

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 8.00 | సంపుటి: 18 సంచిక: 194

SUNDAY Special

ఆదివారం 5-10-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



మనకు నచ్చకపోతే వినేదే లేదు

మనకు ఇష్టమైనదే వింటాం. లేకుంటే అది వినడానికి కూడా ఇష్టపడం. ఇది ఒక సాధారణ ప్రవర్తన అని మనస్తత్వ శాస్త్రవేత్తలు అంటున్నారు. దీనినే 'ఆస్ట్రిచ్ ఎఫెక్ట్' అంటారు.

- వివరాలు 16లో



వన్డే సారథిగా శుబ్‌మన్ గిల్

భారత టెస్టు కెప్టెన్ గిల్ ఇప్పుడు వన్డేల్లోనూ సారథ్య బాధ్యతలు చేపడుతున్నాడు. రోహిత్‌శర్మ స్థానంలో గిల్‌ను వన్డే జట్టు కొత్త కెప్టెన్‌గా నియమించారు.

- వివరాలు 14లో



బందీల విడుదలకు సిద్ధం

బందీల విడుదలకు హమాస్ అంగీకరించింది. దీంతో ట్రంప్ ప్రణాళిక మొదటి దశ అమలుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు నెతన్యాహూ తెలిపారు.

- వివరాలు 6లో▶



చర్చల్లేవు.. లొంగిపోవాల్సిందే

మావోయిస్టులతో చర్చల ప్రసక్తే లేదని, ఆయుధాలు వదిలేసి లొంగిపోవాల్సిందేనని కేంద్ర మంత్రి అమిత్ షా తేల్చిచెప్పారు.

- వివరాలు 6లో▶



అందరూ కాలేరు జన నాయక్‌లు

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని ఆ పార్టీ కార్యకర్తలు 'జన నాయక్' అని పిలవడాన్ని ప్రధాని మోదీ తప్పుపట్టారు.

- వివరాలు 6లో▶



జపాన్ కొత్త ప్రధాని తకైచి!

జపాన్ చరిత్రలో తొలిసారి ఓ మహిళ ప్రధాని పదవి చేపట్టబోతున్నారు. ఎల్‌డీపీ అధ్యక్షురాలిగా సనాయి తకైచి ఎన్నికయ్యారు.

- వివరాలు 6లో▶

స్థానికంపై 'ప్లాన్ బీ'!

6, 8 తేదీల్లో సుప్రీం, హైకోర్టుల్లో బీసీ రిజర్వేషన్, చట్ట సవరణపై విచారణ

కోర్టు తీర్పుల ఆధారంగా వెంటనే స్పందించేందుకు సిద్ధమైన ప్రభుత్వం

- ప్రతికూల తీర్పులు వస్తే పాత రిజర్వేషన్ల ప్రకారం వారం ఆలస్యంగా ఎన్నికలు
- కొత్తగా షెడ్యూల్ విడుదల చేసి ఎన్నికల నిర్వహణకు పీఆర్ శాఖ ప్రణాళిక
- బిల్లులపై రాష్ట్రపతి, గవర్నర్ నిర్ణయం తీసుకొనే వరకు వేచిచూసే మరో ప్లాన్



సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ విషయంలో న్యాయపరమైన చిక్కులు ఎదురైతే.. అందుకు అనుగుణంగా వ్యూహాన్ని మార్చుకుని 'ప్లాన్ బీ'ని అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైనట్టు సమాచారం. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పన, మొత్తంగా 50 శాతం పరిమితికి మించి రిజర్వేషన్ల అమలుపై న్యాయస్థానాల్లో ప్రతికూల తీర్పులు వస్తే.. ఏం చేయాలనే దానిపై పంచాయతీరాజ్ శాఖ ప్రణాళికను సిద్ధం చేసినట్టు తెలిసింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లు ఈ నెల 6న సుప్రీంకోర్టులో, 8వ తేదీన రాష్ట్ర హైకోర్టులో విచారణకు రానున్నాయి.

కోర్టుల వైపు అందరి చూపు..

పంచాయతీరాజ్ చట్ట సవరణ, బీసీలకు రిజర్వేషన్ల పెంపునకు సంబంధించిన బిల్లులు గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉండగా.. ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలయ్యేలా ఉత్తర్వులు జారీ చేయడంతో ఈ జీవోను కొట్టేయాలని గత నెల 27న ఓ వ్యక్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన సంగతి విదితమే. ఆ పిటిషన్‌పై ఈ నెల 8న హైకోర్టు విచారణ జరపనుంది. నాటి విచారణలో బిల్లు ఇంకా గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉండగా జీవో ఎలా జారీ చేస్తారని ప్రభుత్వాన్ని కోర్టు ప్రశ్నించింది. ఈ దశలో రిజర్వేషన్ల పెంపుదలను ఆమోదించలేమని, అదేవిధంగా ఎలాంటి నిలిపివేత ఆదేశాలు జారీ చేయలేమని తెలిపింది. ఒకవేళ స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ జారీచేసినా.. పిటిషన్లు ముందే దాఖలు చేసినందున మెరిట్ ఆధారంగా

మిగతా 2వ పేజీలో ▶

పరిమితి వేలల్లో.. ఖర్చు లక్షల్లో..

- అభ్యర్థుల వ్యయ పరిమితి చిత్రాలు
- సర్పంచ్‌గా పోటీ చేయాలన్నా ఆస్తులు అమ్ముకోవాల్సిన పరిస్థితి
- ఎన్నికల సంఘం పరిమితి మాత్రం రూ.2.5 లక్షల లోపే
- సెల్ఫ్ డిక్లరేషన్‌పై అభ్యర్థులు జాగ్రత్తగా ఉండకపోతే అంతే..

2లో

హైదరాబాద్‌లో బస్సు చార్జీల పెంపు



ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మొదటి మూడు స్టేజీలకు రూ. 5, నాలుగో స్టేజీ నుంచి రూ.10 పెంపు

- డీలక్స్, ఏసీ లగ్జరీ బస్సుల్లో మొదటి స్టేజీకి రూ. 5, రెండో స్టేజీ నుంచి రూ.10 పెంపు
- రేపట్నుంచి కొత్త చార్జీలు అమల్లోకి
- రెండేళ్లలో 3,300 ఎలక్ట్రిక్ బస్సులు సమకూర్చుకోనున్న ఆర్టీసీ
- సిటీలోని డీజిల్ బస్సులన్నీ 'ఔటర్' వెలుపలకు తరలింపు

సాక్షి, హైదరాబాద్: భాగ్యనగరంలోని సిటీ బస్సుల చార్జీలను తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ పెంచింది. వచ్చే రెండేళ్లలో హైదరాబాద్‌లో డీజిల్ బస్సుల స్థానంలో పూర్తిగా విద్యుత్ బస్సులనే తిప్పనుండటంతో అందుకయ్యే మౌలికవసతుల కల్పనకు కావాల్సిన నిధుల కోసం సిటీ బస్సు చార్జీలను పెంచాలని నిర్ణయించింది. ఈ మేరకు ఆర్టీసీ చేసిన ప్రతిపాదనకు ప్రభుత్వం తాజాగా అనుమతించింది. దసరా వేళ చార్జీలు పెంచితే ప్రజల నుంచి వ్యతిరేకత వచ్చే ప్రమాదం ఉండటంతో పండుగ రద్దీ ముగిశాక పెంచాలని నిర్ణయం తీసుకుంది. చార్జీల పెంపు సోమవారం తెల్లవారుజామున తొలి సర్వీసు

మిగతా 15వ పేజీలో ▶

అరేబియా తీరంలో అమెరికా ఓడరేవు!

- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో స్నేహానికి అర్రులు చాస్తోన్న పాకిస్తాన్ ప్రభుత్వం.. అరేబియా సముద్రం తీరంలోని పాక్ భూభాగంలో భారీ ఓడరేవు (పోర్టు) నిర్మించి, నిర్వహించాలని ఆయనకు విజ్ఞప్తి చేసింది. బలూచిస్తాన్‌లో గ్వాదర్ జిల్లాలోని పాస్నీ పట్టణంలో ఈ పోర్టు నిర్మించాలని కోరింది. ఇరాన్ భూభాగంలో భారత ప్రభుత్వం నిర్మిస్తున్న చాబహార్ పోర్టుకు సమీపంలోనే పాస్నీ టౌన్ ఉంది.



6లో

న్యూస్‌రీల్

ఉద్యమం ఇలాగా?



ఓట్ల చోరీపై ఏఐసీసీ చేపట్టిన ఉద్యమం తెలంగాణలో నత్తనడకన సాగుతోందన్న అభిప్రాయంతో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఉన్నారనే చర్చ గాంధీభవన్ వర్గాల్లో జరుగుతోంది. సంతకాల సేకరణ తీరుపై ఆమె అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది.

- వివరాలు 15లో▶

తెలంగాణ సెమీ కండక్టర్స్



ఎలక్ట్రానిక్ చిప్ డిజైన్, తయారీలో తెలంగాణను అంతర్జాతీయ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాన్ని చేపడుతోంది. ఇందులో భాగంగా 'టిటా'తో కలిసి టెక్నాలజీ చిప్ ఇన్నోవేషన్ ప్రోగ్రామ్ (టీ చిప్)ను చేపట్టింది.

- వివరాలు 3లో▶

త్వరలో.. మీ అభిమాన థియేటర్లలో ఏఐ హీరోయిన్



'ఆ హీరోయిన్ డేట్లు దొరకడం చాలా కష్టం'.. 'ఆ హీరోయిన్ టైమ్‌కు లొకేషన్‌కు రాదు. నిర్మాతలను ఏడిపిస్తుంది'..ఇలాంటి మాటలు టిల్లీ నార్వుడ్ విషయంలో వర్తించవు. హాలీవుడ్‌లో తొలి ఏఐ జనరేటెడ్ నటిగా టిల్లీ నార్వుడ్ చరిత్ర సృష్టించనుంది.

- వివరాలు 13లో▶

నాలుగు నెలలుగా జీతాల్లేవు!




తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ పరిధిలో పనిచేసే పార్ట్‌టైమ్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు వేతనాల కోసం ఎదురు చూస్తున్నారు. దాదాపు 4 వేల మందికి 4 నెలలుగా వేతనాలు విడుదల కాలేదు.

- వివరాలు 3లో▶

ఇదం జగత్



బోనస్ బకాయి రూ.1,159.64 కోట్లు



గత యాసంగి సన్నవడ్ల బోనస్ ఇప్పటికీ రైతన్నకు అందని వైనం

- మళ్లీ మార్కెట్‌లోకి వస్తున్న వానాకాలం వడ్లు
- సన్నరకం 40 నుంచి 45 ఎల్‌ఎంటీ ఉంటాయని అంచనా
- వాటికి చెల్లించే బోనస్ రూ. 2,000 కోట్ల నుంచి రూ. 2,200 కోట్లు
- బోనస్ కోసం ఆందోళన బాట పడుతున్న అన్నదాతలు

సన్నధాన్యం పండించే రైతులకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తున్నాం. ఈ వానాకాలం సీజన్‌లో 80 లక్షల మెట్రిక్ టన్నుల (ఎల్‌ఎంటీ) ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని భావిస్తున్నాం. అందులో 40 నుంచి 45 ఎల్‌ఎంటీ సన్నరకాలే. వీరందరికీ బోనస్ ఇస్తాం.

- మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో సన్నధాన్యం పండించిన రైతులకు క్వింటాల్‌కు రూ.500 చొప్పున బోనస్ చెల్లిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ఒక్క సీజన్‌కే పరిమితమైంది. గత (2024–25) వానాకాలం సీజన్‌లో 24 లక్షల మెట్రిక్ టన్నుల సన్నధాన్యం పండించిన సుమారు నాలుగున్నర లక్షల మంది రైతులకు రూ.1,200 కోట్ల వరకు చెల్లించింది. యాసంగి

మిగతా 5వ పేజీలో ▶

కేసులంటూ ఖాతా ఖాళీ చేస్తారు!



- రిటైర్డ్ ఉద్యోగులను కేసుల పేరుతో బెదిరించి డిజిటల్ అరెస్ట్ చేస్తున్న సైబర్ నేరగాళ్లు
- మానవ అక్రమ రవాణా, డ్రగ్స్ పార్సిళ్లకు కొరియర్‌గా వ్యవహరిస్తున్నారంటూ ఫేక్ కాల్స్
- కేసుల నుంచి తప్పించాలంటే తాము అడిగినంత సొమ్ము ముట్టజెప్పాలని బెదిరింపులు

3లో

అమెరికాలో కాల్పులు.. హైదరాబాదీ మృతి



- డాలస్‌లోని ఓ పెట్రోల్ బంక్‌లో ఘటన
- ఎంఎస్ చేసేందుకు 2023లో డాలస్ వెళ్లిన పోలే చంద్రశేఖర్
- ఇటీవలే కోర్సు పూర్తి చేసుకొని ఉద్యోగాన్వేషణలో ఉన్నట్లు సోదరుడి వెల్లడి
- సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి అడ్లూరి సంతాపం.. కుటుంబానికి భరోసా

16లో

బోర్లు ఉప్పొంగంగ..

భారీ వర్షాలతో బోర్ల నుంచి ఉబికి వస్తున్న భూగర్భ జలాలు

- పొంగి పొర్లుతున్న వ్యవసాయ బావులు
- రాష్ట్రంలో సగటున 4.41 మీటర్ల లోతులో భూగర్భ జలమట్టం
- భూగర్భ జలవనరుల శాఖ పరిశీలనలో వెల్లడి

ఈ ఫొటోలోని రైతు పేరు నత్తి గంగాధర్ (బజార్‌కొత్తూర్, నిజామాబాద్ జిల్లా). మూడెకరాల్లో వరి సాగు చేస్తున్నాడు. సమయానికి పంటకు నీళ్లందక గతంలో ఎన్నో ఇబ్బందులు పడ్డాడు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో భూగర్భజలాలు పెరిగి బోర్ల నుంచి నీళ్లు ఉబికి వస్తున్నాయి. ఈసారి రబీకి ఎలాంటి ఇబ్బందులు ఉండకపోవచ్చని చెబుతున్నాడు.



- వివరాలు 5లో

లైవ్‌లో అమ్మేస్తున్నారు!



సోషల్ మీడియా వేదికగా 'లైవ్ స్ట్రీమింగ్'
దేశంలో 'సోషల్ కామర్స్' కొత్త పోకడలు
అంతర్జాతీయంగా దుస్తులకు ప్రాధాన్యత

వ్యాపారం చేయాలంటే ఓ భారీ స్థాయి మాల్ కాకపోయినా.. చిన్న దుకాణం అయినా పెట్టుకోవాలి. లేదా రోడ్డుపై తోపుడు బండి అయినా నిర్వహించాలి. అదీ కాదంటే వాహనం ఆసరాగా చేసుకుని విక్రయాలు సాగించాలి. ఇదంతా సంప్రదాయ పోకడ. ఆన్‌లైన్ రాకతో ప్రపంచవ్యాప్తంగా బిజినెస్ మోడల్ పూర్తిగా మారిపోయింది. సోషల్ మీడియా కాస్తా 'సోషల్ కామర్స్' అయిపోయింది. అంటే ప్రత్యక్షంగా దుకాణాలు పెట్టాల్సిన అవసరం లేకుండానే సామాజిక మాధ్యమాలను ఆసరాగా చేసుకుని వ్యాపారాలు పుట్టుకొస్తున్నాయి. ఒకటి కాదు రెండు కాదు.. కోట్ల మందికి ఇప్పుడీ ప్లాట్‌ఫామ్స్ బిజినెస్ అడ్డాలుగా అవతరించాయి. - సాక్షి, స్పెషల్ డెస్క్

ఆన్‌లైన్‌లో ఉత్పత్తుల తాలూకు వీడియోలు, ఫొటోలు షేర్ చేయడం.. ఓ ఫోన్ నంబర్ ద్వారా వ్యాపారం చేయడం సాధారణం. ఈ–కామర్స్‌లో ఇప్పుడు లైవ్ స్ట్రీమింగ్ కొత్త ట్రెండ్. విక్రేతలు యూట్యూబ్ లైవ్, ఫేస్‌బుక్ లైవ్, ఇన్‌స్టాగ్రామ్ లైవ్ ద్వారా రియల్ టైమ్‌లో ఉత్పత్తులను ప్రమోట్ చేస్తున్నారు. వీక్షకులు తమ కామెంట్స్ ద్వారా హోస్ట్‌తో సంభాషించవచ్చు. లైవ్ పోల్స్ నిర్వహించేందుకు హోస్ట్‌కు వీలవుతుంది. తెలివైన విక్రేతలు తాము తదుపరి వారం/తేదీన పరిచయం చేయబోయే ఉత్పత్తి గురించి ముందుగానే కొన్ని వివరాలను టీజర్ రూపంలో వెల్లడించి వీక్షకుల్లో ఆసక్తిని పెంచుతున్నారు. అంతేగాక 24 గంటల కౌంట్‌డౌన్ నిర్వహించి తమ ఫాలోవర్లలో ఉత్సాహాన్ని నింపుతున్నారు. తద్వారా ఎక్కువ మంది వీక్షకులను చేరుకుంటున్నారు. సోషల్ కామర్స్ భారత్‌లో 2025లో సుమారు రూ.1,80,000 కోట్ల వ్యాపారం చేస్తుందని అంచనాలు ఉన్నాయి. దేశంలో 90 కోట్లకుపైగా ఇంటర్నెట్ యూజర్లు ఉన్నారు. వీరిలో 25 శాతానికిపైగా ఆన్‌లైన్ షాపింగ్ చేస్తున్నారు.

స్మార్ట్‌ఫోన్ ఉంటే చాలు.. వర్ధిల్లు వ్యాపారాలు

తాము సొంతంగా తయారు చేసిన ఉత్పత్తులు, పిండి వంటలు, కళాఖండాలు, అల్లికలు, పెయింటింగ్స్.. ఒకటేమిటి, వ్యాపారానికి ఏదీ అనర్హం కాదు. వ్యాపారం చేయాలంటే ఈ రోజుల్లో ఓ స్మార్ట్‌ఫోన్ ఉంటే చాలు. ఔత్సాహికులు తక్కువ పెట్టుబడితో తమ కాళ్లమీద తాము నిలబడవచ్చు. చేతిలోని సెల్‌ఫోన్‌తో వీడియోలు, ఫొటోలే కాదు.. లైవ్ స్ట్రీమింగ్ నిర్వహించి తాము విక్రయించే ఉత్పాదనను ప్రపంచానికి పరిచయం చేయవచ్చు. లైవ్ వీడియో చేయాలంటే పెద్దగా సాంకేతికంగా అవగాహన కూడా అవసరం లేదు. ఎడిటింగ్ భారం అసలే లేదు.

దశాబ్దాల నుంచి..

వ్యాపార సంస్థలు తమ ఉత్పత్తులు, సేవలను ప్రచారం చేయడానికి, ప్రజల్లో అవగాహన కల్పించడానికి వీడియోలు ఉపయోగిస్తున్నాయి. ఇటీవలి కాలంలో సోషల్ మీడియాలో వీడియోలు, షార్ట్స్ చూడటం పెరిగింది. ముఖ్యంగా ఉత్పత్తులు, సేవల గురించి తెలుసుకోవడానికి వీడియోలను చూసే ధోరణి ఊపందుకుంది. ఈ నేపథ్యంలో లైవ్ స్ట్రీమింగ్ ప్రాధాన్యత సంతరించుకుంది. లైవ్ స్ట్రీమింగ్‌తో షాపింగ్ ఎక్స్‌పీరియెన్స్ మారుతుందని ఈ–కామర్స్ దిగ్గజం అలీ ఎక్స్‌ప్రెస్ చెబుతోంది.

ప్రత్యక్షంగా వీక్షించి..

ఆన్‌లైన్ వ్యాపారంలో భాగంగా విక్రేతలు ఉత్పత్తుల తాలూకు వీడియోలు, ఫొటోలు పోస్ట్ చేయడం సర్వసాధారణం. అయితే ప్రత్యక్ష ప్రసారాన్ని నిర్వహించే వ్యక్తి (హోస్ట్) లైవ్ వీడియోలో ఉత్పత్తి గురించి పూర్తి వివరాలు వెల్లడించేందుకు వీలవుతుంది. లైవ్‌లో వచ్చే ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడం ద్వారా లక్షలాది మంది ఫాలోవర్లకు ప్రత్యక్షంగా అవి చేరతాయి. సందేహాలు ఉంటే నివృత్తి అవుతాయి. హోస్ట్ ఇచ్చే ప్రెజెంటేషన్ ఇక్కడ కీలకం. ప్రసంగం ఆకట్టుకునేలా ఉంటే ఉత్పత్తి పట్ల కస్టమర్లలో సానుకూల దృక్పథం ఏర్పడుతుంది. ఉత్పత్తి ఎలా పనిచేస్తుంది, ప్రత్యేకతలు, వారంటీ, గ్యారంటీ, ధర, మార్కెట్లో లభించే ఇతర ఉత్పత్తులతో పోలిస్తే తాము విక్రయించే ప్రాడక్ట్ విశేషాలను కస్టమర్లతో నేరుగా పంచుకోవచ్చు.

వాయిదాలకు ఫుల్‌స్టాప్

ఈ–కామర్స్ వెబ్‌సైట్లలో చాలామంది కస్టమర్లు తాము చూసిన ఉత్పాదనను తరువాత కొనొచ్చులే అని కార్ట్‌లో నిక్షిప్తం చేస్తారు. చాలా సందర్భాల్లో అవి కార్ట్‌కే పరిమితం అవుతాయి. అదే లైవ్‌లో అయితే.. నచ్చగానే ఆర్డర్ పెట్టేయొచ్చు. హోస్ట్ మీద, ఉత్పత్తి మీద నమ్మకం ఏర్పడితే.. వెంటనే ఆర్డర్ చేసేలా మనస్సు కూడా వీక్షకులను ప్రేరేపిస్తుంది అంటున్నారు మార్కెట్ విశ్లేషకులు. తరచూ వాయిదాలు వేసే కస్టమర్ల విషయంలో విక్రేతలకు లైవ్ స్ట్రీమింగ్ కలిసి వస్తుందని వారు చెబుతున్నారు.

లైవ్‌లో ఏ ఉత్పాదనలను ఎక్కువగా ఇష్టపడుతున్నారంటే..

దేశం	ఉత్పాదన
భారత్	దుస్తులు
చైనా	సరుకులు
యూరప్	దుస్తులు
లాటిన్ అమెరికా	దుస్తులు
యూఎస్	దుస్తులు

(ఆధారం: మెకిన్సే అండ్ కంపెనీ)

పరిమితి వేలల్లో.. ఖర్చు లక్షల్లో

స్థానిక ఎన్నికల్లో అభ్యర్థుల వ్యయ పరిమితి చిత్రాలు
- సర్పంచ్‌గా పోటీచేయాలన్నా ఆస్తులమ్ముకోవాల్సిన పరిస్థితి
- ఎన్నికల సంఘం పరిమితి మాత్రం రూ.2.5 లక్షల లోపే
- సెల్ఫ్ డిక్లరేషన్‌పై అభ్యర్థులు జాగ్రత్తగా ఉండకపోతే అంతే..

సాక్షి, హైదరాబాద్: జమీన్ ఆస్మాన్ ఫరక్.. అంటే భూమికి ఆకాశానికి ఉన్నంత తేడా అనేది నానుడి. గత కొన్నేళ్లలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల ఎన్నికల వ్యయం ఊహించలేనంతగా పెరిగిపోయింది. స్థానిక సంస్థల ఎన్నికల పరిస్థితి కూడా అలాగే తయారవుతోంది. స్థానిక ఎన్నికల్లో పోటీ చేయటం అభ్యర్థులకు తలకు మించిన భారంగా మారుతోంది. వార్డు సభ్యుడు మొదలు సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు పోటీ చేయాలంటే భూములు ఇతర ఆస్తులు కూడా అమ్ముకోవాల్సి వస్తోంది. ఎన్నికల సంఘం అభ్యర్థులకు విధిస్తున్న వ్యయ పరిమితికి, వాస్తవంగా చేస్తున్న ఖర్చుకు జమీన్ ఆస్మాన్ ఫరక్ ఉంటోంది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్‌ఈసీ) జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం గ్రామ వార్డు సభ్యుడు మొదలు జెడ్పీటీసీ వరకు పోటీచేసే అభ్యర్థుల గరిష్ట ఎన్నికల ఖర్చు వివరాలు చూద్దాం..

గరిష్ట వ్యయపరిమితి (2011 జనాభా లెక్కల ప్రకారం..)
- 5 వేల కంటే తక్కువ జనాభా ఉన్న గ్రామపంచాయతీలో వార్డు సభ్యుడిగా పోటీ చేసే అభ్యర్థి రూ.30 వేల వరకే ఖర్చు చేయాలి.
- 5 వేల కంటే ఎక్కువ జనాభా ఉన్న గ్రామపంచాయతీలో వార్డు సభ్యుడిగా పోటీ చేసే అభ్యర్థి గరిష్టంగా రూ.50 వేల వరకే ఖర్చు చేయాలి.
- 5 వేల కంటే తక్కువ జనాభా ఉన్న గ్రామపంచాయతీలో సర్పంచ్‌గా పోటీ చేసే అభ్యర్థి గరిష్టంగా రూ.1.5 లక్షల వరకే ఖర్చు చేయాలి.
- 5 వేల కంటే ఎక్కువ జనాభా ఉన్న గ్రామపంచాయతీలో సర్పంచ్‌గా పోటీ చేసే అభ్యర్థి గరిష్టంగా రూ.2.5 లక్షల వరకే ఖర్చు చేయాలి.
- ఎంపీటీసీ అభ్యర్థి గరిష్టంగా రూ.1.5 లక్షల వరకే ఖర్చు చేయాలి.
- జెడ్పీటీసీ అభ్యర్థి గరిష్టంగా రూ.4 లక్షల వరకే ఖర్చు చేయాలి.

అభ్యర్థులు చేయాల్సినవి...
- ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలు, సర్పంచ్, వార్డు సభ్యుడిగా పోటీచేసే వారు ఇద్దరు సాక్షులతో కూడిన తమ స్వీయ ప్రకటన (సెల్ఫ్ డిక్లరేషన్)ను నామినేషన్ పత్రంతో రిటర్నింగ్ అధికారికి సమర్పించాలి.
- అభ్యర్థులపై ఒకవేళ క్రిమినల్ కేసులు ఉంటే స్వీకరించిన కేసులు (కాగ్నిజెన్స్ టేకన్) మాత్రమే రాయాలి.
- శిక్ష పడిన కేసు వివరాలు రాయాలి.
- అభ్యర్థి లేదా భాగస్వామి, అభ్యర్థిపై ఆధారపడిన వారి చర, స్థిరాస్తులు (విదేశీ ఆస్తులతో సహా) పొందుపరచాలి.
- ఉమ్మడి ఆస్తిలోని వాటాను కూడా తెలపాలి.
- ఉమ్మడిగా కలిగి ఉన్న భూములు, భవనాలు, ఆపార్ట్‌మెంట్ వివరాలు వేర్వేరుగా పొందుపరచాలి.
- వ్యవసాయ భూమికి సంబంధిత భూమి సర్వే నంబర్, ఊరు, మండలం, జిల్లా, రాష్ట్రం, మొత్తం విస్తీర్ణం పొందుపరచాలి. వారసత్వమా కాదా అనేది కూడా తెలపాలి.
- బాండ్లు,షేర్లు, డిబెంచర్ల విలువ, తత్సంబంధిత కంపెనీ స్టాక్ ఎక్స్ఛేంజీ జాబితాలో ఉంటే ప్రస్తుత మార్కెట్ విలువ, జాబితాలో లేని కంపెనీల వివరాలు పుస్తకాలలో పేర్కొన్న ప్రకారం చూపాలి.
- ఆధారపడటం అంటే ఓ వ్యక్తి పూర్తిగా అభ్యర్థి ఆదాయంపైనే ఆధారపడినట్టు అర్థం.
- ప్రతి పెట్టుబడి, ఎంత మొత్తంలో ఆ పెట్టుబడి పెట్టారో వివరాలు తెలపాలి.
- చేతిలో నగదు, అభ్యర్థికి సంబంధించిన నగదు, భార్య/భర్తకు సంబంధించిన నగదు, ఆధారపడిన వారి వద్ద ఉన్న నగదు వివరాలు తెలియజేయాలి.
- అభ్యర్థి, భార్య/భర్త, వారిపై ఆధారపడిన వారి బ్యాంకు ఖాతాలు, వాటిలో ఉన్న మొత్తం నిల్వ, బ్యాంకు పేరు, బ్రాంచి పేరు, అకౌంట్ నంబర్లు, ఏదైనా ఫిక్స్‌డ్ డిపాజిట్లు, టర్మ్ డిపాజిట్లు ఉంటే వాటి వివరాలు తెలపాలి.
- అభ్యర్థి, భార్య/భర్త, వారిపై ఆధారపడిన వారికి ఉన్న బంగారం, వెండి ఆభరణాలు, వజ్రాలు, ఇతర ఆభరణాలు వాటి బరువు ఒక్కొక్కటిగా పేర్కొనాలి.
- అభ్యర్థి, భార్య/భర్తకు సంబంధించిన వృత్తి, వ్యాపార వివరాలు పొందుపరచాలి.
- అభ్యర్థికి సంబంధించిన విద్యార్హతల సర్టిఫికెట్లు, కోర్సు పూర్తి చేసిన సంవత్సరం, ఇతర వివరాలు ఇవ్వాలి.
- అభ్యర్థుల స్వీయ ప్రకటనను ఇద్దరు సాక్షులతో సంతకాలు చేయించి, వారి పూర్తిపేరు, చిరునామా స్పష్టంగా రాయకపోతే నామినేషన్ తిరస్కరణకు గురవుతుంది.

'స్థానిక' రిజర్వేషన్లపై సుప్రీంకోర్టులో సవాల్

సోమవారం విచారించనున్న జస్టిస్ విక్రమ్‌నాథ్ ధర్మాసనం



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించరాదన్న సర్వోన్నత న్యాయస్థానం తీర్పునకు ఇది విరుద్ధమని పేర్కొంటూ దాఖలు చేసిన ఈ పిటిషన్ సోమవారం విచారణకు రానుంది. తెలంగాణలోని స్థానిక సంస్థల ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయనుందని, ఇది సుప్రీంకోర్టు నిర్దేశించిన 50 శాతం రిజర్వేషన్ల పరిమితిని ఉల్లంఘించడమేనని వంగ గోపాల్‌రెడ్డి అనే వ్యక్తి సుప్రీంకోర్టులో సెప్టెంబర్ 29న పిటిషన్ దాఖలు చేశారు. అంతేగాక స్థానిక ఎన్నికలపై తెలంగాణ హైకోర్టు ఇటీవల ఇచ్చిన ఉత్తర్వులను గోపాల్‌రెడ్డి సవాల్ చేశారు. గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం ఏ వర్గానికి కేటాయించే రిజర్వేషన్లు అయినా మొత్తం 50 శాతానికి మించకూడదని, కానీ తెలంగాణ ప్రభుత్వం ఈ నిబంధనను అతిక్రమిస్తోందని పిటిషన్‌లో ఆయన ఆరోపించారు. ఈ పిటిషన్‌ను సోమవారం జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం విచారించనుంది. దీంతో ఈ విచారణపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

స్థానిక ఎన్నికల కోసం కాల్‌సెంటర్



సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన సమాచారం, ప్రజల సందేహాల నివృత్తి, ఫిర్యాదుల స్వీకరణ కోసం కేంద్రీకృత కాల్‌సెంటర్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్‌ఈసీ) ఏర్పాటు చేసింది. ఇప్పటికే స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ ఎస్‌ఈసీ జారీ చేసిన నేపథ్యంలో... ప్రజలు సంబంధిత అధికారుల ద్వారా అవసరమైన సమాచారం తెలుసుకునేందుకు 9240021456తో ఎస్‌ఈసీ కార్యాలయంలో కాల్‌సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ, గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి సమాచారాన్ని ప్రజలకు తెలిపేందుకు ఈ కాల్‌సెంటర్‌ను ఏర్పాటు చేసినట్టు ఎస్‌ఈసీ కార్యదర్శి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

స్థానికంపై 'ప్లాన్ బీ'!

▶ మొదటి పేజీ తరువాయి

విచారణ చేస్తామని తెలిపింది. తాము ఇచ్చే తీర్పు మేరకే స్థానిక ఎన్నికలు జరుగుతాయని తేల్చి చెప్పింది. దీంతో 8న కోర్టు ఏం తేలుస్తుందన్నదానిపై ఆసక్తి నెలకొంది.

పాత రిజర్వేషన్ల ప్రకారమూ సిద్ధమే...

సుప్రీం, హైకోర్టుల్లో వ్యతిరేక తీర్పులు వస్తే పాత రిజర్వేషన్ల పద్ధతిలోనే (50 శాతానికి లోబడి) ఎన్నికలు నిర్వహించేందుకు కూడా పీఆర్ శాఖ సన్నాహాలు చేసుకుంటున్నట్టు చెబుతున్నారు. 2011 జనాభా లెక్కల ఆధారంగా ఎస్టీ, ఎస్సీల రిజర్వేషన్లను ఖరారు చేసినందున, వాటిని అలాగే ఉంచి గతంలో మాదిరిగా బీసీలకు 23 శాతం రిజర్వేషన్ల కల్పనకు మొగ్గుచూపే అవకాశాలున్నట్టు తెలుస్తోంది. అసెంబ్లీ ఓటర్ల జాబితాల ఆధారంగా గ్రామపంచాయతీల్లోని వార్డులవారీగా ఫొటోలతో కూడిన ఓటర్ జాబితాలు ఇప్పటికే సిద్ధమయ్యాయి. కోర్టుల తీర్పు మేరకు ప్రభుత్వం మళ్లీ బీసీ కోటాపై తీసుకునే నిర్ణయానికి అనుగుణంగా బీసీ, అన్ రిజర్వ్‌డ్ రిజర్వేషన్లను ఖరారు చేసి, వారంలోనే మరోసారి ఎన్నికల షెడ్యూల్ జారీ చేసే అవకాశం ఉందని అంటున్నారు. అవసరమైన మార్పులు చేశాక మండల, జిల్లా పరిషత్ ఎన్నికల తొలివిడత నోటిఫికేషన్ 9వ తేదీకి బదులు 16న జారీచేసి, ఎన్నికలను 23వ తేదీకి బదులు 30న నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ఇలా మిగతా నాలుగు విడతలకు కూడా వారం రోజుల అంతరంతో నోటిఫికేషన్, మిగతా దశల ఎన్నికలు నిర్వహించాలని యోచిస్తున్నట్టు తెలిసింది. ఇలా గతంలో ప్రకటించిన విధంగా నవంబర్ 11కు బదులు 18న ఎన్నికల ప్రక్రియను ముగించే అవకాశం ఉందని చెబుతున్నారు.

మరో నెల వేచి చూస్తే ఎలా ఉంటుంది?

రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే పట్టుదలతో ఉన్న పక్షంలో అసెంబ్లీ ఆమోదం పొందిన బిల్లుపై గవర్నర్ నిర్ణయం తీసుకునే గడువు వరకు వేచి ఉండే అవకాశం లేకపోలేదని అధికారపార్టీ నేతలు చెబుతున్నారు. పెండింగ్ బిల్లులపై రాష్ట్రపతి, గవర్నర్‌లు మూడు నెలల్లోగా తప్పనిసరిగా నిర్ణయం తీసుకోవాలని, లేదంటే అవి ఆమోదం పొందినట్టు భావించాలని సుప్రీంకోర్టు ఇటీవల తీర్పు చెప్పిన విషయం తెలిసిందే. కాగా, మొదటి రెండు పర్యాయాలు అసెంబ్లీ ఆమోదించిన బిల్లులు, ఆర్డినెన్స్‌లు రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. ఆ తర్వాత స్థానిక ఎన్నికల్లో 50 శాతం పరిమితికి మించి రిజర్వేషన్ల అమలుపై అసెంబ్లీ ఆమోదించిన బిల్లు గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉంది. మరో 25 రోజులైతే ఆ బిల్లును పంపి 90 రోజులు అవుతుంది. అందువల్ల దీనితోపాటు సుప్రీంకోర్టు, రాష్ట్రపతి నుంచి వచ్చే స్పందనల కోసం మరో నెల వేచి చూస్తే ఎలా ఉంటుందనే చర్చ కూడా అధికార వర్గాల్లో సాగుతోంది.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో తిరోగమనంలో వైద్యం

మాజీ మంత్రి హరీశ్‌రావు
- ప్రభుత్వం పేదల ఆరోగ్యాన్ని పట్టించుకోవడంలేదు
- పార్టీ నేతలతో కలసి కొత్తపేట టిమ్స్ నిర్మాణం పరిశీలించిన హరీశ్



కొత్తపేటలో ఆసుపత్రి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న హరీశ్‌రావు, వివేకానంద, కాలేరు వెంకటేశ్, సబిత, సుధీర్‌రెడ్డి తదితరులు

చైతన్యపురి (హైదరాబాద్): కాంగ్రెస్ పాలనలో ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్యం తిరోగమనంలో ఉందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో తాము ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాలను 30 నుంచి 70 శాతానికి పెంచితే నేటి రేవంత్ సర్కార్‌లో అది 55 శాతానికి పడిపోయిందని విమర్శించారు. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, కాలేరు వెంకటేశ్, వివేకానందగౌడ్, చింత ప్రభాకర్‌లతో కలిసి శనివారం ఆయన ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని కొత్తపేటలో టిమ్స్ హాస్పిటల్ నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ తప్పుడు చర్యల వల్ల రాష్ట్ర ప్రజలకు తీవ్ర నష్టం జరుగుతోందన్నారు. కోవిడ్ సమయంలో ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని బీఆర్‌ఎస్ ప్రభుత్వం వరంగల్‌లో హెల్త్‌సిటీ, హైదరాబాద్‌లో నాలుగు వైపులా నాలుగు మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల నిర్మాణాన్ని ప్రారంభించిందన్నారు. కొత్తపేటలో వెయ్యి పడకల ఆసుపత్రి కోసం సెల్లార్ ప్లస్ ఆరు అంతస్తులు నిర్మాణం చేశామని గుర్తు చేశారు. అయితే రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత ఈ రెండేళ్లలో పనులు నత్తనడకన నడుస్తున్నాయని, కేవలం ఐదు అంతస్తులు మాత్రమే నిర్మాణం చేశారని విమర్శించారు. అంతేకాక తమ ప్రభుత్వం ఈ ఆసుపత్రికి 24 అంతస్తులకు అనుమతి ఇస్తే కాంగ్రెస్ ప్రభుత్వం 14 అంతస్తులకు కుదించిందని మండిపడ్డారు. కేసీఆర్ ప్రభుత్వం ఉంటే ఇప్పటికే పనులు పూర్తయి, పేద ప్రజలకు వైద్యసేవలు అందుబాటులోకి వచ్చేవన్నారు. రాష్ట్రంలో పేద ప్రజల ఆరోగ్యాన్ని పట్టించుకోని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం, కేసీఆర్‌కు మంచి పేరు వస్తుందనే దురుద్దేశంతో ఆసుపత్రుల నిర్మాణాన్ని గాలికి వదిలేసిందని హరీశ్‌రావు విమర్శించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆసుపత్రుల నిర్మాణాలను ఆరునెలల్లో పూర్తి చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. లేకుంటే పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తిట్లమీద ఉన్న శ్రద్ధ ఆరోగ్య కిట్లమీద లేదని విమర్శించారు. పేద ప్రజలకు ఉపయోగ పడే టిమ్స్ నిర్మాణాలను రాజకీయాల కోసం ఆపవద్దని హితవు చెప్పారు.

హరీశ్‌రావు అబద్ధాలను అందంగా చెబుతారు

తనను తాను గొప్పగా ఊహించుకుంటారు: సామా విమర్శ



సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్‌కు చెందిన మాజీ మంత్రి హరీశ్‌రావుకు ఓ అరుదైన వ్యాధి ఉందని టీపీసీసీ మీడియా కమ్యూనికేషన్స్ కమిటీ చైర్మన్ సామా రామ్మోహన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. నార్సిసిస్టిక్ పర్సనాలిటీ అనే ఈ డిజార్డర్ (రుగ్మత) ఉన్న వ్యక్తులు తమను తాము చాలా గొప్పగా ఊహించుకుంటారని, ప్రపంచాన్ని, ప్రజలను తామే కాపాడుతున్నామని భావిస్తుంటారని చెప్పారు. శనివారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీపీసీసీ నేతలు బొజ్జా సంధ్యారెడ్డి, యోగేశ్వర్‌రెడ్డి, కోటూరి మానవతారాయ్ తదితరులతో కలిసి ఆయన మాట్లాడుతూ, ఈ వ్యాధి సోకిన వారు ఎన్ని అబద్ధాలైనా నిస్సంకోచంగా, నిస్సిగ్గుగా మాట్లాడుతారని, అబద్ధాలను కూడా అందంగా అందరూ నమ్మే విధంగా చెబుతుంటారని విమర్శించారు. టిమ్స్ ఆసుపత్రులను రాష్ట్ర ప్రభుత్వం తీర్చిదిద్దుతుంటే ఎల్బీనగర్‌కు వెళ్లి ఏవేవో అబద్ధాలు చెప్పడం హరీశ్‌రావుకే చెల్లిందన్నారు. జిల్లాకో నిమ్స్ కడతామని చెప్పిన కేసీఆర్ అండ్ కో 2014–23 వరకూ అధికారంలో ఉన్నారని, ఎన్నిచోట్ల ఎన్ని నిమ్స్ ఆసుపత్రులు కట్టారో చెప్పాలని సామా డిమాండ్ చేశారు.

సమాధానం చెప్పలేకే వ్యక్తిగత విమర్శలు

హరీశ్‌రావుపై కాంగ్రెస్ నేతల విమర్శలను ఖండించిన బీఆర్‌ఎస్

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావుపై కాంగ్రెస్ నేతలు అర్థరహిత విమర్శలు చేస్తున్నారని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద, కాలేరు వెంకటేశ్ విమర్శించారు. హరీశ్‌రావు టిమ్స్ ఆస్పత్రిని సందర్శించడంపై కాంగ్రెస్ నేతలు చేసిన వ్యాఖ్యలు వారి అవివేకానికి నిదర్శనమని శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వారు పేర్కొన్నారు. హరీశ్‌రావు టిమ్స్ సందర్శనను జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలతో ముడిపెట్టి కాంగ్రెస్ నేతలు మాట్లాడటం హాస్యాస్పదం. వైద్య, ఆరోగ్య శాఖ మంత్రిగా హరీశ్‌రావు చేపట్టిన సంస్కరణలు ప్రజల మన్ననలు పొందాయని, జిల్లా కో–మెడికల్ కాలేజీ, బస్తీ దవాఖానాలు కేసీఆర్ హయాంలోనే నిర్మితమయ్యాయని వారు గుర్తు చేశారు. 'కాంగ్రెస్ నేతలకు టిమ్స్ భవనాల నిర్మాణం గురించి హరీశ్‌రావు సందర్శన వరకు తెలియదు. ఆయన అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారు' అని విమర్శించారు. 'వైద్య, ఆరోగ్య రంగంలో ఏమైనా చెప్పాలనుకుంటే సీఎం రేవంత్‌రెడ్డికి చెప్పాలి, హరీశ్‌రావును లక్ష్యంగా చేసుకోవడం సరికాదు' అని కేపీ వివేకానంద, కాలేరు తమ ప్రకటనలో స్పష్టం చేశారు.

న్యాయవాదులకు ప్రత్యేక రక్షణ చట్టం!

కేంద్ర మంత్రి అర్జున్‌రాం మేఘ్వాల్



సాక్షి, హైదరాబాద్: న్యాయవాదులపై హత్యలు, దాడులు ఇతర భద్రతా సమ స్యల పరిష్కారానికి ప్రత్యేక న్యాయవాద రక్షణ చట్టం తీసుకురా వాలని కేంద్ర ప్రభు త్వం యోచిస్తోందని కేంద్ర న్యాయశాఖ స హాయ మంత్రి అర్జున్ రాం మేఘ్వాల్ తెలిపారని బీజేపీ లీగల్ సెల్, తెలంగాణ బార్ కౌన్సిల్ వెల్లడించాయి. దీనిపై లా కమిషన్ నివేదిక అందగానే న్యాయవాదుల ఆరోగ్య భద్రత, బీమా, డెత్ బెనిఫిట్‌లతో కూడిన ఇన్సూరెన్స్ స్కీమును రూపొందించి, దాని అమలుకు కేంద్రం యోచిస్తోందని కేంద్రమంత్రి వెల్లడించారని పేర్కొన్నాయి. శుక్రవారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశానికి కేంద్రమంత్రి హాజరైన సందర్భంగా పలు కీలక అంశాలపై చర్చించారని తెలియజేశాయి. శనివారం బార్ కౌన్సిల్ వైస్ చైర్మన్ సునీల్ గౌడ్‌తో కలిసి లీగల్‌సెల్ రాష్ట్ర కన్వీనర్ గోకుల్ రామారావు మీడియాతో మాట్లాడుతూ, గత 75 ఏళ్లలో లేని విధంగా న్యాయవాదుల డిమాండ్లు, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా తరఫున స్టేట్ బార్ కౌన్సిల్స్ ద్వారా ప్రతిపాదనలను కేంద్రం పరిశీలించిందని చెప్పారు. బీమా, మెడికల్ ఇన్సూరెన్స్ త్వరలో అందరికీ లభిస్తుందని అర్జున్‌రాం తెలపడం హర్షణీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అడ్వొకేట్స్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను ప్రవేశపెట్టి అమలు చేయాలని డిమాండ్ చేశారు. కొత్తగా ఏర్పాటైన డెట్ రికవరీ ట్రిబ్యునల్‌కు అప్పిలేట్ ట్రిబ్యునల్ కోల్‌కతా నుంచి హైదరాబాద్ తరలింపునకు కేంద్రమంత్రి హామీ ఇచ్చారని సునీల్‌గౌడ్ తెలిపారు.

జనవరిలో రీజినల్ రింగ్‌రోడ్డు ఉత్తర భాగం పనులు

- డిసెంబర్‌లోగా టెండర్లు పూర్తి
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వెల్లడి




నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తిలో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

చిట్యాల: రీజినల్ రింగ్‌రోడ్డు ఉత్తర భాగం నిర్మాణ పనులు డిసెంబర్‌లోగా టెండర్‌లు ఫైనల్ చేసి వచ్చే ఏడాది జనవరిలో పనులు ప్రారంభిస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తిలో శనివారం రీజినల్ రింగ్ రోడ్డు భూనిర్వాసితులతో కలిసి మంత్రి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణానికి 2017–18లో కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపినప్పటికీ అప్పటి సీఎం కేసీఆర్ పట్టించుకోలేదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేటప్పటికి రీజినల్ రింగ్ రోడ్డు భూసేకరణ 6 శాతమే జరిగిందని, ప్రస్తుతం 97 శాతం భూసేకరణ చేసినట్లు ఆయన వివరించారు. దక్షిణ భాగం అలైన్‌మెంట్‌లో ఎలాంటి మార్పులూ చేయలేమని, భూములు కోల్పోతున్న రైతులకు న్యాయమైన పరిహారం అందిస్తామన్నారు. తాను రైతు బిడ్డనని, రైతులకు అన్యాయం జరగనివ్వనని చెప్పారు. సీఎం సహకారంతో రైతుల అంగీకారంతోనే భూసేకరణ చేపడతామన్నారు. ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్ విషయంలో పెద్దవాళ్లకు ఒక న్యాయం, పేద వాళ్లకు ఒక న్యాయం ఉండదన్నారు. హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిని ఎనిమిది లేన్లుగా విస్తరణ పనులు ఫిబ్రవరిలో ప్రారంభించనున్నట్లు మంత్రి తెలిపారు. వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎంగా ఉన్నప్పుడు నిర్మించిన ఔటర్ రింగ్‌రోడ్డును బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.7 వేల కోట్లకు అమ్ముకుందని, ఇప్పుడు బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు భూసేకరణ విషయంలో రైతులను రెచ్చగొడుతున్నారని విమర్శించారు.

పబ్లిసిటీ కోసమే పీకే పాట్లు

- బిహార్‌లో డిపాజిట్లు పొందలేని ఆయన తెలంగాణలో ఏం చేస్తారు?
- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చనగాని



సాక్షి, హైదరాబాద్: ఎన్నికల వ్యూహకర్త పేరుతో పబ్బం గడుపుకుంటున్న ప్రశాంత్ కిశోర్ కేవలం ప్రచారం కోసమే సీఎం రేవంత్‌రెడ్డి గురించి మాట్లాడుతున్నారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చనగాని దయాకర్ విమర్శించారు. ఆయనకు తెలంగాణ రాజకీయాలపై ఎలాంటి అనుభవం, అవగాహన లేదని, పూర్తి అవగాహన ఉన్న బిహార్‌లోనే ఆయన స్థాపించిన జనసురాజ్ పార్టీకి డిపాజిట్లు రాలేదని, ఆయన తెలంగాణలో ఏం చేస్తారని ఎద్దేవా చేశారు. స్థాయికి మించిన వ్యాఖ్యలు చేయడం ద్వారా తాను పాపులర్ అవుతాననే ఆలోచనలో పీకే ఉన్నారని, తిరుగుబాటుకు ప్రతీక అయిన తెలంగాణలో ఇలాంటి రాజకీయ దళారీలను ప్రజలు తరిమికొడతారని శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వ్యాఖ్యానించారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ రెండోసారి అధికారంలోకి రావడం ఖాయమని, పీకే వాళ్ల జేజమ్మ వచ్చినా కాంగ్రెస్ పార్టీ విజయాన్ని ఆపలేరని దయాకర్ ధీమా వ్యక్తం చేశారు. కాగా, పీపుల్స్ సీఎం రేవంత్‌రెడ్డి గురించి ప్రీపెయిడ్ రీచార్జిలాంటి ప్రశాంత్ కిశోర్ మాట్లాడడం పెద్ద జోక్ అని టీపీసీసీ మీడియా కమ్యూనికేషన్స్ కమిటీ చైర్మన్ సామా రామ్మోహన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఆయనకు ఎంత రీచార్జి చేస్తే అంత టాక్‌టైం ఉంటుందని ఎద్దేవా చేశారు. ఎన్నికల వ్యూహకర్త పేరుతో కోట్లు సంపాదించిన పీకే పార్టీలను ఎప్పుడూ గెలిపించలేకపోయాడని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.


క్లుప్తంగా...

పీజీ మేనేజ్‌మెంట్ కోటా సీట్ల భర్తీకి నోటిఫికేషన్

సాక్షి, హైదరాబాద్‌: తెలంగాణలోని వైద్య కళాశాలల్లో మెడికల్ పీజీ మేనేజ్‌మెంట్ కోటా సీట్ల భర్తీకి కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం శనివారం నోటిఫికేషన్ విడుదల చేసింది. శనివారం సాయంత్రం 6 గంటల నుంచి 11వ తేదీ సాయంత్రం 6 గంటల వరకూ దరఖాస్తులకు గడువు విధించారు. నీట్ పీజీలో అర్హత సాధించిన అభ్యర్థులు పీజీ సీట్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు. పూర్తి వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు.

సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్

విధుల నుంచి ఆర్టీసీ డ్రైవర్ తొలగింపు




షాద్‌నగర్ రూరల్‌: సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ బస్సు నడిపిన డ్రైవర్‌ను విధుల నుంచి తొలగించారు. షాద్‌నగర్ ఆర్టీసీ డిపోలో శనివారం జరిగిన ఈ సంఘటన వివరాలివి. షాద్‌నగర్ డిపోకు చెందిన అద్దె బస్సు.. ప్రయాణికులతో హైదరాబాద్‌కు బయల్దేరింది. ఈ క్రమంలో డ్రైవర్ వినోద్.. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ.. స్టీరింగ్‌ను వదిలేసి బస్సు నడుపుతున్నాడు. ఒకపక్క ఫోన్ మాట్లాడుతూ.. మరోపక్క బస్సును వేగంగా పోనిస్తున్నాడు. గమనించిన ప్రయాణికులు.. ఈ దృశ్యాలను సెల్‌ఫోన్‌లో బంధించారు. అనంతరం డ్రైవర్‌ను ప్రశ్నించగా.. 'అర్జంట్ పని.. అందుకే ఫోన్ మాట్లాడుతున్నా.. నేను మాట్లాడితే మీకేమవుతుంది'? అని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పాడు. దీనికి ఆగ్రహించిన ప్రయాణికులు.. వీడియోలను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయడంతో వైరల్‌గా మారింది. దీనిపై డీఎం ఉష స్పందిస్తూ.. బస్సు నగరం నుంచి డిపోకు వెళ్లగానే.. డ్రైవర్‌ను విధుల నుంచి తప్పించారు.

మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నివసించే ఓ రిటైర్డ్ మహిళా డాక్టర్ (76)ను మానవ అక్రమ రవాణా కేసులో ఉన్నందుకు డిజిటల్ అరెస్ట్ పేరిట గత నెల 5న సైబర్ నేరగాళ్లు ఫోన్లో బెదిరించారు. తాము అడిగినంత డబ్బిస్తే కేసు నుంచి తప్పిస్తామంటూ సుమారు 70 గంటలపాటు వేధించారు. ఈ ఒత్తిడి తట్టుకోలేక ఆమె గత నెల 8న మృతిచెందారు.

నిజామాబాద్‌లో ఓ వృద్ధ జంటను ముంబై పోలీసుల పేరిట సైబర్ క్రిమినల్స్ ఫోన్ చేసి డ్రగ్స్ కేసులో డిజిటల్ అరెస్ట్ చేస్తున్నట్లు బెదిరించారు. సుమారు 50 గంటల పాటు వారిని వేధించి కేసు నుంచి తప్పిస్తామని చెప్పి సుమారు రూ.40 లక్షల వరకు కొల్లగొట్టారు.

కేసులంటూ ఖాతా ఖాళీ చేస్తారు



- రిటైర్డ్ ఉద్యోగులను కేసుల పేరుతో బెదిరించి డిజిటల్ అరెస్ట్ చేస్తున్న సైబర్ నేరగాళ్లు
- పిల్లలు విదేశాల్లో స్థిరపడిన వృద్ధుల వద్ద డబ్బు ఉంటుందన్న అంచనాతో బెదిరింపులు
- మానవ అక్రమ రవాణా, డ్రగ్స్ పార్సిళ్లకు కొరియర్‌గా వ్యవహరిస్తున్నారంటూ ఫేక్ కాల్స్
- కేసుల నుంచి తప్పించాలంటే తాము అడిగినంత సొమ్ము ముట్టజెప్పాలని డిమాండ్
- ఈ ఏడాది ఆగస్టు వరకు 827 డిజిటల్ అరెస్ట్ కేసుల్లో రూ. 52.39 కోట్ల దోపిడీ

సాక్షి, హైదరాబాద్

డిజిటల్ అరెస్ట్.. కొంతకాలంగా సైబర్ నేరస్తులు అమాయకులను బురిడీ కొట్టించేందుకు ఎంచుకున్న సరికొత్త అస్త్రం. ప్రజల్లో చట్టాలపై అవగాహన లేమి, దర్యాప్తు సంస్థలంటే ఉన్న భయాన్ని దోపిడీకి అవకాశంగా మార్చుకొని 'డిజిటల్ అరెస్ట్'లకు తెరతీస్తున్నారు. ఒంటరిగా ఉండే వృద్ధులు, రిటైర్డ్ ఉద్యోగులను మానసిక ఒత్తిడికి గురిచేయడం ద్వారా సులువుగా బోల్తా కొట్టించొచ్చన్న ఉద్దేశంతో వారిని లక్ష్యంగా చేసుకుంటున్నారు. ముఖ్యంగా రిటైర్డ్ ఉద్యోగులు లేదా పిల్లలు విదేశాల్లో స్థిరపడిన వృద్ధుల వద్ద కచ్చితంగా ఎంతో కొంత డబ్బు ఉంటుందన్న అంచనాతో వారిని టార్గెట్ చేస్తున్నట్లు సైబర్ క్రైం కేసులు దర్యాప్తు చేసే అధికారులు చెబుతున్నారు.

సీబీఐ, ఈడీ లాంటి పేర్లు చెప్పి..

ఈడీ, సీబీఐ, ముంబై క్రైం బ్రాంచ్, కస్టమ్స్ సహా కేంద్ర దర్యాప్తు సంస్థల పేరుతో సైబర్ నేరస్తులు బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఆన్‌లైన్ ఇన్వెస్టిగేషన్, ఇంటరాగేషన్ పేరుతో గంటల తరబడి 'డిజిటల్ అరెస్ట్'చేస్తున్నారు. వివిధ మార్గాల్లో సేకరించిన ఫోన్ నంబర్లకు మొదట ఎస్ఎంఎస్ లేదా ఈ–మెయిల్, వాట్సాప్ ద్వారా సమాచారం పంపి ఫలానా కొరియర్‌లో డ్రగ్స్ పార్సిల్ వచ్చిందని.. ఎయిర్‌పోర్ట్, సీపోర్టుల్లో నిషేధిత వస్తువులు సీజ్ చేశామని కాల్స్ చేస్తున్నారు. కస్టమ్స్, ముంబై క్రైం బ్రాంచ్, యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్, ఆర్‌బీఐ, సీబీఐ, ఈడీ పేర్లతో స్కైప్, వాట్సాప్ వీడియో కాల్స్ చేసి ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. తాము పట్టుకున్న క్రిమినల్స్ వద్ద మీ ఫోన్ నంబర్ లేదా ఆధార్ నంబర్లు లభించినందున వాటి ఆధారంగా కేసులు నమోదు చేస్తున్నట్లు బెదిరిస్తున్నారు.

డ్రామా ఇలా.. తమకు పట్టుబడిన నేరస్తులతో సంబంధం లేదని నిరూపించుకోవడానికి బ్యాంక్ ఖాతా వివరాలు పంపాలంటూ బాధితులను సైబర్ నేరస్తులు డ్రామాకు తెరతీస్తారు. బ్యాంకు లావాదేవీలను పరిశీలిస్తున్నట్లు నటిస్తారు. ఓ గదిలో కూర్చొని మాత్రమే ఇంటరాగేషన్ ఎదుర్కోవాలని బెదిరిస్తారు. బాధితులు తేరుకొనేలోగా వారి పేరుతో ఫేక్ అరెస్ట్ వారెంట్లు, ఆర్‌బీఐ, ఈడీ నోటీసులను వాట్సాప్‌లో పంపిస్తారు. ప్రధానంగా ఢిల్లీ, ముంబై, నోయిడా, గుర్గావ్, యూపీ, పశ్చిమ బెంగాల్‌కు చెందిన సైబర్ ముఠాలు డిజిటల్ అరెస్ట్‌ల పేరుతో వసూళ్లకు పాల్పడుతున్నట్లు సైబర్‌క్రైం పోలీసులు చెబుతున్నారు. తెలంగాణలో ఈ ఏడాది ఆగస్టు వరకు డిజిటల్ అరెస్ట్‌ల పేరుతో రాష్ట్రవ్యాప్తంగా నమోదైన 827 కేసుల్లో బాధితుల నుంచి రూ. 52.39 కోట్లను సైబర్ నేరస్తులు కొల్లగొట్టినట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. గతేడాది మొత్తం 3,037 డిజిటల్ అరెస్ట్ కేసులు నమోదవగా బాధితుల నుంచి సైబర్ ముఠాలు రూ. 177 కోట్లు దోచుకున్నాయి.

డిజిటల్ అరెస్టు అంటే?

దర్యాప్తు సంస్థల అధికారులుగా నటిస్తూ వీడియో కాల్స్ చేసి అవతలి వ్యక్తులను ఎక్కడికీ కదలనివ్వకుండా, ఎవరితోనూ మాట్లాడనివ్వకుండా బెదిరించి చివరకు తమ ఖాతాల్లోకి డబ్బు వేయించుకొనే సైబర్ మోసాన్నే డిజిటల్ అరెస్ట్ అంటారు.

అనుమానం వస్తే ఫిర్యాదు చేయండి

మీ ఫోన్ నంబర్‌కు వాట్సాప్‌లో పోలీసులు, ఇతర దర్యాప్తు సంస్థల పేరిట నోటీసులు పంపినా, మీపై కేసులు నమోదయ్యాయని బెదిరింపు వీడియోలు లేదా వీడియో కాల్స్ చేస్తే కంగారు పడొద్దు. అవతలి వ్యక్తి తీరు అనుమానాస్పదంగా ఉంటే కాల్ కట్ చేసి వెంటనే 1930 హెల్ప్‌లైన్ లేదా cybercrime.gov.inలో ఫిర్యాదు చేయాలి. మీ బ్యాంకు ఖాతాల వివరాలు, ఓటీపీలు ఎవరితోనూ పంచుకోవద్దు.

4 నెలలుగా జీతాల్లేవు!

ఎస్సీ గురుకులంలో ఔట్ సోర్సింగ్, పార్ట్‌టైమ్ టీచర్ల వేతన గోస

- జీతాలు అందక పోవడంతో ఆర్థిక ఇబ్బందులు
- సీఎం కార్యాలయంతోపాటు మంత్రికి వినతులు

సాక్షి, హైదరాబాద్‌: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ(టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్) పరిధిలో పనిచేస్తున్న పార్ట్‌టైమ్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు వేతనాల కోసం ఎదురు చూస్తున్నారు. ఈ సొసైటీ పరిధిలో పనిచేస్తున్న దాదాపు 4 వేల మంది పార్ట్‌టైమ్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు నాలుగు నెలలుగా వేతనాలు విడుదల కాలేదు. జూన్ 12 నుంచి నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైనప్పటి నుంచి వారి సేవలను వినియోగించుకుంటున్న సొసైటీ.. వేతనాలు మాత్రం చెల్లించడం లేదు. దీంతో ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఉద్యోగులు వేతనాల కోసం ఉన్నతాధికారుల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు.

నిధుల విడుదలపై మంత్రి ప్రకటన చేసినా ..

ఎస్సీ గురుకుల సొసైటీ పరిధిలో 268 పాఠశాలలు, జూనియర్ కాలేజీలు, 37 డిగ్రీ కాలేజీలున్నాయి. వీటి పరిధిలో దాదాపు 16 వేల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరిలో 4 వేల మంది వరకు పార్ట్‌టైమ్, ఔట్ సోర్సింగ్ టీచర్లున్నారు. సాధారణ ఉద్యోగుల మాదిరిగా పార్ట్‌టైమ్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కూడా వేతనాలను ఆన్‌లైన్ పద్ధతిలోనే చెల్లిస్తున్నారు. అయితే 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి వీరికి ఇప్పటివరకు వేతనాలను సొసైటీ విడుదల చేయలేదు. ఈ ఉద్యోగుల సర్వీసు కొనసాగింపు ఉత్తర్వులు రాకపోవడంతో వేతనాలు చెల్లించలేదని గతంలో సొసైటీ అధికారులు చెప్పుకొచ్చినా.. గతనెలలో వారి సేవల కొనసాగింపు ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. దాంతో పాటు వారి వేతనాలకు సంబంధించిన నిధులను రూ.10 కోట్ల వరకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ విడుదల చేస్తున్నట్లు మీడియా సమావేశంలో స్పష్టం చేశారు. కానీ నేటి వరకు ఆయా ఉద్యోగులకు వేతనాలు అందలేదు. ఇదిలా ఉండగా సొసైటీ పరిధిలో పనిచేస్తున్న రెగ్యులర్ ఉద్యోగులు సైతం శనివారం సాయంత్రం వరకు వేతనాలు అందలేదని తెలిపారు. వేతనాల విడుదల కోసం టీఎస్‌డబ్ల్యూఆర్‌టీయూ చైర్మన్ రామలక్ష్మణ్, అధ్యక్ష, కార్యదర్శులు డి.బాలస్వామి, కీర్తి రవి తదితరులు శనివారం ముఖ్యమంత్రి కార్యాలయంలో వినతిపత్రం అందించారు.

తెలంగాణ సెమీ కండక్టర్స్

చిప్ డిజైన్, ఆవిష్కరణల కోసం రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర ప్రయత్నాలు

- టిటా భాగస్వామ్యంతో టెక్నాలజీ చిప్ ఇన్నోవేషన్ ప్రోగ్రాం
- చిప్‌ల ఉత్పత్తిని ప్రోత్సహించేందుకు భూ కేటాయింపులు, సబ్సిడీలు
- ఇప్పటికే ప్రాజెక్టు రిపోర్ట్ సమర్పించిన టిటా.. డీపీఆర్‌పై సదస్సు

సాక్షి, హైదరాబాద్‌: ఎలక్ట్రానిక్ చిప్ డిజైన్, ఆవిష్కరణలు, తయారీలో తెలంగాణను అంతర్జాతీయ కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాన్ని చేపడుతోంది. ఇందులో భాగంగా తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ (టిటా)తో కలిసి టెక్నాలజీ చిప్ ఇన్నోవేషన్ ప్రోగ్రామ్ (టీ చిప్)ను చేపట్టింది. సెమీ కండక్టర్ రంగంలో 2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా 15 లక్షల మంది, భారత్‌లో 85 వేల మంది నిపుణులు అవసరమని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో 2030 నాటికి పది బిలియన్ డాలర్ల పెట్టుబడులను రాష్ట్రానికి రప్పించడంతో పాటు 50 వేల ఉద్యోగాలను సృష్టించడం లక్ష్యంగా 'టీ చిప్'ను అమలు చేస్తారు.

రాష్ట్ర ప్రభుత్వం చేతికి డీపీఆర్

'టీ చిప్'కు సంబంధించిన వివరణాత్మక ప్రాజెక్టు రిపోర్టును గత నెల 9న టిటా చైర్మన్ సందీప్ కుమార్ మక్తాల రాష్ట్ర ప్రభుత్వానికి అందజేశారు. ఈ నివేదికలో సెమీ కండక్టర్ రోడ్ మ్యాప్‌తో పాటు చిప్ డిజైన్, ఆవిష్కరణల కేంద్రంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దడంలో అనుసరించాల్సిన పాలసీ, మౌలిక సదుపాయాలు, పబ్లిక్ ప్రైవేటు భాగస్వామ్యాల అవసరాన్ని వివరించారు. టీ చిప్ రోడ్ మ్యాప్ రూపకల్పన కోసం టిటా బృందం తైవాన్, హాంగ్‌కాంగ్‌లో పర్యటించింది. ఈ రంగంలో అంతర్జాతీయ దిగ్గజ సంస్థలుగా ఉన్న టీఎస్ఎంసీ, ఏఆర్ఎం, సినా



ప్సిస్, ఫారడే టెక్నాలజీ, పఫ్ సెక్యూరిటీతో పాటు నేషనల్ యాంగ్ మింగ్ షియావో తంగ్ యూనివర్సిటీ, తైవాన్ సెమీ కండక్టర్స్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌తో సంప్రదింపులు జరిపింది. సెప్టెంబర్ 28, 29 తేదీల్లో రెండు రోజుల పాటు సెమీకాన్ కాన్‌స్టిట్యూషన్ సమ్మిట్ పేరిట సదస్సు నిర్వహించారు. డీఆర్‌డీఓ ప్రతినిధులతో పాటు దేశం నలమూలల నుంచి సెమీకండక్టర్ పరిశ్రమల ప్రతినిధులు, అంతర్జాతీయ స్థాయిలో పేరొందిన నిపుణులు ఈ సదస్సులో పాల్గొన్నారు.

భూ కేటాయింపులు, ప్రోత్సాహకాలు

ఇండియన్ సెమీ కండక్టర్ మిషన్ (ఐఎస్ఎం) కింద అసెంబ్లింగ్, టెస్టింగ్, మార్కింగ్, ప్యాకేజింగ్ (ఏటీఎంపీ) యూనిట్లను కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఇప్పటికే అస్సాం, గుజరాత్‌లలో ఏటీఎంపీ యూనిట్ల ఏర్పాటు ప్రయత్నాలు చురుగ్గా సాగుతున్నాయి. ఇదే రీతిలో ఐఎస్ఎం నుంచి ఏటీఎంపీ యూనిట్ల ఏర్పాటుకు కేంద్ర సహకారాన్ని కోరాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. వీటి ఏర్పాటుకు ముందుకు వచ్చే సంస్థలకు భూ కేటాయింపులు, ఇతర రాయితీలు, ప్రోత్సాహకాలు ఇవ్వాలని నిర్ణయించింది.

సుస్థిర సెమీ కండక్టర్ వాతావరణం



తెలంగాణలో ఉన్న మౌలిక వసతులు, పెద్ద సంఖ్యలో ఉన్న ఏఐ, సెమీకండక్టర్ నిపుణులు రాష్ట్రాన్ని చిప్ డిజైన్, ఆవిష్కరణల కేంద్రంగా తీర్చిదిద్దేందుకు దోహదం చేస్తాయి. ఐఎస్ఎంలో భాగంగా తెలంగాణలో ఏటీఎంపీ, అడ్వాన్స్‌డ్ ప్యాకేజింగ్ అండ్ మాన్యుఫాక్చరింగ్ ప్లాంట్లు (ఏపీఎంపీ) ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు. తద్వారా రాష్ట్రంలో సెమీ కండక్టర్ రంగం వృద్ధికి అవసరమైన సుస్థిర వాతావరణం ఏర్పడుతుంది.

– మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

సెమీ కండక్టర్ విప్లవానికి లాంచ్ ప్యాడ్



టీ చిప్ కార్యక్రమం ద్వారా రాష్ట్రం రాబోయే రోజుల్లో భారత్ సెమీ కండక్టర్ విప్లవానికి కేంద్ర బిందువుగా నిలుస్తుంది. ఇక్కడ జరుగుతున్న ప్రయత్నాలు అంతర్జాతీయ స్థాయిలో భారీ ఫలితాలు ఇస్తాయి. అంతర్జాతీయ స్థాయిలో భాగస్వామ్యాల ఏర్పాటుకు యూఏఈ, మలేసియా, ఇతర ఆసియా, మధ్యప్రాచ్య దేశాలతో సంప్రదింపులు జరుగుతున్నాయి.

– సందీప్ కుమార్ మక్తాల, టిటా అధ్యక్షుడు.

పేదరికం 'చిన్న'బోయింది

2010–23 మధ్య పురోగతి సాధించిన పలు రాష్ట్రాలు

- పేదరికం తగ్గిన టాప్ రాష్ట్రాల్లో ఉమ్మడి ఏపీ
- ఏపీలో దారిద్య్రరేఖకు దిగువనున్న జనాభా 1.7%
- రిజర్వ్ బ్యాంకు సెప్టెంబర్ నివేదికలో వెల్లడి



సాక్షి, స్పెషల్ డెస్క్‌: భారత్‌లో పేదరికం 2010–23 మధ్య భారీగా తగ్గింది. ఈ విషయంలో అనేక రాష్ట్రాలు గణనీయమైన పురోగతి సాధించాయని రిజర్వు బ్యాంకు (ఆర్‌బీఐ) తాజా నివేదిక వెల్లడించింది. హిమాచల్‌ప్రదేశ్, పంజాబ్, ఉమ్మడి ఏపీ రాష్ట్రాల్లో దారిద్య్రరేఖకు దిగువన ఉన్న జనాభా భారీగా తగ్గడం విశేషం. ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్‌లలో పేదరికం అధికంగా ఉంది. బిహార్, ఉత్తరప్రదేశ్ వంటి కొన్ని పేద రాష్ట్రాల్లో.. ఈ కాలంలో పేదల జనాభా భారీగా తగ్గడం గమనార్హం.

2022–23లో దేశంలో హిమాచల్ ప్రదేశ్‌లో కేవలం 1.2% జనాభా మాత్రమే దారిద్య్రరేఖకు దిగువన ఉంది. పంజాబ్ 1.6%, ఉమ్మడి ఏపీ 1.7 శాతంతో ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. జనాభా పరంగా తక్కువ పేదరికం ఉన్న రాష్ట్రాలలో ఢిల్లీ 1.75%, తమిళనాడు 2%, కర్ణాటక 2.1% వాటాతో పోటీపడుతున్నాయి. మరోవైపు ఛత్తీస్‌గఢ్‌లో అత్యధికంగా 19.2% జనాభా పేదరికంలో మగ్గుతోంది. జార్ఖండ్‌లో 14.6%, మధ్యప్రదేశ్‌లో 10.6% జనాభా దారిద్య్రరేఖకు దిగువన ఉంది. దేశంలోని అత్యంత సంపన్న రాష్ట్రమైన మహారాష్ట్రలో 9.95% పేదలు ఉన్నారు. దేశంలోని అత్యంత పేద రాష్ట్రాలలో ఒకటైన బిహార్‌లో 7.5% జనాభా పేదరికంలో ఉంది.

వినియోగ వ్యయంలో వృద్ధి

భారత్‌లో 2010–11తో పోలిస్తే 2022–23 నాటికి పేదరిక జనాభా గణనీయంగా తగ్గిన రాష్ట్రాల్లో బిహార్ ముందుంది. ఈ రాష్ట్రంలో దారిద్య్రరేఖకు దిగువన ఉన్న జనాభా ఏకంగా 38% తగ్గింది. పేదరికం ఉత్తరప్రదేశ్‌లో 34.1%, మధ్యప్రదేశ్‌లో 33.1% తగ్గింది. చరిత్రాత్మకంగా అధిక పేదరికం ఉన్న ఈ రాష్ట్రాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని ఈ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఒడిశా, అస్సాం, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. 2010–11 నుంచి 2022–23 మధ్య ఉమ్మడి ఏపీ దారిద్య్రరేఖకు దిగువన ఉన్న జనాభా 12.5% తగ్గింది. కాగా, దేశంలో కుటుంబ నెలవారీ తలసరి వినియోగ వ్యయం పెరిగింది. వినియోగంలో పేద రాష్ట్రాలు ముందంజలో ఉండటం విశేషం. వివిధ ప్రభుత్వ పథకాలను మరింత సమర్థవంతంగా అందించడం వల్ల వినియోగ వ్యయంలో అసమానతలు తగ్గాయని నివేదిక తెలిపింది.


అతి తక్కువ పేదరికం ఉన్న రాష్ట్రాలు

రాష్ట్రం	జనాభాలో శాతం
హిమాచల్ ప్రదేశ్	1.2
పంజాబ్	1.6
ఆంధ్రప్రదేశ్	1.7
ఢిల్లీ	1.8
తమిళనాడు	2.0
కర్ణాటక	2.1
కేరళ	2.9
జమ్మూకశ్మీర్	4.2
హరియాణా	4.2
గుజరాత్	5.0

పేదలు అధికంగా ఉన్న టాప్–10 రాష్ట్రాలు

రాష్ట్రం	జనాభాలో శాతం
ఛత్తీస్‌గఢ్	19.2
జార్ఖండ్	14.6
మధ్యప్రదేశ్	10.6
మహారాష్ట్ర	9.95
పశ్చిమబెంగాల్	9.95
ఒడిశా	9.4
ఉత్తరప్రదేశ్	7.8
బిహార్	7.5
అస్సాం	7.1
రాజస్తాన్	6.75

2010–11తో పోలిస్తే 2022–23 నాటికి పేదరికం భారీగా తగ్గిన ప్రధాన రాష్ట్రాలు



11న జాతీయ మోటార్ స్పోర్ట్స్ పోటీలు



ప్రారంభించనున్న కేటీఆర్

సాక్షి, హైదరాబాద్‌: కోయంబత్తూరులోని కుమారగురు ఇన్‌స్టిట్యూషన్స్‌లో ఈ నెల 11న ఫ్రాటర్నిటీ ఆఫ్ మెకానికల్ అండ్ ఆటోమోటివ్ ఇంజనీర్స్ (ఎఫ్ఎంఏఈ) ఆధ్వర్యంలో జరగనున్న 10వ నేషనల్ స్టూడెంట్ మోటార్ స్పోర్ట్ కాంపిటీషన్–25 ప్రారంభోత్సవానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరుకానున్నారు. ఈ కార్యక్రమంలో 100 కళాశాలల నుంచి 1,300 మంది యువ ఇంజనీర్లు, 70కి పైగా విద్యార్థి బృందాలు భాగస్వామ్యం కానున్నాయి. విద్యార్థులు రూపొందించిన వాహనాలు, వినూత్న ఆవిష్కరణలను ఈ వేదికపై ప్రదర్శిస్తారు. ఈ ప్రాజెక్టులను అంతర్జాతీయ స్థాయిలోని అగ్రగామి ఆటోమోటివ్ కంపెనీలకు చెందిన 25 మంది నిపుణుల జ్యూరీ సభ్యులు మూల్యాంకనం చేయనున్నారు. హైదరాబాద్‌కు ఫార్ములా–ఈ రేసింగ్‌ను తీసుకురావడం ద్వారా.. తెలంగాణను గ్లోబల్ మోటార్ స్పోర్ట్ మ్యాప్‌పై నిలబెట్టడంలో కేటీఆర్ పోషించిన పాత్ర అభినందనీయమని ఎఫ్ఎంఏఈ కొనియాడింది.

తిరుమలలో బాంబ్ స్క్వాడ్ తనిఖీలు

తిరుమల: వివిధ రాష్ట్రాల్లో బాంబులు పెట్టినట్లు పోలీసులకు బెదిరింపుల మెయిల్స్ అందాయి. ఈ క్రమంలో తిరుపతి జిల్లాకు కూడా బెదిరింపు మెయిల్ రావడంతో పోలీసులు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టారు. దీన్లో భాగంగా తిరుమలలోబాంబ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వించింది. శ్రీవారి ఆలయానికి వెళ్లే వైకుంఠం క్యూకాంప్లెక్స్–1, 2, మాతృశ్రీ అన్నప్రసాద కేంద్రం, లడ్డూ విక్రయ కేంద్రం, తిరుమలలోని యాత్రికుల వసతి సముదాయాల్లో తనిఖీలను నిర్వహించినట్లు టీటీడీ విజిలెన్స్ అధికారులు తెలిపారు. భక్తులు ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని తిరుమలలో పటిష్టమైన భద్రతా వ్యవస్థ ఉందని చెప్పారు. అదే సమయంలో అపోహలు, ఊహాగానాలు నమ్మవద్దని సూచించారు.

ప్రధాని నుంచి అవార్డు అందుకున్న ఖమ్మం యువతి



ప్రధాని నరేంద్ర మోదీ నుంచి అవార్డు అందుకుంటున్న తాళ్లూరి పల్లవి

సాక్షి, న్యూఢిల్లీ/ఖమ్మం రూరల్‌: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో తెలంగాణ రాష్ట్రం ఖమ్మం రూరల్ మండలం ఆరెంపుల గ్రామానికి చెందిన యువతి తాళ్లూరి పల్లవి జాతీయ స్థాయిలో సత్తా చాటింది. ఈ మేరకు శనివారం ఢిల్లీ విజ్ఞాన్ భవన్‌లో నిర్వహించిన 'కౌశల్ దీక్షాంత్ సమారోహ్' కార్యక్రమంలో తాళ్లూరి పల్లవి.. ప్రధాని నుంచి అవార్డు అందుకుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ విభాగంలో ఆల్ ఇండియా ట్రేడ్ టాపర్‌గా ఆమె ఎంపికైంది. ఈ సందర్భంగా పలు విభాగాల్లో అత్యుత్తమ నైపుణ్యం కనబరిచిన వివిధ రాష్ట్రాల విద్యార్థులకు సైతం ప్రధాని మోదీ అవార్డులు ప్రధానం చేశారు. పల్లవి కిట్స్ కళాశాలలో బీటెక్ పూర్తి చేసింది. పల్లవి హైదరాబాద్‌లో ఏఐలో చేరి.. ఏడాది పాటు శిక్షణ అనంతరం పరీక్ష రాసి టాపర్‌గా నిలిచింది. ఆమె తండ్రి రవిప్రసాద్ ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తుండగా.. తల్లి అజిత గృహిణి. కాగా, పల్లవిని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటనలో అభినందించారు.

24న తిరిగి 'ఫిరాయింపు' వాదనలు

ముగిసిన నలుగురు ఎమ్మెల్యేల క్రాస్ ఎగ్జామినేషన్

- మిగతా ఎమ్మెల్యేల విచారణకు ఇంకా ఖరారవని షెడ్యూల్
- కామన్వెల్త్ పార్లమెంటరీ సదస్సు కోసం రేపు బార్బడోస్‌కు అసెంబ్లీ స్పీకర్
- విదేశీ పర్యటన నుంచి ఈ నెల 22న తిరిగి రాక.. ఆ తర్వాతే మిగతా 'ఫిరాయింపు' ఎమ్మెల్యేలపై విచారణ

సాక్షి, హైదరాబాద్‌: పార్టీ ఫిరాయింపులకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న నలుగురు ఎమ్మెల్యేల క్రాస్ ఎగ్జామినేషన్ శనివారం ముగిసింది. అయితే ఇరుపక్షాల ఎమ్మెల్యేల మౌఖిక వాదనలు వినేందుకు వీలుగా పిటిషన్ల విచారణను అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ నేతృత్వంలోని ట్రిబ్యునల్ ఈ నెల 24కు వాయిదా వేసినట్లు సమాచారం. అయితే క్రాస్ ఎగ్జామినేషన్ సందర్భంగా ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలు.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చూపిన సాక్ష్యాలను నిరాకరించడంతో ఆధారాల కోసం ఈ నెల 24న ట్రిబ్యునల్ ఎదుట పిటిషన్లు దాఖలు చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది.

పార్టీ మారలేదు.. బీఆర్ఎస్‌లోనే ఉన్నాం

స్పీకర్ ట్రిబ్యునల్ ఎదుట ఇప్పటికే ఎమ్మెల్యేలు ప్రకాశ్ గౌడ్, కాలె యాదయ్య క్రాస్ ఎగ్జామినేషన్ ముగియగా శనివారం ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, గూడెం మహిపాల్‌రెడ్డి క్రాస్ ఎగ్జామినేషన్ జరిగింది. తాము పార్టీ మారినట్లు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల తరఫు న్యాయవాదులు చూపిన ఆధారాలను బండ్ల, గూడెం తోసిపుచ్చినట్లు సమాచారం. పార్టీ మారినట్లు వచ్చిన వార్తలు, ప్రకటనలు, వీడియోలు, ఫొటోలు సరైనవి కావని వారు పేర్కొన్నట్లు తెలిసింది. సీఎంను తాము కలిసిన ఫొటోలను మార్ఫింగ్ చేశారనే వాదన వినిపించినట్లు సమాచారం. తాము బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నా పార్టీ కార్యక్రమాలకు హాజరు కావడం లేదని సమాధానం ఇచ్చినట్లు తెలియవచ్చింది. అసెంబ్లీలో వేరుగా ఎందుకు కూర్చుంటున్నారనే ప్రశ్నకు తమకు ట్రెజరీ బెంచ్‌లో సీట్లు కేటాయించలేదని చెప్పినట్లు తెలిసింది. ఇటీవల సీఎం నివాసంలో పార్టీ మారిన ఎమ్మెల్యేలతో రేవంత్‌రెడ్డి జరిపిన భేటీకి సంబంధించిన ఫుటేజీ కావాలని బీఆర్ఎస్ తరఫు న్యాయవాదులు స్పీకర్‌కు విజ్ఞప్తి చేసినట్లు సమాచారం. సాక్షులను కూడా విచారణ జరిపేందుకు అనుమతి ఇవ్వాలనే యోచనలో బీఆర్ఎస్ ఉన్నట్లు సమాచారం.

రేపు బార్బడోస్‌కు స్పీకర్ ప్రసాద్ కుమార్

అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ బండా ప్రకాశ్ ముదిరాజ్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం సోమవారం బార్బడోస్‌కు వెళ్లనుంది. ఈ నెల 5 నుంచి 12 వరకు జరిగే 68వ కామన్వెల్త్ పార్లమెంటరీ సదస్సులో పాల్గొననుంది. సదస్సు ముగిశాక ఇంగ్లండ్, ఫ్రాన్స్, ఇటలీలలో అధ్యయనం పూర్తి చేసుకొని ఈ నెల 22న స్పీకర్ తిరిగి హైదరాబాద్ చేరుకోనున్నారు. పార్టీ ఫిరాయింపుల అంశంలో స్పీకర్ మూడు నెలల్లోగా అంటే అక్టోబర్ 31లోగా నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఇటీవల గడువు విధించడం తెలిసిందే. ఈ నేపథ్యంలో విదేశాల నుంచి తిరిగి వచ్చాక ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న మిగతా ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్ రావు, కడియం శ్రీహరి, దానం నాగేందర్, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, అరికెపూడి గాంధీ, సంజయ్ కుమార్ విచారణ షెడ్యూల్‌ను స్పీకర్ ఖరారు చేసే చాన్స్ ఉంది.

నిజాలు బయటకు వచ్చాయి: సోమా భరత్

పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేలు గూడెం మహిపాల్‌రెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి క్రాస్ ఎగ్జామినేషన్‌లో అనేక నిజాలు వెల్లడయ్యాయని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి సోమా భరత్ కుమార్ తెలిపారు. వారి విచారణ అనంతరం అసెంబ్లీ వెలుపల ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఫిరాయింపు ఎమ్మెల్యేలతో సమావేశమై క్రాస్ ఎగ్జామినేషన్‌ను ఎలా ఎదుర్కోవాలో వివరించారని.. దీనికి సంబంధించిన ఫుటేజీ కోసం ట్రిబ్యునల్‌కు విజ్ఞప్తి చేసినట్లు ఆయన చెప్పారు. పార్టీ ఫిరాయించలేదని 10 మంది ఎమ్మెల్యేలు బుకాయిస్తున్నారని సోమా భరత్ విమర్శించారు. వారు ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరితే అభ్యంతరం లేదని.. కానీ చట్టాలను తుంగలో తొక్కడం సరికాదన్నారు. ఈ వ్యవహారంలో ఇంకా చాలా మంది సాక్షులను విచారణకు తీసుకురావాల్సి ఉందన్నారు.



మనుషులు కండ్ల వైపు చూచుదురు కానీ,
యెహోవా హృదయమును చూచుచున్నాడు.
– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజ మాసం, **తిథి:** శు.త్రయోదశి ప.12.54 వరకు, తదుపరి చతుర్దశి, **నక్షత్రం:** శతభిషం ఉ.6.45 వరకు, తదుపరి పూర్వాభాద్ర, **వర్జ్యం:** ప.12.58 నుండి 2.30 వరకు, **దుర్ముహూర్తం:** సా.4.11 నుండి 4.56 వరకు, **అమృత ఘడియలు:** రా.10.16 నుండి 11.50 వరకు.

సూర్యోదయం : 5.54
సూర్యాస్తమయం : 5.45
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్)
రాయని డైరీ

మాధవ్ శింగరాజు

ఇండియా, పాకిస్తాన్ రెండూ కూడా ఫైనల్స్‌కు చేరుకుంటే, రెండు జట్ల మధ్య – ఈ రోజు మధ్యాహ్నం జరుగుతున్నట్లే – ఆ రోజు మధ్యాహ్నం కూడా ఇదే ప్రేమదాన స్టేడియంలో పోరు మొదలౌతుంది.

'ప్రేమ'దాన స్టేడియంలో 'పోరు'!!

భలే ఉంటాయి ఈ అనుబంధాలు... కొట్లాడుకునే అక్కచెల్లెళ్ల మధ్య, ఘర్షణలు పడే అన్నదమ్ముల మధ్య! ఒకరి ఇంట్లోకి ఒకరు అడుగు పెట్టరు. పొరుగింట్లోనో, ఆ పై ఇంట్లోనో పంచాయితీ! "అలాగైతేనే వస్తాం" అని మొదటే అగ్రిమెంట్! నవ్వొస్తోంది నాకు!

షేక్ హ్యాండ్స్ ఇవ్వాలనీ, సెల్ఫీలు తీసుకోవాలనీ, హగ్స్ ఇస్తుంటే వద్దనకూడదనీ రూల్ బుక్‌లో ఏమైనా ఉందా అని 'బోర్డు'లో పెద్దవాళ్లు అంటున్నారు! అది నిజమే కానీ... షేక్ హ్యాండ్స్ ఇవ్వకూడదనీ, సెల్ఫీలు తీసుకోకూడదనీ, హగ్స్ ఇస్తుంటే వద్దనాలనీ కూడా రూల్ బుక్‌లో ఉండదేమో కదా!

ఇలాంటప్పుడే, అమాయకమైన చిరునవ్వుతో – ఫైవారి ఆదేశాలను ధిక్కరిస్తే ఎలా ఉంటుందా అనే ఆలోచన నాకు వస్తుంటుంది.

"అలా చెయ్యకు హ్యారీ" అనేవారు చిన్నప్పుడు నాన్న. చిరునవ్వుతో సరిగ్గా అలానే చెయ్యబుద్ధి అయ్యేది నాకు!



"అలా చెయ్యటం కరెక్ట్ కాదు హర్మన్" అనేవారు కాలేజ్‌లో ప్రిన్సిపాల్. చిరునవ్వుతో సరిగ్గా అదే కరెక్ట్ అనాలనిపించేది నాకు!

ఇప్పుడిక బీసీసీఐ సెక్రెటరీ! 'మహిళల ప్రపంచ కప్‌లో భారత్–పాక్ ప్లేయర్స్ షేక్ హ్యాండ్స్ ఇచ్చుకుంటారనే గ్యారంటీ ఏమీ లేదని అంటున్నారు! చిరునవ్వుతో సరిగ్గా నాకేం అనిపిస్తోందంటే, షేక్ హ్యాండ్స్ ఇచ్చుకోబోమనే గ్యారంటీ కూడా ఏమీ లేదని!

మనసులో దగ్గరితనాన్ని ఉంచుకుని దూరాన్ని ఎంతకాలం నటించగలం? మాట్లాడాలని లోపల పీకుతూ ఉంటే మౌనాన్ని ఎలా పాటించగలం?

కొద్దిసేపట్లో భారత్–పాక్‌ల మధ్య లీగ్ మ్యాచ్. అది వదిలేసి, ఎప్పుడో నెల తర్వాత నవంబర్ 2న ఎవరి మధ్య జరుగుతుందో కూడా తెలియని ఫైనల్ మ్యాచ్ గురించి ఆలోచిస్తున్నానేను!

నిజంగానే భారత్–పాక్ ఫైనల్‌కి చేరుకుంటే, ఫైనల్‌లో గెలుపెవరిది అనే మాట అటుంచి... ఫైనల్‌లోనైనా టాస్ వేశాక షేక్ హ్యాండ్స్ ఇచ్చుకుంటామా, ఆట ముగిశాకైనా చేతులు కలుపుకుంటామా అన్నదే ఆలోచిస్తూ యావద్దేశంతో పాటుగా నేను కూడా ఆ రోజు తెల్లవారుజాము నుంచే టెన్షన్ టెన్షన్‌గా ఉంటాననుకుంటా!

ఫాతిమా సనా పాక్ కెప్టెన్. చిన్న పిల్ల. నాకంటే 13 ఏళ్లు చిన్న. ఎం.ఎస్.ధోనీ తన ఇన్‌స్పిరేషన్ అట. ధోనీలా కూల్‌గా ఉండి ఈ వరల్డ్ కప్‌లో తన జట్టును గెలిపిస్తుందట! బహిరంగంగానే చెప్పేసింది. అది కదా 'హై–స్పిరిటెడ్' అంటే. కానీ బీసీసీఐ వేరే 'ఫ్లై'లో ఉంది. మొన్నటి మెన్స్ క్రికెట్ 'సంప్రదాయాన్నే' ఉమెన్స్ క్రికెట్ కూడా ఫాలో అవాలట! అంటే, నో షేక్ హ్యాండ్స్ అని.

2022 వరల్డ్ కప్‌లో – న్యూజిలాండ్‌లో భారత్–పాక్ ఆటకు పాక్ కెప్టెన్ బిస్మా మరూఫ్ తన ఆర్నెల్ల వయసున్న కూతుర్ని వెంటపెట్టుకుని వచ్చింది. తల్లీకూతుళ్లతో కలిసి టీమ్ ఇండియాలోని అందరం సెల్ఫీ తీసుకున్నాం. ఆ గేమ్‌లో ఇండియా గెలిచింది కానీ, ఇండియాను బిస్మా మరూఫ్ కూతురు తన బోసి నవ్వుల్తో 'క్లీన్ బౌల్డ్' చేసేసింది. ఆ పాప పేరు కూడా ఫాతిమానే!

లీగ్ మ్యాచ్ టైమ్ అయింది. టాస్ కోసం లోపలికి వెళుతున్నాం. గెలుపు, ఓటమి... తర్వాతి సంగతి. ఫీల్డ్‌లో ఫాతిమా నాకు షేక్ హ్యాండ్ ఇవ్వబోతే నేను చెయ్యి చాస్తానా? లేక, ఫాతిమా షేక్ హ్యాండ్ కోసం నేనే ముందుగా చెయ్యి చాస్తానా?

అంతా ఫాతిమా చేతుల్లో ఉంది. ఊహూ... చేతుల్లో కాదు. ఫాతిమా చిరునవ్వులో ఉంటుంది.

సారీ చెప్పకుండా... సంబరాలా?



జనతంత్రం

వర్ధెల్లి మురళి

నవరాత్రి ఉత్సవాలు మొదలుకొని దీపావళి పండుగ ముగిసే వరకూ ఈ నెల రోజుల సీజన్‌ను ఎన్డీఏ సర్కార్ హైజాక్ చేసింది. జీఎస్టీ పేరుతో వసూలు చేస్తున్న పన్నులను హేతుబద్ధీకరణ చేయడం వల్ల పేద, మధ్య తరగతుల ప్రజలకు బాగా ఆదా అవుతుందనీ, అందువల్ల ఈ సీజన్‌ను పొదుపు ఉత్సవంగా పాటించాలనీ దేశ ప్రజలకు ఎన్డీఏ సర్కార్ పిలుపునిచ్చింది. ఈ మేరకు ప్రభుత్వాలు అధికారిక కార్యక్రమాలను కూడా ప్రకటించాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న డబుల్ ఇంజన్ సర్కార్ దీంతో పాటు మరో అంశాన్ని కూడా జోడించింది. అయితే దాన్ని అధికారిక కార్యక్రమాల్లో కలపకుండా పార్టీ వేదికల ద్వారా ప్రచారం చేసుకోవాలని సంకల్పించారు. వసూలు చేసిన కరెంటు బిల్లుల్లో యూనిట్‌కు 13 పైసల చొప్పున తిరిగి వినియోగదారులకు జమ చేస్తారట! దీన్నే ట్రూ–డౌన్ అంటున్నారు. ఇది చరిత్ర ఎరుగని మహత్కార్యం అన్నట్టు ముఖ్యమంత్రి ట్వీట్ కూడా చేశారు.

నిజంగా ఇవి సంబరాలు చేసుకోదగిన సందర్భాలేనా? ఒంటినిండా వాతలు పెట్టి అక్కడక్కడా ఆయింట్‌మెంట్ రాస్తే ఉపశమనం లభించినట్టేనా! ఆ బాధితుడు అందుకు కృతజ్ఞతగా ఎగిరి గంతేసి పండుగ చేసుకోవాలా? జీఎస్టీని హేతుబద్ధం చేస్తున్నారంటే ఎనిమిదేళ్ల నుంచి అనుసరిస్తున్న విధానం నిర్హేతుకమైనదని అంగీకరించినట్టే కదా! ఈ ఎనిమిదేళ్లుగా సాధారణ ప్రజల రక్తాన్ని తాము జలగల్లా పీల్చుకున్నామని పరోక్షంగా చెప్పినట్టే కదా! ఈ హేతుబద్ధీకరణ వలన ప్రజలకు రెండున్నర లక్షల కోట్ల మేరకు లబ్ధి జరుగుతుందని ప్రధానమంత్రి ప్రకటించారు. దీనిపై భిన్నాభిప్రాయాలున్నాయి. ఇందులో మళ్లీ కొన్ని మెలికలున్నాయి. అందువల్ల ప్రభుత్వం చెబుతున్నంత స్థాయిలో ఉపశమనం కలుగదనే వాదన ఉన్నది. పాప్‌కార్న్ మీద జీఎస్టీ 5 శాతం మాత్రమే అన్నారు. కానీ బ్రాండెడ్ అయితే 12 శాతం, షుగర్ కోటెడయితే 18 శాతం జీఎస్టీ ఉంటుంది. జీవిత బీమా ప్రీమియం మీద జీఎస్టీ లేదన్నారు. కానీ అది వ్యక్తిగత బీమాలకు మాత్రమే వర్తిస్తుంది. గ్రూప్ బీమాకు జీఎస్టీ కట్టాల్సిందే. ఇలాంటివి చాలా ఉన్నాయి.

స్థూలంగా పన్ను రేట్లు తగ్గడం వలన అదే నిష్పత్తిలో వినిమయం కూడా పెరిగి ప్రభుత్వ ఖజానాకు వాటిల్లే నష్టం నామమాత్రంగానే ఉండబోతున్నదని ఎస్‌బీఐ ఇదివరకే అంచనా వేసింది. అందుకు తగ్గట్టుగానే ఈ నవరాత్రి వేడుకల్లో వివిధ అంశాలవారీగా 25 శాతం నుంచి 100 శాతం వరకు గతంతో పోలిస్తే అమ్మకాలు పెరిగాయని అధికార వర్గాలను ఉటంకిస్తూ పత్రికల్లో వార్తలొచ్చాయి. ఈ ఎనిమిదేళ్లలో అమలు చేసిన గబ్బర్ సింగ్ ట్యాక్స్ విధానం వల్ల ప్రజలకు జరిగిన నష్టమెంత అనేదానిపై మాత్రం ఎటువంటి సింహావలోకనం అధికారికంగా జరగలేదు. జీఎస్టీ అమలుకు ముందు సంవత్సరం అంటే, 2016–17 ఆర్థిక సంవత్సరంలో ఇప్పుడు జీఎస్టీ పరిధిలో ఉన్న పరోక్ష పన్నుల ద్వారా కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వా లకు సమకూరిన ఆదాయం సుమారు 12 లక్షల కోట్లని అంచనా. ఇదే ఆదాయం 2024–25 నాటికి 22 లక్షల కోట్లకు ఎగబాకింది. ఇందులో ఏటికేడు సహజంగా వుండే వృద్ధి కొంత ఉండవచ్చు. కాని సింహభాగం వృద్ధి మాత్రం జీఎస్టీ ద్వారా సాధ్యమైనదే.

అయితే ఇంత భారీ పెరుగుదలకు కారణమెవరు? దేశంలో ఈ పదేళ్లలో శరవేగంగా పుట్టుకొచ్చిన బిలియనీర్లా, మిలియనీర్లా? కానేకాదు. సాధారణ పేద మధ్య తరగతి ప్రజలు కడుపు కట్టుకొని ఖజానాకు ముడుపు కట్టిన ఫలితమే ఈ అసాధారణ పెరుగుదల. ఆదాయాల్లో, ఆస్తిపాస్తుల్లో అట్టడుగున ఉండే 50 శాతం మంది పేద ప్రజలు జీఎస్టీలో 64 శాతం చెల్లిస్తున్నారని అధ్యయనాల్లో వెల్లడైంది. వీరికంటే ఎగువన ఉండే 40 శాతం మంది జీఎస్టీ చెల్లింపుల వాటా 33 శాతం. ఇక అగ్రశ్రేణి పది శాతం సంపన్నుల సంగతి. ఈ పదేళ్లలో వీరి సంపద ఇబ్బడి ముబ్బడిగా పెరిగిందని అనేక అధ్యయనాలు వెల్లడించిన సంగతి తెలిసిందే. ఈ పది శాతం కుబేరులు సమష్టిగా మోస్తున్న జీఎస్టీ భారం కేవలం మూడు శాతం. యాభై శాతం మంది పేదలు 64 శాతం చెల్లిస్తుంటే 10 శాతం పెద్దలు 3 శాతం చెల్లిస్తున్నారనేది ఈ జీఎస్టీ రాజ్‌లో ఒక కఠిన వాస్తవం.

అధికాదాయం కలిగిన వారు చెల్లించడానికి జీఎస్టీ కాకుండా వేరే పన్నులున్నాయని వాదించవచ్చు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను ఆదాయ పన్ను, అధికాదాయంపై సర్‌ఛార్జ్, కేపిటల్ గెయిన్స్ అంతా కలిపి సమకూరింది 11,56,000 కోట్లు. అదే సమయంలో 50 శాతం పేదలు జీఎస్టీ రూపంలో చెల్లించింది 22 లక్షల కోట్లలో 64 శాతం. అంటే సుమారు 14 లక్షల కోట్లు. మన సమాజంలో త్యాగమెవరిదో, భోగమెవరిదో చెప్పడానికి ఈ అంకెలు అద్దం పడతాయి. ఈ జీఎస్టీ కాలంలోనే దేశ ప్రజల ఆదాయాల్లో పెరుగుతున్న అసమానతలపై ఆక్స్‌ఫామ్ లాంటి సంస్థలు ఏటేటా సవివరమైన నివేదికలు వెల్లడిస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పుడీ విషయాలకు మరో కొత్త పార్శ్వం తోడైంది. కార్తీక్ మురళీధరన్ అనే ఆర్థికవేత్త శనివారం నాటి 'టైమ్స్ ఆఫ్ ఇండియా'లో ఒక వ్యాసం రాస్తూ ఆదాయాల పరంగా ఇండియాను మూడు ఇండియాలుగా పేర్కొన్నారు. గతంలో లోహియా, ఫెర్నాండెజ్ వంటి సోషలిస్టులు గ్రామీణ భారత్, అర్బన్ ఇండియాలుగా రెండుగా విభజించి మాట్లాడేవారు. ఇప్పుడది మూడుకు చేరింది. ఇండస్ వ్యాలీ రిపోర్ట్‌ను ఉటంకిస్తూ కార్తీక్ మురళీధరన్ ఈ ప్రస్తావన చేశారు.

ఇందులో ఒకటవ ఇండియా పది శాతం జనాభా గల సంపన్నులది. వీరి తలసరి ఆదాయం 15 వేల డాలర్లు. తర్వాత శ్రేణిలోని రెండో ఇండియా 20 శాతం మంది ప్రజలది. వీరి తలసరి ఆదాయం 3 వేల డాలర్లు. ఇక 70 శాతం మంది భారతీయుల ఆదాయం వెయ్యి డాలర్లు. వాళ్లే మూడో భారత్. ప్రపంచ బ్యాంకు వర్గీకరణ ప్రకారం 13,936 డాలర్ల కంటే ఎక్కువ తలసరి ఆదాయం వున్న దేశం అధికాదాయం గల దేశం కింద లెక్క. 14 కోట్లకు పైగా జనాభా ఉన్న మన ఫస్ట్ ఇండియా ఈ శ్రేణిలోకి వస్తుంది. 4,496 డాలర్ల నుంచి 13,935 డాలర్ల మధ్యన తలసరి ఆదాయం ఉండే దేశాలను అప్పర్ మిడిల్ ఆదాయం గల దేశంగా ప్రపంచ బ్యాంకు పరిగణించింది. మూడు ఇండియాల్లో ఒకటి కూడా ఈ శ్రేణిలోకి రాలేదు. లోయర్ మిడిల్ క్లాస్‌లోకి మన 20 శాతం జనాభా (సుమారు 30 కోట్లు) ఉన్న ఇండియా చేరింది. 1,136 డాలర్ల నుంచి 4,495 డాలర్ల తలసరి ఆదాయమున్న దేశాలు ఈ లోయర్ మిడిల్ క్లాసులోకి వస్తాయి. 1,135 డాలర్ల కంటే తక్కువ తలసరి ఆదాయమున్న దేశాలు ప్రపంచ బ్యాంకు దృష్టిలో అల్పాదాయ దేశాలు, అంటే పేద దేశాలు. ఇందులోకి మన 70 శాతం (సుమారు వంద కోట్లు) జనాభా వస్తుంది. అంటే మన దేశంలోని వంద కోట్లమంది జీవన ప్రమాణాలు ఆఫ్రికా ఖండంలోని అతి పేద దేశాల ప్రజలతో ఇంచుమించు సమానమన్నమాట. ఇదిగో ఈ నిరుపేదలే గడచిన ఒక్క సంవత్సరంలో వసూలైన జీఎస్టీలో (22 లక్షల కోట్లు) అత్యధిక భాగాన్ని చెల్లించారు. ఈ ప్రజలకు ఇప్పుడు కొంత ఉపశమనం కలిగించడాన్ని స్వాగతించవలసిందే. కానీ ఈ ప్రభుత్వమే చెబుతున్నట్టు ఎనిమిదేళ్ల 'నిర్హేతుక' విధానానికి పేదలు చెల్లించిన మూల్యం సంగతి? కనీసం క్షమాపణలైనా చెప్పరా? పైగా పండుగ చేసుకోమనడం ఒక క్రూర పరిహాసం.

ఇటువంటి పరిహాసాలు చేయడం ఆంధ్రప్రదేశ్ ఎన్డీఏ కూటమి నాయకుడు చంద్రబాబుకు పరిపాటి. కరుడుగట్టిన పేద ప్రజల వ్యతిరేకిగా ఆయనది చెక్కుచెదరని ట్రాక్ రికార్డు. గడిచిన ఎన్నికలకు ముందు ఆయన చేసిన అనేక బూటకపు వాగ్దానాల్లో కరెంటు ఛార్జీలు తగ్గిస్తామనేది ఒకటి. కానీ అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే 15,450 కోట్ల మేరకు ట్రూ–అప్ పేరుతో జనాన్ని బాదారు. విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ) ఆమోదించిన దానికంటే విద్యుత్ కొనుగోలు – పంపిణీ మీద ఎక్కువ వ్యయమైతే ఈఆర్సీ అనుమతితో పెరిగిన వ్యయానికి అనుగుణంగా ట్రూ–అప్ ఛార్జీలు వసూలు చేస్తారు. వివిధ కారణాల వల్ల ఆమోదించిన వ్యయం కంటే తక్కువ ఖర్చయినప్పుడు ఆ మిగులును వినియోగదారులకు రీఫండ్ చేయవలసి ఉంటుంది. తొలి రోజుల్లో బాదేసిన 15,545 కోట్ల బాదుడుకు తోడు మరో విడత 2,700 కోట్ల బాదుడుకు ప్రతిపాదనలు పంపించారు. ట్రూ–డౌన్ చేయవలసిన అవసరాన్ని దృష్టిలో పెట్టుకొని అందులో 1,800 కోట్ల బాదుడుకే ఈఆర్సీ అనుమతించింది. అ సొమ్మును అప్పటికే వసూలు చేసినందున 900 కోట్లు వినియోగదారులకు రీఫండ్ చేయాలని ఆదేశించింది.

ఇప్పటికే వినియోగదారులపై ట్రూ–అప్ పేరుతో బాదేసి వసూలు చేస్తున్న మొత్తం 15,545 కోట్లు, ట్రూ–అప్‌కు అదనపు ప్రతిపాదన 2,700 కోట్లు. వెరసి 18 వేల కోట్ల పైచిలుకు. ఇందులో 900 కోట్లను రీఫండ్ చేయాలని ఈఆర్సీ ఆదేశించింది. మొత్తం బాదుడులో ఇది ఐదు శాతం. వినియోగదారుని జేబు లోంచి రూపాయి లాగేసుకొని ఓ ఐదు పైసలు చేతిలో పెట్టి ఎంజాయ్ చేయాలని చెబుతున్నారు. మొదట్లో ఇదో గొప్ప వరం లాగా యెల్లో మీడియా, 'దేశం' పెద్దలు తెగ హడావుడి చేశారు. కానీ ఈఆర్సీ ఆదేశాల సంగతి బయటపడేసరికి జీఎస్టీ ఉత్సవాలలో కలపకుండా విడిగా పార్టీ వేదికల ద్వారా ఇదో అద్భుత చర్యగా ప్రచారం చేసుకోవాలని నిర్ణయించారు. చంద్రబాబు స్వయంగా ఇది కనీవినీ ఎరుగని కార్యక్రమంగా వర్ణించుకున్నారు. ఎన్నికల హామీకి అనుగుణంగా చార్జీలను తగ్గిస్తున్నామనీ, ఇది తమ సమర్థ నిర్వహణ ఫలితమనీ కూడా ఆయన చెప్పుకొన్నారు. వంద రూపాయలు పెంచి ఐదు రూపాయలు తగ్గించడమా ఎన్నికల హామీని నెరవేర్చడమంటే? దీన్ని సమర్థవంతమైన నిర్వహణగా పరిగణించాలా?

ప్రజలకు ఇటువంటి షాకులివ్వడం పండుగ చేసుకోమనడం చంద్రబాబు సర్కార్‌కు అలవాటే. ఈ పదహారు మాసాల కాలంలోనే ఆయన సర్కార్ చేసిన గాయాలు పేద, మధ్య తరగతి ప్రజల నిలువెల్లా కనిపిస్తున్నాయి. చేసిన నమ్మక ద్రోహాలకు ఊరూరా శిలాఫలకాలు వేయవచ్చు. ఏటా సమారు 32 వేల కోట్లు ఖర్చవుతుందని అంచనా వేసిన 'ఆడబిడ్డ' పథకాన్ని పూర్తిగా ఎత్తివేసి, ప్రతి నిరుద్యోగికి నెలకు 3 వేల రూపాయలు ఇస్తామన్న హామీని ఎగవేసి, మిగిలిన హామీలను అరకొరగా, అదీ ఏడాది ఆలస్యంగా ప్రారంభించి సూపర్ సిక్స్‌ను అమలుచేశామని చెప్పుకోగలిగిన ప్రభుత్వం ఎంతకైనా తెగిస్తుంది అనుకోవాలి.

ఈ పదహారు మాసాల్లో ఫీల్డ్ అసిస్టెంట్ కొలువులు తీసి 'నరేగా' పథకాన్ని నీరుగార్చి గ్రామీణ ఉపాధిని దెబ్బతీసినందువల్ల జరిగిన నష్టమెంత? ప్రజారోగ్యాన్ని పడకేయించిన కారణంగా, ఆరోగ్యశ్రీని కోమాలోకి పంపినందువల్ల పేద మధ్య తరగతి ప్రజలకు జరిగిన, జరుగుతున్న నష్టమెంత? వైద్య వ్యాపారులకు ఒనగూరిన లాభమెంత?

ప్రజలకు ఇటువంటి షాకులివ్వడం పండుగ చేసుకోమనడం చంద్రబాబు సర్కార్‌కు అలవాటే. ఈ పదహారు మాసాల కాలంలోనే ఆయన సర్కార్ చేసిన గాయాలు పేద, మధ్య తరగతి ప్రజల నిలువెల్లా కనిపిస్తున్నాయి. చేసిన నమ్మక ద్రోహాలకు ఊరూరా శిలాఫలకాలు వేయవచ్చు. ఏటా సమారు 32 వేల కోట్లు ఖర్చవుతుందని అంచనా వేసిన 'ఆడబిడ్డ' పథకాన్ని పూర్తిగా ఎత్తివేసి, ప్రతి నిరుద్యోగికి నెలకు 3 వేల రూపాయలు ఇస్తామన్న హామీని ఎగవేసి, మిగిలిన హామీలను అరకొరగా, అదీ ఏడాది ఆలస్యంగా ప్రారంభించి సూపర్ సిక్స్‌ను అమలుచేశామని చెప్పుకోగలిగిన ప్రభుత్వం ఎంతకైనా తెగిస్తుంది అనుకోవాలి.

ఈ పదహారు మాసాల్లో ఫీల్డ్ అసిస్టెంట్ కొలువులు తీసి 'నరేగా' పథకాన్ని నీరుగార్చి గ్రామీణ ఉపాధిని దెబ్బతీసినందువల్ల జరిగిన నష్టమెంత? పేద ప్రజలు కోల్పోయిన ఆదాయమెంత? లెక్కతీయాలి కదా! ప్రజారోగ్యాన్ని పడకేయించిన కారణంగా, ఆరోగ్యశ్రీని కోమాలోకి పంపినందువల్ల, ఆరోగ్య ఆసరా గొంతు నులిమిన ఫలితంగా, అంబులెన్స్ సర్వీసులకు పెట్టిన పంచర్ల పాపం వలన పేద మధ్య తరగతి ప్రజలకు జరిగిన, జరుగుతున్న నష్టమెంత? వైద్య వ్యాపారులకు ఒనగూరిన లాభమెంత? విద్యారంగంలో గేమ్ ఛేంజర్ వంటి 'నాడు–నేడు' అనే బృహత్తర కార్యక్రమాన్ని నిలిపివేసి, పేద విద్యార్థులు అందుకున్న ఉన్నతమైన వసతులను ఊడిపారేసినందువల్ల ఐదున్నర లక్షలమంది పేద మధ్యతరగతి వర్గాల పిల్లలు ప్రభుత్వ స్కూళ్లను వదిలేశారు. ఫలితంగా విద్యా వ్యాపారులకు కలిగిన లాభమెంత? పేద ప్రజలకు కలిగిన నష్టమెంత? జగన్ ప్రభుత్వం కొనసాగి వుంటే అప్పటికే పూర్తయిన పది లక్షల ఇళ్లకు అదనంగా మరో పది లక్షలు పూర్తయ్యేవి. ఆ కుటుంబాల కలలను కాల్చేసినందుకు వారి గుండెల్లో గూడుకట్టుకున్న విషాదపు విలువెంత? 30 లక్షల మంది నడివయసు స్త్రీల చేయూతను లాగేసినందువల్ల ఆ మహిళలు చేస్తున్న ఆక్రందనను ఎలా ఉపశమింపజేస్తారు! ఇటువంటి పర్యవసానాలు ఈ పదహారు మాసాల పాలన ఫలితంగా ఎన్నో ఉన్నాయి. అన్ని లెక్కలూ వేసి లాభపడ్డవాళ్లను పండుగ చేసుకోమంటే బాగుంటుంది. గాయపడిన వారితో గేమ్స్ ఆడటం అమానుషం!

vardhelli1959@gmail.com

ఇండియన్ ఇంగ్లిష్ స్థితి ఎలా ఉంటుంది?

అభిప్రాయం



ప్రొ॥ కంచ ఐలయ్య షెపర్డ్

ఇంగ్లిష్ దేశాలతో మన దేశ సంబంధాలు గందరగోళంలో ఉన్న రోజులివి. ఒకవైపు ఇండి యన్ యువకుల అమెరికన్ డ్రీమ్‌లపై అమెరికా మట్టికొడుతున్న రోజులు. మరోపక్క కెనడా, ఆస్ట్రేలియా, బ్రిటన్‌లు కూడా ఇమ్మిగ్రేషన్ (వలస)పై తిరుగుబాటు చేస్తున్న రోజులు. ఇందుకు రష్యన్ ఆయిల్‌ను ఇండియా కొనడం ఒక కారణమైతే, ప్రపంచ దేశాలన్నిటిలో మన దేశం 'ఫస్ట్' అనే సంకుచిత జాతీయ భావన పెరిగిపోవడం మరొకటి.

ప్రపంచీకరణ ఆచరణలో ఉన్న గత ముప్పయి ఏండ్లలో 'నా దేశం ఫస్ట్' అనే నినాదం మన దేశ బీజేపీ ప్రభుత్వమే మొదట ఇచ్చింది. దీనితో పాటు భారతదేశంలో 'హిందీ ఫస్ట్' అనే ప్రచారం కూడా మొదలైంది. క్రమంగా వివిధ రంగాలలో ఇంగ్లిష్ భాషను వెనక్కి నెట్టే ప్రక్రియ నడుస్తున్నది.

2025 అక్టోబర్ 5 నాటికి ఇండియాకు ఇంగ్లిష్ భాష ఒక బోధనా భాషగా వచ్చి 208 ఏళ్ళు అవుతుంది. గత కొంత కాలంగా మనం ఆ రోజును 'ఇండియన్ ఇంగ్లిష్ దినం'గా జరుపుకొంటున్నాం. ఈ భాష ఇంజినీరింగ్, మెడికల్ కోర్సుల్లో; సివిల్ సర్వీస్ పరీక్షలలో చాలా ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే ఈ మధ్య ఇంగ్లిష్ దేశాలుగా ఉన్న అమెరికా, బ్రిటన్, కెనడా, ఆస్ట్రేలియా ఇండియన్ ఇమ్మిగ్రేషన్ మీద తీసుకుంటున్న కఠినమైన నిర్ణయాలు ఇక్కడి ఇంజినీరింగ్ విద్యారంగాన్ని ఏం చెయ్యబోతున్నాయన్న అనుమానం కలుగుతోంది.

గత 30 ఏళ్లుగా ఈ దేశంలో ఐఐటీ, ఎన్ఐటీ, వివిధ రాష్ట్రాల్లో పబ్లిక్, ప్రైవేట్ యూనివర్సిటీల్లో, ఇంజినీరింగ్ కాలేజీల్లో చదువుకునే విద్యార్థులు కేవలం అమెరికాకో, మరో ఇంగ్లిష్ భాష మాట్లాడే దేశానికో పోవడం కోసమే చదవడం జరిగింది. కానీ ఇకముందు అన్ని రకాల కోర్సులను మన దేశంలో ఉండి ఏదో ఒక పనిచేసి కుటుంబం, దేశం అభివృద్ధి కావడం కోసం చదవాల్సి ఉంటుంది. ఈ స్థితిలో ఈ దేశంలో ఇంగ్లిష్ ప్రాధాన్యం తగ్గుతుందా? తగ్గించే వైపునకు పయనించాలా అనే ప్రశ్న ఎదురౌతుంది.

ఇండియన్ ఇంగ్లిష్ ఇండియా అభివృద్ధికే!

ఇతర ఇంగ్లిష్ దేశాలు భారతదేశం నుండి మొత్తం వలసలను ఆపినా సరే... ఇండియన్ ఇంగ్లిష్‌ను బాగా అభివృద్ధి చేసుకోవలసిందే. భవిష్యత్తులో అన్ని రంగాల్లో రీసర్చి ఇంగ్లిష్ భాష అభివృద్ధి అయిన దేశాల్లోనే పెరుగుతుంది. ఇంగ్లిష్ భాషకు ఉన్న కాన్సెప్చ్యువల్ క్లారిటీ ప్రపంచంలోని ఏ ఇతర భాషల్లో రాలేదు. పరిశోధనలో కొత్త ఆవిష్కరణలు జరగాలంటే భూమి మీద ఉన్న పదార్థాలను మానవులు చాలా స్పష్టంగా అర్థం చేసుకోగలగాలి. అందుకు దోహదపడే భాష చాలా అవసరం. మన దేశంలోని ప్రాంతీయ భాషల్ని అటుంచండి; చైనా, జపాన్ వంటి సైన్సులో అభివృద్ధి చెందిన దేశాలు కూడా ఆ దేశ భాషలకు ఆ పట్టు లేక వాళ్ళు రీసర్చిలో, ఉన్నత



◆ ఇతర ఇంగ్లిష్ దేశాలు భారతదేశం నుండి మొత్తం వలసలను ఆపినా సరే... ఇండియన్ ఇంగ్లిష్‌ను బాగా అభివృద్ధి చేసుకోవలసిందే. భవిష్యత్తులో అన్ని రంగాల్లో రీసర్చి ఇంగ్లిష్ భాష అభివృద్ధి అయిన దేశాల్లోనే పెరుగుతుంది. అందుకే ఇంగ్లిష్ నేర్చుకోవాలనే పట్టుదలను దేశం వదలకూడదు.

చదువుల్లో ఇంగ్లిష్‌ను అభివృద్ధి చేసుకుంటున్నారు. అందుకే చైనా అతిశక్తిమంతమైన సెర్చ్ ఇంజిన్‌కు 'డీప్ సీక్' అని ఇంగ్లిష్ పేరు పెట్టింది. ఈ మధ్యకాలంలో అమెరికా హెచ్ వన్ బీ వీసా ఆంక్షలు విధించగా టాలెంట్ ఉన్నవారికి తాము స్వాగతం పలుకుతామని ఓ కొత్త వీసా ఇవ్వడానికి సిద్ధమయ్యింది చైనా. దానికి 'కె–వీసా' అని ఇంగ్లిష్ పేరే పెట్టింది. కానీ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మాత్రం అన్ని స్కీములకూ హిందీ పేర్లు పెడుతున్నది. హిందీలో పెట్టిన ఆ పేర్లన్నీ ఈ దేశంలోని దక్షిణ, ఈశాన్య ప్రాంత పౌరులకు అర్థం కావు. అంతేకాక ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రంలో ఇంగ్లిష్ మీడియం విద్యను ప్రభుత్వ స్కూళ్లలో తీసెయ్యడానికి చంద్రబాబు ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నది.

యూఎన్ 80 ఏండ్ల చరిత్రలో ఇంగ్లిష్ పాత్ర

ఈ మధ్యకాలంలో ఐక్యరాజ్యసమితి (యూఎన్) తన 80 ఏండ్ల సంబరాలు జరుపుకున్నది. ప్రపంచ దేశాల అధినేతలు అందులో పాల్గొని మాట్లాడారు. దాదాపు 80 శాతం ప్రపంచ దేశ నాయకులు తమ ఉపన్యాసాలు ఇంగ్లిష్‌లోనే ఇచ్చారు. కొద్దిమంది నాయకులు తమ దేశాల భాషల్లో మాట్లాడారు. కానీ వినే వారికి వారి పెదవుల కదలిక మాత్రమే కనిపించింది. ఇంగ్లిష్ అనువాదకుల మాట మాత్రమే వినిపించింది. అంటే 1945 నుండి 2025 నాటికి ఇంగ్లిష్ భాష ప్రపంచమంతటికీ పాకిందన్నమాట. చాలా దేశాల్లో భాషా సంకుచిత భావం బాగా తగ్గింది. మన దేశంలో భాషా ప్రాతిపదికన ప్రాంతాల మధ్య కొట్లాటలు తగ్గాయి. ఇప్పుడు హిందీని రాష్ట్రాలపై రుద్దుతున్నందువల్ల మళ్ళీ కొన్ని నిరసన ప్రదర్శనలు మొదలవుతున్నాయి. ప్రపంచ దేశాల్లో సైన్సు అభివృద్ధి కీలకమైంది. ఈ స్థితిలో భారతదేశం వెనుకబడకుండా ఉండాలంటే గ్రామీణ ప్రాంతాల్లో ఇంగ్లిష్ భాషను అభివృద్ధి పర్చి శాస్త్రీయ దృక్పథాన్ని అభివృద్ధి చెయ్యడం తప్ప మరో మార్గం లేదు.

భారత్‌లో ఇంగ్లిష్ ప్రాముఖ్యం

పైన పేర్కొన్న అన్ని రకాల కారణాల వల్ల అక్టోబర్ 5 నాడు దేశం మొత్తంగా ఇండియన్ ఇంగ్లిష్ డే జరపడం చాలా ముఖ్యం. గ్రామీణ ప్రాంతాల పిల్లలకు వారి తల్లిదండ్రులకు ఇంగ్లిష్ ప్రాముఖ్యాన్ని చర్చించేందుకు అదొక సందర్భం అవుతుంది.

ఇంగ్లిష్ దేశాల్లోకి యువత ఇమ్మిగ్రేషన్‌కు ఆటంకాలు ఏర్పడుతున్నాయి కదా అని మన విద్యారంగాన్ని ప్రాంతీయ భాషల్లోకి జార్చితే సైన్సు, టెక్నాలజీ అభివృద్ధి సాధ్యం కాదు. ఈ సందర్భంలో చాలా తీవ్రంగా చర్చించాల్సిన అంశం: 'అసలు మన చదువులు విదేశాల కోసమా, మన దేశం కోసమా?' 'మన చదువులు మన దేశంలో మన జీవితాలను, నిర్మించుకునేటందుకు' అనే ఆలోచన కీలకమైంది. నేను జీవితాంతం ఇంగ్లిష్‌లో రాసింది, చదివింది విదేశాల్లో మార్పు, అభివృద్ధి కోసం కాదు కదా! 'నా అభివృద్ధి నా దేశంతోనే ముడివడి ఉంది' అనే ఆలోచనతో. ఈ ఆలోచనతోనే అంబేడ్కర్ విదేశాల్లో చదువుకొని ఇక్కడ ఇంగ్లిష్‌లో రాశారు, మాట్లాడారు. ఆ రోజుల్లో తన కమ్యూనిటీలో గానీ, తన వర్గంలో గానీ ఇంగ్లిష్ అర్థం చేసుకునే వారు గానీ, చదివేవారు గానీ లేరు. ఆ స్థితి ఇప్పుడు కొంతైనా మారింది కదా! అందుకే ఇంగ్లిష్ నేర్చుకోవాలనే పట్టుదలను దేశం వదలకూడదు.

వ్యాసకర్త ప్రముఖ రచయిత, సామాజిక విశ్లేషకుడు
(నేడు 'ఇండియన్ ఇంగ్లిష్ డే')

సత్యాన్వేషణ

సత్యం అంటే ఏమిటో తెలుసుకోవడం కోసం అడవుల్లో ఉన్న ఓ సాధువు దగ్గరకు వెళ్లాడు ఒక యువకుడు. 'సరే ముందు మీ ఊళ్ళో బియ్యం ధర ఎంతుందో చెప్పు' అని అడిగాడు సాధువు. ఆ ప్రశ్నకు యువకుడు విస్తుపోయాడు. గొప్పవాడు అనుకున్న సాధువు నుంచి ఇలాంటి ప్రశ్నను అతను ఊహించలేదు. 'స్వామీ, క్షమించండి. నేను అగౌరవంగా మాట్లాడుతున్నానని అనుకోకండి. ఇకపై ఇలాంటి ప్రశ్నలు అడగకండి. ఎందుకంటే నేను వచ్చిన మార్గాన్ని మరచిపోయాను. నాకు గతం లేదు... నేను నడిచొచ్చిన మార్గాలను వదిలేశాను. నేనెక్కిన నిచ్చెనలను నెట్టేశాను' అన్నాడు యువకుడు. ఈ మాటలు విన్న సాధువు అతని దగ్గరికి వచ్చి భుజం తట్టాడు.



'సరే, మంచిది. ఇప్పటి నుండి నిజం గురించి మాట్లాడుకుందాం. నువ్వు గతంలోని భారాలను మోస్తున్నావా లేదా అని తెలుసుకోవడానికే బియ్యం ధర ఎంత అని అడిగాను. నువ్వు నా ప్రశ్నకు జవాబు చెప్పి ఉంటే, నేను నిన్ను వెంటనే ఇక్కడి నుంచి పంపించేసేవాడిని. సత్యాన్వేషణ గురించి మాట్లాడటానికి నిరాకరించేవాడిని...' అంటూ అతనిని తోటలోకి తీసుకెళ్లాడు సాధువు.

అతనికి గులాబీలు చూపించి 'ఎంత అందంగా ఉన్నాయో కదూ' అన్నాడు సాధువు. అప్పుడా యువకుడు 'దానివల్ల ఏమాత్రం ఉపయోగం లేదు. సాయంత్రానికల్లా అవన్నీ వాడి పోతాయి' అన్నాడు. 'యవ్వనం ఎంత సుఖమో కదూ' అని సాధువు అంటే 'అబ్బే ఏం సుఖమండీ... అనుకున్నంత సేపు పట్టదు వృద్ధులమైపోవడానికి' అన్నాడు.


అంతట ఆ సాధువు 'నువ్వన్నది నిజం... కానీ వర్తమానంలో ఎలా జీవించాలో తెలిసిన వ్యక్తిని తోటలోకి తీసుకుపోతే అతను రకరకాల పువ్వులను చూసి నృత్యం చేస్తాడు. పాడతాడు. రాని సాయంత్రం గురించి నేను ఎందుకు చింతించాలంటాడు. పైగా రాలిపోతామని తెలిసినా అవెంత ఆనందంగా ఉన్నాయో కదా అంటాడు.

అంటే గతాన్నో, భవిష్యత్తునో తలుస్తూంటే వర్తమానంలోని సత్యాన్ని గ్రహించలేమని అర్థం. సత్యం గతానికి లేదా భవిష్యత్తుకు సంబంధించినది కాదు... ఈ క్షణానికి చెందినది' అని బోధించాడు.

– యామిజాల జగదీశ్

పత్తి పంటను దళారులకు విక్రయించొద్దు

- రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి
- ఈనెల 21 నుంచి అధికారికంగా పత్తిని కొనుగోలు చేయనున్న సీసీఐ



సాక్షి, హైదరాబాద్: రైతులు పత్తిపంటను దళారులకు విక్రయించవద్దని రైతు కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి విజ్ఞప్తి చేశారు. దళారులు మాయమాటలతో రైతులను తప్పుదారి పట్టించి తక్కువ ధరకు పత్తిని కొనుగోలు చేస్తారని, సీసీఐ కొనుగోలు కేంద్రాలలో అయితే మద్దతు ధరకు విక్రయించుకోవచ్చని ఆయన సూచించారు. రాష్ట్రంలో పత్తి కొనుగోళ్లపై ప్రతిష్టంభన ఏర్పడిన నేపథ్యంలో శని వారం ఆయన కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో దళారులు రైతులను మోసం చేసే అవకాశం ఉందని, ఈ విషయంలో తగిన విధంగా స్పందించాలని కోరారు. పత్తి రైతులకు నష్టం జరగకుండా పత్తి కొనుగోళ్లు జరి గేలా చూడాలని సూచించారు. కాగా సీసీఐ ఈనెల 21 నుంచి రాష్ట్రంలో కొనుగోలు కేంద్రాలను తెరిచే ఆలోచనలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. జిన్నింగ్ మిల్లుల యజమాన్యాలు పత్తి కొనుగోళ్లకు సంబంధించి ఇచ్చే టెండర్లలో పాల్గొనకపోవడంపై ప్రభుత్వం స్పందిస్తుందని తెలిపారు. ఈనెల 6న వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో సీసీఐ అధికారులు సమావేశం కానున్నారని, పత్తి కొనుగోళ్లు సక్రమంగా సాగేలా చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు.

నిమజ్జనం కోసం వచ్చి నీటమునిగారు..

- సకాలంలో స్పందించి ఇద్దరిని రక్షించిన పోలీసులు
- మెదక్ జిల్లాలో ఘటన



వరద నీటిలో చిక్కుకున్న యువకులను తాడు సహాయంతో ఒడ్డుకు తరలిస్తున్న దృశ్యం

పాపన్నపేట (మెదక్): దేవి నిమజ్జనం కోసం ఏడుపాయలకు వచ్చిన యువకులు విగ్రహాన్ని మంజీర నదిలో నిమజ్జనం చేశారు. అనంతరం స్నానం చేసే క్రమంలో ఇద్దరు వరద ఉధృతికి కొట్టుకుపోగా, సమాచారం అందుకున్న పోలీసులు సకాలంలో చేరుకుని ఇరువురి ప్రాణాలు కాపాడారు. వివరాలు.. హైదరాబాద్ కూకట్‌పల్లికి చెందిన యువకులు శనివారం దేవి విగ్రహాన్ని మంజీర నదిలో నిమజ్జనం చేసేందుకు వచ్చారు. నిమజ్జనం అనంతరం చెక్ డ్యాం ఎగువన వినయ్ అనే యువకుడు స్నానం చేస్తూ వరదలో కొట్టుకు పోయాడు. అతన్ని రక్షించే యత్నంలో అతని స్నేహితుడు సాయి కూడా నీటిలో కొట్టుకుపోయాడు. చెక్ డ్యాం దిగువన సుమారు 200 మీటర్ల దూరంలో నదిలో ఉన్న చెట్టును పట్టుకొని వారు ఆర్తనాదాలు చేశారు. విధుల్లో ఉన్న ఎస్సై శ్రీనివాస్ గౌడ్ వెంటనే పోలీస్ రెస్క్యూ టీంకు, ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్, సీఐ జార్జ్, ఎస్సై శ్రీనివాస్ గౌడ్, ఫైర్ అధికారి వెంకటేశ్, క్యూఆర్టీ ఆధ్వర్యంలో రెస్క్యూ ఆపరేషన్ ప్రారంభించారు. సుమారు 2 గంటలపాటు శ్రమించి ఇద్దరు యువకులనూ ఒడ్డుకు సురక్షితంగా తీసుకొచ్చారు. దీంతో, బాధితుల బంధువులు ఊపిరి పీల్చుకున్నారు.

బైకు దొంగకు నిప్పు

- పెట్రోల్ పోసి ఓ దొంగకు నిప్పుపెట్టిన గ్రామస్తులు
- గాయాలతో గాంధీలో చికిత్స.. పరిస్థితి విషమం
- మెదక్ జిల్లాలో ఘటన

చేగుంట (తూప్రాన్): బైకు దొంగతనం చేసిన వ్యక్తులను గ్రామస్తులు పట్టుకొని దాడిచేసి వారిలో ఒకరికి నిప్పంటించారు. ఈ ఘటన మెదక్ జిల్లా చేగుంట మండలంలోని వడియారం గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసుల వివరాల ప్రకారం.... శుక్రవారం రాత్రి ఇద్దరు దొంగలు గ్రామంలో ఓ బైకును ఎత్తుకెళ్తుండగా గ్రామస్తులు గుర్తించి పట్టుకున్నారు. బైకును దొంగతనంగా తీసుకెళ్తున్నట్లు గుర్తించిన స్థానికులు వారిద్దరికి దేహశుద్ధి చేస్తుండగా, ఓ దొంగ జేబులో పెట్రోల్ బాటిల్‌ను గుర్తించి అదే పెట్రోల్‌ను దొంగపై పోసి నిప్పంటించారు. అనంతరం మంటలను ఆర్పి ఇద్దరు దొంగలనూ పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. కాలిన గాయాలతో ఉన్న వ్యక్తిని పోలీసులు గాంధీ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. దొంగతనం కోసం వచ్చిన వ్యక్తులు చిన్నశంకరంపేట మండలం జంగరాయి గ్రామానికి చెందిన యేసు, మహిపాల్‌గా పోలీసులు గుర్తించారు. కాలిన గాయాలైన వ్యక్తి యేసు సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమంగా ఉండటంతో జడ్జి సమక్షంలో మరణ వాంగ్మూలంకోసం పోలీసులు ప్రయత్నాలు ప్రారంభించారు. మరో నిందితుడు మహిపాల్‌పై గతంలో చిన్నశంకరంపేటలో పోక్సో కేసు నమోదైనట్లు సమాచారం. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను సేకరించేందుకు తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్, రామాయంపేట సీఐ వెంకటరాజాగౌడ్, చేగుంట ఎస్‌ఐ చైతన్య కుమార్ రెడ్డిలు వడియారం గ్రామాన్ని శనివారం సందర్శించారు.

బావులు, బోర్లు ఉప్పొంగంగ



బోరుబావి నుంచి నీరు ఉబికి వస్తున్న ఈ చిత్రం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ సమీపంలోని పస్తాపూర్‌లోనిది. రైతు శివశంకర్‌రెడ్డి పొలంలో ఉన్న ఈ బోరు పక్షం రోజులుగా కురుస్తున్న వర్షాలకు మోటార్ ఆన్ చేయక పోయినా నీరు వస్తోంది.



వ్యవసాయ బావి పూర్తిగా నిండి నీరు పారుతున్న ఈ దృశ్యం నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండల కేంద్రంలోని కదిరె బక్కయ్య అనే రైతు పొలంలోనిది. ఇటీవలి భారీ వర్షాలకు ఊటల నుంచి పుష్కలంగా నీళ్లు వచ్చి బావి నిండి పోయి పొలంలోకి నీళ్లు పారుతున్నాయి. అయితే, దీంతో పత్తి, మొక్కజొన్న పంటలకు నష్టం జరుగుతోందని బక్కయ్య వాపోతున్నాడు.



ఈ చిత్రంలో పైపుల్లోంచి నీళ్లు వస్తున్నాయనుకుంటే పొరపడ్డట్టే. భారీ వర్షాలకు భూగర్భ జలం ఇలా పైపు లీకేజీ అయినట్లు పొంగుకొస్తున్న ఈ చిత్రం సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం మద్నూర్ గ్రామంలోనిది.

భారీ వర్షాలతో బోర్ల నుంచి ఉబికి వస్తున్న భూగర్భ జలాలు

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: వరుణుడు కరుణించడంతో రాష్ట్రంలో పాతాళ గంగ పైపైకి వచ్చింది. ప్రధానంగా సెప్టెంబర్‌లో కురిసిన భారీ వర్షాలకు భూగర్భ జలమట్టం భారీగా పెరిగింది. అధిక వర్షపాతం నమోదైన జిల్లాల్లోనే కాకుండా, సాధారణ వర్షపాతం రికార్డయిన జిల్లాల్లోనూ జలమట్టాలు భారీగా పెరగడం విశేషం. రాష్ట్రంలో సగటు భూగర్భ జల మట్టం 4.41 మీటర్ల లోతులో ఉన్నట్లు భూగర్భ జల వనరుల శాఖ తాజా పరిశీలనలో తేలింది. 2024 సెప్టెంబర్‌లో రాష్ట్ర సగటు భూగర్భ జలమట్టం 5.31 మీటర్లు ఉండగా, ఈ సెప్టెంబర్‌లో 4.41 మీటర్ల పైకి వచ్చింది. అంటే సగటున 0.9 మీటర్లు పెరిగింది. రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాల్లో 0.18 మీటర్ల నుంచి 3.55 మీటర్ల వరకు నీటిమట్టాలు పెరిగాయి. ఏడు జిల్లాల్లో మాత్రం స్వల్పంగా 1.38 మీటర్ల తగ్గుదల కనిపించింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 1,771 పీజో మీటర్ల ద్వారా భూగర్భ జలమట్టాలను ఆ శాఖ సేకరించింది. భూగర్భ జల మట్టం అత్యధిక సగటు ఆదిలాబాద్ జిల్లాలో 1.63 మీటర్లు కాగా, అత్యంత లోతులో మెదక్ జిల్లా (7.86 మీ.) ఉంది.

కామారెడ్డిలో 3.55 మీటర్లు పైకి.. : రాష్ట్రంలో అత్యధికంగా కామారెడ్డి జిల్లాలో జలమట్టం సగటున 3.55 మీటర్లు పైకిరావడం విశేషం. సంగారెడ్డి జిల్లాలో 3.29 మీటర్లు, మెదక్‌లో 2.95 మీటర్లు, మేడ్చల్‌లో 2.64 మీటర్లు, సిద్దిపేట, నాగర్‌కర్నూల్‌లలో 2.11 మీటర్ల చొప్పున మట్టాలు పెరిగాయి. ఈ ఏడాది వర్షాకాలం ప్రారంభం జూన్ 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు సాధారణ వర్షపాతం 741 మి.మీ. కాగా, ఏకంగా 988 మి.మీ. వర్షం కురిసింది. అంటే సాధారణం కంటే 33 శాతం ఎక్కువ వర్షపాతం నమోదైంది. దీంతో భూగర్భ జలాలు పైకి వచ్చాయి. చాలా ఏళ్ల తర్వాత ఈ స్థాయిలో భూగర్భ జలమట్టాలు ఉబికివచ్చాయని అధికారులు చెబుతున్నారు.

పొంగి పొర్లుతున్న వ్యవసాయ బావులు

- రాష్ట్రంలో సగటున 4.41 మీటర్ల లోతులో భూగర్భ జలమట్టం
- భూగర్భ జల వనరుల శాఖ పరిశీలనలో వెల్లడి

వట్టిపోయిన బోరు నుంచి..



గత సంవత్సరం బోర్లు ఎండిపోతుండటంతో ఆరు బోర్లు వేశాను. మూడు బోర్లలో నీళ్లు పడకపోగా, మరో మూడు బోర్ల నుంచి చుక్క చుక్క నీళ్లు వచ్చాయి. అవి కూడా కొన్ని రోజుల్లోనే వట్టి పోయాయి. ట్యాంకర్ల ద్వారా నీళ్లు పోసుకుని పంటలు రక్షించాను. ఇటీవల కురుస్తున్న వర్షాలకు మూడు బోర్ల నుంచి ఇంచు మేర ప్రెజర్‌తో నీళ్లు వస్తున్నాయి. మిగిలిన బోర్లలో కూడా నీరు వచ్చే అవకాశం ఉంది. దీంతో డ్రాగన్ పంట కూడా ఇగురు వచ్చింది.

– శనిగల జంగయ్య, సంస్థాన్ నారాయణపురం, నల్లగొండ జిల్లా.



ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం ఆడేగామ (బి) గ్రామం కదం సురేశ్‌పొలంలోని ఈ వ్యవసాయబావి పూర్తిగా నిండిపోయింది. చాలా ఏళ్ల తర్వాత ఈసారి తన బావిలో ఈ స్థాయిలో నీళ్లు వచ్చాయని చెప్పాడు.

జిల్లాల వారీగా భూగర్భ జలమట్టాలు
వివరాలు: సాక్షి ప్లస్ (ఈ–పేపర్)లో

పది లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు

- అదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల



దమ్మపేట/సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పది లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ పంట సాగు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వ రంగ సంస్థ అయిన టీఎస్ ఆయిల్‌ఫెడ్ పనిచేస్తోందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం లింగాలపల్లిలో శనివారం నిర్వహించిన ఆయిల్‌పామ్ రైతుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగు రైతులకు లాభసాటిగా మారిందన్నారు. ఇప్పటివరకు రైతుల సంక్షేమం, వ్యవసాయరంగ అభివృద్ధికి రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు చేశామని చెప్పారు. ఆయిల్‌పామ్ సాగులో దేశంలోనే తెలంగాణ అగ్రస్థానంలో ఉందని తెలిపారు. పంటకు టన్నుకు రూ.25 వేల మద్దతు ధర ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామని వివరించారు. ఏదైనా ప్రాంతంలో పంట సాగు 15 వేల ఎకరాలు దాటితే అక్కడ పామాయిల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే పలు జిల్లాల్లో పామాయిల్ ఫ్యాక్టరీలు నిర్మిస్తున్నామని తెలిపారు. విదేశాల నుంచి యూరియా దిగుమతిలో జాప్యం జరిగినా.. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రాష్ట్రంలో యూరియా సమస్య నివారించగలిగామని అన్నారు. సిద్దిపేట జిల్లా నర్మెట్టలో అత్యాధునిక పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మించామని, రాష్ట్రమంతటా పండిన పంటను కూడా అక్కడ క్రషింగ్ చేసే సామర్థ్యం ఉందని తెలిపారు. ఈ సమావేశంలో ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిన్నింగ్ మిల్స్‌తోనే సమస్య..

రాష్ట్రంలో పత్తి కొనుగోళ్లకు సంబంధించి జిన్నింగ్ మిల్లులు టెండర్లలో పాల్గొనకపోవడంవల్లే సమస్య ఎదురవుతోందని, ఈ అంశాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రాష్ట్రంలో అధిక వర్షాలతో పత్తి పంట దెబ్బతిన్నదని, ఈ దశలో సీసీఐ కొనుగోళ్లు చేయకపోతే రైతులు తీవ్రంగా నష్టపోతారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో 43.29 లక్షల ఎకరాల్లో పత్తి సాగు జరిగితే.. 24.70 లక్షల టన్నుల పత్తి ఉత్పత్తి అవుతుందని అంచనా వేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో 341 జిన్నింగ్ మిల్లులు ఉన్నా.. ఇప్పటి వరకు ఒక్కటి కూడా టెండర్లలో పాల్గొనలేదని వెల్లడించారు. రైతులను ఇబ్బంది పెడితే ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని శనివారం మంత్రి ఒక ప్రకటనలో హెచ్చరించారు. జిన్నింగ్ మిల్లుల ప్రతినిధులతో సీసీఐ సీఎండీ చర్చలు జరిపి, వారి సందేహాలను నివృత్తి చేయాలని ఆయన కోరారు.

బోనస్ బకాయి రూ.1,159.64 కోట్లు

▶ మొదటి పేజీ తరువాయి

సీజన్‌కు సంబంధించిన బోనస్ ఇప్పటి వరకు రూపాయి కూడా చెల్లించలేదు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గంలోని కృష్ణా ప్రాంత రైతులు ఏకంగా పోరుబాట పట్టారు. బోనస్ చెల్లించకపోవడంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో రైతులంతా మూకుమ్మడిగా పోటీ చేసి నిరసన తెలియజేయాలని నిర్ణయించారు. నిజామాబాద్, నల్లగొండ తదితర జిల్లాల్లో సైతం రైతులు యాసంగి బోనస్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈ ఏడాది వానాకాలం సీజన్ కోతల ప్రక్రియ ప్రారంభమైనా గత యాసంగి బోనస్‌ను విడుదల చేయకపోవడంపై రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

రైతులకు రావలసిన బోనస్ రూ.1,159.64 కోట్లు

యాసంగి సీజన్‌లో 74.22 ఎల్‌ఎంటీ ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఇందులో దొడ్డురకం ధాన్యం 51.03 ఎల్‌ఎంటీ కాగా, సన్న ధాన్యం 23.19 ఎల్‌ఎంటీ. ఈ మొత్తం ధాన్యానికి రూ.17,198.58 కోట్ల మొత్తాన్ని ప్రభుత్వం రైతులకు చెల్లించింది. సన్నధాన్యం పండించిన 4,09,031 రైతులకు 1,159.64 కోట్ల మొత్తాన్ని చెల్లించాల్సి ఉంది. ధాన్యం కొనుగోళ్లు పూర్తయి మూడు నెలలు దాటినా బోనస్ విడుదల చేయలేదు. బోనస్ కోసం పోరుబాట పట్టిన మక్తల్ రైతులను మంత్రి వాకిటి శ్రీహరి సముదాయించే ప్రయత్నం చేశారే తప్ప బోనస్‌పై హామీ ఇవ్వలేదు. ఇటీవల పదవీ విరమణ చేసిన పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ సైతం బోనస్ అంశాన్ని ప్రభుత్వం ప్రకటిస్తుందని వారం క్రితం మీడియా సమావేశంలో తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.500 బోనస్‌ను దృష్టిలో ఉంచుకొని పెద్ద ఎత్తున రైతులు యాసంగిలో కూడా సన్నాలు సాగు చేశారు. నిజామాబాద్ జిల్లాలో 8 లక్షల ఎల్‌ఎంటీ ధాన్యాన్ని సేకరిస్తే, అందులో 7.15 లక్షల ఎల్‌ఎంటీ సన్నాలే ఉన్నాయి. నల్లగొండ, నారాయణపేట, జగిత్యాల, నిర్మల్, సిద్దిపేట, సూర్యాపేట, ఖమ్మం జిల్లాల్లో కూడా పెద్ద ఎత్తున సన్న ధాన్యాన్ని పండించారు. ప్రస్తుత వానాకాలం సీజన్‌లో సాగు చేసిన 67.33 లక్షల ఎకరాల్లో 60 శాతానికి పైగా సన్న ధాన్యమే పండించినట్లు లెక్కలు చెపుతున్నాయి. ఈసారి కొనుగోలు కేంద్రాలకు 80 ఎల్‌ఎంటీ ధాన్యం వస్తుందని పౌరసరఫరాల శాఖ అంచనా వేసింది. ఇందులో 40 నుంచి 45 ఎల్‌ఎంటీ సన్నధాన్యం మార్కెట్‌కు వస్తుందని భావిస్తున్నారు. ఈ మొత్తానికి బోనస్ క్వింటాల్‌కు రూ.500 చొప్పున చెల్లిస్తే రూ.2,200 కోట్లు అవుతుంది. ఇప్పటికే ఉన్న బాకాయి 1,159.64 కోట్లు కలిపితే దాదాపు రూ.3,400 కోట్ల వరకు బోనస్ చెల్లించాల్సి ఉంటుంది.

నాకు రూ.5.60 లక్షల బోనస్ రావాలి



నాకు ఉన్న 5 ఎకరాల పొలంతోపాటు కొంత కౌలుకు తీసుకొని రబీలో వరి సాగు చేశాను. 2,800 బస్తాలు పండించాను. మొత్తం 1,120 క్వింటాళ్ల ధాన్యాన్ని ఐకేపీ కొనుగోలు కేంద్రంలో విక్రయించాను. రూ.5.60 లక్షల బోనస్ రావాల్సి ఉంది. ఇప్పటికీ ప్రభుత్వం బోనస్ ఇవ్వలేదు.

– వాద్యాట్ తిమ్మన్న, రైతు, గుడే బల్లూరు గ్రామం

జెడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేస్తాం



రాష్ట్ర ప్రభుత్వం అందిస్తానన్న బోనస్ డబ్బులు ఇవ్వక పోవడంతో బాధిత రైతులమంతా కలిసి ఓ నిర్ణయం తీసుకున్నాం. వచ్చే ఎన్నికల్లో జెడ్పీటీసీకి రైతులందరం రాజకీయాలకు అంతీతంగా పోటీ చేయాలని నిర్ణయించాం.

– చెవిటోళ్ల వెంకటేశ్, రైతు, గుడే బల్లూరు గ్రామం

యువతి ప్రేమకథ విషాదాంతం

- గద్వాల జిల్లా గట్టు మండలంలో కొత్తగూడెం జిల్లా యువతి ఆత్మహత్య
- కానిస్టేబుల్ రఘునాథ్‌గౌడ్‌తో ప్రేమ
- పెళ్లికి నిరాకరించడంతో రెండు నెలలుగా యువకుడి ఇంట్లోనే మకాం
- గుళికల మందు తాగి ఆత్మహత్యాయత్నం.. చికిత్స పొందుతూ మృతి



ప్రియాంక

గట్టు: ప్రేమించిన యువకుడు పెళ్లికి నిరాకరించడంతో అందరి నీ ఎదిరించింది. పెళ్లి చేసుకోవాల్సిందేనని ఒత్తిడి తీసుకు వచ్చింది. రెండు నెలలుగా ఆ యువకుడి ఇంట్లోనే మకాం వేసింది. చివరికి విషపు గుళికలను తీసుకొని తనువు చాలించింది. కొత్తగూడెం జిల్లా పాల్వంచకు చెందిన ప్రియాంక (32), జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు మండలం చిన్నోనిపల్లె గ్రామా నికి చెందిన రఘునాథ్‌గౌడ్‌ను ప్రేమించింది. హైదరాబాద్‌లో కానిస్టేబుల్ ఉద్యోగం కోసం కోచింగ్ తీసుకుంటున్న సమయంలో వీరిద్దరూ ప్రేమించుకున్నారు. అనంతరం రఘునాథ్‌గౌడ్‌కు కానిస్టేబుల్‌గా ఉద్యోగం వచ్చింది. ఈ క్రమంలో రెండు నెలల కిందట తనను పెళ్లి చేసుకోవాలని ప్రియాంక చిన్నోనిపల్లె గ్రామానికి వచ్చి రఘునాథ్‌గౌడ్‌ను కోరింది. అయితే రఘునాథ్ గౌడ్, అతని కుటుంబ సభ్యులు పెళ్లికి నిరాకరించారు. దీంతో యువతి తనను పెళ్లి చేసుకోవాల్సిందేనని ఒత్తిడి తీసుకువచ్చింది. ఆమె వారి ఇంట్లోనే మకాం వేయడంతో రఘునాథ్‌గౌడ్, అతని కుటుంబ సభ్యులు ఇల్లు వదిలి వెళ్లిపోయారు. కాగా, అప్పట్లోనే ప్రియాంక నిద్రమాత్రలు వేసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించగా గ్రామస్తులు ఆమెను వెంటనే గద్వాల ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందించడంతో ప్రాణాపాయం తప్పింది. అనంతరం ప్రియాంక రఘునాథ్‌గౌడ్‌తోపాటు కుటుంబ సభ్యులపై గట్టు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా జూలైలో కేసు నమోదు చేశారు. తర్వాత ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుగా సెక్షన్ మార్పు చేసి, రఘునాథ్‌ను రిమాండ్‌కు తరలించగా ఇటీవలే బెయిల్‌పై విడుదల అయ్యాడు.

మరోసారి ఆత్మహత్యాయత్నం..

ఈ క్రమంలో ప్రియాంక శుక్రవారం గుళికల మందు తీసుకున్నట్లు పోలీసు లకు సమాచారం అందింది. దీంతో పోలీసులు హుటాహుటిన చిన్నోనిపల్లె గ్రామానికి చేరుకొని చికిత్స నిమిత్తం ఆమెను గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శనివారం ఉదయం ఆమె మృతిచెందింది. ఇదిలా ఉండగా రఘునాథ్‌గౌడ్, అతని కుటుంబ సభ్యులు తమ కూతురుకు కరెంట్ షాక్ ఇచ్చి చంపినట్లుగా ఆమె తల్లి దండ్రులు ఆస్పత్రి వద్ద ఆరోపించారు. రఘునాథ్‌తో పాటు అతని కుటుంబ సభ్యులపై ప్రియాంక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, ప్రియాంక మృతికి కారణమైన రఘు నాథ్‌గౌడ్‌ను ఉద్యోగం నుంచి తొలగించినట్లు ఎస్పీ శ్రీనివాస రావు తెలిపారు. ప్రియాంక ఆత్మహత్య ఘటనకు సంబంధించి 22 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మల్లేశ్ వెల్లడించారు. మరో పక్క దళిత యువతి మృతికి కారణమైన రఘునాథ్‌గౌడ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజా, కుల సంఘాల నాయకులు ఆస్పత్రి వద్ద ఆందోళన నిర్వహించారు.

చట్టప్రకారం జరిమానా విధించవచ్చు

- గనులశాఖ ఏడీకి అధికారముందన్న హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: ఇసుక, మట్టి అక్రమ తవ్వకాలు, రవాణా జరిగినప్పుడు చట్టప్రకారం జరిమానా విధించే అధికారం గనుల శాఖ ఏడీకి ఉంటుందని హైకోర్టు స్పష్టం చేసింది. జరిమానా విధించే ముందు వివరణ తీసుకోవాలని, నిబంధనల ప్రకారం సరైన కారణాలుంటే సీనరేజీ కంటే 10 రెట్ల వరకు విధించవచ్చని కోర్టు తెలిపింది. అనుమతి లేకుండా ఇసుక, మట్టి రవాణా, తవ్వకాలు జరుపుతున్నారంటూ గనుల శాఖ ఏడీ ఇచ్చిన నోటీసులను సవాల్ చేస్తూ జి.ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్‌తో పాటు మరికొందరు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేపట్టారు. పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. నోటీసులు జారీ చేసే ముందు పిటిషనర్ల వాదన పరిగణనలోకి తీసుకోలేదని పేర్కొన్నారు. ప్రభుత్వం తరఫు న్యాయ వాది వాదనలు వినిపిస్తూ.. చట్టప్రకారం నోటీసులు జారీ చేశామన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. జరిమానా విధించే ముందు ఉల్లంఘన, నష్టాన్ని పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. కారణాలు పేర్కొనకుండా భారీ జరిమానా విధింపు చట్టవిరుద్ధమన్నారు. ప్రస్తుత కేసులో కోట్లాది రూపాయల డిమాండ్ నోటీసు జారీ చేయగా, అందులో కొంత మేర చెల్లించారని చెప్పారు. షోకాజ్ నోటీసులో ఏడీ కారణాలను పేర్కొననందున వాటిని రద్దు చేస్తున్నామని స్పష్టం చేశారు. మరోసారి పరిశీలించి నిబంధనల మేరకు జరిమానాపై నిర్ణయం తీసుకోవాలని ఆదేశిస్తూ విచారణ ముగించారు.

తల్లిని చంపిన తనయుడు



ఐలమ్మ (ఫైల్)

మంచాల: మద్యానికి బానిసైన ఒక కొడుకు డబ్బులు ఇవ్వలేదని కన్న తల్లిపై దాడి చేసి చంపాడు. రంగారెడ్డి జిల్లా ఆరుట్లలో జరిగిన ఈ సంఘటన వివరాలివి. గ్రామానికి చెందిన మానుపాటి ఐలమ్మ (49), సోమయ్య దంపతుల పెద్ద కుమారుడు శ్రీకాంత్ మద్యానికి బానిసైనయ్యాడు. అతను తరచూ భార్య, తల్లిదండ్రులతో గొడవ పడేవాడు. శుక్రవారం రాత్రి కూడా ఇంట్లో నిద్రిస్తున్న తల్లి వద్దకు వచ్చి గొడవ పడ్డాడు. డబ్బులు లేవని ఆమె గట్టిగా చెప్పడంతో ఆగ్రహానికి గురైన శ్రీకాంత్.. ఇనుప రాడ్డుతో తల్లిపై దాడి చేశాడు. రక్తం మడుగులో పడిఉన్న ఐలమ్మను భర్త సోమయ్య, చుట్టుపక్కల వారు ఇబ్రహీంపట్నంలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం నగరంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. శ్రీకాంత్ పరారీలో ఉన్నాడు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రాంరెడ్డి దామోదర్‌రెడ్డికి కన్నీటి వీడ్కోలు

అధికార లాంఛనాలతో అంత్యక్రియలు

- పాడె మోసిన మహేశ్‌గౌడ్, వీహెచ్
- నివాళులర్పించిన మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులు

తుంగతుర్తి: మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి (ఆర్‌డీఆర్)అంత్యక్రియలు శనివారం సూర్యాపేట జిల్లా తుంగతుర్తిలో ముగిశాయి. దామోదర్‌రెడ్డి బుధవారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందిన విషయం తెలిసిందే. పార్థివదేహాన్ని హైదరాబాద్‌లోని ఆస్పత్రి నుంచి శుక్రవారం సూర్యాపేటలోని రెడ్‌హౌస్‌కు తీసుకువచ్చి ప్రజల సందర్శనార్థం ఉంచారు. శుక్రవారం రాత్రి సూర్యాపేట నుంచి తుంగతుర్తిలోని ఆయన స్వగృహానికి తీసుకొచ్చారు. దామన్నను కడసారి చూసేందుకు శనివారం ఉదయం నుంచే వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చారు. శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, మాజీ ఎంపీ వి.హన్మంతరావుతో పాటు పలువురు నాయకులు దామోదర్‌రెడ్డి పార్థివదేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డిలు ఆర్డీఆర్ పార్థివదేహంపై కాంగ్రెస్ పార్టీ జెండాను కప్పారు. ఆర్డీఆర్ కుమారుడు సర్వోత్తమ్‌రెడ్డిని ఓదార్చారు. శనివారం మధ్యాహ్నం తర్వాత అంతిమయాత్ర ప్రారంభమైంది. పీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎంపీ వీహెచ్ పాడె మోశారు. స్వగృహానికి సమీపంలోని వ్యవసాయక్షేత్రంలో దామోదర్‌రెడ్డి అంత్యక్రియలు ప్రభుత్వ అధికార లాంఛనాలతో నిర్వహించారు.



దామోదర్‌రెడ్డి భౌతికకాయంపై కాంగ్రెస్ పార్టీ జెండా కప్పి నివాళులర్పిస్తున్న టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



అంతిమసంస్కారాలు నిర్వహిస్తున్న దామోదర్‌రెడ్డి తనయుడు సర్వోత్తమ్‌రెడ్డి

అరేబియా తీరంలో అమెరికా ఓడరేవు!

ట్రంప్‌కు పాకిస్తాన్ వినతి ● చాబహార్ పోర్టుకు 300 కిలోమీటర్ల దూరంలో పాస్నీ పోర్టు

ఇస్లామాబాద్: అమెరికాతో సంబంధాలు మరింత బలోపేతం చేసుకోవాలని పాకిస్తాన్ ప్రభుత్వం ఆరాటపడుతోంది. ముఖ్యంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో స్నేహానికి అధిక ప్రాధాన్యం ఇస్తోంది. అరేబియా సముద్రం తీరంలో పాక్ భూభాగంలో భారీ ఓడరేవు(పోర్టు) నిర్మించి, నిర్వహించాలని తాజాగా ట్రంప్‌కు విజ్ఞప్తి చేసింది. బలూచిస్తాన్‌లో గ్వాదర్ జిల్లాలోని పాస్నీ పట్టణంలో ఈ పోర్టు నిర్మించాలని కోరింది. ఇరాన్ భూభాగంలో భారత ప్రభుత్వం నిర్మిస్తున్న చాబహార్ పోర్టుకు సమీపంలోనే పాస్నీ టౌన్ ఉండడం గమనార్హం. పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్ సలహాదారులు ఇటీవల అమెరికా సీనియర్ అధికారులను సంప్రదించినట్లు తెలిసింది. పాస్నీలో ఓడరేవు కోసం ఆఫర్ ఇచ్చినట్లు సమాచారం. ఈ పట్టణం ఇరాన్, అఫ్గానిస్తాన్ సరిహద్దుల్లో ఉంది. వ్యూహాత్మకంగా కీలకమైనది. ఇప్పటికే రూపొందించిన బ్లూప్రింట్ ప్రకారం పాస్నీ పోర్టులో అమెరికా ప్రభుత్వం ఒక టర్మినల్ నిర్మించి, నిర్వహించనుంది. పాకిస్తాన్‌లోని అరుదైన ఖనిజాలను ఇక్కడి నుంచే అమెరికాకు చేరవేస్తారు. పాకిస్తాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్, అసిమ్ మునీర్ గత నెలలో వైట్‌హౌస్‌లో డొనాల్డ్ ట్రంప్‌తో సమావేశమయ్యారు. పాకిస్తాన్‌లో మైనింగ్, ఇంధన రంగాల్లో పెట్టుబడులకు పెట్టాలని ఈ సందర్భంగా అమెరికా కంపెనీలను ఆహ్వానించారు. పాకిస్తాన్‌లో ఉన్న విలువైన ఖనిజ సంపద గురించి ట్రంప్‌కు అసిమ్ మునీర్ ప్రత్యేకంగా వివరించారు. చెక్క పెట్టెలో తీసుకొచ్చిన కొన్ని నమూనాలు కూడా చూపించారు. రక్షణ, సాంకేతిక అవసరాల కోసం పాకిస్తాన్‌తో కలిసి ఖనిజాలను గుర్తించి, వెలికితీయడం కోసం 500 మిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టడానికి అమెరికా మెటల్స్ కంపెనీ ముందుకొచ్చింది. పాస్నీలోని పోర్టు నిర్మాణం కోసం అమెరికాను పాక్ సర్కార్ కోరడం వెనుక పెద్ద వ్యూహమే ఉన్నట్లు తెలుస్తోంది. పాస్నీ పోర్టు నుంచి ఖనిజ సంపద ఉన్న పశ్చిమ ప్రావిన్స్‌ల దాకా రైలు మార్గాన్ని అమెరికా నిధులతో నిర్మించాలన్నదే పాక్ ఉద్దేశం. ఈ ప్రాంతం ఇరాన్‌కు, దక్షిణాసియాకు దగ్గరగా ఉండడం కలిసొచ్చే అంశం. ఇక్కడ పాగా వస్తే అరేబియా సముద్రంతోపాటు మధ్య ఆసియాలో అమెరికా ప్రాబల్యం విస్తరిస్తుంది. అమెరికాకు వాణిజ్య అవకాశాలు కూడా పెరుగుతాయి. అయితే, సైనిక అవసరాల కోసం ఈ పోర్టును ఉపయోగించుకోవడానికి వీల్లేదు. గ్వాదర్‌లో చైనా ఇప్పటికే ఒక పోర్టును పాక్ సాయంతో నిర్వహిస్తోంది. గ్వాదర్‌కు 100 కిలోమీటర్ల దూరంలో పాస్నీ ఉంది. ఇక్కడ ఓడ రేవు నిర్మించాలంటూ చైనా ప్రత్యర్థి దేశమైన అమెరికాను పాక్ కోరడం ప్రాధాన్యం సంతరించుకుంది. భారత ప్రభుత్వం నిర్మిస్తున్న చాబహార్ పోర్టుకు 300 కిలోమీటర్ల దూరంలో అమెరికా పోర్టు రానుంది. ఈ ఓడరేవు భారత్‌కు కీలకం . పాకిస్తాన్‌తో సంబంధం లేకుండా అఫ్గానిస్తాన్, సెంట్రల్ ఆసియాకు నౌకలు రాకపోకలు సాగించవచ్చు. చాబహార్ కోసం 2024లో భారత్, ఇరాన్‌లు ఒప్పందంపై సంతకాలు చేశాయి.

అందరూ కాలేరు జన నాయక్‌లు

కర్పూరీ ఠాకూర్ గౌరవాన్ని దొంగిలించడానికి కుట్రలు

- బిహార్ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు
- రూ. 62,000 కోట్ల విలువైన యువత కేంద్రీకృత కార్యక్రమాలు ప్రారంభం
- రూ. 60,000 కోట్లతో అమలు చేసే 'పీఎం–సేతు' పథకానికి శ్రీకారం
- బిహార్‌కు సంబంధించిన పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రారంభం

న్యూఢిల్లీ: విజ్ఞానం, నైపుణ్యాలకు మన దేశంలో లోటు లేదని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టంచేశారు. మేధో సంపత్తి మన విలువైన ఆస్తి అని ఉద్ఘాటించారు. విజ్ఞానం, నైపుణ్యాలను దేశ ప్రగతికి ఉపయోగించుకోవాలని చెప్పారు. 21వ శతాబ్దంలో స్థానిక నైపుణ్యాలు, వనరులు, ప్రతిభ, విజ్ఞానానికి డిమాండ్ నానాటికీ పెరుగుతోందని అన్నారు. శనివారం రూ.62,000 కోట్లకుపైగా విలువైన యువత కేంద్రీకృత కార్యక్రమాలను ప్రధాని మోదీ ఢిల్లీలో వర్చువల్‌గా ప్రారంభించారు. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న బిహార్‌కు అనుసంధానమైన పథకాలు ఇందులో ఉన్నాయి. అలాగే రూ.60,000 కోట్లతో అమలు చేసే కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత 'పీఎం–సేతు' పథకానికి శ్రీకారం చుట్టారు. బిహార్ రాష్ట్రానికి సంబంధించిన మరికొన్ని అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రారంభించారు. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా 1,000 ప్రభుత్వ ఐటీఐలను హబ్ అండ్ స్పోక్ మోడల్‌గా అభివృద్ధి చేయబోతున్నారు. బిహార్‌లో జన నాయక్ కర్పూరీ ఠాకూర్ స్కిల్ యూనివర్సిటీని సైతం మోదీ ప్రారంభించారు. బిహార్‌లో రాష్ట్రీయ జనతాదళ్(ఆర్జేడీ) ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు విద్యావ్యవస్థ దిగజారిందని, వలసలు పెరిగిపోయాయని మండిపడ్డారు. నితీశ్ కుమార్ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితి మెరుగుపడిందని, రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందని ప్రశంసించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ఆ పార్టీ కార్యకర్తలు 'జన నాయక్' అని పిలుస్తుండడాన్ని ప్రధానమంత్రి తప్పుపట్టారు. ఓబీసీ నేత, బిహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరీ ఠాకూర్ మాత్రమే 'జన నాయక్' అని తేల్చిచెప్పారు. ఆ గౌరవాన్ని దొంగిలించే కుట్రలు జరుగుతున్నాయని, దీనిపై అప్రమత్తంగా ఉండాలని బిహార్ ప్రజలకు పిలుపునిచ్చారు. అందరూ జన నాయకులు కాలేరని రాహుల్‌ను ఎద్దేవా చేశారు.

ఐటీఐలపై ప్రత్యేక దృష్టి

''పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ)లు పారిశ్రామిక విద్యకు అత్యంత కీలకం. ఇవి ఆత్మనిర్భర్ భారత్‌కు వర్క్‌షాప్‌లుగా పని చేస్తున్నాయి. ఐటీఐల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాం. 2014 వరకు దేశంలో 10,000 ఐటీఐలు ఉండేవి. ఇప్పుడు వాటి సంఖ్య 15,000కు చేరుకుంది. పారిశ్రామిక నైపుణ్య అవసరాలను తీర్చేలా, రాబోయే పదేళ్లలో డిమాండ్‌ను తట్టుకొనేలా ఐటీఐ నెట్‌వర్క్ ఇప్పటినుంచే సన్నద్ధం కావాలి'' అని ప్రధాని మోదీ సూచించారు.



ప్రతి గ్రామంలోనూ పాఠశాల

''బిహార్ పురోభివృద్ధి కోసం నితీశ్ కుమార్ ప్రభుత్వం ఎంతగానో శ్రమిస్తోంది. యువతకు గత 20 ఏళ్లలో ఇచ్చిన ఉద్యోగాల కంటే రాబోయే ఐదేళ్లలో అంతకు రెట్టింపు ఉద్యోగాలు కల్పించాలని నిర్ణయించింది. వేర్లకు చెదలు పట్టి ఎండిపోయిన చెట్టును బతికించడం కష్టం. ఇతర పార్టీల పాలనలో బిహార్ పరిస్థితి ఇలాగే ఉండేది. నితీశ్ కుమార్ పట్ల బిహార్ ప్రజలు విశ్వాసం ప్రదర్శించారు. ఆయన నాయకత్వంలో ఎన్డీయే ప్రభుత్వం బిహార్‌ను మళ్లీ దారిలో పెట్టడానికి ఉమ్మడిగా కృషి చేస్తోంది. రెండున్నర దశాబ్దాల క్రితంలో బిహార్‌లో విద్యా వ్యవస్థ ఎలా ఉండేదో ఇప్పటి తరానికి తెలియదు. తమ బిడ్డలు స్థానికంగానే చదువుకొని, ఉద్యోగం సంపాదించుకోవాలని తల్లిదండ్రులు కోరుకుంటారు. కానీ, విపక్షాల పాలనలో లక్షలాది మంది బిహార్‌ను విడిచిపెట్టి బనారస్, ఢిల్లీ, ముంబై వంటి ప్రాంతాలకు వలసవెళ్లారు. వలసలకు అప్పుడే బీజం పడింది. ఎన్డీయే సర్కార్ వచ్చిన తర్వాత బిహార్ ప్రజలు సొంత రాష్ట్రానికి తిరిగి రావడం ఆరంభమైంది'' అని ప్రధానమంత్రి స్పష్టంచేశారు.

జన నేతను నిర్ణయించేది జనమే..మోదీ కాదు

తిప్పికొట్టిన కాంగ్రెస్

పట్నా: బిహార్ ప్రజలు జన నాయక్ అనే బిరుదును కొట్టేయడానికి జరుగుతున్న ప్రయత్నాలను అడ్డుకోవాలంటూ ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ మండిపడింది. ప్రజల నేత ఎవరనేది నిర్ణయించాల్సింది ప్రజలే తప్ప..ప్రధాని మోదీ కాదని తిప్పికొట్టింది. రాహుల్ గాంధీకి ప్రజలే జన నేత అనే బిరుదు ఇచ్చారని పేర్కొంది. బిహార్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేశ్ కుమార్ ఈ మేరకు స్పందించారు. సోషల్ మీడియాలో ట్రోలింగ్‌లతోనే జన నేతలు కారని ఎద్దేవా చేశారు. ఈ విషయాన్ని ప్రధాని మోదీ నిర్ణయించలేరన్నారు.


బుర్ఖా ధరించే ఓటర్ల ఐడీలను క్షుణ్నంగా పరిశీలించాలి

ఈసీని కోరిన బీజేపీ

పట్నా: బిహార్ అసెంబ్లీ ఎన్నికలను ఒకటి లేదా రెండు దశల్లో నిర్వహించాలని ఎన్నికల కమిషన్(ఈసీ)ని శనివారం బీజేపీ కోరింది. అదేవిధంగా, ఓటర్లు ముఖ్యంగా బుర్ఖా ధరించి వచ్చే వారిని గుర్తింపు కార్డుల్లోని ఫొటోలతో పోల్చి ధ్రువీకరించుకున్నాకే పోలింగ్ బూత్‌లలోకి అనుమతించేలా చర్యలు చేపట్టాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు దిలీప్ జైశ్వాల్ కోరారు. లక్నోకు వచ్చిన సీఈసీ జ్ఞానేశ్ కుమార్ సారథ్యంలోని బృందాన్ని బీజేపీ నేతలు కలుసుకున్నారు. ఎన్నికల ప్రక్రియను సాధ్యమైనంత త్వరగా, ఒకట్రెండు దశల్లోనే పూర్తి చేయాలని కోరామని అనంతరం జైశ్వాల్ మీడియాకు తెలిపారు.

ఇక చర్చల్లేవు లొంగిపోవాల్సిందే

మావోయిస్టులకు తేల్చిచెప్పిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా



జగదల్‌పూర్: మావోయిస్టులతో చర్చల ప్రసక్తే లేదని, వారంతా ఆయుధాలు వదిలేసి లొంగిపోవాల్సిందేనని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా మరోసారి తేల్చిచెప్పారు. శనివారం ఛత్తీస్‌గఢ్‌లోని జగదల్‌పూర్‌లో 'బస్తర్ దసరా లోకోత్సవ్'తో పాటు స్వదేశీ మేళాలో ఆయన పాల్గొన్నారు. లొంగిపోయే మావోయిస్టులకు పునరావాస ప్యాకేజీ ఇస్తున్నట్లు తెలిపారు. వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ నాటికి దేశంలో నక్సలిజాన్ని పూర్తిగా అంతం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. గ్రామాల్లో నక్సలిజం బాటపట్టిన యువత ఆయుధాలు వదిలేసేలా ఒప్పించాలని గిరిజనులకు విజ్ఞప్తి చేశారు. ఇకనైనా హింసామార్గం విడనాడి, సాధారణ జన జీవన స్రవంతిలో కలిసిపోవాలని మావోయిస్టులకు పిలుపునిచ్చారు. బస్తర్ అభివృద్ధిలో ఉత్సాహంగా పాలుపంచుకోవాలని కోరారు. తమ మాట వినకుండా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే భద్రతా దళాలు గట్టిగా బదులిస్తాయని హెచ్చరించారు. మావోయిస్టు సమస్యను అంతం చేయడానికి సీఆర్‌పీఎఫ్ జవాన్లతోపాటు ఛత్తీస్‌గఢ్ పోలీసులు కృషి చేస్తున్నారని చెప్పారు. బస్తర్‌లో ప్రఖ్యాత 'దంతేశ్వరి మాత' ఆలయాన్ని దర్శించుకున్నానని, వచ్చే ఏడాది మార్చి 31 నాటికి రెడ్ టెర్రర్ నుంచి ఈ ప్రాంతానికి శాశ్వతంగా విముక్తి కల్పించేలా భద్రతా బలగాలకు శక్తిని ఇవ్వాలంటూ ప్రార్థించానని తెలిపారు.

కొత్తగా ఏం చర్చించాలి?

మావోయిస్టులతో వెంటనే చర్చలు జరపాలని కొందరు మేధావులు సూచిస్తుండడం సరైంది కాదని అమిత్ షా అన్నారు. కొత్తగా చర్చించాల్సింది ఏమీ లేదని స్పష్టంచేశారు. బస్తర్‌తో పాటు నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కట్టుబడి ఉన్నాయని పేర్కొన్నారు. ఢిల్లీలో కూర్చున్న కొందరు వ్యక్తులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, అభివృద్ధి కోసమే నక్సలిజం పుట్టుకొచ్చిందని మాట్లాడుతున్నారని అమిత్ షా ఆక్షేపించారు. బస్తర్ ప్రాంతం అభివృద్ధికి నోచుకోకుండా వెనుబడి ఉందంటే అందుకు నక్సలిజం కారణం కాదా? అని ప్రశ్నించారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బస్తర్‌లో ప్రగతి మొదలైందని పేర్కొన్నారు. లొంగిపోయేవారి కోసం ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం అద్భుతమైన సరెండర్ పాలసీ అమలు చేస్తోందన్నారు. ఒక్క నెలలో 500 మందికిపైగా లొంగిపోయారని తెలిపారు. నక్సల్స్ రహితంగా మారిన గ్రామాలకు రూ.కోటి చొప్పున అందజేస్తామన్నారు.

8న బ్రిటిష్ ప్రధాని కీర్ స్టార్మర్ రాక



న్యూఢిల్లీ: బ్రిటిష్ ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ ఈ నెల 8, 9వ తేదీల్లో భారత్‌లో పర్యటించబోతున్నారు. ఈ నెల 9న ముంబైలో భారత ప్రధాని నరేంద్ర మోదీతో ఆయన సమావేశమవుతారు. విజన్–2035 రోడ్‌మ్యాప్‌లో భాగంగా భారత్, యూకే మధ్య సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేసుకోవడానికి చేపట్టిన చర్యల పురోగతిని వారు సమీక్షిస్తారు. ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపై చర్చిస్తారు. ముంబైలో గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్‌లో స్టార్మర్ ప్రసంగిస్తారు. స్టార్మర్ గత ఏడాది జూలైలో బ్రిటిష్ ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఆ తర్వాత ఆయన భారత్‌లో పర్యటిస్తుండడం ఇదే మొదటిసారి.

హెచ్-1బీ వీసా ఫీజు లక్ష డాలర్లా?

- ట్రంప్ ఉత్తర్వును రద్దు చేయండి
- యూఎస్ జిల్లా కోర్టులో దావా

సియాటిల్: అమెరికాలోని కంపెనీల్లో విదేశీ వృత్తి నిపుణులు తాత్కాలికంగా ఉద్యోగాలు చేసుకోవడానికి వీలు కల్పించే హెచ్-1బీ వీసాల ఫీజును డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం పెంచేయడాన్ని వ్యతిరేకిస్తూ కోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ వీసా ఫీజును ప్రభుత్వం లక్ష డాలర్లుగా ఖరారు చేసిన సంగతి తెలిసిందే. తొలిసారి దరఖాస్తు చేసుకొనే వారు లక్ష డాలర్లు చెల్లించాల్సి ఉంటుంది. నిజానికి ఈ రుసుమును అమెరికా కంపెనీలే భరించాల్సి వస్తోంది. అందుకే ట్రంప్ నిర్ణయాన్ని ఆయా కంపెనీలు తప్పుపడుతున్నాయి. లక్ష డాలర్ల ఫీజుపై జారీ చేసిన ఉత్తర్వును కొట్టివేయాలని కోరుతూ పలు కంపెనీల యాజమాన్యాలు, యూనివర్సిటీ ప్రొఫెసర్లు, మత సంస్థల ప్రతినిధులు శాన్‌ఫ్రాన్సిస్కోలోని యూఎస్ జిల్లా కోర్టులో శుక్రవారం దావా వేశారు.

హూస్టన్‌లో కాల్పులు.. ఇద్దరు చిన్నారులు మృతి

హూస్టన్: అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రం హ్యూస్టన్ శివారు యాంగిల్‌టన్‌లో శనివారం వేకువజామున జరిగిన కాల్పుల ఘటనలో ఇద్దరు చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మృతుల వయస్సు 13, 4 ఏళ్లు కాగా, క్షతగాత్రులు 8, 9 ఏళ్ల వారని బ్రజోరియా కౌంటీ షరీఫ్ కార్యాలయం వెల్లడించింది. ఇద్దరు చిన్నారుల పరిస్థితి విషమంగా ఉందని, వారిని హెలికాప్టర్ ద్వారా ఆస్పత్రికి తరలించినట్లు తెలిపింది. కాల్పులకు కారకులుగా భావిస్తున్న వారిని అదుపులోకి తీసుకున్నామంది. కాల్పుల ఘటనకు దారి తీసిన కారణాలను మాత్రం వెల్లడించలేదు.

బందీల విడుదలకు సిద్ధం

- పాలనా బాధ్యతలను కూడా అప్పగిస్తాం
- ట్రంప్ ప్రణాళికపై హమాస్ సానుకూల స్పందన
- కొన్ని అంశాలపై చర్చల అవసరముందంటూ మెలిక
- ట్రంప్ ప్రణాళిక మొదటి దశ అమలుకు ఏర్పాట్లు చేపట్టాం
- గాజా వ్యాప్తంగా దాడులు నిలిపివేశాం..
- ప్రకటించిన ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ

గాజా స్ట్రిప్: హమాస్ అంతమే లక్ష్యంగా రెండేళ్లుగా గాజాపై ఇజ్రాయెల్ ఆర్మీ సాగిస్తున్న దాడుల పరంపర ముగింపునకు వచ్చిన జాడలు కనిపిస్తున్నాయి. ఈ దిశగా శనివారం కీలక పరిణామాలు సంభవించాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 20 అంశాల ప్రణాళిక మేరకు తమ వద్ద ఉన్న బందీలందరి విడుదలకు సిద్ధంగా ఉన్నట్లు హమాస్ ప్రకటించగా గాజాలో యుద్ధానికి ముగింపు పలుకుతూ ట్రంప్ ప్రణాళిక మొదటి దశ అమలుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ తెలిపారు. గాజాలోని తమ బలగాలు ఇప్పుడు కేవలం ఆత్మరక్షణ చర్యలకే పరిమితమయ్యాయని ఇజ్రాయెల్ ఆర్మీ తెలిపింది. దాడులు జరపడం లేదంది. అయితే, గాజా నుంచి బలగాలను మాత్రం ఉపసంహరించుకోవడం లేదని స్పష్టం చేసింది.

కీలక పరిణామం

బందీలందరినీ విడుదల చేయడంతోపాటు గాజాలో అధికారాన్ని స్వతంత్ర రాజకీయ పాలస్తీనా గ్రూపులకు అప్పగించడానికి సిద్ధమని హమాస్ ప్రకటించడాన్ని కీలకమైన పరిణామంగా భావిస్తున్నారు. అయితే, ట్రంప్ ప్రణాళికలోని ఇతర అంశాలపై పాలస్తీనా గ్రూపులతో సంప్రదింపులు జరపాల్సి ఉంటుందని హమాస్ పేర్కొంది. కొన్నిటిపై మరిన్ని విస్తృత చర్చలు అవసరమవుతాయని కూడా పేర్కొంది. గాజా భవిష్యత్తును పాలస్తీనియన్లే చర్చించి నిర్ణయించుకోవాల్సి ఉందని తెలిపింది. ఈ విషయంలో విదేశీ జోక్యాన్ని గట్టిగా వ్యతిరేకిస్తున్నామంది. అయితే, హమాస్ ఆయుధాలను అప్పగించాలన్న ఇజ్రాయెల్ కీలక డిమాండ్ ప్రస్తావన ఇందులో లేకపోవడం గమనార్హం. ఇజ్రాయెల్‌కు అనుకూలంగా ఉన్న ట్రంప్ ప్రతిపాదనలను చర్చలు జరపకుండా ఆమోదించలేమని హమాస్ సీనియర్ అధికారి మూసా అబూ మెర్జౌక్ వ్యాఖ్యానించారు. అదేవిధంగా, బందీలందరినీ 72 గంటల్లోగా విడుదల చేయడం సాధ్యం కాదన్నారు. వారందరినీ ఒకే చోటకు చేర్చేందుకు రోజులు లేక వారాలు పట్టొచ్చని చెప్పారు. ఆయుధాలను అప్పగించే హమాస్ సిద్ధంగానే ఉందన్నారు. అయితే, హమాస్ విడుదల చేసిన అధికార ప్రకటనలో మాత్రం ఆయుధాల అప్పగింత విషయం లేకపోవడం గమనార్హం.

బాంబింగ్ ఆపేయాలి: ట్రంప్

హమాస్ ప్రకటనను ట్రంప్ స్వాగతించారు. 'శాశ్వత శాంతిని హమాస్ కోరుకుంటోందని అనుకుంటున్నా. గాజాపై బాంబింగ్‌ను ఇజ్రాయెల్ వెంటనే నిలిపివేయాలి. బందీలందరినీ తక్షణమే సురక్షితంగా తీసుకురావడానికి ఇదెంతో అవసరం. ఇప్పటికే ఎంతో ఆలస్యమైంది. మిగతా అంశాలపై చర్చలకు సిద్ధం'అని తన ట్రూత్ సోషల్ మీడియాలో పేర్కొన్నారు.

శాంతి నెలకొంటుందా?

తన శాంతి ప్రణాళిక పూర్తిస్థాయి అమలుపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సైతం పూర్తి నమ్మకంతో ఉన్నట్లు కనిపించడం లేదు. 'చూద్దాం.. ఏం జరుగుతుందో..మనమైతే ఒక స్పష్టమైన నిర్ణయాన్ని తీసుకున్నాం. స్పష్టంగా చెప్పాం'అని ఆయన వ్యాఖ్యానించడం దీనికి అద్దం పడుతోంది. 'ఈ ఒప్పంద ఫలితంగా గాజాలో కొన్ని రోజులపాటు ఇజ్రాయెల్ కాల్పులను ఆపేస్తుంది. బందీలను హమాస్ విడుదల చేస్తుంది. హమాస్ ఆయుధాలను అప్పగించకుంటే మాత్రం ఇజ్రాయెల్ తిరిగి దాడులు మొదలుపెడుతుంది'అని ఇజ్రాయెల్ మాజీ సైనికాధికారి ఒకరు పేర్కొన్నారు. హమాస్ చర్చలకు సిద్ధమని ప్రకటించిందే గానీ, ఆ సంస్థ డిమాండ్లలో మాత్రం ఎటువంటి మార్పు లేదని మరో పరిశీలకుడు తెలిపారు. రెండు వర్గాల మాటలకు, చేతలకు ఏమాత్రం పొంతన లేదని విశ్లేషించారు.

ప్రిలిమినరీ తర్వాత తాత్కాలిక జవాబు కీ

సుప్రీంకోర్టుకు యూపీఎస్సీ వెల్లడి

న్యూఢిల్లీ: ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించిన తర్వాత తాత్కాలిక జవాబు కీని ప్రచురించాలని నిర్ణయించినట్లు యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్.. సుప్రీంకోర్టుకు తెలియజేసింది. గత నెలలో అత్యున్నత న్యాయస్థానంలో దాఖలు చేసిన అఫిడవిట్‌లో.. తుది ఫలితాల ప్రకటన తర్వాతే తుది జవాబు కీని ప్రచురిస్తామని కమిషన్ తెలిపింది. ఈ అఫిడవిట్‌ను సివిల్ సర్వీసెస్ పరీక్షకు సంబంధించి.. పెండింగ్‌లో ఉన్న పిటిషన్‌లో దాఖలు చేశారు. ఈ కేసు విచారణలో ఉన్న సమయంలో, కోర్టు నియమించిన అమికస్ క్యూరీ సూచనతో సహా వివిధ అంశాలపై తాము చర్చించామని యూపీఎస్సీ పేర్కొంది. 'సమగ్ర చర్చల అనంతరం.. బాగా ఆలోచించాక ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించిన తర్వాత తాత్కాలిక జవాబు కీని ప్రచురించాలని కమిషన్ నిర్ణయించింది.. అని అడ్వకేట్ వర్ధమాన్ కౌశిక్ ద్వారా దాఖలు చేసిన అఫిడవిట్‌లో పేర్కొంది. పరీక్షకు హాజరైన అభ్యర్థుల నుంచి అభ్యంతరాలు లేదా ప్రాతినిధ్యాలు కోరతామని అందులో వివరించింది. అభ్యర్థులు తెలిపే ప్రతి అభ్యంతరం లేదా ప్రాతినిధ్యానికి మూడు ప్రామాణిక ఆధారాలను జత చేయాలని, అలా జత చేయని అభ్యంతరాలను ప్రారంభ దశలోనే తిరస్కరించాలని అఫిడవిట్‌లో తెలిపారు. 'అయితే, సమర్పించిన ఆధారాలు ప్రామాణికమైనవా? కాదా? అనేది కమిషనే నిర్ణయిస్తుంది'.. అని కూడా అందులో స్పష్టం చేశారు.

జపాన్ కొత్త ప్రధాని తకైచి

దేశానికి తొలి మహిళా ప్రధాని కానున్న మాజీ మంత్రి

- అధికార కన్జర్వేటివ్ లిబరల్ డెమోక్రాటిక్ పార్టీ చీఫ్‌గా ఎన్నిక
- తకైచికి కరుడుగట్టిన సంప్రదాయవాదిగా గుర్తింపు

టోక్యో: జపాన్ చరిత్రలో తొలిసారి ఒక మహిళ ప్రధానమంత్రి పదవి చేపట్టబోతున్నారు. అధికార లిబరల్ డెమోక్రాటిక్ పార్టీ (ఎల్‌డీపీ) అధ్యక్షురాలిగా ఆర్థిక భద్రత శాఖ మాజీ మంత్రి సనే తకైచి (64) ఎన్నికయ్యారు. జపాన్‌లో అధికార పార్టీ అధ్యక్షుడే ప్రధాని అవుతారు. శనివారం అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికల్లో వ్యవసాయ శాఖ మంత్రి షింజిరో కొయిజుమిపై ఆమె గెలుపొందారు. షింజిరో కొయిజుమి ఆ దేశ మాజీ ప్రధాని జునిచిరో కొయిజుమి కుమారుడు. పార్టీలో తిరుగుబాటు నేపథ్యంలో ప్రధాని పదవి నుంచి తప్పుకోవాలని ప్రస్తుత ప్రధాని షిగెరు ఇషిబా నిర్ణయించుకోవటంతో ఈ ఎన్నిక అనివార్యమైంది. గత ఏడాది జరిగిన పార్లమెంటు ఎగువ, దిగువ సభల ఎన్నికల్లో ఎల్‌డీపీ ఓటమి చవిచూడటంతో షిగెరు నాయకత్వంపై పార్టీ నేతలు విశ్వాసం కోల్పోయారు. అయితే ప్రధానిని ఎన్నుకునే దిగువ సభలో ఇప్పటికీ ఎల్‌డీపీనే అతిపెద్ద పార్టీగా ఉండటంతో తకై చి ప్రధాని కావటం ఖాయమని చెబుతున్నారు. మరో పది రోజుల్లో జపాన్ పార్లమెంటు కొత్త ప్రధానిని ఎన్నుకొనే అవకాశం ఉంది.

చైనాకు ప్రబల శత్రువు

సనే తకైచికి జపాన్ రాజకీయాల్లో అత్యంత సంప్రదాయవాదిగా పేరుంది. ఆమె మాజీ ప్రధాని షింజో అబె విధానాలకు అతిపెద్ద మద్దతుదారు. చైనాను ప్రబల శత్రువుగా భావిస్తారు. జపాన్ సైనికీకరణకు గుర్తుగా భావించే యషుకుని ఆలయాన్ని ఆమె తరుచూ సందర్శిస్తుంటారు. పార్టీ అధ్యక్షురాలిగా ఎన్నికై న తర్వాత ఆమె మాట్లాడుతూ.. ప్రధాని పదవి చేపట్టిన తర్వాత తాను మొదట చేయబోయే పని దేశంలో పెరిగిపోతున్న వస్తువుల ధరలను తగ్గించటమేనని తెలిపారు. అమెరికాతో దౌత్య సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు ప్రయత్నిస్తానని చెప్పారు. దేశానికి కొత్తగా ఎదురవుతున్న భద్రత, దౌత్య సవాళ్లపై దృష్టిపెడుతానని వెల్లడించారు. అయితే, ఆమె పదవి చేపట్టిన వెంటనే అతిపెద్ద దౌత్య సవాలు ఎదురయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. దక్షిణకొరియాలో ఈ నెల 31 నుంచి ఆసియా పసిఫిక్ ఆర్థిక సహకార సమాఖ్య శిఖరాగ్ర సదస్సు ప్రారంభం కానుంది. ఆ సమావేశాల్లో అమెరికా అధ్యక్షుడితో ఆమె జపాన్ ప్రధాని హోదాలో ముఖాముఖి సమావేశం కావాల్సి ఉంటుంది. ఇటీవల మిత్ర దేశాలపై కూడా ఎడాపెడా టారిఫ్‌లు విధిస్తున్న ట్రంప్.. జపాన్‌ను కూడా వదల్లేదు. మరోవైపు జపాన్ తన సైనిక వ్యయాన్ని పెంచాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అమెరికాతో దౌత్య సంబంధాలకు అధిక ప్రాధాన్యం ఇస్తానని తకై చి తెలిపారు. మరోవైపు దేశంలో సుదీర్ఘకాలంగా అధికారంలో ఉన్న ఎల్‌డీపీకి ఎదురుగాలి వీస్తోంది. గత ఏడాది జరిగిన ఎన్నికల్లో పార్లమెంటులోని రెండు సభల్లోనూ ఆ పార్టీ మెజారిటీ కోల్పోయింది. ఇప్పుడు మళ్లీ తన పార్టీపై ప్రజలకు విశ్వాసం కల్పించటం తకైచి ముందున్న అతిపెద్ద సవాలు.



పట్టువదలని సంకల్పం

సనే తకైచి ఎల్‌డీపీ అధ్యక్ష పదవికి 2021లోనే పోటీ పడ్డారు. అయితే, నాడు ఆమె విపరీత సంప్రదాయ భావాలను వ్యతిరేకించిన పార్టీలోని మెజారిటీ సభ్యులు ఆమెను ఓడించారు. దీంతో నాడు ఆమె మూడో స్థానంలో నిలిచారు. తకైచి 1961 మార్చి 7న నారా ప్రావిన్స్‌లోని యమటోకొయిరామాలో జన్మించారు. ఆమె కోబె యూనివర్సిటీలో గ్రాడ్యుయేషన్ చదివారు. అనంతరం బ్రాడ్‌కాస్టర్‌గా, రాజకీయ సలహాదారుగా పనిచేశారు. పలు రచనలు కూడా చేశారు. అనంతరం ఎల్‌డీపీలో చేరి 1993లో తొలిసారి పార్లమెంటుకు ఎన్నికయ్యారు. మాజీ ప్రధాని షింజో అబెకు ఆమె ప్రధాన అనుచరురాలిగా గుర్తింపు పొందారు. ఆయన మంత్రివర్గంలో పనిచేశారు. 2019–20 మధ్య దేశ అంతర్గత వ్యవహారాలు, సమాచార శాఖ మంత్రిగా పనిచేశారు. ఫుమియో కిషిడా మంత్రివర్గంలో 2022–24 మధ్య ఆర్థిక భద్రత సహాయ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. 2024లో కూడా ఆమె పార్టీ అధ్యక్ష పదవికి పోటీ పడ్డారు. కానీ, ప్రస్తుత ప్రధాని షిగేరు ఇషిబా చేతిలో అతి తక్కువ ఓట్ల తేడాతో ఓడిపోయారు. ముచ్చటగా మూడోసారి పట్టువదలక ప్రయత్నించి విజయం సాధించి ప్రధాని పదవి చేపట్టబోతున్నారు. ఆమె జపాన్ తొలి మహిళా ప్రధానిగానే కాకుండా నారా ప్రావిన్స్ నుంచి తొలి ప్రధానిగా కూడా రికార్డు సృష్టించబోతున్నారు.

జుబీన్ గార్గ్‌పై విషప్రయోగం

మేనేజర్ సిద్ధార్థ, ఆర్గనైజర్ శ్యామకానుపై శేఖర్ జ్యోతి గోస్వామి ఆరోపణ

గౌహతి: గాయకుడు జుబీన్ గార్గ్ మృతిపై ఆయన బ్యాండ్ సభ్యుడు శేఖర్ జ్యోతి గోస్వామి సంచలన ఆరోపణలు చేశారు. మేనేజర్ సిద్ధార్థ శర్మ, ఫెస్టివల్ ఆర్గనైజర్ శ్యామకాను మహంత.. గార్గ్‌కు విషం ఇచ్చారని ఆయన ఆరోపించారు. పీటీఐకి అందిన అత్యంత కీలక పత్రం ప్రకారం.. గార్గ్ మరణాన్ని ప్రమాదవశాత్తు జరిగినట్లుగా చిత్రీకరించడానికి 'కుట్ర' జరిగిందని కూడా గోస్వామి పేర్కొన్నారు. జుబీన్ గార్గ్ సెప్టెంబర్ 19న సింగపూర్‌లో సముద్రంలో ఈత కొడుతూ అనుమానాస్పద పరిస్థితుల్లో మరణించడం తెలిసిందే. మహంత, అతని సంస్థ నిర్వహించిన 4వ ఈశాన్య భారతదేశ ఉత్సవంలో పాల్గొనేందుకు జుబీన్ గార్గ్ ఆగ్నేయాసియా దేశానికి వెళ్లారు. 'గార్గ్ మునిగిపోతూ.. శ్వాస ఆడక ఉక్కిరిబిక్కిరవుతున్న విపత్కర సమయంలో 'జబో దే, జబో దే' (వదిలెయ్, వదిలెయ్) అని శర్మ అరిచాడని, గార్గ్ నిపుణుడైన ఈతగాడని, అతనే తనకీ, నిందితుడికీ ఈత నేర్పించాడు కాబట్టి మునిగిపోయే అవకాశం లేదని.. సాక్షి గోస్వామి స్పష్టం చేసినట్లు రిమాండ్ నోట్ పేర్కొంది. 'శర్మ, మహంత.. జుబీన్‌కు విషం ఇచ్చారని, తమ కుట్రను దాచడానికి ఉద్దేశపూర్వకంగా విదేశీ వేదికను ఎంచుకున్నారని గోస్వామి ఆరోపించారు.

సాక్షి హైదరాబాద్

ఆదివారం । 5 । అక్టోబర్ । 2025



రన్‌వే.. రాబడికి హైవే
రన్‌వేలు.. విమానాలు రయ్‌మంటూ ఆకాశంలోకి దూసుకెళ్లడానికి మాత్రమే కాదు.. ఆదాయ ఆర్జనకు హైవేలుగా మారుతున్నాయి. -10లో



వన్‌డే టూర్.. బెస్ట్ బీదర్
చక్కని వీకెండ్ విహారం బీదర్. సిటీ నుంచి 3 గంటల ప్రయాణం. చరిత్రాత్మక, ఆధ్యాత్మిక విశేషాలు తెలుసుకుకోవచ్చు. నగర పర్యాటకులకు బీదర్ ఫేమస్ డెస్టినేషన్. - సిటీప్లస్‌లో


గరిష్టం/కనిష్టం
32.0/23.0

వాతావరణం
నగరంలో ఆదివారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పగటిపూట పొడి వాతావరణం నెలకొంటుంది. గరిష్టంగా 32, కనిష్టంగా 23 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా.

మూసీ, ఈసా, గోదావరి నదుల సంగమమిదీ..

- ఇక్కడే ప్రపంచంలోనే ఎత్తయిన మహాత్ముడి కాంస్య విగ్రహం
- బాపూ తత్వాలను బోధించేందుకు ఆశ్రమం, మ్యూజియం కూడా
- మూసీ వెంట రాష్ట్ర, జాతీయ స్థాయి మహనీయుల విగ్రహాల ఏర్పాటు
- సర్వమతాల సమ్మేళనంగా మూసీ అభివృద్ధి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పానికి అనుగుణంగా అడుగులు





గాంధీ సరోవర్ అభివృద్ధి నమూనా చిత్రం

స్ఫూర్తి మూర్తి.. సాంస్కృతిక కీర్తి

బాపూ ఘాట్ వద్ద గాంధీ సరోవర్ అభివృద్ధి



దండియాత్ర విగ్రహమే..

మూసీ, ఈసా నదుల సంగమమైన బాపూఘాట్ వద్దకు మల్లన్నసాగర్ నుంచి గోదావరి జలాలను తరలించి.. ఈ ప్రదేశాన్ని త్రివేణి సంగమంగా అభివృద్ధి చేయనున్నారు. ఇక్కడే ప్రపంచంలోనే ఎత్తయిన గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు. దేశ, విదేశాల్లో కొలువుదీరిన మహాత్మా గాంధీ విగ్రహాలను అధ్యయనం చేసిన అధికారులు.. చరిత్రాత్మక దండి యాత్రలో చేతిలో కర్రతో నడుస్తున్న స్థితిలో ఉన్న గాంధీ విగ్రహాన్ని ఎంపిక చేసినట్లు తెలిసింది. అహింసా, ప్రతిఘటన, స్వావలంబన, స్వేచ్ఛను సాధించే సమష్టి శక్తికి ఇది సూచిక. గాంధీజీ నిశ్శబ్ద బలమైన వాకింగ్ స్టిక్.. శ్రద్ధ, దృఢత్వాన్ని సూచిస్తుంది. ఇప్పటికే 68 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న బాపూఘాట్‌లో ధ్యాన భంగిమలో ఉన్న 22 అడుగుల ఎత్తయిన గాంధీ విగ్రహం ఉన్న సంగతి తెలిసిందే. దీన్ని 1999లో ఏర్పాటు చేశారు.

సాక్షి, సిటీబ్యూరో

భాగ్యనగరానికి వడ్డాణంలా.. నడిమధ్యలో వయ్యారంగా ప్రవహించే మూసీ నది పునరుజ్జీవానికి అందమైన సొబగులు అద్దుకుంటున్నాయి. మూసీని వాణిజ్య కేంద్రంగానే కాకుండా.. నదీ పరీవాహక ప్రాంతాన్ని సాంస్కృతిక ఆలవాలంగా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పించారు. ఈమేరకు మూసీ, దాని ఉపనది ఈసా నదుల సంగమం అయిన బాపూ ఘాట్ వద్ద గాంధీ సరోవర్‌ను అభివృద్ధి చేయనున్నారు. ఇక్కడే ప్రపంచంలోనే ఎత్తయిన మహాత్మా గాంధీ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు. దీంతో పాటు గాంధీ తత్వాన్ని బోధించే ఆశ్రమం, మ్యూజియంను కూడా నిర్మించనున్నారు.

సమగ్ర మాస్టర్‌ప్లాన్ త్వరలోనే ప్రభుత్వానికి..

మెయిన్‌హార్డ్ట్, కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్, ఆర్‌ఐఏఎస్, జెడ్‌హెచ్‌ఏ, ఎస్‌ఓఎంలతో కూడిన కన్సార్టియం తొలి దశ మూసీ సుందరీకరణ సమగ్ర మాస్టర్ ప్లాన్‌ను అతి త్వరలోనే ప్రభుత్వానికి సమర్పించనుంది. గాంధీ సరోవర్ అభివృద్ధి కోసం 250 ఎకరాల భూమి అవసరం కాగా.. కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ అధీనంలో ఉన్న ఈ భూములను బదిలీ చేయాలని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం కోరింది. ఇప్పటికే కేంద్రం 100 ఎకరాల భూమిని బదిలీ చేసేందుకు కేంద్రం అంగీకరించగా.. మిగిలిన భూమి కోసం చర్చలు జరుగుతున్నాయని మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ లిమిటెడ్ (ఎంఆర్‌డీసీఎల్) అధికార వర్గాలు తెలిపాయి.

సాంస్కృతిక పునరుజ్జీవంగా..

తొలి దశలో గండిపేట నుంచి బాపూ ఘాట్ వరకూ 20.5 కిలో మీటర్ల వరకు మూసీకి పునరుజ్జీవం కల్పించనున్న అధికారులు.. రెండో దశలో హెచ్‌ఎండీఏ పరిధిలోని 55 కి.మీ. వరకూ నదిని సుందరీకరించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా మూసీకి వాణిజ్య, ఉపాధి కేంద్రంతో పాటు సాంస్కృతిక పునరుజ్జీవంగా అభివృద్ధి చేయనున్నారు. నదీ పరీవాహక ప్రాంతంలో వాకింగ్, సైక్లింగ్ ట్రాక్‌లు, షాపింగ్ మాల్స్, యాంపి థియేటర్లు, వినోద కేంద్రాలు, ఉద్యానాలు, ఇతర త్రా యుటిలిటీలను అభివృద్ధి చేయడంతో పాటు నదీ పరీవాహక ప్రాంతం వెంబడి రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రభావవంతమైన వ్యక్తులు, మహనీయుల విగ్రహాలను కూడా ఏర్పాటు చేయనున్నారు.

సకల మతాల సమ్మేళనంగా..

నగరం మధ్యలో నుంచి 55 కి.మీ. మేర ప్రవహించే మూసీ పరీవాహక ప్రాంతాన్ని సకల మతాల సమ్మేళనంగా తీర్చిదిద్దనున్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వం మంచిరేవులలో 800 ఏళ్ల నాటి పురాతన శివాలయం, పాతబస్తీలోని మసీదు, సిఖ్‌ఛావనిలో గురుద్వార, ఉప్పల్‌లో మెదక్ కేథడ్రిల్ తరహాలో చర్చిని కూడా నిర్మించనున్నారు. బాపూ ఘాట్‌ను అభ్యాస ప్రదేశంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా గాంధీ ఆశ్రమం, మ్యూజియంలను నిర్మించనున్నారు. ఇందులో గాంధీ బోధనలను నుంచి ప్రేరణ పొందిన నీతి, కమ్యూనికేషన్, విలువలపై కోర్సులను అందిస్తారు.

సిటీ బాటలో..

తిరుగు ప్రయాణంలోనూ రద్దీ

- కిటకిటలాడుతున్న రైళ్లు, బస్సులు
- సొంత వాహనాల్లోనూ భారీగా ప్రయాణాలు
- టోల్‌గేట్ల వద్ద కిలోమీటర్ల కొద్దీ పడిగాపులు
- అదనపు బస్సులను ఏర్పాటు చేసిన ఆర్టీసీ
- సుమారు 25 లక్షల మంది సొంతూళ్లకు వెళ్లినట్లు అంచనా



ఎంజీబీఎస్‌లో..

సాక్షి, సిటీబ్యూరో: సద్దుల బతుకమ్మ, దసరా సందర్భంగా సొంత ఊళ్లకు వెళ్లిన నగరవాసులు శనివారం వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తిరుగుపయనమయ్యారు. దీంతో పలు జిల్లాల నుంచి నగరానికి చేరుకొనే రైళ్లు, బస్సులు ప్రయాణికులతో నిండిపోయాయి. కొన్ని స్కూళ్లు, కాలేజీలు శనివారమే తిరిగి తెరుచుకున్నాయి. సోమవారం నుంచి విద్యాసంస్థలు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు పూర్తిస్థాయిలో పని చేయనున్నాయి. దీంతో సొంత ఊళ్లకు వెళ్లిన నగరవాసులు క్రమంగా చేరుకుంటున్నారు. ఈసారి దసరా సందర్భంగా సుమారు 25 లక్షల మంది వరకు సొంత ఊళ్లకు వెళ్లినట్లు అంచనా. వరుస సెలవులు రావడంతో చాలామంది పర్యాటక ప్రాంతాలు, ఆధ్యాత్మిక యాత్రలకు వెళ్లారు. నగరంలో పని చేస్తున్న ఐటీ, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు సైతం సొంత ఊళ్ల నుంచి నగరానికి చేరుకుంటున్నారు. మరోవైపు ఆదివారం ప్రయాణికుల రద్దీ భారీగా ఉండే అవకాశం ఉంది. ఇందుకనుగుణంగా అదనపు బస్సులను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఈ ఏడాది దసరా సందర్భంగా సుమారు 7,750 బస్సులను నడిపేందుకు ఏర్పాట్లు చేశారు. రద్దీ మేరకు బస్సులను నడిపారు. శని, ఆదివారాల్లో తిరుగు ప్రయాణాలను దృష్టిలో ఉంచుకొని జిల్లా కేంద్రాల నుంచి అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

అదనపు రైళ్లు...

వివిధ ప్రాంతాల నుంచి నగరానికి చేరుకొనే ప్రయాణికుల దృష్ట్యా విశాఖ, విజయవాడ, గుంటూరు, తిరుపతి, బెంగళూరు, పాట్నా తదితర ప్రాంతాల నుంచి అదనపు రైళ్లను ఏర్పాటు చేశారు. పలు రైళ్లకు సాధారణ బోగీలను అదనంగా ఏర్పాటు చేశారు. ప్రయాణికుల డిమాండ్ మేరకు రిజర్వేషన్ బెర్తులు లభించకపోవడంతో సాధారణ బోగీల్లో రద్దీ పెరిగింది. మరోవైపు సికింద్రాబాద్, చర్లపల్లి, నాంపల్లి స్టేషన్‌ల వద్ద రిటర్న్ జర్నీ ప్రయాణికులతో సందడి నెలకొంది. చర్లపల్లి టర్మినల్ నుంచి సరైన సిటీబస్సుల సదుపాయం లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వచ్చింది. ఆటోలు, క్యాబ్‌లపై ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు.

బారులు తీరిన సొంత వాహనాలు..

సొంత వాహనాల్లోనూ జనం పెద్ద సంఖ్యలో నగరానికి బయలుదేరారు. దీంతో శనివారం సాయంత్రం రహదారులపైన వాహనాల రద్దీ బాగా పెరిగింది. నగరానికి చేరుకొనే మార్గాల్లో పంతంగి, బీబీనగర్, షాద్‌నగర్, కడ్తాల్, శామీర్‌పేట్‌లలోని టోల్‌గేట్‌ల వద్ద వాహనాలు కిలోమీటర్‌కు పైగా బారులు తీరాయి.ఆ దివారం ప్రయాణికుల రాకపోకలు భారీగా పెరిగే అవకాశం ఉండడంతో ముందుజాగ్రత్తగా శనివారమే బయలుదేరినప్పటికీ టోల్‌ప్లాజాల వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చిందని పలువురు వాహనదారులు పేర్కొన్నారు. దసరా సందర్భంగా సుమారు 10 లక్షలకు పైగా ద్విచక్ర వాహనాలు, మరో 5 లక్షల కార్లు, ఇతర వాహనాల్లో జనం ఊళ్లకు తరలి వెళ్లినట్లు అంచనా. ప్రస్తుతం ఈ వాహనాలన్నీ నగరానికి తిరుగుముఖం పట్టడంతో రోడ్లపైన రద్దీ పెరిగింది.

ప్రైవేట్ దోపిడీ యథాతథం..

ఆర్టీసీ ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్‌లు మహిళా ప్రయాణికులతో కిటకిటలాడాయి. విజయవాడ వైపు నుంచి నగరానికి చేరుకొనే ప్రైవేట్ బస్సులు, మ్యాక్సీ క్యాబ్‌లు, టాటాఏస్‌లు వంటి వాహనాల్లో యథావిధిగా పండుగ దోపిడీ కొనసాగింది. రెట్టింపు చార్జీలు వసూలు చేశారు.

ఎన్ని 'కలలు'..

రూ. 100 కోట్ల పనులు

జూబ్లీహిల్స్‌పై సర్కారు ప్రేమ

- ఇప్పటికే నిధులు మంజూరు
- పనులకు శంకుస్థాపనలు
- సంక్షేమ పథకాల అమలు



సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ పరిధిలోని వివిధ నియోజకవర్గాల ప్రజలు, కార్పొరేటర్లు కాళ్లరిగేలా తిరుగుతున్నా అభివృద్ధి కార్యక్రమాలకు నిధులందడం లేదు. సంక్షేమ ఫలాలు అరకొరగా అందుతున్నాయి. అదే జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ప్రజలతో పాటు కార్పొరేటర్లకు మాత్రం అడిగిందే తడవుగానే కాదు, అడగకున్నా వివిధ మౌలిక సదుపాయాలు, అభివృద్ధి పనులకు నిధులు మంజూరవుతున్నాయి. పనులు కూడా ప్రారంభమవుతున్నాయి. అతి త్వరలోనే నియోజకవర్గ ఉపఎన్నికకు షెడ్యూలు కూడా విడుదల కానున్న నేపథ్యంలో శంకుస్థాపనలు ముమ్మరమయ్యాయి. ఇప్పటికే దాదాపు రూ. 100 కోట్ల మేర పనులకు నిధులు మంజూరైనట్లు సమాచారం. వాటిలో కొన్ని పనులకు ఇప్పటికే శంకుస్థాపనలు కూడా జరిగాయి. ఇంకా జరుగుతున్నాయి. షెడ్యూలు వెలువడేంత వరకు ఈ కార్యక్రమాలు జరుగుతూనే ఉంటాయని స్థానిక ప్రజలు కూడా భావిస్తున్నారు. మరో రూ.25 కోట్ల పనులు ప్రతిపాదనల దశల్లో ఉన్నాయని సమాచారం.

శంకుస్థాపనలు ముమ్మరం..

ఆయా పనులకు శంకుస్థాపన కార్యక్రమాలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ప్రతిరోజూ ఏదో ఓ ప్రాంతంలో శంకుస్థాపనలో, ప్రారంభోత్సవాలో, సంక్షేమ ఫలాల పంపిణీయో జరుగుతోంది. శంకుస్థాపనలు చేస్తున్న పనుల్లో వరద నివారణ పనులు, రహదారులు, తదితర మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించినవి ఉంటున్నాయి. నియోజకవర్గంలోని ఎర్రగడ్డ, యూసుఫ్‌గూడ ప్రాంతాల్లో సీసీ రోడ్లు, బాక్స్ డ్రెయిన్స్, డ్రెయినేజీ నెట్‌వర్క్ వంటి పనులకు ఇటీవల రూ.8.49 కోట్ల అంచనా వ్యయాలతో శంకుస్థాపనలు జరిగాయి. రూ. 5 కోట్లతో షేక్‌పేట ఫ్లై ఓవర్ కింద స్పోర్ట్స్‌పార్క్, హరిజన బస్తీ, వెంగళరావునగర్ ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లు, సీసీ రోడ్ల పనులు జరగనున్నాయి. కృష్ణానగర్, కమలాపురి ప్రాంతాల్లో నాలా పునరుద్ధరణ, డ్రైనేజీ ఓవర్‌ఫ్లో సమస్యల పరిష్కారానికి రూ. 65 లక్షలు మంజూరయ్యాయి. తాజాగా శనివారం సైతం దాదాపు రూ. 3 కోట్ల అంచనా వ్యయంతో పలు పనులకు హైదరాబాద్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ శంకుస్థాపనలు చేశారు.ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. ఇంకా ఆయా ప్రాంతాల్లో పార్కులు, వాకింగ్‌ట్రాక్‌లు,చిల్డ్రన్స్ పార్కులు, తదితర పనులకు సిద్ధమయ్యారు. గృహ నిర్మాణాలు, కమ్యూనిటీ హాళ్ల వంటి పనులు కూడా చేపట్టనున్నట్లు సమాచారం.

సంక్షేమ కార్యక్రమాలు..

నియోజకవర్గంలో కొత్తగా 6 వేల కుటుంబాలకు రేషన్‌కార్డులందాయి. పాత రేషన్‌కార్డుల్లో అదనపు సభ్యుల చేరికతో కొత్తగా 15వేల మంది లబ్ధిదారులుగా నమోదయ్యారు. ఇక అన్ని నియోజకవర్గాలతోపాటు 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్, మహిళలకు ఉచిత బస్ వంటి గ్యారంటీలను నేతలు ప్రచారం చేస్తున్నారు. స్లమ్స్ ప్రజలకు ఇందిరమ్మ ఇళ్ల వంటి కార్యక్రమాల గురించి మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, వివేక్ వెంకటస్వామి ప్రచారం చేస్తున్నారు.

గెలుపు కోసం..

అధికార కాంగ్రెస్‌తో పాటు ప్రతిపక్ష పార్టీలైన బీఆర్‌ఎస్, బీజేపీలు ఈ ఎన్నికల్ని సవాల్‌గా, ప్రతిష్టాత్మకంగానే కాక జీవన్మరణ సమస్యగా పరిగణిస్తుండటంతో వేటికవిగా ప్రజల మద్దతు పొందేందుకు తిప్పలు పడుతున్నాయి. ఈ ఉప ఎన్నిక కేవలం ఖాళీ అయిన స్థానాన్ని భర్తీ చేసేందుకు జరుగుతున్నదిగా కాక, అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని వినియోగించుకోవాలని కాంగ్రెస్ నేతలు ప్రచారం చేస్తున్నారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్‌తో మాత్రమే అభివృద్ధి సాధ్యమవుతుందని చెబుతూ, గత బీఆర్‌ఎస్ హయాంలో నియోజకవర్గం నిర్లక్ష్యానికి గురైందని ప్రచారం చేస్తున్నారు. వచ్చిన ఈ అవకాశాన్ని వినియోగించుకొని జూబ్లీహిల్స్‌ను మోడల్ నియోజకవర్గంగా మార్చేందుకు తమ పార్టీకే ఓటేయాలని కోరుతున్నారు. మిగతా పార్టీలూ తమ వ్యూహాలతో ప్రచారాలు చేస్తున్నాయి.

మళ్లీ తెరపైకి అజహరుద్దీన్!?

గవర్నర్ కోటాలో వచ్చిన ఎమ్మెల్సీ పదవికి గండం?

- ఎమ్మెల్యేగా పోటీ చేయాలంటున్న అభిమానులు
- మరో వైపు సీటు కోసం ఇతరుల ప్రయత్నాలు
- పట్టుబడుతున్న మాజీ ఎంపీ అంజన్ కుమార్
- మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ సైతం..
- జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కోసం కాంగ్రెస్ అభ్యర్థి ఎంపికలో రోజురోజుకూ పెరుగుతున్న ఉత్కంఠ



తన నివాసంలో మైనారిటీ నేతలతో అజహర్

సాక్షి,సిటీబ్యూరో/బంజారాహిల్స్: అధికార కాంగ్రెస్ అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో అభ్యర్థి ఎంపిక ఉత్కంఠ రేపుతోంది. ముగ్గురు మంత్రులను రంగంలోకి దింపి అభివృద్ధి మంత్రం జపిస్తున్న కాంగ్రెస్ పార్టీకి సీటు కోసం తీవ్రపోటీ ఉండటంతో అభ్యర్థి ఎంపిక కత్తిమీద సాముగా తయారైంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి పరాజయం పాలైన అజహరుద్దీన్ ఉప ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆసక్తి కనబర్చగా.. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం గవర్నర్ కోటాలో ఆయనను ఎమ్మెల్సీ పదవికి ఎంపిక చేసి బరి నుంచి తప్పించింది. తాజాగా ఆశావహుల జాబితా తయారు చేసేందుకు కసరత్తు చేస్తున్న సమయంలో.. తిరిగి అజహరుద్దీన్ పేరు తెరపైకి రావడంతో రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. గవర్నర్ కోటా నాన్ పొలిటికల్ కేటగిరీ కింద అజహరుద్దీన్‌ను ఎంపిక చేసినప్పటికీ.. ఆయన గతంలో కాంగ్రెస్ పార్టీ పక్షాన ఎంపీగా ఎన్నిక కావడంతో పాటు ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో సైతం పోటీ చేసి ఉండటంతో న్యాయపరమై చిక్కులతో పదవికి గండం తప్పదని రాజకీయ పరిశీలకులు పేర్కొంటున్నారు. ఆయనకు కూడా ఆ అనుమానం వెంటాడుతోంది. మరోవైపు ఉప ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేయాలని ఆయన అభిమానుల నుంచి ఒత్తిడి పెరుగుతోంది. తాజాగా శనివారం బంజారాహిల్స్‌లోని అజహరుద్దీన్ నివాసానికి మైనారిటీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలి వచ్చి పోటీ చేయాలంటూ పట్టుబట్టారు. వారం రోజులుగా కార్యకర్తల ఒత్తిళ్లు పెరుగుతుండటంతో ఆయన రెండు మూడు రోజులుగా ఎమ్మెల్యేగా పోటీ చేయాలనే తలంపుతో ఉన్నట్లు తెలుస్తోంది.

రంగంలోకి మీనాక్షీ నటరాజన్

తాజా రాజకీయ పరిణామాలతో ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్ రంగంలోకి దిగారు. అభ్యర్థి ఎంపిక వ్యవహారంలో ఆచితూచి అడుగులు వేస్తున్నారు. అధికార పక్షం కావడంతో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో సీటు కోసం తీవ్ర పోటీ నెలకొంది. మాజీ ఎంపీ అంజన్ కుమార్, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, యువనేత నవీన్ యాదవ్‌లు తీవ్రంగా పోటీ పడుతున్నారు. మరోవైపు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, మాజీ ఎంపీ రంజిత్ రెడ్డి, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిన్ రెడ్డి తదితరుల పేర్లు కూడా వినిపిస్తున్నాయి. మాజీ ఎంపీ అంజన్ కుమార్ మాత్రం తనకు ఉప ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఇవ్వాల్సిందేనని పట్టు పడుతున్నారు. ఇప్పటికే ఉప ఎన్నికకు అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసేందుకు కాంగ్రెస్ పార్టీ కసరత్తు చేస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి పోటీ చేసే అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ బాధ్యతలను ఇన్‌చార్జి మంత్రులకు అప్పగించారు.

మజ్లిస్ కలిసి వస్తున్నందుకు..

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో మజ్లిస్ పార్టీ కలిసి వస్తుండటంతో కాంగ్రెస్‌కు విజయావకాశాలపై ధీమా మరింత పెరిగింది. ఇప్పటికే ముగ్గురు రాష్ట్ర మంత్రులు, 18 మంది కార్పొరేషన్ చైర్మన్లు రంగంలో దిగి అభివృద్ధి మంత్రం జపిస్తున్నారు. క్షేత్ర స్థాయిలో ప్రతి కుటుంబానికి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ద్వారా ఏదో ఒక విధంగా లబ్ధి చేకూర్చేవిధంగా ప్రయత్నిస్తున్నారు. నియోజకవర్గంలో ముస్లిం మైనారిటీ ఓటర్లు అధికంగానే ఉన్నారు. తాజాగా మజ్లిస్ కూడా ఉప ఎన్నికల బరి నుంచి దూరం పాటిస్తున్నట్లు, కాంగ్రెస్‌తో కలిసి నడిచేందుకు సిద్ధమైనట్లు పరోక్షంగా సంకేతాలు ఇచ్చింది. ఆశావహుల్లో మరింత ఆసక్తి పెరిగింది. దీంతో టికెట్ కోసం పోటీ తీవ్రంగా మారింది. ఎమ్మెల్సీ పదవికి ఎంపికై నప్పటికీ.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఎమ్మెల్యేగా విజయం సాధిస్తే హైదరాబాద్ మైనారిటీ కోటాలో మంత్రి పదవీ దక్కవచ్చని అజహరుద్దీన్ కూడా యూ టర్న్ తీసుకునేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది.

రోడ్డు ఆక్రమణ ఫిర్యాదుపై

చర్యలు చేపట్టండి

బడంగ్‌పేట్ మున్సిపల్ కమిషనర్‌కు హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: బడంగ్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలో రోడ్డు ఆక్రమణకు సంబంధించి అమెరికన్ టౌన్‌షిప్ ప్లాట్ ఓనర్స్ వెల్‌ఫేర్ అసోసియేషన్ ఇచ్చిన ఫిర్యాదు వెంటనే చర్యలు చేపట్టాలని కమిషనర్‌ను హైకోర్టు ఆదేశించింది. అనధికారిక ప్రతివాదులైన షేక్ సైఫుద్దీన్, ప్రైడ్ ఇండియా మాన్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌పై పోలీసుల సాయంతో చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. తదుపరి విచారణ ఈ నెల 23కు వాయిదా వేసింది. బడంగ్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలో అనుమతి పొందిన లే అవుట్ ప్రకారం 40 ఫీట్ల రోడ్డు ఉండగా, సైఫుద్దీన్ రహదారిని కబ్జా చేశారని, చర్యలు తీసుకోవాలని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదంటూ అమెరికన్ టౌన్‌షిప్ ప్లాట్ ఓనర్స్ వెల్‌ఫేర్ అసోసియేషన్ తరపున అధ్యక్షుడితో పాటు మరొకరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి విచారణ చేపట్టారు. మున్సిపాలిటీ తరపున స్టాండింగ్ కౌన్సిల్ కృష్ణ వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్ల ఫిర్యాదు మేరకు చర్య తీసుకున్నామని చెప్పారు. అనధికారిక ప్రతివాదుల నిర్మాణాలు కూల్చివేశామన్నారు. వారు మళ్లీ నిర్మాణాలు కొనసాగిస్తున్నట్లు ఫిర్యాదు అందిందని తెలిపారు. వాదనలు విన్న న్యాయమూర్తి..పిటిషనర్ల ఫిర్యాదుపై వెంటనే చర్య తీసుకోవాలని, అవసరమైతే సంబంధిత పోలీస్ స్టేషన్ నుంచి సాయం పొందాలని కమిషనర్‌ను ఆదేశిస్తూ.. విచారణ వాయిదా వేశారు.

రూ.1,900 కోట్ల భూమిని కాపాడిన హైడ్రా

కొండాపూర్ సర్వే నంబర్ 59లో ఆక్రమణల కూల్చివేత

గచ్చిబౌలి: కొండాపూర్ సర్వే నంబర్ 59లో వెలసిన ఆక్రమణలను శనివారం హైడ్రా కూల్చివేసింది. రూ.1,900 కోట్ల విలువైన భూమిని కాపాడింది. 18.30 ఎకరాల స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేసింది. హైడ్రా అధికారుల కథనం ప్రకారం.. కొండాపూర్‌లోని సర్వే నంబర్ 59లో మొత్తం 57 ఎకరాల 9 గుంటల భూమి ఉంది. 36 ఎకరాల స్థలం 12 మంది రైతుల పేరిట ఉంది. సదరు భూమి ప్రభుత్వానికి చెందుతుందని రెవెన్యూ అధికారులు వాదిస్తూ వస్తున్నారు. ఈ క్రమంతో రైతులకు, ప్రభుత్వానికి మధ్య భూ వివాదం నెలకొంది. తమ పేరిట ఉన్న అసైన్డ్ ల్యాండ్ తమకే చెందుతుందని రైతులు చెబుతున్నారు. కొద్ది రోజుల క్రితం హై కోర్టు కొండాపూర్ సర్వే నంబర్ 59లోని 36 ఎకరాల స్థలం ప్రభుత్వానికి చెందుతుందని తీర్పు వెలువరించిన విషయం తెలిసిందే. హై కోర్టు తీర్పు నేపథ్యంలో హైడ్రా రంగంలోకి దిగింది. భారీ పోలీసులు బందోబస్తు మధ్య శేరిలింగంపల్లి తహసీల్దార్ వెంకారెడ్డితో కలిసి ఆక్రమణలను నేలమట్టం చేసింది. 11 గుడిసెలు, 12 తాత్కాలిక షెడ్లను కూల్చివేశారు. ఆర్టీఏ ఆఫీస్ కింద భాగంలో వీకర్ సెక్షన్‌ను అనుకొని 14 ఎకరాలు, లింకు రోడ్డు అవతల 4 ఎకరాలు మొత్తం 18 ఎకరాల 30 గుంటల స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. వీకర్ సెక్షన్‌ను అనుకొని నకిలీ పట్టాలతో అనేక మంది కబ్జాలకు పాల్పడినట్లు తెలుస్తోంది. హైడ్రా 18.30 ఎకరాల భూమితో సరిపెట్టుకుంటుందా లేక సర్వే చేసి మొత్తం భూమిని స్వాధీనం చేసుకుంటుందా అనేది తెలియాల్సి ఉంది.



ఆక్రమణలను నేలమట్టం చేసిన హైడ్రా

ట్రాక్టర్ బోల్తా ..డ్రైవర్ మృతి



బచ్చన్న(ఫైల్)

గచ్చిబౌలి: అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా పడటంతో డ్రైవర్ మృతి చెందిన సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శశిపాల్ రెడ్డి తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపలి మండలం వెన్నచెర్ల గ్రామానికి చెందిన బింగి బచ్చన్న(33)నగరంలోని గుడిమల్కాపురం వలస వచ్చాడు. తన సోదరుడికి చెందిన ట్రాక్టర్‌కు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. గచ్చిబౌలిలోని టీఎన్‌జీవోస్ కాలనీలో స్లాబ్ వేసేందుకు ట్రాక్టర్ ద్వార మిల్లర్‌ను తీసుకొని వస్తుండగా..శనివారం తెల్లవారుజామున టీఎన్‌జీఓస్‌కాలనీ సమీపంలో అదుపుతప్పి బోల్తాకొట్టి రోడ్డు పక్కన పడింది. దీంతో బచ్చన్న చక్రాల కింద పడటంతో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో దంపతులపై దాడి

జగద్గిరిగుట్ట: బైక్ పై వస్తున్న దంపతులను కొందరు మద్యం మత్తులో అడ్డుకుని గాయపరిచిన ఘటన జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం ఉత్తరప్రదేశ్ కు చెందిన షబ్బీర్ అలీ, ఫాతిమా దంపతులు స్టేషన్ పరిధిలోని దేవేందర్‌నగర్‌లో నివసిస్తున్నారు. కాగా గురువారం అర్ధరాత్రి వీరు తమ బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తుండగా దేవేందర్‌నగర్‌కు చేరుకోగానే వీరిని అజీజ్, అతని స్నేహితులు బైక్‌ను అడ్డుకున్నారు. ఎందుకు ఆపారని అడిగే లోపే అప్పటికే మద్యం తాగి ఉన్న వారు మూకుమ్మడిగా విచక్షణారహితంగా దాడి చేశారు. కళ్ల ముందే భర్తను కొడుతుంటే, ఆపేందుకు ప్రయత్నించిన భార్య ఫాతిమాపై కూడా దాడి చేసి గాయపర్చారు. ఇదంతా దగ్గర్లో ఉన్న సీసీ కెమెరాల్లో రికార్డు కావడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. తమను అన్యాయంగా కొట్టారని, నిందితులను కఠినంగా శిక్షించాలని బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

లోతుకుంటలో అగ్ని ప్రమాదం



మంటలతో దగ్ధమైన ఆరు దుకాణాలు

బొల్లారం: లోతుకుంటలో శనివారం ఉదయం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఉదయం 11 గంటల సమయంలో ఓ సైకిల్ స్టోర్‌లో మంటలు చెలరేగి, పక్కనే ఉన్న ఓ ఫార్మసీ షాపుతో పాటు మొత్తం ఆరు దుకాణాల వరకు మంటలు వ్యాపించాయి. అగ్నిమాపక సిబ్బంది ఆలస్యంగా చేరుకోవడంతో ప్రమాద తీవ్రత మరింత పెరిగింది. తిరుమలగిరి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని, స్థానికులతో కలిసి సైకిల్ షాప్ పైఅంతస్తులో ఉన్న గ్లోబల్ అకాడమీ హాస్టల్‌లో చిక్కుకున్న ఇద్దరు మహిళలను సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది తరువాత మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఎలాంటి ప్రాణనష్టం జరగక పోయినా, ఆస్తినష్టం సంభవించిందని పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై తిరుమలగిరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు.



నార్సింగి నుంచి మంచిరేవుల రోడ్డులో ప్రవహిస్తున్న నీరు



గండిపేటను సందర్శించిన జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి బృందం

జంట జలాశయాలకు వరద

- వాతావరణ శాఖ ఆరెంజ్ అలెర్ట్ జారీ
- అప్రమత్తమైన జలమండలి

సాక్షి, సిటీబ్యూరో/మణికొండ: జంట జలాశయాలకు భారీగా వరద వచ్చి చేరుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలు, నాగార్జున సాగర్ గేట్ల ఎత్తివేతతో వరద ప్రవాహం పెరిగింది. మరో వైపు వాతావరణం శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేయడంతో ముందస్తు జాగ్రత్తగా జలమండలి అప్రమత్తమైంది. జంట జలాశయాలకు చేరుతున్న నీటిని వచ్చినట్టే దిగువన మూసీలోకి వదులుతున్నారు. శనివారం జలమండలి ఎండీ అశోక్ రెడ్డి జంట జలాశయాలను అధికారులతో కలిసి సందర్శించారు. వాతావరణం శాఖ ఆరెంజ్ అలెర్ట్ జారీ చేయడంతో రెవెన్యూ, సంబంధిత అధికారులను అప్రమత్తం చేశారు. ఎప్పటికప్పుడు వరద పరిస్థితిని అంచనా వేస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

జంట జలాశయాలు ఇలా..

ఉస్మాన్ సాగర్ పూర్తి నీటి మట్టం: 1790.00 అడుగులు (3.900 టీఎంసీలు)
ప్రస్తుత మట్టం: 1789.35 అడుగులు (3.751టీఎంసీలు)
ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద : 600 క్యూసెక్కులు
దిగువకు వదులుతున్న వరద: 2652 క్యూసెక్కులు
గేట్లు ఎత్తివేత: 4 అడుగుల ఎత్తుకు 6 గేట్లు

హిమాయత్ సాగర్ పూర్తి నీటి మట్టం: 1763.50 అడుగులు (2.970 టీఎంసీలు)

ప్రస్తుత మట్టం: 1762.95 (2.780 టీఎంసీలు)
ఎగువ ప్రాంతాలనుంచి వస్తున్న వరద: 400 క్యూసెక్కులు
దిగువకు వదులుతున్న వరద : 1981 క్యూసెక్స్
గేట్లు ఎత్తివేత: 3 అడుగుల ఎత్తుకు 2 గేట్లు

మగువకే మకుటం!

ఎస్సీ మహిళకు జెడ్పీ పీఠం
- ఇరవై ఏళ్ల తర్వాత తొలిసారి దక్కనున్న అవకాశం
- 9మంది జెడ్పీటీసీలు, 9మంది ఎంపీపీలు కూడా వారే
- 94 ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాలూ కేటాయింపు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: మహిళా శక్తి మరింత బలపడుతోంది. విద్య, ఉపాధి రంగాల్లోనే కాదు రాజకీయాల్లోనూ క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. లీడర్‌షిప్‌తో పాటు ఇతర అభ్యర్థుల గెలుపోటములను సైతం నిర్ణయిస్తూ.. పురుషులకు ఏమాత్రం తీసిపోమని నిరూపిస్తున్నారు. ఈసారి స్థానిక సంస్థల రిజర్వేషన్లలోనూ అతివలకు పెద్దపీట వేశారు. దాదాపు ఇరవై ఏళ్ల తర్వాత జెడ్పీ పీఠం ఎస్సీకి రిజర్వ్ కాగా.. తొలిసారిగా మహిళా అభ్యరి (ఎస్సీ) చైర్‌పర్సన్‌గా ఆసీనులు కానున్నారు. ఇప్పటికే రిజర్వేషన్లు కూడా ఖరారయ్యాయి. ఇక జిల్లా వ్యాప్తంగా 21 జెడ్పీటీసీ స్థానాలు ఉండగా, వీటిలో తొమ్మిది సీట్లను మహిళలకు కేటాయించారు. 230 ఎంపీటీసీ స్థానాలకు గానూ 94 సీట్లను మహిళలకు కేటాయించారు. మరోవైపు తొమ్మిది ఎంపీపీ స్థానాల్లో మహిళలే కొలువుదీరనున్నారు. ఇక 526 సర్పంచ్ స్థానాలు, 4,668 వార్డులు ఉండగా.. 45 శాతం స్థానాలను మహిళలే దక్కించుకోనున్నారు. గతంతో పోలిస్తే ఈసారి వీరి సంఖ్య కొంత తగ్గినప్పటికీ.. మెజార్టీ స్థానాల్లో మహిళలే కీలకం కాబోతున్నారు. స్వయంగా పోటీలో నిలబడటంలోనే కాదు ఇతర అభ్యర్థుల గెలుపు ఓటముల్లోనే మహిళల ఓట్లే కీలకంగా మారబోతున్నాయి. మహిళలు మాత్రమే అభ్యర్థుల తలరాతలను మార్చగలరు. జిల్లా వ్యాప్తంగా 21 మండలాల పరిధిలోని 526 పంచాయతీల్లో మొత్తం 7,94,653 మంది ఓటర్లు ఉండగా, వీరిలో 3,99,404 మంది పురుషులు ఉన్నారు. ఇక మహిళలు 3,95,216 మంది ఉండగా.. ఇతరులు 33 మంది ఉన్నారు. బరిలో ఉన్న తోటి మహిళల గెలుపులోనే కాదు.. ఓటమిలోనే వీరే ఓట్లే కీలకం కాబోతున్నారు. మహిళలను ప్రసన్నం చేసుకునేందుకు ఆశావహులు ఇప్పటికే వారి ఇళ్ల చుట్టూ ప్రదక్షిణలు మొదలు పెట్టారు. పురుష నాయకులు ఇప్పుడు కొత్త వరుసలు కలుపుతున్నారు.

ప్రాణం తీసిన మూఢనమ్మకం

- చేతబడి అనుమానంతో చిన్నారిని చంపేసిన దంపతులు
- ఇరువురి అరెస్టు...రిమాండ్



సుమయ(ఫైల్)



నిందితులను రిమాండ్‌కు తరలిస్తున్న పోలీసులు

చంచల్‌గూడ: మూఢ నమ్మకమనే పెనుభూతం ఒక చిన్నారి ప్రాణం బలితీసుకుంది. అనారోగ్యంతో కన్న కూతురు చనిపోతే..అందుకు కారణం చేతబడే అని నమ్మి, అందుకు తోడు ఆస్తి వివాదం కొనసాగుతుండటంతో సోదరి కూతుర్ని చంపేశాడో కిరాతకుడు. శనివారం మాదన్నపేట పీఎస్‌లో సౌత్ ఈస్ట్ అదనపు డీసీపీ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం..చావణీలో నివాసం ఉండే మీర్ సమీ అలీ స్థానికంగా వాటర్ ప్లాంట్ నిర్వహిస్తున్నాడు. అతని భార్య యాస్మీన్ బేగం గృహిణి. కాగా సమీ కుమార్తె గతేడాది నవంబర్‌లో అనారోగ్యంతో మృతి చెందింది. దీనికి చేతబడే కారణమని సమీ అనుమానించాడు. దీనికి తోడు సమీకి సోదరి, సోదరులతో ఆస్తి వివాదం ఏర్పడింది. తన తల్లి ఆస్తిని తన పేరున రాయించుకుని సోదరి, సోదరులకు కొంత డబ్బులు ఇస్తానని సమీ హామీ ఇచ్చాడు. కానీ ఇవ్వకపోవడంతో వారంతా ఒత్తిడి చేస్తున్నారు. ఈ క్రమంలో తన కూతురు చేతబడి వల్లే మృతి చెందిందని ధృఢంగా నమ్మిన సమీ..లోలోపల తన సోదరి షబానా బేగంపై ప్రతీకారంతో రగిలిపోయాడు. గత మంగళవారం మధ్యాహ్నం షబానా బేగం తన కుమార్తె ఉమ్మేహాని సుమయ (7)తో కలిసి తల్లి ఇంటికి వచ్చింది. బాలికను వదిలేసి షాపింగ్‌కు చార్మినార్ వెళ్లింది. ఇదే అదునుగా భావించిన సమీ దంపతులు సుమయను ఆడుకుందామని నమ్మించి పిలిచి..బెడ్‌షీట్‌తో వెనక నుంచి చేతులు కట్టేసి బిల్డింగ్ మీదకు తీసుకెళ్లి బతికుండగానే వాటర్ ట్యాంక్‌లో పడేసి మూత పెట్టి వెళ్లిపోయారు. చిన్నారి కనిపించకపోవడంతో తల్లి పీఎస్‌లో ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. ఇంట్లో పరిశీలించగా వాటర్ ట్యాంక్‌లో శవమై కనిపించింది. దీంతో కుటుంబ సభ్యులను విచారించగా సమీ దంపతులు నేరాన్ని అంగీకరించారు. భార్యా భర్తలిద్దర్నీ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో సైదాబాద్ ఏసీపీ వెంకట్‌రెడ్డి, మాదన్నపేట ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు, సిబ్బంది ఉన్నారు.

పార్కింగ్ విషయంలో ఘర్షణ: 20 మందిపై కేసులు

కీసర: ఆటో పార్కింగ్ విషయంలో రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో కీసర పోలీసులు 20 మందిపై కేసు నమోదు చేశారు. కీసర సీఐ ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం ..కీసరదాయర రహదారి పక్కన..తన ఆటో పార్క్ చేసేందుకు రోడ్డుకు అడ్డంగా ఉన్న ద్విచక్ర వాహనాన్ని పక్కకు తీయాలని ఆటో డ్రైవర్ అక్కడున్న వారిని అడిగాడు. దీంతో ఇరు వర్గాల మధ్య వివాదం చోటు చేసుకుంది. పరస్పరం దాడులకు దిగారు. శనివారం పెద్దల సమక్షంలో ఇరువర్గాల వారిని పిలిచి రాజీ కుదిర్చే ప్రయత్నం చేశారు. మండల తహసీల్దార్ కార్యాలయం సమీపంలో రెచ్చిపోయిన ఇరువర్గాల వారు కత్తులు, కర్రలతో దాడి చేసుకోవడంతో ఘర్షణ వాతావరణం ఏర్పడింది. విషయం కీసర పోలీస్‌స్టేషన్ వరకు వెళ్లింది. చిన్న విషయానికి గొడవపడి ఘర్షణ వాతావరణం సృష్టించి ప్రజల శాంతికి భంగం కలిగించినందుకుగాను ఇరువర్గాలకు చెందిన సాయిప్రసాద్, నరేష్, శ్రీశైలం, మల్లేష్, వెంకటేష్, రాజు, శ్రవణ్, తేజగౌడ్, మణికాంత్, గోపి, నిఖిల్, రుద్ర, వంశీ అలాగే దండుగుల గణేష్, రవి, సోమశంకర్, నందకిషోర్, అరవింద్, జగదీశ్, దినేష్, మనోజ్‌లపై కేసునమోదు చేసి కీసర తహసీల్దార్ అశోక్‌కుమార్ ఎదుట బైండోవర్ చేశారు. ఈ కేసును కీసర పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

యువతి ఆత్మహత్య



సృష్టిత (ఫైల్)

కుషాయిగూడ: కుటుంబంలోని విభేదాలతో మనస్తాపం చెందిన ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన శనివారం చర్లపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగులోకి వచ్చింది. ఇన్‌స్పెక్టర్ సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. చర్లపల్లిలోని మధుసూదన్‌రెడ్డినగర్‌కు చెందిన బత్తుల గోపాల్, ప్రసన్న దంపతులు గత మే నెలలో విడాకులు తీసుకున్నారు. ఈ క్రమంలో వారి కుమార్తె సృష్టిత (21) తల్లి ప్రసన్నతో కలిసి మధుసూదన్‌రెడ్డి నగర్‌లో ఉంటుండగా...భర్త వేరుగా ఉంటున్నాడు. సృష్టిత డిగ్రీ చదువుతుండగా, తల్లి ప్రైవేటుగా ఉద్యోగం చేస్తుంది. శుక్రవారం ప్రసన్న రోజులానే ఉద్యోగానికి వెళ్లింది. ఆ సమయంలో కూతురు సృష్టిత ఇంట్లో ఒంటరిగా ఉంది. ఆ రోజు మధ్యాహ్నం 2:30 గంటల సమయంలో తల్లి కుమార్తెతో ఫోన్‌లో మాట్లాడింది. తిరిగి సాయంత్రం 6:30 గంటలకు మరోమారు ఫోన్ చేస్తే సృష్టిత ఫోన్ లిఫ్ట్ చేయలేదు. పలుమార్లు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయకపోవడంతో ఆందోళన చెందిన తల్లి ఇంట్లో కిరాయిదారులకు ఫోన్ చేసి కూతురు ఫోన్ లిఫ్ట్ చేయకపోవడాన్ని తెలిపి ఇంటికి వెళ్లి చూడమని కోరింది. వారు తలుపు తట్టి ప్రయత్నించినా ఎలాంటి సమాధానం రాలేదు. తలుపులు పగులగొట్టి లోనికి వెళ్లి చూడగా సృష్టిత తన గదిలో ఫ్యాన్‌కు వేలాడుతూ విగతజీవిగా కనిపించింది. దీంతో విషయాన్ని తల్లి ప్రసన్నకు తెలిపారు. తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. కాగా తల్లిదండ్రుల మధ్య ఉన్న విభేదాల వల్లే మనస్థాపం చెంది యువతి ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని భావిస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

గెలిచేవారికే టికెట్!

సర్వే ఆధారంగానే జెడ్పీటీసీ అభ్యర్థుల ఎంపిక
- ఒక్కో నియోజకవర్గం నుంచి ముగ్గురి పేర్ల సేకరణ
- ఉమ్మడిజిల్లా నేతలతో ఇన్‌చార్జ్ మంత్రి శ్రీధర్‌బాబు భేటీ
- స్థానిక ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చ

సాక్షి, రంగారెడ్డి జిల్లా: జెడ్పీటీసీ పీఠాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ చేజిక్కించుకోవాలని అధికార కాంగ్రెస్ భావిస్తోంది. ఉమ్మడి జిల్లా చరిత్రలో ఇప్పటి వరకు కాంగ్రెస్ గెలుపొందిన దాఖలాల్లేవు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉండటం, సీఎం రేవంత్‌రెడ్డి సైతం ఇదే ఉమ్మడి జిల్లాకు చెందిన వ్యక్తి కావడంతో ఈ ఎన్నికలను హస్తం పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఎలాగైనా మెజార్టీ జెడ్పీటీసీ స్థానాలతో పాటు జెడ్పీ పీఠాన్ని కైవసం చేసుకుని తీరాలని నిర్ణయించింది. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ సహా పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ ఆదేశం మేరకు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి శ్రీధర్‌బాబు శనివారం తన నివాసంలో డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, షాద్‌నగర్ ఎమ్మెల్యే కె.శంకరయ్య, తాండూరు ఎమ్మెల్యే బి.మనోహర్‌రెడ్డి, మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ కేఎల్లార్, చేవెళ్ల ఇన్‌చార్జ్ భీంభరత్, రాజేంద్రనగర్ ఇన్‌చార్జ్ నరేందర్‌తో భేటీ అయ్యారు. సంస్థాగతంగా పార్టీ బలాలు, బలహీనతలు సహా స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అంశాలపై దిశానిర్దేశం చేశారు.

భేటీకి దూరం..

రంగారెడ్డి జిల్లాలో 27 మండలాలు ఉండగా, వీటిలో సరూర్‌నగర్, బాలాపూర్, హయత్‌నగర్, గండిపేట్, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్ పూర్తిగా జీహెచ్‌ఎంసీలో విలీనమయ్యాయి. మిగిలిన 21 జెడ్పీటీసీ స్థానాలు సహా వికారాబాద్ జిల్లాలోని 20 జెడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. పార్టీ గుర్తుపై నిర్వహించే ఈ ఎలక్షన్లను అధికార కాంగ్రెస్ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. మెజార్టీ స్థానాల్లో పార్టీ అభ్యర్థులే గెలుపొందే విధంగా వ్యూహాలు రచిస్తోంది. ఇందుకోసం ఒక్కో ఎమ్మెల్యే నుంచి ముగ్గురు అభ్యర్థుల పేర్లను సేకరించింది. ఎమ్మెల్యేలు లేని చోట పార్టీ ఇన్‌చార్జ్‌ల నుంచి అభ్యర్థుల పేర్లను సేకరించింది. వీరు ప్రతిపాదించిన అభ్యర్థులపై అంతర్గత సర్వే చేయించి, ప్రజల్లో ఆదరణ ఉన్న వ్యక్తికే టికెట్ ఇవ్వాలని నిర్ణయించింది. ఇదిలా ఉండగా బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ సహా చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య కూడా అధిష్టానానికి పలువురి పేర్లను ప్రతిపాదించారు. కానీ ఈ భేటీకి మాత్రం దూరంగా ఉన్నారు. మొదటి నుంచి పార్టీ కోసం పని చేసిన గెలుపు గుర్రాలకే టికెట్ ప్రకటించనుంది.

ఆరు గ్యారంటీలే అస్త్రాలు

సంస్థాగతంగా పార్టీ కేడర్ మధ్య ఎలాంటి సమన్వయ లోపం తలెత్తకుండా చూసుకోవడంతో పాటు అన్ని స్థానాల్లోనూ గెలుపొందేలా ముందుకెళ్లాలని మంత్రి శ్రీధర్‌బాబు ఎమ్మెల్యేలకు సూచించారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, గృహాలకు 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్, రుణమాఫీ, రైతు భరోసా, 24 గంటల ఉచిత కరెంట్, రూ.500లకే గ్యాస్ సరఫరా, వంటి పథకాలే ప్రధాన ప్రచారాస్త్రాలుగా ముందుకు వెళ్లాలని మార్గనిర్దేశం చేశారు. గత ప్రభుత్వ వైఫల్యాలు, ఈ రెండేళ్లలో కాంగ్రెస్ సాధించిన అభివృద్ధి, సంక్షేమాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఇతర పార్టీల నుంచి వచ్చిన కొత్త వారికి కాకుండా ఏళ్ల తరబడి పార్టీనే నమ్ముకుని వాళ్లను బరిలోకి దింపడం ద్వారా సంస్థాగతంగా పార్టీ మరింత బలపడే అవకాశం ఉందని చెప్పినట్లు తెలిసింది.



ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నేతలతో సమావేశమైన మంత్రి శ్రీధర్‌బాబు

ధన్వంతరి ఆస్తులు విక్రయించి బాధితులకు చెల్లించాలి

- ధన్వంతరి బాధితుల ఫోరం పక్షాన కోర్టు తీర్పు
- ఫోరం కన్వీనర్ గిరిప్రసాద్ శర్మ

హిమాయత్‌నగర్: ధన్వంతరి ఫౌండేషన్ ఇంటర్నేషనల్ సంస్థపై నాంపల్లి ఎంఎస్‌జే కోర్టు ఇచ్చిన తాజా తీర్పు ప్రకారం డీఎఫ్ఐ ఆస్తులను ఈ వేలం వేసి వచ్చిన మొత్తం డబ్బును బాధితులకు చెల్లించాలని ఆదేశించినట్లు ధన్వంతరి బాధితుల ఫోరం కన్వీనర్ గిరిప్రసాద్ శర్మ తెలిపారు. బాషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సీసీఎస్ విచారణలో బాధితులు మొత్తం 4,400 మంది అని నిర్ధారణ అయ్యిందని వివరించారు. రియల్ ఎస్టేట్ అనే రంగం అసలు ధన్వంతరి ట్రస్ట్ పరిధిలో లేదన్నారు. అయినప్పటికీ నిందితుడు కమలాకర్ శర్మ తన భార్య డాక్టర్ జయశ్రీతో కలిసి కుట్రపన్ని ధన్వంతరి పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారాలు సాగించారని పేర్కొన్నారు. వారితో పాటు మరణించిన వెన్నెలగంటి సుబ్బారావు(జనరల్ సెక్రటరీ), ఖండవల్లి పద్మ(డైరెక్టర్), పీసపాటి సత్యశ్రీ, ఆకెళ్ల అనురాధతో కలిసి ముఠాగా ఏర్పడి 20 శాతం కూడా పూర్తికాని వెంచర్లను 100 శాతం పూర్తి అయ్యాయని, మోస పూరిత ప్రకటనలు ఇచ్చి, బ్రాహ్మణ కుటుంబాల ఇళ్లలోకి వెళ్లి కోట్లలో మోసం చేశారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ వేలం ద్వారా ధన్వంతరి రియల్ ఎస్టేట్ ఆస్తులను అమ్మి వచ్చిన మొత్తం డబ్బును బాధితులకు అందించాలని కోరారు. సమావేశంలో ఫోరం సభ్యులు రాధా రోహిణి, పరిమళ, సరళ దేవి, విజయలక్ష్మి, ఛాయాదేవి, వీణ, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

నిమ్స్‌కు వీల్ చైర్ల వితరణ

ఐదు వీల్‌చైర్లను అందజేసిన డాక్టర్ ఉషారాణి



నిమ్స్‌కు వీల్‌చైర్లను అందజేస్తున్న నిమ్స్ ప్రొఫెసర్ ఉషారాణి

లక్డీకాపూల్: నిజాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్)కు చెందిన ఇటీవలే ఉద్యోగ విరమణ పొందిన ఫార్మకాలజీ విభాగాధిపతి పి.ఉషారాణి ఆస్పత్రికి ఐదు వీల్‌చైర్లను విరాళంగా అందజేశారు. సోమవారం వీటిని డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్పకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ఉషారాణికి కృతజ్ఞతలు తెలిపారు. నిమ్స్‌కు వచ్చే రోగులకు ఉపయోగపడే విధంగా వీల్ చైర్లను అందించడం తనకు ఎంతో సంతోషంగా ఉందని ఆమె అన్నారు. కార్యక్రమంలో అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్.లక్ష్మీ భాస్కర్, అసిస్టెంట్ మెడికల్ సూపరింటెండెంట్ డా.చరణ్, ఆర్ఎంఓ సయ్యద్ సల్మాన్, డా.పద్మజ, పారామెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ శిరం దాస్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు శుభాకాంక్షల వెల్లువ



దసరా శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ కార్పొరేటర్ భారతీనాయక్ తదితరులు

బంజారాహిల్స్: ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ నివాసానికి శనివారం నియోజకవర్గ కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చారు. దసరా పండగను పురస్కరించుకుని కార్యకర్తలు, నేతలు ఆయనను కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. బంజారాహిల్స్ మాజీ కార్పొరేటర్ బి.భారతీనాయక్, రాములుచవాన్, బాబా నాయక్, రాజేష్‌నాయక్‌తో పాటు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లి పండగ శుభాకాంక్షలు తెలపడమే కాకుండా శాలువాతో సత్కరించారు. భారీగా తరలివచ్చిన కార్యకర్తలతో ఆయన నివాసం కిటకిటలాడింది.

గ్యార్వీ షరీఫ్ ప్రార్థనలు



అన్నదాన కార్యక్రమంలో బాబా ఫసియుద్దీన్

రహమత్‌నగర్: పవిత్ర గ్యార్వీ మాసం ప్రారంభం సందర్భంగా రహమత్‌నగర్, బోరబండ డివిజన్‌లో ముస్లింలు శనివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. బోరబండ సైట్-1 మసీద్-ఏ-గౌసియా ఆజాం వద్ద కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మైనార్టీ నాయకులు సత్తార్, ఖదీర్, సిద్దికి, ఆరీఫ్, నగర కాంగ్రెస్ నాయకుడు మహేష్ కుమార్ గౌడ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు. రహమత్‌నగర్ డివిజన్ శ్రీరాంనగర్‌లో చిల్లాలో నగర కాంగ్రెస్ నాయకురాలు కంజర్ల విజయలక్ష్మీ ప్రార్థనలు నిర్వహించారు. ముస్లిం మత పెద్దలు, కాంగ్రెస్ నాయకుడు రాజుయాదవ్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా నిమజ్జనాలు





బంజారాహిల్స్: తొమ్మిది రోజుల పాటు వివిధ ప్రాంతాల్లోని మండపాల్లో అమ్మవారికి ఘనంగా పూజలు నిర్వహించిన భక్తులు నిమజ్జనం కోసం హుస్సేన్ సాగర్‌కు తీసుకువస్తున్నారు. శనివారం పెద్ద ఎత్తున అమ్మవారి విగ్రహాల నిమజ్జనాలు జరిగినట్లు అధికారులు తెలిపారు. శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం మధ్యాహ్నం వరకు నెక్లెస్‌రోడ్డులోని పీపుల్స్ ప్లాజాతో పాటు బేబీపాండ్ ప్రాంతాల్లో సుమారు 550కిపైగా విగ్రహాలు నిమజ్జనం అయ్యాయి. అమ్మవారి విగ్రహాల నిమజ్జనాలను కేవలం నెక్లెస్ రోడ్డుకు మాత్రమే పరిమితం చేయడంతో అటు ట్యాంక్‌బండ్, ఇటు ఎన్టీఆర్ మార్గ్ వైపు రాకపోకలు సజావుగా సాగాయి. మరో వైపు పెద్ద ఎత్తున వచ్చిన అమ్మవారి విగ్రహాల వద్ద పూజా వ్యర్థాలు ఎక్కడికక్కడ పేరుకుపోవడంతో అధికారులు నిమజ్జన కార్యక్రమాలు నిర్వహిస్తూనే వ్యర్థాల తరలింపుపై కూడా దృష్టి సారించారు.



నెక్లెస్ రోడ్డులో అమ్మవారి విగ్రహాల నిమజ్జనాలు



హుస్సేన్ సాగర్ వద్ద వ్యర్థాల తొలగింపు పనులు

రాంగ్‌సైడ్ డ్రైవ్ చేస్తే కఠిన చర్యలు

- రాంగ్‌రూట్‌లో వచ్చే ప్రాంతాల్లో సీసీ కెమెరాలు
- చలాన్లతో పాటు వాహనాల సీజ్
- ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే





రాంగ్‌సైడ్ డ్రైవ్‌ను పర్యవేక్షిస్తున్న ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే

బంజారాహిల్స్: రాంగ్‌సైడ్ డ్రైవింగ్‌తో ప్రమాదాలు జరుగుతాయని, ఎట్టి పరిస్థితుల్లోనూ రాంగ్‌రూట్లో డ్రైవింగ్ చేయవద్దని, అలాంటి వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని నగర ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే హెచ్చరించారు. నంబర్ ప్లేట్ సరిగ్గా లేని, హెల్మెట్లు ధరించని, రాంగ్‌సైడ్ డ్రైవింగ్‌లపై వెస్ట్ జోన్ ట్రాఫిక్ పోలీసులు శనివారం స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్-36లోని బరోడా బ్యాంక్ చౌరస్తాలో చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌ను వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్‌తో కలిసి ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం ఏయే ప్రాంతాల్లో రాంగ్‌సైడ్ డ్రైవింగ్ చేస్తున్నారో.. సంబంధిత హాట్‌స్పాట్‌లను గుర్తించి అక్కడ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసే యోచనలో ఉన్నట్లు తెలిపారు.

◆ ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులు లేకున్నా రాంగ్‌సైడ్‌లో డ్రైవింగ్ చేస్తే సీసీ కెమెరాల్లో ఫుటేజీలు ఉంటాయని, వాటి ఆధారంగా వాహనదారులకు చలాన్లు పంపిస్తామన్నారు. ఇటీవల కాలంలో ద్విచక్ర వాహనాలే కాకుండా కొంతమంది కార్లు కూడా రాంగ్‌సైడ్‌లో డ్రైవ్ చేస్తున్నారన్నారు. నంబర్ ప్లేట్ లేకుండా తిరుగుతున్న వాహనదారులపై కొరడా ఝుళిపిస్తున్నట్లు చెప్పారు. వాహనాలు కొనుగోలు చేసిన తర్వాత కొంతమంది తమ పేరు మీద రిజిస్ట్రేషన్ చేసుకోవడం లేదని, ఇంకా కొందరు రిజిస్ట్రేషన్ నంబర్ వచ్చినా తాత్కాలిక నంబర్లతో తిరుగుతున్నారని, వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదన్నారు. అలాంటి వాహనాలను సీజ్ చేయడమే కాకుండా ఎఫ్ఐఆర్‌లు కూడా నమోదు చేయిస్తున్నామన్నారు.

◆ కొంతమంది నంబర్ ప్లేట్లు ఉన్నా ట్రాఫిక్ పోలీసులు, కెమెరాలకు చిక్కకూడదనే ఉద్దేశ్యంతో వాటిపై స్టిక్కర్లు అంటించడం, రంగులు పూయడం చేస్తున్నారని వెల్లడించారు. నంబర్ ప్లేట్ లేకుండా తిరుగుతున్న వాహనాలు చోరీకి గురైనవో, చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడుతున్నవో కావొచ్చని, వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ట్రాఫిక్ రూల్స్ పాటించకుండా తిరుగుతున్న వాహనదారులపై ప్రతిరోజూ ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వారిని పట్టుకుంటామన్నారు. చలాన్లతో పాటు అవసరమైతే వాహనాలు సీజ్ చేస్తామన్నారు.

శుభాకాంక్షలు



బంజారాహిల్స్: నగర పోలీసు కమిషనర్ సజ్జనార్‌ను వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరి ప్రసాద్‌తో పాటు బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఎస్సార్‌నగర్, పంజగుట్ట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు, అడిషనల్ ఇన్‌స్పెక్టర్లు మర్యాదపూర్వకంగా కలిశారు. కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

108 అడుగుల ఏకశిలా హనుమాన్ విగ్రహం ఏర్పాటు



సీఎంకు విగ్రహం గురించి వివరిస్తున్న రాహుల్‌దాస్ బాబా

లంగర్‌హౌస్: రాంలీలా మైదానంలో 108 అడుగుల ఏకశిలా ఆంజనేయ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నామని, ఇందుకు సహకరించాలంటూ సీఎం రేవంత్‌రెడ్డిని సంగం పీఠాధిపతి 1008 రాహుల్‌దాస్ బాబా కోరారు. సీఎం రేవంత్‌రెడ్డిని పరిగి ఎమ్మెల్యే రాంమోహన్ రెడ్డితో పాటు రాహుల్‌దాస్ బాబా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 400 ఏళ్ల చరిత్ర ఉన్న త్రివేణి సంగం ఆలయం ప్రాముఖ్యత, ఇక్కడ చనిపోయిన వారి అస్థికల నిమజ్జనం ప్రాముఖ్యతను ముఖ్యమంత్రికి తెలియజేశామన్నారు. ప్రస్తుతం తమ ఆలయం 4 ఎకరాలలో నల్లరాతి ఏకశిలా హనుమాన్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్న విషయాన్ని సీఎంకు వివరించామన్నారు. దీనికి సీఎం సుముఖత వ్యక్తం చేసి మరోసారి తనను కార్యాలయంలో కలవాలని చెప్పారన్నారు.

పూల సోయగం



ఐమ్యాక్స్ చౌరస్తాలోని ఇందిరా గాంధీ విగ్రహం చౌరస్తాలో పూల గార్డెన్

బంజారాహిల్స్: ప్రతి మూడు, నాలుగు నెలలకో సారి హెచ్ఎండీఏ అధికారులు పలు కూడళ్లలో ఆహ్లాదకరమైన వాతావరణం కోసం రంగురంగుల పూలమొక్కలు నాటుతున్నారు. ఇందులో భాగంగా ఖైరతాబాద్‌లోని ఐమ్యాక్స్ చౌరస్తాలోని ఇందిరాగాంధీ విగ్రహం చుట్టూ పూల మొక్కలను ఏర్పాటు చేశారు. విరివిగా పూలు పూయడంతో వాహనదారులతో పాటు ఎన్టీఆర్ మార్గ్, నెక్లెస్ రోడ్డుకు వచ్చే సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. పలువురు ఈ గార్డెన్ వద్దకు వచ్చి సెల్ఫీలు తీసుకుంటూ సరదాగా గడుపుతున్నారు.



యువకుడిపై రెండు కేసులు

- పోలీసులను దూషించినందుకు ఒకటి..
- మద్యం మత్తులో ప్రహరీని ఢీకొట్టినందుకు మరొకటి..

బంజారాహిల్స్: మద్యం మత్తులో కారు నడుపుతూ అదుపు తప్పి ఓ ఇంటిని ఢీకొట్టడమే కాకుండా స్టేషన్‌కు తీసుకువచ్చిన తర్వాత పోలీసులతో అసభ్యంగా ప్రవర్తించిన యువకుడిని జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళ్తే.. అమీన్‌పూర్‌కు చెందిన పెద్దింటి సందీప్‌రెడ్డి(33) తెల్లవారుజామున 5.30 గంటల ప్రాంతంలో తన కారులో మద్యం తాగి అదుపు తప్పిన వేగంతో ప్రశాసన్‌నగర్‌లో దూసుకెళ్తుండగా కారు అదుపుతప్పి ఓ రిటైర్డ్ అధికారి ఇంటిని ఢీకొట్టాడు. కారు ముందుభాగం నుజ్జునుజ్జు కాగా, ఇంటి ప్రహరీతో పాటు మొక్కలు ధ్వంసమయ్యాయి. బాధితుడు సాయికుమార్ ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు సందీప్‌రెడ్డిని స్టేషన్‌కు తీసుకువచ్చి డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించగా పీకలదాకా మద్యం తాగినట్లు తేలింది. మద్యం మత్తులో పోలీసులపై దురుసుగా ప్రవర్తించడమే కాకుండా అసభ్య పదజాలంతో దూషించాడు. దీంతో ఇంటి ప్రహరీని ఢీకొట్టిన కేసుతో పాటు పోలీసులను దూషించినందుకు మరో కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధే మంత్రంగా కాంగ్రెస్ పాలన



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

శ్రీనగర్‌కాలనీ: కాంగ్రెస్ ప్రజాపాలనలో సంక్షేమం, అభివృద్ధి జోడెద్దుల మాదిరి దూసుకెళ్తున్నాయని, ఆదర్శ తెలంగాణ కోసం కృషి చేస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఎర్రగడ్డ డివిజన్‌లో రూ.2.16 కోట్లతో నటరాజ్‌నగర్, శంకర్‌లాల్‌నగర్, ఛత్రపతి శివాజీనగర్ వద్ద సీసీ రోడ్లు, నటరాజ్ నగర్, బంజారానగర్ కమ్యూనిటీహాల్‌ల పునరుద్ధరణ, రూ.53 లక్షలతో నీటి సరఫరా లైన్లు, సంజయ్‌నగర్, సుల్తాన్‌నగర్, ఫాతిమానగర్ వద్ద మురుగు నీటి లైన్ల భర్తీకి శంకుస్థాపన చేశారు. తాగునీరు, శానిటేషన్ ఇబ్బందులు లేకుండా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, అభివృద్ధే మంత్రంగా కాంగ్రెస్ పాలన సాగుతోందన్నారు. కంటోన్మెంట్ మాదిరిగా జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. ప్రజలు అభివృద్ధి కోరుకుంటున్నారని, ఇక్కడ సానుభూతి పని చేయదని చెప్పారు. జూబ్లీహిల్స్‌లో వేలాది మందికి రేషన్‌కార్డులు, ఉచిత విద్యుత్, రూ.500లకే గ్యాస్, డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు, మహిళలకు ప్రత్యేక పథకాలను అందిస్తున్నామని, సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాసంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. ఎమ్మెల్సీలు మీర్జా రహమత్‌బేగ్ ఖాద్రీ, కౌసర్ మొయినుద్దీన్, డిప్యూటీ మేయర్ శ్రీలతరెడ్డి, కార్పొరేషన్ చైర్మన్లు ఇనగాల వెంకట్రామిరెడ్డి, గుత్తా అమిత్‌రెడ్డి, నాయకులు నవీన్‌యాదవ్, అజారుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ

కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తోందని, మహిళా శక్తి, మహిళా సాధికారత కోసం ప్రత్యేక పథకాలను అందిస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం యూసుఫ్‌గూడ డివిజన్ మహమూద్ ఫంక్షన్ హాల్‌లో ఇందిరమ్మ మహిళా శక్తి పథకం కింద కుట్టు మిషన్లను ఆయన మైనార్టీ నేతలతో కలిసి మహిళలకు పంపిణీ చేశారు.

ప్రిన్సిపాల్ శ్రావణికి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం

అబిడ్స్: ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎస్ఎస్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రిన్సిపాల్ కె.శ్రావణిను తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం-2025కు ఎంపిక చేసినట్లు ఆ కౌన్సిల్ అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ్ ముదిరాజ్ వెల్లడించారు. ప్రతి సంవత్సరం ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ముగ్గురు ఉపాధ్యాయులకు ఉత్తమ పురస్కారాలు అందజేసి ఘనంగా సత్కరిస్తామన్నారు. ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున చేపడుతామన్నారు. శ్రావణితో పాటు ప్రొఫెసర్ డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి, సూపర్ గ్రామర్ హైస్కూల్ కరస్పాండెంట్ ముబాషీర్ మొయినుద్దీన్‌కు ఉత్తమ అవార్డులను అందజేసి సన్మానం చేస్తామన్నారు.

జూబ్లీహిల్స్‌లో బీజేపీ గెలుపు ఖాయం

శ్రీనగర్‌కాలనీ: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీజేపీదే గెలుపని, ప్రధాని నరేంద్ర మోదీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు, దేశ ప్రగతిని చూపి ప్రజలు బీజేపీ వైపే ఉన్నారని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ రాజ్యసభ సభ్యుడు గరికపాటి రామ్మోహన్‌రావు అన్నారు. ఎర్రగడ్డ డివిజన్‌లోని పలు బస్తీల్లో బీజేపీ చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ శనివారం ప్రచారం నిర్వహించారు. జీఎస్టీ తగ్గించడం వల్ల మధ్య తరగతి ప్రజానీకం, వ్యాపార సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయని పేర్కొన్నారు. జీఎస్టీ తగ్గడం వల్ల వచ్చిన మార్పులను వివరిస్తూ స్టిక్కర్లను అతికించారు. కార్యక్రమంలో సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి, ఎర్రబల్లి ప్రదీప్‌రావు, ఆరూరి రమేష్, డివిజన్ అధ్యక్షుడు విజయ్‌కుమార్, శ్రీనివాసులు రెడ్డి, రాజేష్ పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎంపీ గరికపాటి రామ్మోహన్‌రావు

పడకేసిన పారిశుద్ధ్యం

- క్షేత్రస్థాయిలో పర్యటించని అధికారులు
- నిత్యం శుభ్రం చేయకపోవడంతో పేరుకుపోతున్న చెత్త
- సీఎం నివసించే సర్కిల్‌లోనే దుస్థితి



ఫిలింనగర్ రోడ్డు నంబర్-3లో..

బంజారాహిల్స్: నిత్యం చెత్తా చెదారాన్ని తొలగించి రహదారులను శుభ్రం చేయాల్సిన జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య విభాగం అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టడంలో పూర్తిగా విఫలమవుతున్నారు. రోజూ మూడుసార్లు రోడ్ల పక్కన చెత్త, డంపర్ బిన్ల నుంచి వ్యర్థాలను తొలగించాల్సిన సిబ్బంది జాడ లేకుండాపోయింది. ఫలితంగా ఎక్కడికక్కడ రోడ్ల పక్కన చెత్త కుప్పలు, డంపర్ బిన్ల వ్యర్థాలు కుప్పలుగా పేరుకుపోయి పారిశుద్ధ్య సమస్య తీవ్రంగా మారుతోంది. సీఎం రేవంత్‌రెడ్డి నివాసం ఉండే జూబ్లీహిల్స్ సర్కిల్-18లోనే ఈ దుస్థితి నెలకొంది. ముఖ్యమంత్రి రాకపోకలు సాగించే రహదారుల పక్కన కూడా కుప్పలుగా చెత్త పేరుకుపోయి జీహెచ్ఎంసీ పనితీరుకు అద్దంపడుతోంది. జీహెచ్ఎంసీ సర్కిల్-18 పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, షేక్‌పేట డివిజన్ల పరిధిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కొండా సురేఖతో పాటు ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఉంటారు. ఇంతటి కీలకమైన సర్కిల్‌కు మొన్నటివరకు ఇన్‌ఛార్జి ఏఎంఓహెచ్ ఉండగా ఆయనపై నిర్లక్ష్యపు ఆరోపణలు రావడం, ఆయన హయాంలో అవినీతి, అక్రమాలు పెరిగిపోవడంతో ఎస్ఎఫ్ఏలు ఇష్టారాజ్యంగా ప్రవర్తించడంతో బదిలీ చేసి మరొకరిని నియమించారు.

◆ జూబ్లీహిల్స్ సర్కిల్-18కు కొత్తగా వచ్చిన ఏఎంఓహెచ్ సైతం క్షేత్రస్థాయిలో పర్యటించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో ఆయన కింద పనిచేసే ఎస్ఎఫ్ఏలు, పారిశుద్ధ్య కార్మికులు, మెక్లిన్ సంస్థ సిబ్బంది, చెత్తను తొలగించాల్సిన వాహన సిబ్బంది ఏమాత్రం పనిచేయడం లేదని, నిర్లక్ష్యం రాజ్యమేలుతోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

◆ ఫిలింనగర్ రోడ్డు నంబర్-3లో నటుడు మురళీమోహన్ ఇంటి ముందు నాలుగు రోజులుగా చెత్త కుప్పలు పేరుకుపోయాయి. తొలగించాలని స్థానికులు ఎన్నిమార్లు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదు. బంజారాహిల్స్ రోడ్డు నంబర్-14లోని స్టడీ సెంటర్ పక్క సందులో రోడ్డుపై చెత్త పేరుకుపోయింది. కేబీఆర్ పార్కు చుట్టూ చెత్త సంచులు నిండిపోయి వ్యర్థాల కవర్లు రోడ్లపైకి కొట్టుకువస్తున్నాయి. ఇక మధ్యాహ్నం, రాత్రి ఓ ప్రైవేటు సంస్థ వాహనాల ద్వారా డంపర్ బిన్ల నుంచి చెత్తను తొలగించాల్సి ఉంటుంది. అయితే కొద్ది రోజులుగా వాహనాలు సక్రమంగా రావడం లేదని ఎస్ఎఫ్ఏలు ఆరోపిస్తున్నారు.

◆ ఇటీవల చెత్తను తొలగించకపోవడంతో ఓ ప్రైవేటు సంస్థకు జీహెచ్ఎంసీ సర్కిల్-18 డీసీ సమ్మయ్య రూ.లక్ష జరిమానా విధించారు. అయినా మార్పు కనిపించడం లేదు. ఫిలింనగర్ బస్తీలు, కాలనీల్లో రహదారులకు రెండు వైపులా వ్యర్థాలు గుట్టలుగా పేరుకుపోయాయి. బడా హోటళ్లు, వాణిజ్య సముదాయాలు, డబ్బులు ఇచ్చేవారి నుంచే రోజూ స్వచ్ఛ ఆటోలు చెత్తను తీసుకెళ్తున్నాయని ఫిర్యాదులు అందుతున్నాయి.

◆ స్వచ్ఛ ఆటోలపై కూడా సంబంధిత అధికారులు నియంత్రణ కోల్పోయారు. తూతూమంత్రంగా పర్యటించడం, వెళ్లడం ఓ తంతుగా మారింది. ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ సైతం తెల్లవారుజామున చెత్త సమస్యపై క్షేత్రస్థాయిలో పర్యటించాల్సి ఉండగా ఆయన ఎక్కడా కనిపించడం లేదు.

ఫీవర్.. ఫీవర్

- వాతావరణ మార్పులతో ఇంటింటా జ్వరాలు
- ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులకు రోగుల తాకిడి

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో సీజనల్ వ్యాధులు పంజా విసురుతున్నాయి. విషజ్వరాలతో జనం విలవిలలాడుతున్నారు. పిల్లలు, పెద్దలనే తేడా లేకుండా అందరూ మంచం పట్టారు. బస్తీ దవాఖానా నుంచి సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి వరకు అన్నీ రోగులతో కిటకిటలాడుతున్నాయి. విషజ్వరాలు, జలుబు, దగ్గు, ఒళ్లునొప్పులు, శ్వాసకోశ వ్యాధులు, న్యుమోనియా లక్షణాలతో బాధితులు ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు. దీంతో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల ఓపీ కిటకిటలాడుతోంది. ఇటీవల కాలంలో ఎడతెరిపి లేని వర్షాలు, వాతావరణ మార్పులు ఈ పరిస్థితులకు కారణాలని వైద్యులు పేర్కొంటున్నారు. నల్లకుంట ఫీవర్ ఆసుపత్రి, గాంధీ, ఉస్మానియా, నిమ్స్, నిలోఫర్ వంటి ప్రధాన ఆసుపత్రుల్లో సాధారణ రోజులతో పోల్చితే ఓపీ గణనీయంగా పెరిగింది. ఉస్మానియాలో గత నెల ఓపీ 60 వేలు దాటిపోయింది. సెలవు రోజులు మినహాయిస్తే నెల రోజుల నుంచి సరాసరిన 2,500 వరకు ఓపీ నమోదవుతోంది. నల్లకుంట ఫీవర్ ఆసుపత్రి ఓపీ సాధారణ రోజుల్లో నెలకు సుమారుగా 10 వేల వరకు ఉండేది. ఈ సీజన్‌లో ఆ సంఖ్య 18 వేల వరకు పెరిగింది. గాంధీ ఆసుపత్రి ఓపీ రోజుకు సుమారు 2,450 ఉంటోంది. గతంతో పోల్చితే ఇది 800 వరకు రోగులు అధికంగా వస్తున్నారు. నిమ్స్‌లోనూ రోజూ 3,500 నుంచి 4 వేల మంది రోగులు ఓపీకి వస్తున్నారు. ఇక బస్తీ దవాఖానాల్లోనూ జ్వర బాధితుల తాకిడి కనిపిస్తోంది.

ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్‌లో సాంకేతిక సమస్య

విమానంలో పంజాబ్ గవర్నర్ గులాబ్‌చంద్ కటారియా

శంషాబాద్: హైదరాబాద్ నుంచి బెంగళూరుకు బయలుదేరాల్సిన ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానంలో సాంకేతిక సమస్య తలెత్తింది. దీంతో మరో విమానాన్ని ఏర్పాటు చేసి ప్రయాణికులను గమ్యస్థానానికి పంపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఐఎక్స్ 1072 విమానం శనివారం సాయంత్రం 4.50 గంటలకు బయలుదేరాల్సి ఉండగా టేకాఫ్‌కు ముందు అందులో సాంకేతిక సమస్య తలెత్తింది. వెంటనే అధికారులు గుర్తించి దానిని నిలిపివేశారు. ఇందులో పంజాబ్ గవర్నర్ గులాబ్‌చంద్ కటారియాతోపాటు మరికొందరు వీఐపీలు, సాధారణ ప్రయాణికులున్నారు. దీంతో ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ అధికారులు అదే నంబరుతో ప్రత్యామ్నాయంగా మరో ఎయిర్‌క్రాఫ్ట్‌ను సిద్ధం చేశారు. ప్రత్యామ్నాయ విమానం శంషాబాద్ విమానాశ్రయంలో నుంచి సాయంత్రం 6.15 గంటలకు టేకాఫ్ తీసుకుని బయలుదేరింది.

బీజేపీ అభ్యర్థి ఎంపికకు త్రిసభ్య కమిటీ!

జూబ్లీహిల్స్ ఉపఎన్నికకు కసరత్తు

సాక్షి, సిటీబ్యూరో: జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికలో బలమైన అభ్యర్థిని బరిలో దింపేందుకు భారతీయ జనతాపార్టీ కసరత్తు మొదలుపెట్టింది. ఇప్పటికే బీఆర్ఎస్ తన అభ్యర్థిని ప్రకటించగా కాంగ్రెస్ పార్టీ కూడా అభ్యర్థుల జాబితా వడపోతను ప్రారంభించింది. ఈ నేపథ్యంలోనే బీజేపీ కూడా సాధ్యమైనంత త్వరగా అభ్యర్థిని ఖరారు చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీని ప్రకటించింది. ఈ కమిటీ అభ్యర్థుల జాబితాను పరిశీలించి తుది జాబితాను హైకమాండ్‌కు నివేదించింది. ఈ త్రిసభ్య కమిటీలో మాజీ ఎమ్మెల్యే ఎం.ధర్మారావు, మాజీ ఎంపీ పోతుగంటి రాములు, సీనియర్ నేత, న్యాయవాది కోమల ఆంజనేయులు సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీ వచ్చే వారాంతంలోగా అభ్యర్థుల తుది జాబితాను ఎంపిక చేసే అవకాశముంది.

నగరంలో నేడు

- ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో సాయంత్రం 5 గంటలకు మనుజ్యోతి ఆశ్రమం ఆధ్వర్యంలో అమృత మంజరి పుస్తకావిష్కరణ కార్యక్రమం జరుగుతుంది.
- బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్క్ ఎంట్రన్స్ వద్ద మాదకద్రవ్య దుర్వినియోగాన్ని ఆపండి అన్న నినాదంతో అపోలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉదయం 6.45 గంటలకు రన్ కార్యక్రమం జరుగుతుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో శివోహం పేరిట కళాకారిణి శిల్పా కాసు వేసిన చిత్రాల ప్రదర్శన ఉదయం 10.30గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో ఏర్పాటు చేసిన హస్తకళా మ్యూజియం ఉదయం 10.30గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- గడ్డం వెంకటస్వామి(కాకా) 96 జయంతి ఉత్సవాలు ఉదయం 10 గంటలకు రవీంద్రభారతిలో జరుగుతాయి.


గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.comకు మెయిల్ చేయగలరు.

రన్ వే.. రాబడికి హైవే!

ఏటేటా పెరుగుతున్న వైమానికేతర ఆదాయం

బిగ్ స్టోరీ





రన్ వే.. విమానాలు రయ్‌మంటూ ఆకాశంలోకి దూసుకెళ్లేందుకు మాత్రమే కాదు, ఆదాయానికి హైవేలుగా మారాయి. విమానాశ్రయాలు ప్రయాణికులు, సరుకుల రవాణాతోపాటు పట్టణీకరణ, ప్రాంతీయ అభివృద్ధి, ఆర్థికాభివృద్ధికి చోదకశక్తిగా మారాయి. ప్రయాణికుల సంఖ్య విపరీతంగా పెరగడం, కొత్త భౌగోళిక ప్రాంతాలకు కనెక్టివిటీ విస్తరిస్తుండటంతో వైమానికేతర ఆదాయం పెరుగుతోంది. రియల్ ఎస్టేట్, పరిశ్రమ, ఆతిథ్యం, లాజిస్టిక్స్, పర్యాటకం, కమ్యూనిటీ మౌలిక సదుపాయాల అభివృద్ధికి అవకాశాలను తెరుస్తున్నాయని నైట్‌ఫ్రాంక్ ఇండియా, నరెడ్కో సంయుక్త నివేదిక వెల్లడించింది.

–సాక్షి, సిటీబ్యూరో



కార్గో కూడా రయ్..

దేశీయ ఎయిర్ కార్గో రంగం కూడా క్రమంగా అభివృద్ధి చెందింది. అయితే ప్రయాణికుల రద్దీతో పోలిస్తే చాలా తక్కువే. 2012–25 మధ్య ఎయిర్ కార్గో ఏటేటా 3.84 శాతం మేర వృద్ధి చెందుతూ వచ్చింది. దేశీయ కార్గో 4.24 శాతం, అంతర్జాతీయ కార్గో 3.6 శాతం మేర పెరిగాయి. హైదరాబాద్ విమానాశ్రయం 2024లో 1,80,914 మెట్రిక్ టన్నుల సరుకు రవాణా సేవలను అందించింది. అంతకుముందు ఏడాదితో పోలిస్తే ఇది 22 శాతం ఎక్కువ. మొత్తం సరుకు విలువలో 72 శాతం మేర ఔషధాల వాటానే. ఇక్కడి నుంచి ప్రధానంగా అమెరికా, యూరప్ దేశాలకు ఫార్మా ఉత్పత్తులు ఎగుమతి అవుతుంటాయి. దీంతోపాటు ప్రాట్ అండ్ విట్నీ, సఫ్రాన్, టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ వంటి ఏరో స్పేస్, రక్షణ రంగ సంస్థల ఉత్పత్తులు కూడా ఎగుమతి అవుతుంటాయి.

- డ్యూటీ ఫ్రీ ఉత్పత్తులు, రిటైల్ స్టోర్లు, కార్గో సేవలతో పెరుగుదల
- దేశంలో వైమానికేతర ఆదాయం రూ.8,400 కోట్లు
- శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ ఆదాయంలో దీని వాటా 33 శాతం
- హైదరాబాద్‌లో తలసరి వైమానికేతర ఆదాయం రూ.745

విమానాల రాకపోకలతో నేరుగా సంబంధం లేకుండా విమానాశ్రయ కార్యకలాపాల నుంచి వచ్చే ఆదాయాన్ని నాన్–ఏరోనాటికల్ (వైమానికేతర) ఆదాయంగా పరిగణిస్తారు. వాణిజ్య రియల్ ఎస్టేట్, రిటైల్ రాయితీలు, ఫుడ్ అండ్ బేవరేజెస్ ఔట్‌లెట్లు, ప్రకటనలు, కార్ పార్కింగ్, కార్గో, లాజిస్టిక్ హబ్‌లు, హాస్పిటాలిటీ సేవలు విమానాశ్రయాలను వాణిజ్య కేంద్రాలుగా కూడా మారుస్తున్నాయి. ప్రయాణికుల రద్దీ, కనెక్టివిటీల ప్రయోజనాలను పెంచడంతోపాటు ఉపాధిని అందించే, పెట్టుబడులను ఆకర్షించే, స్థానిక జీడీపీ వృద్ధిని సాధించే నిరంతర ఆర్థిక మండలాలుగా అభివృద్ధి చెందుతున్నాయి. 2025 ఆర్థిక సంవత్సరంలో దేశంలోని విమానాశ్రయాలలో వైమానికేతర ఆదాయం 8,400 కోట్లు. ఇందులో పీపీపీ విధానంలోని విమానాశ్రయాల వాటా 86.80 శాతం కాగా.. ఏఏఐ ఆధీనంలోని విమానాశ్రయాల వాటా 13.20 శాతం. పీపీపీ ఎయిర్‌పోర్టులు ప్రజా రవాణాతోపాటు వాణిజ్య కార్యకలాపాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వడమే ఈ వృద్ధికి కారణం. ఏఏఐ విమానాశ్రయాలు ప్రాంతీయ కనెక్టివిటీకి అధిక ప్రాధాన్యత ఇస్తుంటాయి.

41.2 కోట్ల మంది ప్రయాణికులు..

దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న విమానయాన రంగం శరవేగంగా విస్తరిస్తోంది. వార్షిక ప్రయాణికుల రద్దీ 2015లో 19 కోట్ల నుంచి 2025 నాటికి 41.2 కోట్లకు పెరిగింది. ఇందులో దేశీయ ప్రయాణికుల సంఖ్య 33.5 కోట్లు కాగా, అంతర్జాతీయ ప్రయాణికుల సంఖ్య 7.7 కోట్లు. ఏటా ప్రయాణికుల రద్దీ 8 శాతం మేర వృద్ధి రేటుతో 2030 నాటికి వార్షిక ప్రయాణికుల రద్దీ 60 కోట్లకు చేరుతుందని అంచనా. ప్రాంతీయ కనెక్టివిటీ పెరగడం, మధ్య తరగతి ఆదాయ వృద్ధి, పట్టణీకరణ ఇందుకు ప్రధాన కారణాలు.

ఢిల్లీ, ముంబై ఎయిర్‌పోర్టులలో..

మన దేశంలో ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయం (డీఐఏఎల్), ముంబై అంతర్జాతీయ విమానాశ్రయం(ఎంఐఏఎల్) వంటివి వైమానికేతర విభాగాల నుంచి గరిష్ట ఆదాయాన్ని ఆర్జిస్తున్నాయి. దేశంలో అతిపెద్ద విమానాశ్రయమైన డీఐఏఎల్ వైమానికేతర ఆదాయం 2020 ఆర్థిక సంవత్సరంలో రూ.2,205 కోట్లు కాగా.. 2025 నాటికి 50 శాతం వృద్ధి రేటుతో రూ.3,300 కోట్లకు చేరింది. ఈ ఆదాయంలో 22 శాతం డ్యూటీ ఫ్రీ ఉత్పత్తుల నుంచి వస్తుండగా, 18.1 శాతం స్థలం అద్దెలు, 13.6 శాతం కార్గో, 10 శాతం ఫుడ్ అండ్ బేవరేజెస్ నుంచి వస్తున్నాయి. 2025 నాటికి డీఐఏఎల్ ప్రయాణికుల సంఖ్య 7.93 కోట్లకు చేరుకుంది.

దేశంలో రెండో అతిపెద్ద విమానాశ్రయం ఎంఐఏఎల్. దీని నాన్ ఏరో ఆదాయం ఏటా 21 శాతం వృద్ధి చెందుతోంది. 2023లో రూ.2 వేల కోట్లు కాగా, 2024 నాటికి రూ.2,430 కోట్లకు పెరిగింది. 2024లో 5.28 కోట్ల ప్రయాణికులకు చేరుకుంది.

దక్షిణాదిలో హైదరాబాద్ టాప్..

హైదరాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం మొత్తం ఆదాయంలో వైమానికేతర విభాగం వాటా 33 శాతంగా ఉంది. బెంగళూరులోని కెంపెగౌడ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ (బీఐఏఎల్) వైమానికేతర ఆదాయం 2023లో రూ.801 కోట్లు కాగా.. 2025 నాటికి 1,029 కోట్లకు పెరిగింది. రెండేళ్లలో 28 శాతం వృద్ధిని నమోదు చేసింది. ప్రపంచంలోని విమానాశ్రయాల్లో ఒక్కో ప్రయాణికుడిపై వచ్చే వైమానికేతర ఆదాయంలో హైదరాబాద్ 8వ స్థానంలో ఉంది. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో తలసరి వైమానికేతర ఆదాయం రూ.746గా ఉంది. దక్షిణాది నగరాలతో పోలిస్తే మన దగ్గరే అత్యధికం. మన దేశంలో అత్యధికంగా ముంబై ఎయిర్‌పోర్ట్‌లో తలసరి వైమానికేతర ఆదాయం రూ.1,785. ఆ తర్వాత ఢిల్లీలో రూ.1,607గా ఉంది. పుణేలో రూ.417, కోల్‌కతాలో రూ.302, అహ్మదాబాద్‌లో రూ.204గా ఉంది. డ్యూటీ ఫ్రీ, రిటైల్, ఫుడ్ అండ్ బేవరేజెస్ మీద ఎక్కువగా వెచ్చిస్తున్నారు.

ఏరో సిటీలతో వృద్ధి..

విమానాశ్రయాలకు వృద్ధి ఇంజిన్లు ఎయిర్‌పోర్ట్ సిటీ (ఏరో సిటీ)లు. ఇవి విమానాశ్రయ ఆవరణలో లేదా దానికి ఆనుకొని ఉన్న స్వయం సమృద్ధి గల వాణిజ్య, ఆతిథ్య కేంద్రాలు. ఇందులో హోటళ్లు, కన్వెన్షన్ సెంటర్లు, రిటైల్ కాంప్లెక్స్‌లు, కార్యాలయ స్థలాలు, వినోద సౌకర్యాలుంటాయి. ఇవి విమాన ప్రయాణికులకు, స్థానికులకు సేవలందిస్తాయి. రాజీవ్‌గాంధీ విమానాశ్రయానికి ఆనుకొని దాదాపు 1,500 ఎకరాల్లో జీఎంఆర్ ఏరోసిటీ విస్తరించి ఉంది. పారిశ్రామిక, వాణిజ్య, ఆతిథ్య, ఆరోగ్య సంరక్షణ, విద్య, రిటైల్, వినోద కేంద్రాలను సమగ్రపరిచే మాస్టర్ ప్లాన్డ్ ఎయిర్‌పోర్ట్ సిటీ ఇది. ఇందులో జీఎంఆర్ ఏరోస్పేస్ అండ్ ఇండస్ట్రియల్ పార్క్ ప్రధాన పారిశ్రామిక ప్రాంతం ఉంది. దీనిలో 200 ఎకరాలకుపైగా సెజ్, 77 ఎకరాల డొమెస్టిక్ టారిఫ్ ఏరియా ఉంది. ఇందులో 10 లక్షల చ.అ.కు పైగా గ్రేడ్–ఏ ఆఫీస్ టవర్లు లీజుకు ఉన్నాయి. ఇది రిటైల్, ఫుడ్, ఇతర ప్రజా అవసరాలతో అనుసంధానమై ఉంది. ఔటర్ రింగ్ రోడ్డు, పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ వే, ప్రతిపాదిత మెట్రో కారిడార్‌లతో ఇది అనుసంధానమై ఉండటంతో ఈ ఏరోసిటీ అధిక విలువ కలిగిన రియల్ ఎస్టేట్ హాట్‌స్పాట్‌గా అభివృద్ధి చెందింది.

విమానాశ్రయంతో స్థిరాస్తి ధరల జోరు..

కొన్ని దశాబ్దాలుగా విమానాశ్రయాలు ప్రయాణికుల, సరకుల రవాణా కేంద్రాల నుంచి పట్టణీకరణ, ప్రాంతీయ అభివృద్ధి, పెట్టుబడులను ఆకర్షించే శక్తివంతమైన ఆర్థిక ఉత్ప్రేరకాలుగా మారాయి. ఆధునిక విమానాశ్రయాలను ప్రధాన విమానయాన సేవలతోపాటు ఇంటిగ్రేటెడ్ వ్యాపార పర్యావరణ వ్యవస్థలు, గృహ రిటైల్ హబ్‌లు, ఆతిథ్య కేంద్రాలు, కాన్ఫరెన్స్ సెంటర్లు, వాణిజ్య రియల్ ఎస్టేట్‌లను లక్ష్యంగా చేసుకొని అభివృద్ధి చేస్తున్నారు. విమానాశ్రయంతో స్థానికంగా స్థిరాస్తి రంగం శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. ఎయిర్‌పోర్ట్ నుంచి 5–10 కి.మీ. దూరంలోని నివాస సముదాయాల ధరలు 110–120 శాతం వృద్ధి చెందితే, 0–5 కి.మీ. లోపు ఉన్న ప్రాపర్టీ ధరలు 150–170 శాతం, 10 కి.మీ. కంటే ఎక్కువ దూరంలోని స్థిరాస్తుల ధరలు 70–90 శాతం మేర పెరిగే అవకాశముందని అంచనా.




159 ఎయిర్‌పోర్టులు..

విమానాశ్రయాలు ప్రాంతీయాభివృద్ధికి శాశ్వత గ్రోత్ ఇంజిన్లు. ఇవి కేవలం రవాణా కేంద్రాలు కాదు, అంతకుమించి ఆదాయ వనరులు కూడా. మన దేశంలో 2014లో 74 విమానాశ్రయాలు ఉండగా, 2025 నాటికి వాటి సంఖ్య 159కి పెరిగాయి. భారత్ ప్రపంచంలోనే మూడో అతిపెద్ద దేశీయ విమానయాన మార్కెట్‌గా అవతరించింది. ఇందులో 14 విమానాశ్రయాలు పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్(పీపీపీ) కింద ఉండగా, మిగిలినవి ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) ఆధీనంలో ఉన్నాయి. 2047 నాటికి వాటి సంఖ్యను సుమారు 300 చేయాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది.

ప్రపంచంలోని టాప్-7 వైమానికేతర ఆదాయం ఆర్జిస్తున్న విమానాశ్రయాలు

విమానాశ్రయం	వైమానికేతర ఆదాయం (శాతంలో)
దుబాయ్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ (యూఏఈ)	53
దల్లాస్ ఫోర్ట్‌వర్త్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్, యూఎస్ఏ	52.5
బీజింగ్ క్యాపిటల్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్, చైనా	50.9
సింగపూర్ చాంగి ఎయిర్‌పోర్ట్, సింగపూర్	47.6
ఆమ్‌స్టర్ డ్యామ్ ఎయిర్‌పోర్ట్ షిపోల్, నెదర్లాండ్స్	37.3
లండన్ హీత్రో ఎయిర్‌పోర్ట్, యూకే	36.0
గ్వాంగ్జౌ బైయున్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్, చైనా	38.8



విమానాశ్రయాల వారీగా తలసరి వైమానికేతర ఆదాయం (రూ.లలో)

విమానాశ్రయం పేరు	వైమానికేతర ఆదాయం
చాంగి, సింగపూర్	2,309
లండన్ హీత్రో	1,918
ముంబై	1,785
టోక్యో హెనేడా	1,767
ఢిల్లీ	1,607
కొచ్చి	1,199
ఆమ్‌స్టర్‌డ్యామ్	1,092
హైదరాబాద్	745
బెంగళూరు	719
దల్లాస్ ఫోర్ట్‌వర్త్	666
చికాగో ఓహారే	568
చెన్నై	524
పుణే	417
కోల్‌కతా	302
డబ్లిన్	275
అహ్మదాబాద్	204

బదిలీ చేసినా.. కుర్చీ వదలరు!

- వాణిజ్య పన్నుల శాఖలో పలువురు ఒకేచోట ఐదేళ్లుగా విధులు
- పదోన్నతులు లభించినా కదలని వైనం

సాక్షి, సిటీబ్యూరో: ఐదేళ్లయినా అక్కడ బదిలీలుండవ్! పదోన్నతులు లభించినా అంతే! ఏళ్ల తరబడి ఒకే కుర్చీలో కుర్చున్నా కదిలించడానికి ప్రభుత్వం సాహసం చేయడంలేదు. ఉన్నతాధికారుల ఆశీస్సులతో కాసులు కురిపించే పోస్టుల్లో దర్జాగా కొనసాగుతున్నారు. చాలా ఏళ్లుగా ఒకేచోట విధులు నిర్వర్తిస్తున్నవారు బదిలీల నుంచి తప్పించుకునేందుకు జాబితాలో వారి పేర్లు రాకుండా జాగ్రత్తపడుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ రకం ఉద్యోగులు అబిడ్స్, చార్మినార్, సికింద్రాబాద్, పంజాగుట్ట డివిజన్లలో ఎక్కువగా ఉన్నారని ఆయా డివిజన్లలో పలువురు చర్చించుకుంటున్నారు. నీతి నిజాయితీ, అక్రమాలకు పాలుపడకుండా విధులు నిర్వహిస్తున్న అధికారులు, ఉద్యోగులపై ఈ రకం ఉద్యోగుల ఒత్తిడి ఉండటంతో వీరు పని చేయలేకపోతున్నారు. వీరి గురించి తెలిసినా జేసీలు పట్టించుకోవడం లేదని ఓ ఉద్యోగి 'సాక్షి'తో మాట్లాడుతూ విచారం వ్యక్తం చేశాడు. పన్ను ఎగ్గొట్టే మార్గాల్లో పని చేయాలని బదిలీలు కానీ ఉద్యోగులు పలువురు ఒత్తిడి చేస్తున్నారని, వీరికి పలువురు జేసీలు, ఏసీలు కూడా మద్దతు ఇస్తున్నారని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. కొన్నిరోజుల క్రితం ఈ విషయం ఉద్యోగ సంఘాల నేతలకు కూడా చేరింది. అయితే ఈ రకం ఉద్యోగులను వెంటనే బదిలీ చేయాలని ఇతర ఉద్యోగ సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు. ఏళ్లతరబడి కుర్చీలకు అత్తుకుపోయిన అధికారులు, ఉద్యోగుల వల్ల శాఖకు తీవ్ర స్థాయిలో నష్టం జరుగుతోందని, వీరిని వెంటనే ప్రధాన కార్యాలయానికి ఆటాచ్ చేయాలని కేంద్ర కార్యాలయం ఉన్నతాధికారి అన్నారు. ఇలాంటి ఉద్యోగులతో ప్రభుత్వం ఖజానాకు గండిపడుతుందని ఆయన వాపోయారు.

త్వరగా గోదావరి పనులు ప్రారంభించాలి

జలమండలి ఎండీ అశోక్ రెడ్డి

సాక్షి,సిటీ బ్యూరో: గోదావరి తాగునీటి సరఫరా పథకం ఫేజ్–2, 3 ప్రాజెక్టుల మాస్టర్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, నీటి శుద్ధి కేంద్రాల పనులను త్వరగా ప్రారంభించాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టులో భాగంగా నిర్మిస్తున్న ఘన్‌పూర్ వద్ద నిర్మించనున్న మాస్టర్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పనులను శనివారం సందర్శించారు. ఘన్‌పూర్ నుంచి ఉస్మాన్ సాగర్ వరకు ఉన్న 56 కిలోమీటర్ల మేరకు నిర్మించ తలపెట్టిన రెండు వరుసల పైప్ లైన్ పనులకు ఆటంకం లేకుండా తీసుకోవాల్సిన చర్యల గురించి అధికారులతో చర్చించారు. రోడ్ క్రాసింగ్, టన్నెలింగ్ లాంటి సమస్యాత్మక ప్రాంతాల్లోనూ ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతూ ఘన్‌పూర్ వద్ద నిర్మించనున్న 80 మిలియన్ లీటర్ల మాస్టర్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, నీటి శుద్ధి కేంద్రాల పనులను త్వరగా ప్రారంభించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ టీవీ శ్రీధర్, సీజీఎం మహేష్ కుమార్‌తోపాటు సంబంధిత అధిరకారులు పాల్గొన్నారు.

వైద్యవృత్తికి ఉజ్వల భవిష్యత్తు

నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీరప్ప



లక్డీకాపూల్: వైద్య వృత్తికి ఉజ్వల భవిష్యత్తు ఉందని, సేవా రంగంలో పనిచేసే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప సూచించారు. నిమ్స్ లెర్నింగ్ సెంటర్‌లో వైద్య అనుబంధ వృత్తి విజ్ఞాన కళాశాల విద్యార్థులకు ఓరియెంటేషన్ ప్రోగ్రాం జరిగింది. ఈ సందర్భంగా 2025– 26 విద్యాసంవత్సరానికి అడ్మిషన్ పొందిన విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. రానున్న రోజుల్లో కృత్రిమ మేధ, మెషీన్ లెర్నింగ్ ద్వారా సాంకేతిక నిపుణులకు ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటాయని, నిమ్స్‌లో సీటు లభించడం అదృష్టంగా భావించాలన్నారు. దేశంలోనే అత్యంత ఆధునిక రోగ నిర్ధారణ యంత్ర పరికరాలు, నిష్ణాతులైన సాంకేతిక సిబ్బంది, అనుభవజ్ఞులైన వైద్యులు ఉన్న నిమ్స్‌లో శిక్షణ పొందడం ద్వారా విస్తృత అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని పేర్కొన్నారు. మెడిసిన్‌లో సీటు రాలేదని బాధపడకుండా వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, ఉజ్వల భవిష్యత్తును సొంతం చేసుకోవాలని సూచించారు. ఎంచుకున్న కోర్సులో క్రమశిక్షణ, పట్టుదలతో సుశిక్షితులు కావాలన్నారు. ఈ క్రమంలో సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ డాక్టర్ శాంతి వీర్, కళాశాల ప్రిన్సిపాల్ శిరందాస్ శ్రీనివాస్, కో ఆర్డినేటర్ దామోదర నాయుడు, విద్యార్థులు, వారి తల్లితండ్రులు పాల్గొన్నారు.

వచ్చేవారంలో హౌసింగ్ బోర్డు భూముల విక్రయాలు

- చింతల్‌లో బహిరంగ వేలం ద్వారా విక్రయాలు
- కేపీహెచ్‌బీ కాలనీ, రావిర్యాలలోని భూములకు ఈ–వేలం

సాక్షి,సిటీ బ్యూరో: హౌసింగ్ బోర్డు ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ పరిధిసహా పలు పట్టణ ప్రాంతాల్లో ఉన్న ఖాళీ ప్లాట్ల విక్రయాలకు రంగం సిద్ధమైంది. సోమవారం నగరంలోని చింతల్, నిజాంపేట, బాచుపల్లి ప్రాంతాల్లోని 22 రెసిడెన్షియల్ ప్లాట్లు, ఫ్లాట్లను బహిరంగ వేలం ద్వారా విక్రయించనున్నారు. దీనికి సంబంధించిన నోటిఫికేషన్‌ను గత నెల 15 తేదీన జారీ చేశారు. చింతల్ ప్రాంతంలో 18 ఎంఐజీ, హెచ్ఐజీ ఫ్లాట్లు, నిజాం పేట బాచుపల్లిలో 4 ప్లాట్లను బహిరంగ వేలం వేయనున్నారు. ఇటీవల కేపీహెచ్‌బీ కాలనీ ప్రాంతంలో హౌసింగ్ బోర్డు పలు దఫాలుగా నిర్వహించిన భూముల విక్రయాల్లో ఎకరా భూమి సుమారు రూ.70 కోట్లకు ఇ–వేలం ద్వారా విక్రయించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కేపీహెచ్‌బీ కాలనీలో నాలుగు కమర్షియల్ ప్లాట్లను అక్టోబర్ 7, 8 వ తేదీల్లో ఈ–వేలం ప్రక్రియ ద్వారా విక్రయించనున్నారు. ఫేజ్ 1, 2 పరిధిలో ఉన్న 6,549 చదరపు గజాలతోపాటు, 2,420 చ.గజాలు, 2,397 చ.గజాలు, 726 చ.గజాల విస్తీర్ణంలోని ప్లాట్‌లకు మంగళవారం ఇ–వేలం నిర్వహిస్తున్నారు. నాంపల్లి ప్రాంతంలోని 1,148 చదరపు గజాల కమర్షియల్ ప్లాట్‌ను కూడా 8 వ తేదీన ఈ–వేలం ద్వారానే విక్రయిస్తున్నట్లు హౌసింగ్ బోర్డు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. వీటితోపాటు అక్టోబర్ 9, 10 వ తేదీల్లో చింతల్‌లోని 10,890 చదరపు గజాల కమర్షియల్ భూమి, మహేశ్వరం మండలంలోని రావిర్యాల ప్రాంతంలోని 13,503 చ.గ., 5,953.20 చ.గ., 3,630 చ.గజాల విస్తీర్ణంలోని భూములను కూడా ఇ–వేలం ద్వారా విక్రయించనున్నారు.

హెచ్ఐసీసీలో 'హార్ట్‌ఫుల్‌నెస్ కాన్షియస్'

మాదాపూర్: జైన మతం ప్రపంచంలోని అన్ని మతాలకు తల్లి లాంటిదని హార్ట్‌ఫుల్ నెస్ మార్గదర్శి, శ్రీరామచంద్ర మిషన్ అధ్యక్షుడు పూజ్య దాజీ అన్నారు. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో జీటో(జైన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఆర్గనైజేషన్) ఆధ్వర్యంలో హార్ట్‌ఫుల్‌నెస్ కాన్షియస్ లివింగ్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హార్ట్‌ఫుల్ నెస్ ఆధ్యాత్మిక జీవితాన్ని ఎప్పుడూ నిర్లక్ష్యం చేయవద్దన్నారు. కుటుంబం, సమాజంపట్ల భౌతిక బాధ్యతలను విస్మరించవద్దని పేర్కొన్నారు. మాస్టర్ క్లాస్‌లో భాగంగా ధ్యానం, శక్తి, స్పష్టత, అంతరంగిక శక్తిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంజాబ్ గవర్నర్ గులాబ్ చంద్ కటారియాతోపాటు ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన విధాన రూపకర్తలు, ఆధ్యాత్మిక వేత్తలు, ఆర్థిక వేత్తలు, కార్పొరేట్, క్రీడా, సాంస్కృతిక రంగాల ప్రముఖులు హాజరయ్యారు.



'హోలీ తీర్థంకర్స్' పుస్తకాన్ని ఆవిష్కరించిన పంజాబ్ గవర్నర్ గులాబ్ చంద్ కటారియా

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, ఆదివారం, 5, అక్టోబర్, 2025

ఆహ్లాదభరితంగా ఉండాలి.. ఆధ్యాత్మిక భావాలు మేల్కొలపాలి.. అన్య ప్రాంతం భాష పరిచయం కావాలి.. కొత్త కొత్త కళలు వీక్షించాలి.. ఇవన్నీ కూడా కేవలం ఒక్కరోజు రాకపోకలతోనే పూర్తి కావాలి అనుకునే వారికి సరైన డెస్టినేషన్స్ నగర చుట్టుపక్కల సరిహద్దుల్లో చాలానే ఉన్నాయి. అయితే స్పీడ్ టూరిస్టుల కోసం ప్రస్తుతం అనేక రకాల ట్రిప్స్ రెడీగా ఉన్నాయి. అలాంటి ఒక చక్కని వీకెండ్ విహారమే బీదర్. కేవలం మూడు గంటల ప్రయాణంతో ఇటు చారిత్రాత్మక విశేషాలు, అటు ఆధ్యాత్మిక విశేషాలు తెలుసుకునే అవకాశం ఉండడంతో చాలా మంది నగర పర్యాటకుల వీకెండ్ ట్రిప్‌కి బీదర్ ఫేమస్ డెస్టినేషన్‌గా మారింది.

- సాక్షి, సిటీబ్యూరో




క్రీడలతో క్రమశిక్షణ..

ఆర్చరీ ప్రీమియర్ లీగ్‌లో నటుడు రామ్ చరణ్



సాక్షి, సిటీబ్యూరో: క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని టాలీవుడ్ నటుడు రామ్ చరణ్ అన్నారు. నగరానికి చెందిన ప్రముఖులు అనిల్ కామినేని ఆధ్వర్యంలో తొలిసారిగా జరుగుతున్న ఆర్చరీ ప్రీమియర్ లీగ్ పురస్కరించుకుని క్రీడాకారులకు ఆయన అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలోనే కాక ప్రపంచంలో తొలిసారి ఆర్చర్ల కోసం ప్రత్యేకంగా ప్రీమియర్ లీగ్ నిర్వహించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ ఆటలో ఉన్న ఫోకస్, క్రమశిక్షణ, బలం ప్రత్యేకమైనవని, ప్రతి ఆర్చర్‌ని మనం ప్రోత్సహించాలని కోరారు. ఈ లీగ్ విజయం సాధించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. తెలంగాణకు చెందిన కాకతీయ నైట్స్ కూడా పాల్గొంటున్న ఈ పోటీల్లో ఆరు ఫ్రాంచైజీ జట్లు, 36 మంది అగ్రగామి ఆర్చర్లు, 12 మంది అంతర్జాతీయ స్టార్లు తొలిసారిగా ఈ ఫార్మాట్‌లో పోటీ పడుతుండడం విశేషం. న్యూఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో ఉన్న యమునా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఈ పోటీలు ఈ నెల 12 వరకూ కొనసాగనున్నాయని ఆర్చరీ ప్రీమియర్ లీగ్ నిర్వాహకులు తెలిపారు. ఆర్చరీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, వరల్డ్ ఆర్చరీ, వరల్డ్ ఆర్చరీ ఆసియా, భారత క్రీడా మంత్రిత్వ శాఖలు సంయుక్తంగా లీగ్ నిర్వహణలో పాలు పంచుకుంటున్నట్లు తెలిపారు.





వన్‌డే టూర్.. బెస్ట్ బీదర్

నగరం నుంచి కేవలం 3గంటల ప్రయాణం

- చారిత్రక, ఆధ్యాత్మిక విశేషాలకు చిరునామా
- బిద్రీ ఆర్ట్ సహా ఉత్తర కర్ణాటక ప్రత్యేకతలకు నెలవు
- సిటిజనుల వీకెండ్ ట్రిప్‌కు ఫేమస్.. బీదర్

నగరానికి సమీపంలోనే పూర్తిగా కొత్త ప్రదేశానికి వెళ్లి కొత్త కొత్త అనుభూతులు మూటగట్టుకోదగిన వారాంతపు విహారయాత్రలలో మొదటిది బీదర్ పట్టణం ('బీ–డెర్' అని ఉచ్చరిస్తారు) చెప్పొచ్చు. నగరం నుంచి దాదాపు 130 కి.మీ దూరంలో బీదర్ ఉంది. నిదానంగా వెళ్లినా రోడ్డు మార్గంలో అయితే కేవలం 3గంటల్లోనే చేరుకోవచ్చు. నగరం నుంచి మేడ్చల్, ఆ తర్వాత తూప్రాన్, నర్సాపూర్, జహీరాబాద్, హుమ్నాబాద్ మీదుగా బీదర్ వెళ్లాలి. బస్సులో వెళ్లే వారైతే ఎంజీబీఎస్, జూబ్లీ బస్ స్టేషన్‌ల నుంచి ప్రయాణం చేయాలి. నగరం నుంచి బీదర్‌కు పాసింజర్ రైలు, ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్‌లు ఉన్నాయి. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి రోజుకు 2 రైళ్లు నడుస్తాయి. అయితే రైలు మార్గంలో వెళితే కనీసం 4గంటలు పడుతుంది.




సందర్శనీయ స్థలాలు..

ఇవేకాక మరికొన్ని టూంబ్స్ కూడా ఈ నగరంలో ఉన్నాయి. అలాగే సిక్కు యాత్రికులకు అత్యంత పవిత్ర స్థలం, గురునానక్ దేవ్‌జీ అడుగుపెట్టినప్పుడు ఉద్భవించిన పవిత్ర జల వనరుగా పేర్కొనే గురు నానక్ ఝిరా సాహిబ్ ఆధ్యాత్మిక విశేషాలతో ఆకట్టుకుంటుంది. నగరానికి మధ్యలో పాత గడియార స్థూపం చౌబారా టవర్ మరో ఆకర్షణ. దీనిపైకి ఎక్కితే బీదర్ పట్టణం మొత్తాన్ని వీక్షించవచ్చు. ఇవే కాక సమయాన్ని బట్టి మహ్మద్ గవన్ మద్రాసా, బరీద్ షాహి టూంబ్స్, పాపనాశ్ టెంపుల్.. వంటివి కూడా సందర్శనీయ స్థలాలే.


లోకల్ స్పెషల్స్..

బిద్రీ వర్క్ పేరుతో పిలిచే బిద్రీ ఆర్ట్ మెటల్ వర్క్ బీదర్ ప్రత్యేకత. వెండి ఇన్‌లేతో చేసిన నల్ల మెటల్ ఆర్ట్ పీస్, సెంటర్ పీస్, ట్రేలవంటివి చూడడానికి కొనుగోలు చేయడానికి కూడా మంచి ఎంపిక. ఆహారం ప్రియులకు ఇక్కడ ఉత్తర కర్ణాటక ప్రత్యేక శైలి భోజనం లభిస్తుంది. కన్నడిగుల శైలిలో వండే జొన్నరొట్టె లేదా జోలడ రొట్టె దానికి కాంబినేషన్‌గా అందించే వంకాయతో చేసిన ఎన్నగై కర్రీ లోకల్ స్పెషల్‌గా ట్రై చేయవచ్చు. అలా కాదన్నా తెలుగు రెస్టారెంట్స్, దాబాలు కూడా హైవేపై అందుబాటులో ఉన్నాయి.



ఆధ్యాత్మిక చారిత్రక, విశేషాల నెలవు..

చారిత్రక విశేషాలెన్నో ఉన్న 15వ శతాబ్దానికి చెందిన అద్భుతమైన కోట బీదర్ ఫోర్ట్. ఈ కోట లోపల ప్యాలెస్‌లు, గుమ్మాలు, మసీదులు ఫొటోగ్రఫీకి అద్భుతమైన నేపథ్యాలను అందిస్తాయి. కోట లోపలే ఉన్న రంగీన్ మహల్ ఇన్లే వర్క్, వుడ్ కార్వింగ్, టైల్ డిజైన్‌లకు ప్రసిద్ధి చెందింది. కోట లోపల 16 స్తంభాలపై నిర్మితమైన భారీ సోలా ఖంబా మసీదు కూడా ఆసక్తి కలిగిస్తుంది. కోట సమీపంలో రాతి గుహలో ఉన్న ఈ దేవాలయం నరసింహ జలాశయం, ప్రకృతి అందాలకు ప్రసిద్ధి. ఇవికాక బీదర్‌కి వెలుపల అష్టూర్ ఖానా సమీపంలో ఉన్న బహ్మనీ టూంబ్స్ రాజుల సమాధులుగా అద్భుతమైన వాస్తు నిర్మాణానికి ప్రసిద్ధి చెందాయి.



హైదరాబాద్ - బీదర్ టూర్ ప్లాన్ ఇలా..

- వ్యక్తిగత కార్ లేదా క్యాబ్ /బస్‌లో ఉదయం 5:00 గంటలకు ప్రయాణం మొదలవ్వాలి.
- మధ్యలో జహీరాబాద్‌లో బ్రేక్‌ఫాస్ట్.
- ఉదయం 9:45 గంటలకు బీదర్ కోట సందర్శించేలా చూసుకోవాలి.
- 11:30కు చౌబారా టవర్‌కు చేరుకోవాలి.
- మధ్యాహ్నం 12గంటలకు గురు ద్వారా నానక్ ఝిరా సాహిబ్ సందర్శన.
- ఒంటిగంటకు స్థానిక హోటల్స్‌లో లంచ్ పూర్తిచేసుకోవాలి.
- మధ్యాహ్నం 2:30గంటలకు బహ్మనీ టూంబ్స్ విజిటింగ్.
- సాయంత్రం 4గంటలకు నరసింహ జలాశయం/ దేవాలయం సందర్శన.
- సాయంత్రం 5గంటలకు స్థానిక వస్తువులు, ఉత్పత్తుల షాపింగ్.
- 6 గంటలకు తిరుగు ప్రయాణం ప్రారంభం.. రాత్రి 10 గంటలకు సిటీ చేరుకోవచ్చు.





మరిన్ని టచ్ పాయింట్స్ విస్తరణ

తైవాన్ టెక్ దిగ్గజం అసూస్

సాక్షి, సిటీబ్యూరో: తైవాన్ టెక్ దిగ్గజం (అసూస్) ఇండియా, నగరంలో తమ ప్రత్యేకమైన స్టోర్ ఏర్పాటు చేసింది. ఈ 350పైగా చదరపు అడుగుల విస్తీర్ణంలో మలక్‌పేట్‌లో నెలకొల్పిన ఈ స్టోర్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫ్లాగ్‌షిప్ ఉత్పత్తులైన వివో బుక్, జెన్ బుక్, రిపబ్లిక్ గేమర్స్, ల్యాప్‌టాప్‌లు, గేమింగ్ డెస్క్‌లు, తదితర కలెక్షన్లను అందుబాటులోకి తెచ్చామని, సాఫ్ట్‌వేర్, హార్డ్ వేర్ యాక్సెసరీస్ వినియోగదారులకు అందుబాటులో ఉన్నాయని, తమ ఉత్పత్తులను అనుభూతించేందుకు గాను కొత్త టచ్‌పాయింట్లను సృష్టిస్తామని అసూస్ ఇండియా సేల్స్ మేనేజర్ జిగ్నేశ్ భవ్సర్ తెలిపారు.

అన్నార్థులకు అండగా..

కడుపు నింపుతున్న రూపాయి భోజనం

నిత్యం 300 మంది ఆకలి తీరుస్తున్న జార్జ్ రాకేష్ బాబు



ఒక్క రూపాయికి కనీసం ఒక చాక్లెట్, బిస్కెట్ కూడా కొనలేము.. కనీసం నీళ్లతో కడుపు నింపుకుందా మన్నా.. వాటర్ ప్యాకెట్ కూడా రాదు. కానీ నిండైన మనసున్న జార్జ్ రాకేష్ బాబు మాత్రం అవతలి వ్యక్తుల ఆకలిని తన ఆకలిగా భావించి కేవలం రూపాయికే 'ఒక్క ఆశ ఒక్క రూపాయి' పేరుతో కడుపునిండా మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. కేవలం ఐదుగురితో మొదలైన ఈ అన్నదానం ప్రస్తుతం 300లకు చేరింది.

- రాంగోపాల్‌పేట్

మధ్యాహ్నం 12 గంటలు అయ్యిందంటే చాలు చకచకా సిద్ధమైన వంటలన్నీ అక్కడికి చేరుకుంటాయి. అప్పటికే ఒక్కొక్కరుగా చేరి లైన్‌లో నిలబడి చూస్తుంటారు. ఒక్కొక్కరూ వరుసలో వచ్చి ఆ రోజు స్పెషల్ భోజనం తీసుకుని కడుపునిండా తిని అన్నదాతా సుఖీభవ అని ఆశీర్వదించి వెళుతుంటారు. గత 6 నెలల నుంచి సికింద్రాబాద్ రెజిమెంటల్ బజార్‌లోని మనోహర్ థియేటర్ వద్ద ఇదే దృశ్యం కనిపిస్తుంది. ఆకలితో ఉండే ప్రతి ఒక్కరూ రూపాయి చెల్లించి ఆత్మగౌరవంతో భోజనం చేయాలనే ఆలోచనతో రూపాయికే భోజనం అందుబాటులోకి తెచ్చారు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ జార్జ్ రాకేష్ బాబు.

పేదవాడి ఆకలి తీర్చాలని..

రెజిమెంటల్ బజార్‌లో నివాసం ఉండే జార్జ్ రాకేష్ బాబు వృత్తి రీత్యా సాఫ్ట్‌వేర్ ఇంజినీర్.. 2010 నుంచి గుడ్ సమారిటన్ ఇండియా ఫౌండేషన్ ద్వారా దుండిగల్‌లో వృద్ధాశ్రమాన్ని నిర్వహించాడు. అనేక కారణాలతో అది మూతబడగా కొద్ది రోజుల పాటు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, క్లాక్‌టవర్, సంగీత్, గాంధీ ఆస్పత్రి వద్ద అన్నదానం చేపట్టాడు. కానీ కొన్ని చోట్ల కొంత మంది వృథా చేయడం, ఒక్కోసారి మరో చోట ఇంకో భోజనం ఉంటే ఇక్కడికి రాకపోవడం వంటి సమస్యలను ఎదుర్కొన్నాడు. దీంతో వివిధ ప్రాంతాల్లో ఉచిత భోజనం పంపిణీ ఎలా చేయాలని పరిశీలించాడు. ఢిల్లీ, యానం తదితర ప్రాంతాల్లో పరిశీలన అనంతరం ఒక్క రూపాయి తీసుకుని మధ్యాహ్న భోజనం అందించాలని భావించి రెజిమెంటల్ బజార్‌లో చిన్న షాపు తీసుకుని ఫిబ్రవరి నెలలో దీన్ని ప్రారంభించాడు. కేవలం ఐదుగురితో మొదలైన ఈ అన్నదాన కార్యక్రమం ప్రస్తుతం ప్రతి రోజూ 300 మంది ఆకలి తీరుస్తోంది.

మెనూ ఇలా..

వారంలో రోజుకో వెరైటీ చొప్పున ఇక్కడ మధ్యాహ్నం 12 గంటల నుంచి రెండు గంటల వరకూ అందిస్తారు. ఇంట్లో ఇద్దరు వంట వాళ్లు తయారు చేయగా మరో ఇద్దరు వాలీంటీర్లతో కలిసి రూపాయి భోజనం అందిస్తారు. పొంగల్, కిచిడీ–కట్టా, పప్పు అన్నం, టమాటో చారు–బగారా రైస్, టమాటో రైస్ ఇలా కడుపు నిండా పెడుతున్నారు. ప్రతి రోజూ దినసరి కూలీలు, షాపుల్లో పనిచేసే వారు, ఆటో డ్రైవర్లు, డెలివరీ బాయ్స్, జొమాటో, స్విగ్గీ డెలివరీ బాయ్స్ ఎంతో మంది ఆ టైమ్‌కు వచ్చి భోజనం చేసి వెళుతుంటారు.

నా వంతు సాయంగా..

"మహానగరంలో ఎక్కడెక్కడి నుంచో కడుపు చేతబట్టుకుని వచ్చే వలసదారులు, చిన్న చిన్న ఉద్యోగాలతో మధ్యాహ్నం భోజనం చేయలేక ఆకలి కడుపుతో ఉండే వాళ్లు ఎంతో మంది ఉన్నారు. అలాంటి వారిలో కొందరి ఆకలినైనా తీర్చాలనే భావనతో దీనిని ప్రారంభించా. నా ప్రయత్నానికి కొందరు దాతలు సహకరిస్తున్నారు. వారికి రుణపడి ఉంటా."

- జార్జ్ రాకేష్ బాబు



నగరంలో టెస్లా కారు

కుత్బుల్లాపూర్: అడ్వాన్స్‌డ్ వెహికల్‌గా పేరొందిన టెస్లా కారు హైదరాబాద్ నగరంలో అడుగుపెట్టింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో మొట్టమొదటి కారు కావడం విశేషం. మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కొంపల్లిలోని అపర్ణ ఫామ్ మెడోస్‌లో ఉండే డాక్టర్ ప్రవీణ్ కోడూరు రెండు రోజుల క్రితం కొనుగోలు చేసి కొంపల్లిలో ఉన్న నందక ఆస్పత్రి ముందు పార్కు చేయడంతో పలువురు సెల్ఫీలు తీసుకుంటూ సందడి చేశారు. ముంబయి, ఢిల్లీలో మాత్రమే టెస్లా షోరూమ్‌లు ఉండగా.. డాక్టర్ ప్రవీణ్ మహారాష్ట్రకు వెళ్లి అక్కడ షోరూమ్‌లో టెస్లా కారు కొనుగోలు చేసి రోడ్డు మార్గంలో నగరానికి చేరుకున్నాడు. అడ్వాన్స్‌డ్ ఫ్యూచర్స్ ఉన్న ఈ ఎలక్ట్రికల్ కారులో ప్రయాణించడం ఎంతో ఆనందాన్నిచ్చిందని, సెప్టెంబర్ 27న మధ్యాహ్నం 3 గంటలకు ఈ వాహనం కొనుగోలు చేశానని పుణెలో ఒకసారి, సోలాపూర్‌లో మరోసారి చార్జింగ్ చేసుకున్నామని, దాదాపు 770 కిలోమీటర్లు ప్రయాణించామని పేర్కొన్నారు. మహారాష్ట్రలో కొనుగోలు చేసిన ఈ టెస్లా కారుకు 22% టాక్స్ చెల్లించి తీసుకొచ్చామని, మన దగ్గర షోరూం లేకపోవడం మూలంగా బయట రాష్ట్రానికి వెళ్లడం జరిగిందని, రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని టెస్లా షోరూమ్ హైదరాబాదులో ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా ఎలక్ట్రికల్ వాహనాలకు 100% రోడ్డు టాక్స్ రాయితీ కల్పించాలని కోరారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో మొట్టమొదటిసారిగా తాను టెస్లా కారు కొనుగోలు చేయడం సంతోషంగా ఉందని డాక్టర్ ప్రవీణ్ తెలిపారు. దేశంలో ఇప్పటికే ఐదు టెస్లా కార్లు ఉండగా, ఆరో కారును ప్రవీణ్ కొనుగోలు చేశారు. టెస్లా అనేది ఎలక్ట్రికల్ వాహనాలు, సౌర శక్తి ఉత్పత్తులు, బ్యాటరీ శక్తి నిల్వ వ్యవస్థలను తయారు చేసే అమెరికన్ కంపెనీ. టెస్లా రోడ్డు స్టార్, మోడల్ ఎస్, మోడల్ 3 ఎలక్ట్రికల్ కార్లతో ఈ సంస్థ ప్రసిద్ధి చెందింది. అత్యాధునిక సాంకేతికత, ఆకట్టుకునే పనితీరు, దీర్ఘ శ్రేణి సామర్థ్యంతో కూడిన ఫీచర్లు దీని సొంతం. 2003లో ఈ కంపెనీ స్థాపించారు.



డ్రైవర్ అన్నలకు బాబు బురిడీ

బ్యాడ్జి ఉన్న వారందరికీ ఆర్థిక సహాయమని మేనిఫెస్టోలో హామీ

మొదటి ఏడాది పథకం పూర్తిగా అమలు చేయని చంద్రబాబు

రెండో ఏడాదిలో 18 నిబంధనలతో అర్హుల్లో భారీగా కోత



ఇదీ టీడీపీ మేనిఫెస్టో హామీ

- బ్యాడ్జ్ కలిగిన ప్రతి ఆటో డ్రైవర్‌కు, ట్యాక్సీ డ్రైవర్లకు, హెవీ లైసెన్స్ కలిగిన ప్రతి లారీ, టిప్పర్ డ్రైవర్‌కు ఏటా రూ.15 వేలు ఆర్థిక సాయం

సాక్షి, అమరావతి: 'అంతన్నాడింతన్నాడే గంగరాజు...' అని ఉత్తరాంధ్రలో ఓ జానపద గీతం బాగా పాపులర్. ప్రస్తుతం చంద్రబాబు పనితీరూ అలానే ఉంది. మేనిఫెస్టోలో అంత చేస్తాం.. ఇంత చేస్తాం.. అని హామీలు ఇచ్చిన ఆయన తీరా అధికారంలోకి రాగానే మరోసారి తన ట్రేడ్ మార్కు శైలిలో బురిడీ కొట్టిస్తున్నారు. 'ఆటో డ్రైవర్ల సేవలో..' అని చెప్పి తీరా అమలులోకి వచ్చేసరికి కొందరికే అంటూ టోకరా వేశారు. మేనిఫెస్టోను యథాతథంగా ఏనాడూ అమలు చేయని చంద్రబాబు మరోసారి తన ట్రాక్ రికార్డును కొనసాగించారు. ఈసారి ఆయన్ను నమ్మి మోసపోయిన బాధితుల జాబితాలో పేద డ్రైవర్లు చేరారు. మొదటి ఏడాది పథకాన్ని అమలు చేయకుండా పూర్తిగా ఎగవేసిన టీడీపీ కూటమి ప్రభుత్వం.. రెండో ఏడాది సరికొత్త మోసానికి తెరతీసింది. దరఖాస్తు చేసేందుకే అవకాశం లేకుండా నిబంధనల చట్రం బిగించి, ఏకంగా 80 శాతం మందికి పథకం అందకుండా చేసింది. కానీ టీడీపీ కూటమి ప్రభుత్వం డ్రైవర్లకు ఎంతో చేసిందని చంద్రబాబు, లోకేశ్, పవన్ కల్యాణ్ ఎల్లో మీడియా ద్వారా సొంత డబ్బా కొట్టుకోవడం విస్మయ పరుస్తోంది. ఇవ్వని హామీ నెరవేరుస్తున్నామని గొప్పలు చెబుతుండటం నివ్వెరపోయేలా చేస్తోంది.

ఇద్దరూ బురిడీ బాబులే

ఎన్నికల ముందు అరచేతిలో వైకుంఠం చూపించే చంద్రబాబు.. 2024 ఎన్నికల ముందు అదే పన్నాగాన్ని అమలు చేశారు. బ్యాడ్జి ఉన్న ప్రతి డ్రైవర్‌కు ఏడాదికి రూ.15 వేలు ఆర్థిక సహాయం చేస్తామని టీడీపీ–జనసేన–బీజేపీ ఉమ్మడి మేనిఫెస్టోలో హామీ ఇచ్చారు. అంతేకాదు మాటలతో బూరెలు వండటంలో తన తండ్రిని మించిపోయేలా లోకేశ్ హామీలు గుప్పించారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే ఆర్థిక సహాయం పథకం లబ్దిదారులయ్యేందుకు బ్యాడ్జి ఉన్న డ్రైవర్లు 13 లక్షల మంది ఉన్నారని ఆయన 2023లోనే ప్రకటించారు. అంటే కనీసం 13 లక్షల మందికి ఆర్థిక సహాయం అందిస్తామని ఆయన చెప్పారు. ఈ రెండేళ్లలో మరో రెండు లక్షల మంది బ్యాడ్జి పొంది ఉంటారని రవాణా శాఖ వర్గాలే చెబుతున్నాయి.

అంటే ప్రస్తుతం 15 లక్షల మంది అర్హులు ఉన్నారని లెక్క తేలుతోంది. ఆ ప్రకారం 15 లక్షల మందికి రూ.15 వేలు చొప్పున మొత్తం రూ.2,250 కోట్లు ఆర్థిక సహాయం చేయాలి.

ఏకంగా 80 శాతం ఎగవేత

మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా అర్హులందరికీ ఈ పథకాన్ని వర్తింప చేస్తామన్న టీడీపీ కూటమి ప్రభుత్వం ఏం చేసిందో తెలుసా... 'డ్రైవర్ అన్నల సేవలో..' అంటూ కేవలం రూ.436 కోట్లే ఇచ్చింది. అందుకోసం ఎన్ని అడ్డదారులు తొక్కాలో అన్నీ తొక్కింది. బ్యాడ్జి ఉంటే చాలు పథకం వర్తింపజేస్తామన్న చంద్రబాబు.. తీరా ఆర్థిక సహాయం చేయాల్సి వచ్చే సరికి ఏకంగా 18 నిబంధనలు విధించారు. తద్వారా బ్యాడ్జి ఉన్న డ్రైవర్లు కనీసం దరఖాస్తు చేసేందుకు కూడా అవకాశం లేకుండా చేశారు. లారీ డ్రైవర్లు, టిప్పర్ డ్రైవర్లు, రేషన్ సరుకులు డెలివరీ వాహనాలు.. ఇలా లక్షలాది మందికి పథకం అందకుండా ఆంక్షలు విధించారు. లోకేశ్ చెప్పినట్టు 2023లోనే 13 లక్షల మంది బ్యాడ్జి ఉన్న వారు ఉంటే.. టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రకటించిన 'డ్రైవర్ అన్నల సేవలో' పథకం కోసం కేవలం 3.21 లక్షల మందే దరఖాస్తు చేయడం గమనార్హం. అంటే 10 లక్షల మంది కనీసం దరఖాస్తు చేసేందుకు కూడా అవకాశం లేకుండా ఆంక్షలు విధించారు. పథకం అర్హత నిబంధనల పేరుతోనే ఏకంగా 10 లక్షల మందికి కోత విధించారు. ఇక దరఖాస్తు చేసిన 3,21,531 మందికి కూడా పథకాన్ని వర్తింప చేయలేదు. వారిలో కూడా 2,90,669 మందినే అర్హులుగా ప్రకటించారు. దాంతో కేవలం ఈ పథకం కింద ఆర్థిక సహాయం రూ.436 కోట్లకే సరిపెట్టారు. ఇస్తామని ఎన్నికల్లో చెప్పింది రూ.2,250 కోట్లు కాగా, ఇచ్చింది కేవలం రూ.436 కోట్లే. అంటే ఇచ్చిన హామీలో 80 శాతం కోత విధించారన్నది స్పష్టమవుతోంది. అదీ చంద్రబాబు మార్కు బురిడీ అంటే అని మరోసారి రాష్ట్ర ప్రజలకు తెలిసేలా చేశారు.

తొలి ఏడాది పూర్తిగా ఎగవేత

మేనిఫెస్టోను అమలు చేయకుండా అడ్డదారులు వెతకడంలో తనది మాస్టర్ మైండ్ అని చంద్రబాబు మరోసారి నిరూపించారు. బ్యాడ్జి ఉన్న డ్రైవర్లు అందరికీ ఏడాదికి రూ.15 వేలు ఆర్థిక సహాయం చేస్తామన్న ఆయన.. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాది అంటే 2024లో ఆ పథకం ఊసే ఎత్త లేదు. తొలి ఏడాది డ్రైవర్లకు ఒక్క రూపాయి కూడా ఆర్థిక సహాయం చేయలేదు. ఆ విధంగా ఒక ఏడాది పూర్తిగా ఎగ్గొట్టారు. రెండో ఏడాది పథకం అమలు చేస్తామంటూనే ఏకంగా 18 నిబంధనలు విధించి అర్హుల జాబితాలో భారీగా కోత విధించారు. మేనిఫెస్టోను సక్రమంగా అమలు చేయకుండా మోసం చేయడంలో చంద్రబాబు ట్రేడ్ మార్క్ అంటే ఇదే మరి.

ఇప్పటికే భారీగా ఆదాయం కోల్పోతున్న ఆటో డ్రైవర్లు

చంద్రబాబు ప్రభుత్వ విధానాలతో ఆటో డ్రైవర్లు ఆర్థిక ఇక్కట్లలో కూరుకుపోతున్నారు. రాష్ట్రంలో ఆటో డ్రైవర్ల ఆదాయం భారీగా పడిపోయింది. ఆటోల నిర్వహణ ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అందించే పథకం ద్వారా అయినా కాస్త ఊరట లభిస్తుందని ఆశించిన డ్రైవర్లకు నిరాశే మిగిలింది. ఏకంగా 10 లక్షల మందిని ఈ పథకానికి అనర్హులుగా చేసి కూటమి ప్రభుత్వం మోసం చేసిందని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పథకాన్ని సక్రమంగా అమలు చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

మేనిఫెస్టోను కచ్చితంగా అమలు చేయడం అంటే ఏమిటో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఐదేళ్లపాటు చేతల్లో చూపించింది. లైసెన్స్ ఉండీ.. ఆటో, ట్యాక్సీ, మ్యాక్సి కేబ్, రేషన్ వాహనాలు కలిగి ఉన్న ప్రతి ఒక్కరికి 'వైఎస్సార్‌సీపీ వాహన మిత్ర' పథకాన్ని అందించింది. మొదటి ఏడాది అని ఎగవేయలేదు. చివరి ఏడాది ఎన్నికల నియామావళి అని సాకుతో తప్పించుకోలేదు. అధికారంలోకి రాగానే పథకం అమలు చేసింది. చివరి ఏడాది ఎన్నికల నియమావళి అమలులోకి రావడానికి ముందే వైఎస్సార్ వాహన మిత్ర పథకం కింద ఆర్థిక సహాయం అందించింది. ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం అంటే ఏమిటో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతల్లో చూపించారని డ్రైవర్లు ప్రస్తుతం గుర్తు చేసుకుంటుండటం ప్రాధాన్యత సంతరించుకుంది.

ఆమె ఎవరినైనా గుద్దితే నాకే ....!

మంత్రి లోకేశ్ అభ్యంతరకర మాటలకు కంగుతిన్న మహిళా ఆటో డ్రైవర్



అజిత్‌సింగ్‌నగర్ (విజయవాడ సెంట్రల్): మంత్రి నారా లోకేశ్ అభ్యంతరకర మాటలకు ఓ మహిళా ఆటోడ్రైవర్ అవాక్కైంది. విజయవాడ సింగ్‌నగర్‌లో శనివారం జరిగిన ఆటో డ్రైవర్ సేవ కార్యక్రమంలో పాల్గొనేందుకు మంత్రి లోకేశ్ ఓ మహిళ నడుపుతున్న ఆటో ఎక్కారు. ఈ క్రమంలో ఆమెతో మాట్లాడుతుండగా పక్కనే ఉన్న కెమెరామెన్లు, గన్‌మెన్లు ఆమెను 'అటువైపు నుంచి నడపండి' అంటూ చెబుతున్నారు. దీంతో లోకేశ్ 'ఆమెకు ఇటూ అటూ అంటూ చెప్పి మాట్లాడించకండి.. ఆమె ఎవరినైనా గుద్దితే మళ్లీ నాకే బొక్క' అంటూ వ్యాఖ్యానించారు. లోకేశ్ మాటలు విన్న మహిళా ఆటోడ్రైవర్ ఒక్కసారిగా కంగుతింది.

మరణశయ్యపై విశాఖ ఉక్కు!

ప్రైవేటీకరణలో వెనక్కి తగ్గలేదని ఎప్పటికప్పుడు కేంద్రం స్పష్టీకరణ

- సెయిల్‌లో విలీనమూ లేదని వెల్లడిస్తున్న వైనం
- కేంద్ర మంత్రులు, అధికారులదీ ఇదే మాట
- దీనికి భిన్నంగా రాష్ట్రంలో కూటమి నేతల ప్రచారం
- ప్రైవేటీకరణ నిలిచిపోయిందంటూ మభ్యపెట్టే ప్రయత్నం
- విశాఖ ఉక్కు పరిరక్షణలో తగ్గేదేలేదంటున్న వైఎస్సార్‌సీపీ

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

9న వైఎస్ జగన్ అనకాపల్లి జిల్లాలో పర్యటన

- భీమబోయినపాలెంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీని పరిశీలించనున్న మాజీ సీఎం



సాక్షి, అమరావతి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 7, 8, 9 తేదీల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పర్యటించనున్నారు. ఈ మేరకు వివరాలను శనివారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం విడుదల చేసింది. ఈ నెల 7వ తేదీన వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ రీజనల్ కో–ఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షులు, పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. 8వ తేదీన భీమవరం(పెద అమిరం)లో వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు కుమారుడి వివాహ వేడుకకు హాజరవుతారు. ఈ నెల 9వ తేదీన అనకాపల్లి జిల్లా మాకవరపాలెం మండలంలోని భీమబోయినపాలెంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీని సందర్శించనున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన ప్రభుత్వ వైద్య కళాశాలలను పీపీపీ పేరుతో ప్రైవేటుకు ఇవ్వడానికి కూటమి ప్రభుత్వం చేస్తున్న కుట్రలను అడ్డుకోవడంలో భాగంగా భీమబోయినపాలెంలో నిర్మాణం నిలిపివేసిన ప్రభుత్వ వైద్య కళాశాలను మాజీ సీఎం వైఎస్ జగన్ సందర్శిస్తారు.

'పెద్దల' దన్నుతోనే నకిలీ మద్యం రాకెట్

టీడీపీ ముఖ్యులకు నెలవారీ మామూళ్లు

- అన్నమయ్య జిల్లా స్థాయిలో ముఖ్య నేత, తంబళ్లపల్లి ఇన్‌చార్జ్ కనుసన్నల్లో తయారీ
- వీరిని తప్పిస్తూ తూతూ మంత్రంగా కేసు నమోదు
- నేరాన్నంతటినీ విదేశాల్లో ఉన్న జనార్దన్‌రావుపైకి తోసేసే యత్నం
- అసలు సూత్రధారులు, పాత్రధారులను కాపాడేలా స్కెచ్
- సీఎంవోకు నివేదించడంతో రాత్రికి రాత్రి మారిపోయిన కేసు
- టీడీపీ ఇన్‌చార్జ్ జయచంద్రారెడ్డి పీఏ రాజేష్ మద్యం దుకాణం వైపు కన్నెత్తి చూడని అధికారులు



టీడీపీ ఇన్‌చార్జ్ జయచంద్రారెడ్డితో కట్టా సురేంద్ర, పీఏ రాజేశ్

సాక్షి ప్రతినిధి, కడప: అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గం మండల కేంద్రం ములకలచెరువుకు సమీపంలో నకిలీ మద్యం తయారీ కేంద్రం బట్టబయలు కావడం రాష్ట్ర వ్యాప్తంగా కలకలం రేపింది. కనీ వినీ ఎరుగని రీతిలో ఇంత భారీగా యంత్రాల సాయంతో వివిధ బ్రాండ్లను పోలిన నకిలీ మద్యం ములకలచెరువు వద్ద తయారవుతోందని తెలిసి ఉమ్మడి చిత్తూరు, అనంతపురం వాసులు విస్తుపోయారు. ఇన్నాళ్లూ తాము తాగిన మద్యం నకిలీదేనని తెలుసుకుని స్థానికంగా ఉన్న వారు బెంబేలెత్తుతున్నారు. చిన్న పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లోని మద్యం దుకాణాలకు, బెల్ట్ షాపులకు ప్రధానంగా ఇక్కడి నుంచి నకిలీ మద్యం సరఫరా అయ్యేదని శుక్రవారం నాటి ఎక్సైజ్ దాడుల్లో స్పష్టమైంది. ఇంత భారీ రీతిలో నకిలీ మద్యం దందా సాగించడానికి ప్రభుత్వంలోని టీడీపీ ముఖ్య నేతల అండ ఉందని తెలుస్తోంది. ప్రతి నెలా కోట్ల రూపాయల్లో లావాదేవీలు జరిగేవని తేలింది. ఇందులో కొంత సొమ్ము ముఖ్య నేతలకు ప్రతి నెలా చేరేదని సమాచారం. విచ్చలవిడిగా, నిర్భీతిగా ఏడాదికి పైగా యథేచ్ఛగా నకిలీ మద్యం తయారు చేసి.. జనంతో తాగించి వారి ప్రాణాలతో చెలగాటం ఆడిన టీడీపీ నేతలు.. వారికి అన్ని విధాలా అండగా నిలిచిన ప్రభుత్వ పెద్దలు ఇప్పుడు తేలు కుట్టిన దొంగల్లా నోరెత్తడం లేదు. పైగా అసలు సూత్రధారులను తప్పిస్తూ.. పాత్రధారుల్లో అనామకులైన కొంత మందిపై మాత్రమే కేసులు నమోదు చేయించి చేతులు దులుపుకునే ప్రయత్నం చేస్తున్నారు. అన్నమయ్య జిల్లా స్థాయిలో ముఖ్యనేత, తంబళ్లపల్లి ఇన్‌చార్జ్ కనుసన్నల్లో ఈ నకిలీ మద్యం ప్లాంట్ కార్యకలాపాలు కొనసాగాయని ఈ ప్రాంత వాసులు చెబుతున్నారు. ఇక్కడి కూలీలను పనిలో పెట్టుకుంటే బండారం బయట పడుతుందని భావించి, ఇతర రాష్ట్రాల నుంచి తీసుకొచ్చారు. ఈ విషయమై స్థానికులకు ఇదివరకే అనుమానాలు వచ్చినా, టీడీపీ నేతలకు జడిసి నోరు విప్పలేదు. శుక్రవారం నాటి నాటకీయ పరిణామాల నేపథ్యంలో అందరూ ఇదే విషయమై చర్చించుకుంటున్నారు.

వారి పేర్లు ఎక్కడా రాకూడదు

నకిలీ మద్యం రాకెట్‌ను నడిపిస్తున్న టీడీపీ ముఖ్య నేతల పేర్లు ఎక్కడా రాకూడదని, కేసులో వారి పేర్లు ఉండకూడదని ఉన్నతాధికారులకు అమరావతి నుంచి ఆదేశాలు అందినట్లు తెలిసింది. శుక్రవారం నాటి నాటకీయ పరిణామాలు, శనివారం సాయంత్రం ములకలచెరువులో ఎక్సైజ్ అధికారులు నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో వెల్లడించిన అంశాలు పరిశీలిస్తే ఇదే విషయం స్పష్టం అవుతోంది. అసలు వాస్తవాల జోలికి వెళ్లకుండా, సూత్రధారులెవరో చెప్పకుండా, కేవలం పాత్రధారుల వివరాలను మాత్రమే వెల్లడించి చేతులు దులుపుకున్నారు. నకిలీ మద్యం కేసులో అనుమానాలను నివృత్తి చేయాల్సిన ఎక్సైజ్ అధికారుల తీరుపైనా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

ముఖ్యులను తప్పించేసినట్టే

రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం కలిగించిన ములకలచెరువు నకిలీ మద్యం తయారీ రాకెట్‌లో సూత్రధారులను ప్రభుత్వ పెద్దలు తప్పించేసినట్లు కనిపిస్తోంది. ఈ వ్యవహారం వెలుగులోకి రాగానే ప్రభుత్వ నిఘా, ఎక్సైజ్ వర్గాలు తమ నివేదికలను సీఎంఓకు నివేదించాయని సమాచారం. మొదట టీడీపీ నేత కట్టా సురేంద్రనాయుడును అదుపులోకి తీసుకున్నాక.. అక్కడి పరిస్థితి ఉన్నత స్థాయి వ్యక్తుల దృష్టికి వెళ్లింది. మొదట దీనిపై కఠినంగా వ్యవహరించాలనే నిర్ణయంతో సురేంద్ర నాయుడును అరెస్ట్ చేసినట్టు ఎక్సైజ్ అధికారులు ప్రకటించారు. శనివారం అసలు సూత్రధారుల వివరాలను వెల్లడిస్తారని భావించగా, పైస్థాయిలో జరిగిన పరిణామాలతో తంబళ్లపల్లె టీడీపీ ముఖ్యుల పేర్లు బయటకు రాకుండా తొక్కిపెట్టినట్టు తెలిసింది. రాష్ట్ర వ్యాప్తంగా కూటమి ప్రభుత్వం అప్రతిష్టను మూట కట్టుకోవాల్సి వస్తుందని వీరిని తప్పించారని భావిస్తున్నారు. దీంతో ఇప్పటికే కేసులో నమోదు చేసిన నిందితుల పేర్లను మరోమారు వెల్లడించి సరిపెట్టుకున్నారు. నిజానికి తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి పీఏ రాజేష్‌పై కేసు నమోదైంది. అయితే ఇతని అరెస్ట్‌పై అధికారులు ఆసక్తి చూపేలా కనిపించడం లేదు. పీఏ చేసే వ్యవహారాలు జయచంద్రారెడ్డికి తెలియకుండా ఉంటుందనేది నమ్మశక్యం కాదు. రాజేష్‌కు చెందిన మద్యం దుకాణం వైపు శనివారం ఎక్సైజ్ శాఖ అధికారులు కన్నెత్తి కూడా చూడలేదు. ఈ దుకాణాన్ని సీజ్ చేస్తామని, లైసెన్స్ కూడా రద్దు చేస్తామని శుక్రవారం చెప్పిన అధికారులు పై నుంచి ఒత్తిడి రావడంతో ఆ దిశగా చర్యలు తీసుకోలేదని స్పష్టంగా తెలుస్తోంది. ఈ కేసులో నిందితులుగా ఉన్న జనార్దనరావు, కట్టా రాజులు దొరికితే కాని వాస్తవాలు తెలియవని ఎక్సైజ్ అధికారులు తప్పించుకునే ధోరణితో ముందుకెళ్తున్నారు. విజయవాడకు చెందిన జనార్దన్‌రావు ప్రస్తుతం ఆఫ్రికాలో ఉన్నట్టు సమాచారం. ఇదే నిజమైతే అయన్ను ఇక్కడికి ఎప్పుడు రప్పిస్తారు.. ఎప్పుడు అరెస్ట్ చేస్తారు.. నిజాలు ఎప్పుడు వెలికితీస్తారనే దానికి సంబంధించి అధికారుల నుంచి స్పందనే లేదు. ఈ నకిలీ మద్యం ఏడాది క్రితం నుంచి నడుస్తుండగా.. గత నెలలోనే పెట్టారంటూ అధికారులు తేల్చేయడం గమనార్హం.

ఈ ప్రశ్నలకు బదులేదీ?

- ఈ కేంద్రానికి పెట్టుబడి పెట్టింది ఎవరు?
- నగదు లావాదేవీల మాటేంటి? ఏయే అకౌంట్ల ద్వారా లావాదేవీలు నడిచాయి?
- ఒక్క రోజే రూ.1.75 కోట్ల విలువైన నకిలీ మద్యం దొరికిందంటే ఇన్నాళ్లూ సరఫరా చేసిన మద్యం విలువ ఎంత?
- ఏయే ఊళ్లలోని ఏయే దుకాణాలకు నకిలీ మద్యం సరఫరా చేశారు?
- ప్రముఖ బ్రాండ్లకు సంబంధించి నకిలీ మద్యం ఆర్డర్లు ఎక్కడెక్కడి నుంచి వచ్చాయి?
- నకిలీ మద్యం తయారీకి సంబంధించి ముడి సరుకులు ఎక్కడి నుంచి తెచ్చారు?
- లేబుళ్లు, సీసాలు, మూతలు, స్పిరిట్, ఫ్లేవర్లు, భారీ యంత్రాలతో కూడిన ప్లాంట్‌ను నడపడం కేసులో చూపుతున్న నిందితులకు సాధ్యమా?
- చిన్న చిన్న బడ్డీ కొట్లను సైతం వదలకుండా మామూళ్లు దండుకునే ప్రజా ప్రతినిధులకు ఇంత భారీ ప్లాంట్ గురించి తెలియదంటే ఎవరు నమ్ముతారు?
- ఈ కేంద్రాన్ని విజయవాడకు చెందిన జనార్దనరావు అనే వ్యక్తి చూస్తుంటాడని.. అంతా అతనిపైకి నెట్టేయడం ఎంత వరకు సమంజసం?
- అధికార పార్టీ నేతల దండలు లేకుండా స్థానికేతరుడు ఇంత భారీ నకిలీ మద్యం ప్లాంట్‌ను నడపగలడా?
- రోజుకు 20వేలకు పైగా 180 ఎంఎల్ బాటిళ్ల మద్యం తయారు చేసే సామర్థ్యం ఉన్న ఈ ప్లాంట్ నుంచి ఇప్పటి వరకు ఎంత సరుకు విక్రయించారు?
- ఒడిశా, తమిళనాడు నుంచి వచ్చిన తొమ్మిది మంది కూలీలపై కేసులు పెట్టి చేతులు దులుపుకోవడం సబబా?
- పెద్దలంతా తప్పించుకుని ఒక్క కట్టా సురేంద్ర నాయుడిని మాత్రమే బలి పశువును చేస్తున్నారని నిలదీస్తున్న ఓ సామాజిక వర్గీయుల ప్రశ్నలకు ఎవరు సమాధానం చెబుతారు?

నకిలీ మద్యం కేసులో పది మంది అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీసీ జయరాజ్

ములకలచెరువు: అన్నమయ్య జిల్లా ములకలచెరువు పాత హైవే సమీపంలో బట్టబయలైన నకిలీ మద్యం తయారీ కేంద్రం కేసులో 14 మందిపై కేసు నమోదు చేసి, 10 మందిని అరెస్ట్ చేశామని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జయరాజ్ తెలిపారు. స్థానిక ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఆయన మీడియా సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. ఈ కేసులో జనార్దనరావు, కట్టా రాజు, పి.రాజేష్, కొడాలి శ్రీనివాసరావు, నాగరాజు, హాజీ, బాలరాజు, మణిమారన్, అనందన్, సూర్య, వెంకటేషన్ సురేష్, మిథున్, అనంతదాస్, కట్టా సురేంద్ర నాయుడులపై కేసు నమోదు చేశారు. వీరిలో జనార్దనరావు, పి.రాజేష్, కట్టా రాజు, కొడాలి శ్రీనివాసులు పరారీలో ఉన్నారు. వీరి కోసం నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలిస్తున్నట్టు చెప్పారు. మిగతా వారిని అరెస్ట్ చేశారు. నకిలీ మద్యం తయారీ కేంద్రం నుంచి ఒక ఎస్ఎస్ ట్యాంకు, ఒక డిస్టలరీ వాటర్ ట్యాంకు, బాటిళ్లకు మూతలు బిగించే మూడు యంత్రాలు, మూడు వాహనాలు, ఒక ఎలక్ట్రికల్ మోటార్, 1,050 లీటర్ల స్పిరిట్, బాటిలింగ్‌కు సిద్ధంగా ఉన్న 1,470 లీటర్ల మద్యం, 20,208 బాటిళ్ల మద్యం, 12 వేల ఖాళీ బాటిళ్లు, వేలాది మూతలు, 70 క్యాన్లు, రాయల్ లాన్సర్ లేబుళ్లు 10,800, ఓల్డ్ అడ్మిరల్ లేబుళ్లు 1200, కేరళ మాల్ట్ లేబుళ్లు 486, 4 వేల రోల్స్‌ను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్టు వెల్లడించారు. స్వాధీనం చేసుకున్న వీటి విలువ రూ.1.75 కోట్లని చెప్పారు. గత నెలలోనే నకిలీ మద్యం తయారీ మొదలైందని చెప్పుకొచ్చారు. ఈ సమావేశంలో ఏసీ చంద్రశేఖర్‌రెడ్డి, ఈఎస్ మధుసూదనరావు, ఏఈఎస్ జోగేంద్ర, సీఐ నీలకంఠేశ్వరరెడ్డి, స్థానిక బిందుమాధవి, కిశోర్, ఎస్ఐలు జహీర్, సతీష్, యల్లప్ప, సిబ్బంది పాల్గొన్నారు.



అతివేగంతోనే.. అత్యధిక ప్రమాదాలు!

రోడ్డు ప్రమాదాల్లో 1.74 లక్షల మంది దుర్మరణం

- దేశంలో ప్రమాదాల్లో 4.44 లక్షల మంది మృతి
- సగానికిపైగా దుర్ఘటనలకు అతివేగమే కారణం
- సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటలు డేంజర్
- 2023వ సంవత్సర నివేదికలో ఎన్‌సీఆర్‌బీ వెల్లడి

దేశంలో 2023లో జరిగిన ప్రమాదాల్లో 4.44 లక్షల మంది మరణించారు. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాలు, రైల్వే ప్రమాదాలు, రైల్వే క్రాసింగ్ ప్రమాదాల వంటి 'ట్రాఫిక్ ప్రమాదాల్లో' 1.98 లక్షల మంది ప్రాణాలు కోల్పోయారు. మొత్తం రోడ్డు ప్రమాదాల్లో 45.8 శాతం ద్విచక్ర వాహనాల వల్లే జరిగాయి. రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం.. అతివేగమే. ఇలా మొత్తం 2.81 యాక్సిడెంట్లలో 1.02 లక్షల మంది ప్రాణాలు కోల్పోయారు. మొత్తం రోడ్డు ప్రమాదాల్లో అత్యధికంగా 20.7 శాతం సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల్లోపే జరిగాయి. ప్రకృతి వైపరీత్యాల వల్ల 2023లో 6,444 మంది ప్రాణాలు కోల్పోయారు.

– సాక్షి, స్పెషల్ డెస్క్

మహారాష్ట్రలో అత్యధికంగా 69,809 మంది ప్రమాదాల్లో మరణించగా, ఆ తరువాతి స్థానాల్లో మధ్యప్రదేశ్ (43,320), ఉత్తరప్రదేశ్ (43,207) ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో 19,949 ప్రమాదాల్లో 17,039 మరణించగా, తెలంగాణలో 22,903 ప్రమాదాల్లో 13,374 మంది ప్రాణాలు కోల్పోయారు.

రాష్ట్రం	శాతం
మహారాష్ట్ర	15.7
మధ్యప్రదేశ్	9.8
ఉత్తరప్రదేశ్	9.7
తమిళనాడు	7.4
కర్ణాటక	6.8
రాజస్తాన్	6.8
గుజరాత్	5.2
ఒడిశా	5

ప్రమాద మరణాలు

2019	4,21,104
2020	3,74,397
2021	3,97,530
2022	4,30,504
2023	4,44,104

ప్రధాన కారణాలు.. మరణాల శాతం

ట్రాఫిక్ ప్రమాదాలు	44.6
హఠాన్మరణాలు	14.3
నీట మునిగి చనిపోవడం	8.5
జారిపడడం	5.7
విషం కారణంగా	4.9
విద్యుదాఘాతం	3.1
ప్రకృతి వైపరీత్యాలు	1.5
అగ్నిప్రమాదాలు	1.6

ట్రాఫిక్ మరణాలు..: రోడ్డు ప్రమాదాలు, రైల్వే ప్రమాదాలు, రైల్వే క్రాసింగ్ ప్రమాదాలు.. వీటిలో ప్రాణాలు కోల్పోయిన వారిని 'ట్రాఫిక్ మరణాల' కింద పరిగణించారు. 2019లో ఇలా 1.81 లక్షల మంది మరణిస్తే.. 2023 నాటికి ఈ సంఖ్య 1.98 లక్షలకు పెరిగింది. తెలంగాణలో 23,673 ట్రాఫిక్ ప్రమాదాల్లో 8,345 మంది మరణించగా.. ఏపీలో 21,078 కేసుల్లో 9,284 మంది ప్రాణాలు కోల్పోయారు.

	రోడ్డు ప్రమాదాల్లో గాయపడినవారు (లక్షల్లో)	మరణించినవారు
2019	4.39	1,54,732
2020	3.35	1,33,201
2021	3.71	1,55,622
2022	4.23	1,71,100
2023	4.48	1,73,826

టూ వీలర్లే అత్యధికం

మొత్తం రోడ్డు ప్రమాదాల్లో 45.8 శాతం ద్విచక్ర వాహనాల వల్లే జరిగాయి. కారు, జీపు, ఎస్‌యూవీల వల్ల 14.3 శాతం జరగ్గా.. ఆటోల వంటి త్రీవీలర్ల వల్ల 4.1 శాతం సంభవించాయి.

అతివేగం అనర్థదాయకం

రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం పరిమితికి మించిన వేగంతో వెళ్లడమే. ఇలా 58.6 శాతం ప్రమాదాలు జరిగాయి. మొత్తం 2.81 యాక్సిడెంట్లలో 1.02 లక్షల మంది ప్రాణాలు కోల్పోయారు. నిర్లక్ష్యంగా డ్రైవింగ్, ఓవర్ టేకింగ్ వంటి వాటివల్ల 23.6 శాతం యాక్సిడెంట్లు సంభవించాయి. మాదక ద్రవ్యాలు, మద్యం సేవించి వాహనం నడపడం వల్ల 2.1 శాతం ప్రమాదాలు చోటుచేసుకున్నాయి.

మొత్తం రోడ్డు ప్రమాదాల్లో 60.2 శాతం (2.80 లక్షల కేసులు) గ్రామీణ ప్రాంతాల్లో నమోదు కాగా.. 39.8 శాతం (1.84 లక్షలు) పట్టణాల్లో జరిగాయి.

రాత్రి పూటే అధికం

మొత్తం రోడ్డు ప్రమాదాల్లో అత్యధికంగా 20.7 శాతం (95,984) సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల్లోపే సంభవించాయి. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల్లోపు 17.3 శాతం, మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల్లోపు 15 శాతం సంభవించాయి.

ప్రమాదాల్లో టాప్-5 రాష్ట్రాలు

తెలంగాణలో 22,903 రోడ్డు ప్రమాదాలు జరగ్గా, ఏపీలో 19,949 జరిగాయి.

తమిళనాడు	67,213
మధ్యప్రదేశ్	54,763
కేరళ	45,981
కర్ణాటక	43,439
ఉత్తరప్రదేశ్	37,764

మరణాల్లో టాప్ - 5 రాష్ట్రాలు

తెలంగాణలో 7,660 మంది ప్రాణాలు కోల్పోగా, ఆంధ్రప్రదేశ్‌లో 8,137 మంది రోడ్డు ప్రమాదాల్లో మరణించారు.

ఉత్తరప్రదేశ్	23,947
తమిళనాడు	18,347
మహారాష్ట్ర	15,434
మధ్యప్రదేశ్	14,098
కర్ణాటక	12,322

తమిళనాడు గవర్నర్‌కు వ్యతిరేకంగా 'సుప్రీం'లో పిటిషన్

- డీఎంకే ప్రభుత్వం దాఖలు

సాక్షి, చెన్నై: రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవికి వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టులో మళ్లీ పిటిషన్ దాఖలు చేసింది. అందులో కలైంజ్ఞర్ కరుణానిధి పేరిట వర్సిటీ ఏర్పాటుకు అసెంబ్లీ ఆమోదించిన బిల్లును గవర్నర్ ఎడతెగని జాప్యం చేస్తూ చివరకు రాష్ట్రపతికి పంపించినట్లు ఆరోపించారు. వివరాలివీ.. రాష్ట్ర గవర్నర్, డీఎంకే ప్రభుత్వం మధ్య వివిధ అంశాలపై నెలకొన్న వివాదాలు ఇప్పటికే సుప్రీంకోర్టు వరకు వెళ్లిన విషయం తెలిసిందే. 'సుప్రీం' ఉత్తర్వులతో రాష్ట్ర ప్రభుత్వం పలు వర్సిటీల వ్యవహారాలకు సంబంధించిన ముసాయిదాలను ఆమోదించుకుంది. ఈ పరిస్థితుల్లో కుంభకోణంలో కలైంజ్ఞర్ కరుణానిధి పేరిట వర్సిటీ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్‌లో నిర్ణయించింది. అసెంబ్లీ ఆమోదం పొందిన ఈ ముసాయిదా రాజ్‌భవన్‌కు చేరింది. ఆర్నెల్లవుతున్నా ఇంతవరకు రాజ్‌భవన్ నుంచి ఆమోదం రాలేదు. తాజాగా.. ఈ ముసాయిదాను రాష్ట్రపతికి పంపించినట్లు సంకేతాలు వెలువడ్డాయి. దీంతో ఈ వర్సిటీ సాధన కోసం డీఎంకే ప్రభుత్వం మళ్లీ న్యాయ పోరాటానికి సిద్ధమైంది. ఈ మేరకు గవర్నర్‌కు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో శనివారం పిటిషన్ దాఖలు చేశారు.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
ఆదివారం ॥ 5-10-2025



"ఎప్పుడూ బిజీగా ఉండడం వల్ల చేస్తున్న పనుల తాలుకు ఆలోచనలతోనే బుర్ర నిండిపోతుంది. దీంతో సృజనాత్మక, ప్రత్యామ్నాయ ఆలోచనలకు ఆ బుర్రలో చోటు ఉండదు. అందుకే మన డైరీలో కొన్ని రోజులు లేదా గంటలు ఖాళీగా ఉండేలా చూసుకోవాలి. ఇదే 80 శాతం రూల్. 20 శాతం కృషితో, 80 శాతం ఫలితం వస్తుందనేది 80 శాతం రూల్. మెటా చీఫ్ మార్క్ జుకర్ బర్గ్‌తో సహా ఎంతోమంది ఈ రూల్‌ను అనుసరిస్తున్నారు."

● స్ఫూర్తి

గురి తప్పని బాణం

స్ఫూర్తిదాయకమైన విజేతలు, సామాన్యులలో అసామాన్యుల గురించి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో పోస్టులు పెట్టే పారిశ్రామిక దిగ్గజం ఆనంద్ మహీంద్రా ఈసారి పారాలింపిక్ అథ్లెట్ శీతల్‌దేవిపై ప్రశంసల వర్షం కురిపించారు. ప్రపంచ పారా ఆర్చరీ ఛాంపియన్‌షిప్స్‌లో శీతల్‌దేవి చారిత్రాత్మకమైన బంగారు పతకాన్ని సాధించిన విషయం తెలిసిందే.

పుట్టుకతోనే రెండు చేతులు లేకపోయినా సంకల్పబలాన్ని మాత్రం ఎప్పుడూ కోల్పోలేదు శీతల్. ఆ బలమే తనను స్ఫూర్తిదాయకమైన విజేతను చేసింది.

'శీతల్, నువ్వెప్పుడూ వరల్డ్ ఛాంపియన్‌వే. ప్రజల మనసులను గెలుచుకోవడంలో



కూడా నువ్వు ఛాంపియన్‌వి' అని శీతల్ దేవిని ఆకాశానికెత్తారు మహీంద్రా.

గత సంవత్సరం ఒక బాణాన్ని ఆనంద్‌కు బహూకరించింది శీతల్.

'నువ్వు నాకు బహుమతిగా ఇచ్చిన బాణం నా కుటుంబంలో విలువైన వారసత్వ సంపదగా నిలిచిపోతుంది. నీలాగే ధైర్యంగా ఉండడానికి మాకు ఎప్పుడూ స్ఫూర్తినిస్తుంది' అని రాశారు.

శీతల్‌దేవితో తాను ఉన్న ఫోటోను పోస్ట్ చేశారు.

● డిజిటల్ వరల్డ్



'ఆ హీరోయిన్ డేట్లు దొరకడం చాలా కష్టం'
'ఆ హీరోయిన్ ఎక్కువ ఫీజులు తీసుకుంటుంది'
'బాగానే నటిస్తుంది గానీ టైమ్‌కు లొకేషన్‌కు రాదు. నిర్మాతలను ఏడిపిస్తుంది'...
ఇలాంటి మాటలు టిల్లీ నార్వుడ్ విషయంలో వర్తించవు.
టిల్లీ నార్వుడ్ హాలీవుడ్‌లో తొలి ఏఐ జనరేటెడ్ నటిగా చరిత్ర సృష్టించనుంది...

త్వరలో... మీ అభిమాన థియేటర్‌లలో ఏఐ హీరోయిన్

లండన్‌లోని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కంపెనీ 'పార్టికల్ 6' డిజిటల్ స్టార్ టిల్లీ నార్వుడ్‌ను సృష్టించింది. తమ డిజిటల్ స్టార్‌ను జ్యూరిచ్ సదస్సులో పరిచయం చేశారు. ఆమె నటనైపుణ్యాన్ని పరిచయం చేసే డెమో వీడియోలు రూపొందించారు. ఈ అందాల సుందరిని తెరంగేట్రం చేయించడానికి హాలీవుడ్ ఎగ్జిక్యూటివ్, ఏజెంట్లతో చర్చలు మొదలయ్యాయి.

చర్చలు ఫలప్రదం అయితే ఫస్ట్ ఏఐ-జనరేటెడ్ స్టార్‌గా టిల్లీ నార్వుడ్ చరిత్ర సృష్టించనుంది.

'భవిష్యత్‌లో టెలివిజన్ అభివృద్ధి' అనే అంశంపై తీసిన 'ఏఐ కమిషనర్' అనే కామెడీ స్కెచ్‌లో తొలిసారిగా కనిపించింది టిల్లీ. 'నా మొట్టమొదటి పాత్ర ప్రత్యక్షప్రసారం అయింది. నిజంగా ఇది నమ్మలేకపోతున్నాను!' అని తన ఫేస్‌బుక్ పేజీలో పోస్ట్ చేసింది టిల్లీ నార్వుడ్.

ఈ ఏఐ స్టార్ గురించి 'ఆహా' అనేవాళ్లతోపాటు 'అయ్యయ్యో' అంటున్నవాళ్లు కూడా ఉన్నారు.

నిర్మాణసంస్థల ఆసక్తి విషయం ఎలా ఉన్నా హాలీవుడ్ తారలు మాత్రం ఏఐ స్టార్‌పై నిరసన వ్యక్తం చేస్తున్నారు. 'ఇన్ ది హైట్స్' స్టార్ మెలిసా బరెరా 'ఎంత దారుణం ఇది' అని ఇన్‌స్టాగ్రామ్ వేదికగా నిరసన తెలిపారు.

'ఆమెకు అందమైన రూపం తీసుకురావడానికి ఎంతోమంది నిజజీవిత అందగత్తెల ముఖాలను రెఫరెన్స్‌గా తీసుకొని ఉంటారు. ఇంత శ్రమ ఎందుకు? ఆ సహజ అందాల సుందరులనే హాలీవుడ్‌కు పరిచయం చేయవచ్చు కదా!' అని హాలీవుడ్ నటుడు ఒకరు స్పందించారు.

ఘాటైన విమర్శల నేపథ్యంలో 'పార్టికల్6' వ్యవస్థాపకురాలు, సీయీవో ఎలిన్ వాన్ ఇలా స్పందించారు...

'మా ఏఐ క్యారెక్టర్ టిల్లీ నార్వుడ్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నవారికి చెప్పేదేమిటంటే..., నిజమైన నటులకు ఇది ప్రత్యామ్నాయం కాదు. ఎన్నో సృజనాత్మక అంశాలలో ఇది కూడా ఒకటి. సృజనాత్మక శక్తిని తెలియజేసేది. యానిమేషన్, తోలుబొమ్మలాట, సిజీఐ వలన తెరపై కొత్తదనం వచ్చిందే తప్ప నటులు కనిపించకుండా పోలేదు. ఇప్పుడు కూడా అంతే. సరికొత్త ఏఐ క్యారెక్టర్ వలన కొత్త ఆలోచనకు ఆస్కారం ఏర్పడుతుంది. ఆ క్యారెక్టర్‌లకు తగినట్లు కొత్తకథలు తయారవుతాయి. నేను స్వతహాగా నటిని. ఏఐ క్యారెక్టర్ మనిషి సహజ నటనైపుణ్యాన్ని దూరం చేయదు'

నిజానికి సినీరంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)ను ఏదో ఒక రకంగా ఉపయోగిస్తూనే ఉన్నారు. ఉదా: నటుల వయసు తగ్గించడానికి, దివంగత నటుల గొంతును తిరిగి తీసుకురావడానికి, సినిమా ట్రైలర్‌లు ఆకట్టుకునేలా రూపొందించడానికి... మొదలైనవి.

అయితే ఏఐ నటి మెయిన్ స్ట్రీమ్‌లోకి రావడం అనేది టిల్లీ నార్వుడ్‌తోనే మొదలు కానుంది.

అక్కడెక్కడో ఆవిష్కృతమైన సాంకేతిక అద్భుతం గురించి తెలుసుకొని 'ఆహా వోహో' అనుకునేలోపే ఆ సాంకేతికత మనల్ని కూడా పలకరించి లోకలైజ్ అయిపోతుంది.

'గుండమ్మ కథ రీమేక్ చేస్తే బానే ఉంటుందిగానీ గుండమ్మ పాత్రను అంత అద్భుతంగా ఎవరు చేయగలరండి!'

'సావిత్రి లాంటి మహానటి నటనను మళ్లీ చూడలేమా?'... ఇలాంటి

హాలీవుడ్ టు టాలీవుడ్... తప్పదేమో!



మాటలు సినీప్రియుల నోటి నుంచి వినిపిస్తూ ఉంటాయి. ఈ నేపథ్యంలో 'పార్టికల్6' టాలీవుడ్‌కు చేరువ అయితే...

'ఆ లోటును ఎవరు భర్తీ చేయగలరు' అనే మాట వినిపించకపోవచ్చు. ఎందుకంటే 'పార్టికల్6' ఏఐ అవతార్‌తో వారినే స్వయంగా నటింపజేయవచ్చు!

● నివాళి



చింపాంజీల ప్రాణహిత

'చింపాంజీల నుంచి మనిషి నేర్చుకోవాల్సింది చాలా ఉంది'.... ఈ మాట అనడంతో జేన్ గుడ్ ఆల్ 'కోతి నుంచి మానవుడు పుట్టాడు' అనే సిద్ధాంతాన్ని ఒక విధంగా ప్రశ్నార్థకం చేసింది. 'మానవులకు అతి సమీపంగా నివసించే చింపాంజీల గురించి నేను పరిశోధన చేసే వరకూ లోకానికి ఏమీ తెలియదు' అంటుంది జేన్ గుడ్‌ఆల్. ఈ బ్రిటిష్ పర్యావరణవేత్త ఆఫ్రికాలో చింపాంజీల గురించి 'సుదీర్ఘమైన' ఫీల్డ్‌వర్క్ చేసింది. 91 సంవత్సరాల వయసులో అక్టోబర్ 1న కన్ను మూసిన జేన్ గుడ్‌ఆల్ ఎందరో పర్యావరణ ప్రియులకు స్ఫూర్తి.

'చింపాంజీలను చూసి బిడ్డకు తల్లి ఇవ్వాల్సిన భరోసాను నేర్చుకోవచ్చు. చింపాంజీలలో తల్లి తన బిడ్డను ఎప్పటికీ వదలదు... అది పెద్దయ్యి రెండు మూడు నమ్మదగ్గ స్నేహితులను సంపాదించుకునే వరకు. అలాగే తగువులాడి తిరిగి కలిసిపోవడంలో చింపాంజీలు చాలా పెద్ద మనసు చూపుతాయి. మనుషులు కొట్లాడుకుంటే తిరిగి కలిసే విషయంలో చాలా భేషజం చూపుతారు' అంటారు జేన్ గుడ్ ఆల్. టాంజానియాలో 1960 నుంచి 30 ఏళ్లకు పైగా చింపాంజీల గురించి పరిశోధన చేసిన జేన్ గుడ్ ఆల్ ఇంగ్లాండ్‌లోని బోర్‌మెత్ అనే పట్టణంలో జీవిస్తూ అమెరికా పర్యటనలో అక్కడే కన్నుమూశారు.

ఎవరు జేన్ గుడ్ ఆల్?

జేన్ గుడ్ ఆల్ పూర్తి పేరు వాలెరీ జేన్ మోరిస్-గుడ్ ఆల్. 1934 ఏప్రిల్ 3న లండన్‌లో జన్మించారు. తండ్రి హార్బర్ట్ మారిస్ వ్యాపారి. తల్లి మార్గరెట్ జోసెఫ్ నవలా రచయిత్రి. సంపన్న కుటుంబంలో పుట్టిన గుడ్ ఆల్ కోసం ఓసారి ఆమె తండ్రి 'జూబ్లీ' అనే చింపాంజీ బొమ్మను కానుకగా ఇచ్చాడు. దాన్ని చూసి తోటివాళ్లు భయపడి అసహ్యించుకున్నా గుడ్ ఆల్ మాత్రం ఆప్యాయంగా హత్తుకుంది. తనకు చింపాంజీల మీద ప్రేమ కలిగేందుకు కారణమైన తొలి సంఘటన అదే అంటారామె. 1957లో కెన్యాలో తన స్నేహితురాలి పొలానికి వెళ్లడం జేన్ గుడ్ ఆల్ జీవితంలో మేలి మలుపు. అక్కడ కెన్యా పురావస్తు శాస్త్రవేత్త, పాలియెంటాలజిస్ట్ (శిలాజాల అధ్యయనవేత్త) అయిన లూయిస్ లీకీని ఆమె కలుసుకున్నారు. ఆ సమయంలో ఆయన కోతులపై అధ్యయనం చేస్తున్నారు. తన అధ్యయానికి గుడ్‌ఆల్ సహకారం అందించగలదని ఆయన భావించారు. అలా ఆయన వద్ద ఆమె సెక్రటరీగా చేరారు. ఆయన వద్ద పని చేస్తున్న సమయంలో ఆమె ఓర్పు, నేర్పులను పరిశీలించిన ఆమెను టాంగన్యికా (ప్రస్తుతం టాంజానియా)కు పంపారు లూయిస్ లీకీ.



అదే ఆమె కార్యక్షేత్రం

1960 జులై 14న గుడ్ ఆల్ తొలిసారి టాంజానియాలోని గోంబే స్ట్రీమ్ నేషనల్ పార్క్‌కు వెళ్లారు. అది ఆమె జీవితానికి కీలకమైన ఘట్టం. ఆ సమయంలో ఆమె తల్లి కూడా వెంట ఉండి, ఆమెను తన కెరీర్లో ప్రోత్సహించడం చెప్పుకోదగ్గ విషయం. అడవుల్లో తిరుగుతూ, జంతువులను మచ్చిక చేసుకుని, వాటిపై పరిశోధన చేయడం మగవాళ్ల పని అని భావించే కాలంలో తల్లి తనకు అందించిన సహకారానికి కృతజ్ఞత తెలిపేవారు.

గోంబే స్ట్రీమ్ నేషనల్ పార్క్‌లోని 'కసకేలా చింపాంజీ కమ్యూనిటీ'తో ప్రారంభించి చింపాంజీ సామాజిక, కుటుంబ జీవితాన్ని అధ్యయనం చేశారు గుడ్‌ఆల్. చింపాంజీలు కేవలం జంతువులు అన్న ధోరణిని కాదని, 'వాటికి కూడా వ్యక్తిత్వం ఉంది. చింపాంజీలకూ ఆనందం, దుఃఖం వంటి భావోద్వేగాలు ఉంటాయి' అని ఆమె కనుగొన్నారు. మానవ చర్యలుగా భావించే కౌగిలింతలు, ముద్దులు, వీపుమీద తట్టడం, చక్కిలిగింతలు చింపాజీల్లోనూ ఉంటాయని గమనించారు. ఇదంతా ఒక్క రోజులో సాధ్యపడ్డ సంగతి కాదు. ఎన్నో రోజులపాటు వాటి మధ్య మెలిగి, వాటిని గమనిస్తూ తెలుసుకున్న సంగతులు.

ఆమె పరిశోధనలు

గుడ్‌ఆల్ చేసిన పరిశోధనల కారణంగా అప్పటి దాకా చింపాంజీల గురించి ప్రపంచం నమ్మిన రెండు విషయాలు అబద్ధాలని తేలింది. ఒకటి చింపాంజీలు శాకాహారులు అనుకోవడం, మరొకటి చింపాంజీలు ఏ సాధనాలనూ తయారు చేయలేవు అని భావించడం. అయితే చింపాంజీలు చెదపురుగులను తినడాన్ని ఆమె గమనించారు. చింపాంజీలు చెట్ల నుండి కొమ్మలను తీసుకొని ఆకులను తీసేసి, వాటిని తమ కోసం వాడుకోవడం గుర్తించారు. మనుషులు మాత్రమే ఒక వస్తువు నుంచి మరో వస్తువు తయారు చేయగలరన్న విషయం అబద్ధమని, చింపాంజీలకూ ఆ శక్తి ఉందని నిరూపించారు. చింపాంజీ దళాల్లో దూకుడు, హింస, అడవిలో తమ ఆధిపత్యాన్ని కొనసాగించడానికి ఇతర ఆడపిల్లల పిల్లలను ఉద్దేశపూర్వకంగా చంపడం వంటివన్నీ గుడ్‌ఆల్ చేసిన పరిశోధనల ద్వారానే ప్రపంచానికి తెలిశాయి. 1990లో ఆమె రాసిన 'త్రూ ఎ విండో: మై థర్టీ ఇయర్స్ విత్ ది చింపాంజీస్ ఆఫ్ గోంబే'లో ఆ అనుభవాలన్నీ ఆమె పొందుపరిచారు.

చింపాంజీల ఫ్రెండ్

చింపాంజీలు మనుషుల్ని అంత సులభంగా తమతో కలుపుకోవు. అయితే గుడ్‌ఆల్‌ని మాత్రం తమ తోటి ప్రాణిగానే భావించాయి. ఏళ్ల తరబడి వాటితో మమేకమైపోయిన ఆమె వాటి కోసం ఎంతో తపన పడేవారు.



'The only human ever accepted into chimpanzee society' అంటూ అందరూ ఆమెను పొగిడేవారు. చింపాంజీలకు పేర్లు పెట్టడం, వారి మధ్య గొడవలు వస్తే తీర్చడం, వాటి భావోద్వేగాలను అర్థం చేసుకోవడం, వాటి మూడ్‌ని బట్టి వాటికి ఇష్టమైన పనులు చేయడం, వాటితో కలిసి షికారుకు వెళ్లడం వంటి వన్నీ ఆమె చేసేవారు.

చింపాంజీల మీద జరిగే పరిశోధనల కోసం 'జెన్ గుడ్‌ఆల్ ఇన్‌స్టిట్యూట్'ను స్థాపించిన ఆమె రిపబ్లిక్ ఆఫ్ కాంగోలో చింపూగా చింపాంజీ రిహాబిలిటేషన్ కేంద్రం ప్రారంభించారు. ఇందులో వందలాది చింపాంజీలను సంరక్షిస్తున్నారు. అడవుల నరికివేత కారణంగా తిండి, నివాసం కోల్పోయిన చింపాంజీలను గుర్తించేందుకు, వాటి పట్ల జనానికి అవగాహన కల్పించేందుకూ గుడ్ ఆల్ చర్యలు చేపట్టారు. దేశవిదేశాల్లో అనేక సదస్సులు నిర్వహించి పర్యావరణ పరిరక్షణ గురించి, చింపాంజీల జీవన విధానం గురించి వివరించారు. ఆమె కృషికి ఫలితంగా అనేక అంతర్జాతీయ పురస్కారాలు ఆమెను వరించాయి. 'సృష్టిలో ప్రాణులన్నీ సమానమే. ఇందులో మనిషి అధికుడు, జంతువులు తక్కువ అన్న భావన సరికాదు. మనం ప్రేమ పంచగలిగితే అందుకు నేందుకు మూగజీవులు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటాయి' అనేది ఆమె మాట.

● సోషల్ మీడియా

కన్నుల.. వీనుల విందు

తిరువనంతపురంలోని ఆ ఇంట్లోకి అడుగు పెడితే సంగీత కళాశాలలోకి అడుగు పెట్టినట్లుగా ఉంటుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఈ కుటుంబ సంగీత కచేరి వీడియో వైరల్‌గా మారింది. ఈ వీడియోను చూసి ముచ్చటపడిన సంగీత దిగ్గజం ఏఆర్ రెహమాన్ ఆ కుటుంబానికి అభినందనలు తెలిపారు.

ఫాతిమా వయోలిన్ వాయిస్తుంది. ఆమె చెల్లి గిటార్ వాయిస్తుంది. ఆమె తండ్రి తబలా వాయిస్తూ గానం చేస్తాడు. వీరందరూ కలిసి రెహమాన్ ట్యూన్ చేసిన 'గురు' సినిమాలోని 'తెరే బినా' పాటను అద్భుతంగా ఆలాపించారు.



'హార్ట్' 'క్లాప్' ఇమోజీలతో కామెంట్ సెక్షన్ నిండిపోయింది. కనుల, వీనుల విందు చేసే ఈ వీడియో చూస్తూ.... 'ఆ ఇల్లు ఎంత అదృష్టం చేసుకుందో!' అని స్పందించారు నెటిజనులు.

● హెల్త్

● అవగాహనే ఆయుధం

క్యాన్సర్ రొమ్ము విరుద్దాం!

ప్రపంచ వ్యాప్తంగా మహిళలను ఆందోళనకు గురి చేస్తున్న వ్యాధుల్లో రొమ్ము క్యాన్సర్ ఒకటి. మన దేశంలో మహిళల్లో వ్యాప్తిచెందుతున్న క్యాన్సర్లలో, అలాగే మహిళల మరణాలకు కారణమవుతున్న క్యాన్సర్లలోనూ దానిదే అగ్రస్థానం. ఈ క్యాన్సర్‌ను ఎంత త్వరగా కనుక్కుంటే మహిళల్లో సమర్థ చికిత్స ద్వారా దాన్నుంచి నూటికి నూరు పాళ్లూ పూర్తిగా విముక్తిపొందే అవకాశముంది. **ఈ అక్టోబరు నెల 'రొమ్ముక్యాన్సర్ అవగాహన మాసం'.** ఈ నేపథ్యంలో రొమ్ముక్యాన్సర్‌కు కారణాలూ, స్క్రీనింగ్ ప్రాధాన్యం, అందుబాటులో ఉన్న చికిత్స ప్రక్రియల వంటి అనేక అంశాలపై అవగాహన కోసం ఈ కథనం.



రొమ్ముక్యాన్సర్ ప్రధానంగా మహిళల రొమ్ముల్లో ఉండే పాలు ఉత్పత్తి చేసే 'లోబ్యూల్స్' అనే గ్రంథుల్లో లేదా ఆ పాలను నిపుల్ వరకు తీసుకెళ్లేందుకు ఉపయోగపడే ట్యూబుల్లో గానీ పెరిగే అవకాశం ఎక్కువ. ఆ హానికరమైన ట్యూమర్ నుంచి క్యాన్సర్ కణాలు పక్కనే ఉండే లింఫ్ నోడ్స్‌లోకి ప్రవేశించేందుకు అవకాశముంటుంది. ఒకసారి క్యాన్సర్ కణం లింఫ్ నోడ్స్ లోకి గానీ ప్రవేశిస్తే... అక్కడి నుంచి అది దేహంలోని ఏ ప్రాంతానికైనా విస్తరించే ముప్పు ఉంటుంది. అందుకే ఆలోపే దాన్ని కనుక్కోగలిగితే చికిత్సతో రొమ్ము క్యాన్సర్‌ను పూర్తిగా నయం చేసే అవకాశముంటుంది. అందుకే రొమ్ముక్యాన్సర్‌పై అవగాహన పెంచుకునే అవకాశం తప్పనిసరి.

రొమ్ముక్యాన్సర్ విస్తృతి

ఇది సాధారణంగా మహిళల్లోనే ఎక్కువగా వచ్చే ప్రధానమైన క్యాన్సర్. మహిళల్లోనే వస్తుందన్నంత మాత్రాన పురుషుల్లో దీని ముప్పు ఉండదని కాదు. అయితే పురుషుల్లో ఇది కాస్తంత అరుదు. స్త్రీ పురుష నిష్పత్తి ప్రకారం... ప్రతి 135 మంది మహిళలకు ఒక పురుషుడిలో ఇది కనిపిస్తుంది. పైగా గతంలో పోలిస్తే ఇటీవల పురుషుల్లోనూ ఇది కాస్తంత ఎక్కువగానే కనిపిస్తోంది. దీన్ని బట్టి చూస్తే ఇది పూర్తిగా మహిళలకే పరిమితమని చెప్పడానికి వీల్లేదు.



డాక్టర్ కవిత వాసిరెడ్డి
సీనియర్ కన్సల్టెంట్
రేడియేషన్ ఆంకాలజిస్ట్

కారణాలూ... ముప్పును పెంచే అంశాలు

ఇదమిత్థంగా ఇవే కారణాలంటూ స్పష్టంగా చెప్పలేకపోయినప్పటికీ... రొమ్ముక్యాన్సర్‌ను అనేక అంశాలు తెచ్చిపెడతాయి. వాటిల్లో కొన్ని...

● **కుటుంబం చరిత్ర :** కుటుంబంలో దగ్గరి వారికి రొమ్ము క్యాన్సర్ వచ్చిన దాఖలాలు ఉండటం, అందునా తల్లి, తల్లి సోదరి లాంటి మరీ దగ్గరి బంధువుల్లో రొమ్ముక్యాన్సర్ దాఖలా ఉన్నవాళ్లలో దీని ముప్పు మరింత ఎక్కువ.

● **జన్యుపరమైన ముప్పు :** జన్యుపరంగా బీఆర్‌సీఏ 1, బీఆర్‌సీఏ 2 అనే జన్యుపరమైన మ్యుటేషన్ జరిగినవాళ్లలో రొమ్ముక్యాన్సర్ తప్పక వచ్చే అవకాశం.

● **త్వరగా రుతుస్రావం రావడం :** బాలికలు చాలా త్వరగా రుతుస్రావం కావడం (అంటే 12 ఏళ్ల లోపే బాలికలు రుతుస్రావం మొదలుకావడం) అలాగే రుతుక్రమం ఆగడం చాలా ఆలస్యంగా జరిగినవాళ్లలో రొమ్ముక్యాన్సర్ ముప్పు (రిస్క్) ఎక్కువ.

● **సంతానలేమి / ఆలస్యంగా సంతానం :** సంతానం లేని మహిళలూ, అలాగే చాలా ఆలస్యంగా గర్భవతులైన వాళ్లలో.

● **అస్తవ్యస్తమైన జీవనశైలి / దురలవాట్లు :** అంతగా క్రమశిక్షణ లేకుండా అనారోగ్యకరమైన జీవనశైలితో ఉండేవాళ్లకూ, అలాగే పొగతాగడం, మద్యం వంటి అలవాట్లు ఉన్నవాళ్లలో (ప్రధానంగా విదేశీ మహిళల్లో ఈ తరహా అలవాట్లు ఎక్కువ).

● **రేడియేషన్‌కు గురైన మహిళల్లో :** తాము యువతులుగా ఉన్నప్పుడు ఏవైనా కారణాలతో రేడియేషన్‌కు చాలా ఎక్కువగా ఎక్స్‌పోజ్ అయిన మహిళల్లో.

అపోహలూ ఎక్కువే...

రొమ్ముక్యాన్సర్ విషయంలో అపోహలూ ఎక్కువే. ఉదాహరణకు రొమ్ముల్లో గడ్డలు, నీటితిత్తులు ఉన్నప్పుడు అది క్యాన్సరే అని చాలామంది అపోహ పడుతుంటారు. రొమ్ముల్లో గడ్డలూ, నీటితిత్తులూ కనిపించడం చాలా సాధారణం. ఇలాంటివారిలో 80 శాతం కేసుల్లో అవి హానికరం కానివే. వాటినే 'బినైన్' గడ్డలుగా చెబుతారు. కేవలం 20 శాతం కేసుల్లోనే అవి హానికరమైన (మేలిగ్నెంట్) క్యాన్సర్‌గా బయటపడతాయి. అందుకే రొమ్ముల్లో గడ్డలు కనిపించగానే అది తప్పనిసరిగా క్యాన్సర్ అని ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. అలా కనిపించేవాటిల్లో చాలావరకు అంటే దాదాపు 80 శాతం ఎలాంటి హాని కలిగించనివే. కాకపోతే గుర్తుంచుకోవాల్సిన విషయం ఏమిటంటే... రొమ్ముల్లో అలాంటి గడ్డలు కనిపించగానే వీలైనంత త్వరగా ఒకసారి డాక్టర్‌కు చూపించి, అవి హానికరం కాదని వారు నిశ్చయంగా చెప్పాక ఇక నిశ్చింతగా ఉండవచ్చు. అలాగే పెద్దసైజు రొమ్ములు ఉన్నవారికి ఈ ముప్పు ఎక్కువ అనేది మరో అపోహ. రొమ్ము పెద్దగా ఉండటానికీ, క్యాన్సర్‌కూ ఎలాంటి సంబంధమూ ఉండదు.

స్క్రీనింగ్ పరీక్షలు అన్నిటికంటే ప్రధానం...

రొమ్ముక్యాన్సర్‌ను ఎంత త్వరగా కనుక్కుంటే దాన్నుంచి అంత పూర్తిగా విముక్తం కావడం సాధ్యమనే విషయాన్ని బట్టి బ్రెస్ట్‌క్యాన్సర్ విషయంలో స్క్రీనింగ్ పరీక్షలకు ఉన్న ప్రాధాన్యమేమిటన్నది వివరించవచ్చు. దాదాపు 35 ఏళ్లు దాటిన ప్రతి మహిళా, అలాగే కుటుంబంలో రొమ్ముక్యాన్సర్ ఉన్న మహిళలతో పాటు రిస్క్‌ఫ్యాక్టర్స్ ఉన్న స్త్రీలు ఏడాదికోమారు లేదా తమ డాక్టర్ చెప్పిన విధంగా స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలి. అలాగే ప్రతి మహిళా తమ రొమ్ములను పరీక్షించుకునే 'సెల్ఫ్ బ్రెస్ట్ ఎగ్జామినేషన్' వివరాలు తెలుసుకుంటూ స్నానం సమయంలో వాటిని పరీక్షించుకుంటూ ఉండాలి. అందువల్ల తొలిదశలోనే రొమ్ముక్యాన్సర్‌ను కనుక్కోవడం సాధ్యం... తద్వారా దాన్నుంచి పూర్తిగా విముక్తం కావడమూ సాధ్యమే.



ఈ లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం వద్దు...

ఈ కింద పేర్కొన్న లక్షణాలు కనిపించినప్పుడు వాటిని అస్సలు నిర్లక్ష్యం చేయకూడదు. అవేమిటంటే...

- రొమ్ము లేదా చంకల్లో నొప్పిలేని గడ్డ (లంప్) కనిపించడం.
- రొమ్ము సైజు లేదా ఆకృతిలో మార్పు రావడం.
- నిపుల్ నుంచి ఏదైనా ద్రవం స్రవిస్తుండటం.
- రొమ్ము చర్మంపై ఏవైనా మార్పులు అంటే గుంటపడటం లేదా చర్మం మందంగా మారడం వంటివి.
- చాలా అరుదుగా రొమ్ముక్యాన్సర్ వచ్చినవాళ్లలో రొమ్ములో లంప్, ఒకవేళ లంప్ లేకుండానే రొమ్ముపై చర్మం పొరలు పొరలుగా ఊడుతూ ఉండటం, రొమ్ము ఎర్రబారడం, వాపు వంటి లక్షణాలు చాలా అరుదుగా కనిపించవచ్చు.

నివారణ/చికిత్స...

క్యాన్సర్‌కు కారణమయ్యే కొన్ని అంశాల్లో మానవ నియంత్రణ సాధ్యం కాదు. ఉదాహరణకు పెరుగుతుండే వయసు. అయితే మన ప్రమేయంతో రొమ్ముక్యాన్సర్‌ను చాలావరకు నివారించవచ్చు. ఉదాహరణకు అన్ని పోషకాలు ఉండే సమతులాహారాన్ని తీసుకోవడం; క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం; ప్రసవం తర్వాత పిల్లలకు చనుబాలు పట్టించడం; ఆల్కహాల్, పొగతాగడం వంటి దురలవాట్లకు దూరంగా ఉండటం, బరువును నియంత్రణలో ఉంచుకోవడం వంటి జాగ్రత్తలతో రొమ్ముక్యాన్సర్‌ను చాలావరకు నివారించవచ్చు. అయితే ఇప్పుడు కీమోథెరపీ, రేడియేషన్ థెరపీ, శస్త్రచికిత్సలతో పాటు అనేక ఇతరత్రా ప్రక్రియలతో రొమ్ముక్యాన్సర్‌కు సమర్థమైన చికిత్స సాధ్యం.

కుటుంబ చరిత్ర, ఇతర అంశాలూ పూర్తి కారణాలు కాదు...

అయితే ఈ సందర్భంగా ఒక ప్రధానమైన విషయాన్ని గుర్తుపెట్టుకోవాలి. పైన పేర్కొన్న అంశాలనే ప్రామాణికంగా తీసుకోవడమూ పూర్తిగా సాధ్యం కాదు. ఎందుకంటే వ్యాధి నిర్ధారణ జరిగిన కేసుల్లో దాదాపు 70శాతం మందిలో వాళ్ల కుటుంబంలో రొమ్ముక్యాన్సర్ ఉన్న దాఖలాలు లేకపోవడం ఒక వైరుధ్యం. అలాగే నిర్దిష్టంగా ఫలానా అంశమే రొమ్ముక్యాన్సర్‌కు కారణమవుతుందని లేదు. చాలా సందర్భాల్లో ఎలాంటి రిస్క్‌ఫ్యాక్టర్స్ లేనివాళ్లలోనూ ఇది కనిపించడమూ మామూలే.

చివరగా... గత మూడు దశాబ్దాల్లో రొమ్ము క్యాన్సర్ చికిత్సల్లో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయి. దాంతో త్వరగా కనుగొంటే రొమ్ముక్యాన్సర్‌ను పూర్తిగా నయం చేయడం ఇప్పుడు సాధ్యమవుతోంది. అయితే రొమ్ముక్యాన్సర్ చికిత్స వరకూ వెళ్లకుండానే తమ సొంత దేహంపై పూర్తి అవగాహనతోనూ, ఆరోగ్యకరమైన జీవనశైలిలోనూ దాన్ని నివారించుకోవడం చాలా మేలు అనేది వైద్య నిపుణుల సూచన.

నిర్వహణ: యాసీన్



మహిళల ప్రపంచకప్‌లో నేడు భారత్ x పాకిస్తాన్

భారత్, పాకిస్తాన్ క్రికెట్ జట్లు వరుసగా నాలుగో ఆదివారం అంతర్జాతీయ వేదికపై తలపడనున్నాయి. అయితే ఈ సారి ఇది మహిళల సమరం. వన్డే వరల్డ్ కప్‌లో భాగంగా నేడు కొలంబోలో భారత్, పాక్ మధ్య మ్యాచ్ జరగనుంది. బలాబలాలపరంగా చూస్తే పాక్‌కంటే భారత్ ఎంతో మెరుగైన స్థితిలో ఉంది. ఇరు జట్ల మధ్య గతంలో 11 వన్డేలు జరగ్గా అన్నీ భారతే గెలిచింది. పాక్ ఒక్క మ్యాచ్‌లోనూ కనీసం పోటీ కూడా ఇవ్వలేకపోయింది. భారత్ కనీసం 80 పరుగుల తేడాతో లేదా... 5 వికెట్ల తేడాతో ఈ మ్యాచ్‌లలో విజయాలు సాధించింది. ఈ సారి కూడా ఫలితం అదే వచ్చే అవకాశం ఉంది. ఈ టోర్నీ తొలి పోరులో శ్రీలంకపై సునాయాస విజయం సాధించగా... పాక్ జట్టు బంగ్లా చేతిలో చిత్తుగా ఓడింది. పురుషుల ఆసియా కప్ తరహాలోనే ఈ మ్యాచ్‌లోనూ పాక్ క్రికెటర్లతో కరచాలనం చేయరాదని హర్మన్ సేన నిర్ణయించింది. ఈ మ్యాచ్ కోసం భారత్ తుది జట్టులో ఎలాంటి మార్పులు చేసే అవకాశం లేదు. మరో వైపు కొలంబోను వర్షాలు వెంటాడుతున్నాయి. ఇదే వేదికపై శనివారం ఆసీస్, శ్రీలంక మధ్య మ్యాచ్ రద్దయిన నేపథ్యంలో నేటి మ్యాచ్‌కు కూడా వర్షం ముప్పు పొంచి ఉంది.

వన్డే సారథిగా గిల్

కెప్టెన్సీనుంచి రోహిత్ శర్మ అవుట్

- టీమ్‌లో రోహిత్, కోహ్లిలకు చోటు
- వన్డేల్లో తొలిసారి నితీశ్, జురేల్
- ఆసీస్‌తో వన్డే, టి20 సిరీస్‌లకు భారత జట్ల ప్రకటన

రోహిత్ శర్మ భారత వన్డే జట్టు కెప్టెన్ హోదాలో చాంపియన్స్ ట్రోఫీలో జట్టును విజేతగా నిలిపాడు. దీని తర్వాత టీమిండియా మరో వన్డే మ్యాచ్ ఆడలేదు. లెక్క ప్రకారం చూస్తే ఏదైనా స్వల్ప మార్పు మినహా అదే జట్టు తర్వాతి సిరీస్ కోసం కొనసాగాలి. కానీ బీసీసీఐ సెలక్షన్ కమిటీ భిన్నంగా ఆలోచించింది. ఐసీసీ టోర్నీని గెలిపించినా సరే... సారథ్యం నుంచి తప్పించి అనూహ్య నిర్ణయం తీసుకుంది. ఓపెనింగ్ బ్యాటర్‌గా జట్టులో స్థానం దక్కించుకోగలిగిన ఆటగాడు నాయకత్వానికి మాత్రం అవసరం లేదని తేల్చింది. ఇప్పటికే టెస్టు కెప్టెన్‌గా ఉన్న శుబ్‌మన్ గిల్‌ను ఇప్పుడు వన్డే కెప్టెన్‌గా కూడా నియమించి మార్పుకు సెలక్టర్లు శ్రీకారం చుట్టారు. ఆటగాళ్లుగా మాత్రం రోహిత్, విరాట్ కోహ్లి భారత జట్టు తరఫున ఆస్ట్రేలియా పర్యటనకు ఎంపికయ్యారు.


చాంపియన్స్ ట్రోఫీ విజయానంతరం రోహిత్, గిల్ (ఫైల్)

అహ్మదాబాద్: భారత టెస్టు కెప్టెన్ శుబ్‌మన్ గిల్ ఇప్పుడు వన్డేల్లోనూ సారథ్య బాధ్యతలు చేపడుతున్నాడు. అజిత్ అగార్కర్ సారథ్యంలోని సెలక్షన్ కమిటీ గిల్‌ను వన్డే జట్టు కొత్త కెప్టెన్‌గా నియమించింది. ఇప్పటి వరకు కెప్టెన్‌గా ఉన్న రోహిత్ శర్మను అనూహ్యంగా నాయకత్వం నుంచి తప్పిస్తూ సెలక్టర్లు నిర్ణయం తీసుకున్నారు. ఆస్ట్రేలియా గడ్డపై జరిగే 3 వన్డేలు, 5 టి20ల సిరీస్‌ల కోసం టీమ్‌లను సెలక్టర్లు ప్రకటించారు. కెప్టెన్‌గా రోహిత్ వైఫల్యం లేకపోయినా... భవిష్యత్తును, ముఖ్యంగా 2027 వన్డే వరల్డ్ కప్‌ను దృష్టిలో ఉంచుకొని 26 ఏళ్ల గిల్‌ను కెప్టెన్‌గా ఎంపిక చేసినట్లు సెలక్టర్లు వెల్లడించారు. ఇంగ్లండ్‌తో సిరీస్‌లో తొలి సారి టెస్టు కెప్టెన్‌గా వ్యవహరించిన గిల్ ఇప్పుడు రెండు ఫార్మాట్‌లలో కెప్టెన్ కావడంతో పాటు టి20 టీమ్‌కు వైస్ కెప్టెన్‌గా ఉన్నాడు. 2026 టి20 వరల్డ్ కప్ తర్వాత సూర్యకుమార్ యాదవ్‌నుంచి అతనికి టి20 సారథ్య బాధ్యతలు కూడా వచ్చే అవకాశం ఉంది. రోహిత్ వయసు (38)ను దృష్టిలో ఉంచుకొని చూస్తే 2027 వరకు ఆటగాడిగా, కెప్టెన్‌గా కొనసాగడం కష్టంగానే అనిపించినా... ఇంత తొందరగా అతడిని కెప్టెన్ హోదానుంచి తప్పిస్తారనేది మాత్రం ఎవరూ ఊహించలేదు. అయితే అసలు వన్డే జట్టులో ఉంటారా లేదా అనే చర్చ జరిగిన నేపథ్యంలో... రోహిత్‌తో పాటు మరో సీనియర్ విరాట్ కోహ్లిలకు కూడా వన్డే టీమ్‌లో స్థానం లభించింది.

వన్డే జట్టు: గిల్ (కెప్టెన్), శ్రేయస్ (వైస్ కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, అక్షర్, రాహుల్, నితీశ్ రెడ్డి, సుందర్, కుల్దీప్, హర్షిత్, సిరాజ్, అర్ష్‌దీప్, ప్రసిధ్, జురేల్, జైస్వాల్.

టి20 జట్టు: సూర్యకుమార్ (కెప్టెన్), గిల్ (వైస్ కెప్టెన్), అభిషేక్, తిలక్, నితీశ్ రెడ్డి, దూబే, అక్షర్, జితేశ్, వరుణ్, బుమ్రా, అర్ష్‌దీప్, కుల్దీప్, హర్షిత్, సామ్సన్, రింకూ, సుందర్.

వైస్ కెప్టెన్‌గా శ్రేయస్...

భారత జట్టు చాంపియన్స్ ట్రోఫీలో విజేతగా నిలిచిన జట్టులో పలు మార్పులు జరిగాయి. ఆ టీమ్‌లో ఉన్నవారిలో రిషభ్ పంత్, హార్దిక్ పాండ్యా ఇంకా గాయాలనుంచి కోలుకోలేదు. ఇద్దరు స్పిన్నర్లు జడేజా, వరుణ్ చక్రవర్తిలను ఎంపిక చేయలేదు. పేస్ బౌలర్ మొహమ్మద్ షమీకి కూడా జట్టులో స్థానం లభించలేదు. వారి స్థానాల్లో నితీశ్ కుమార్ రెడ్డి, ధ్రువ్ జురేల్, ప్రసిధ్ కృష్ణ, అర్ష్‌దీప్ సింగ్, మొహమ్మద్ సిరాజ్ వచ్చారు. టాప్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాకు వన్డేల నుంచి మరోసారి విశ్రాంతినిచ్చారు. గత ఏడాది ఆగస్టు తర్వాత వన్డేలు ఆడని సిరాజ్ తన ఇటీవలి టెస్టు ప్రదర్శనతో మళ్లీ టీమ్‌లోకి రాగా... టెస్టులు, టి20ల్లో ఆకట్టుకున్న

42-12 రోహిత్ కెప్టెన్సీలో భారత్ 56 వన్డేలు ఆడింది. ఇందులో 42 గెలిచి 12 ఓడగా... ఒక మ్యాచ్ 'టై'గా ముగిసి మరో మ్యాచ్ రద్దయింది. 2018, 2023 ఆసియా కప్‌లను రోహిత్ సారథ్యంలో గెలవగా...2025 చాంపియన్స్ ట్రోఫీ కెప్టెన్‌గా రోహిత్ అత్యుత్తమ ప్రదర్శన.

'కెప్టెన్సీ మార్పు గురించి రోహిత్‌కు ముందే తెలియజేశాం. 2027 వన్డే వరల్డ్ కప్‌కు చాలా సమయం ఉన్నా సహజంగానే దాని గురించి ఆలోచించాల్సి ఉంటుంది. ఇప్పుడు వన్డే జరుగుతున్న తీరు చూస్తే వచ్చే రెండేళ్లలో ఎక్కువగా మ్యాచ్‌లు లేకపోవచ్చు. కాబట్టి కెప్టెన్ జట్టు గురించి తెలుసుకునేందుకు, తన ప్రణాళికలు రూపొందించుకునేందుకు తగినంత సమయం కావాలి. అందుకే గిల్‌ను ఎంపిక చేశాం. నిజంగా చెప్పాలంటే మూడు ఫార్మాట్‌లకు ముగ్గురు వేర్వేరు కెప్టెన్లు ఉండటం కూడా కష్టమే. కెప్టెన్‌గా రోహిత్ చాలా అద్భుతంగా నడిపించాడు. ఒక వేళ చాంపియన్స్ ట్రోఫీ గెలవకపోయినా అది అతని గొప్పతనాన్ని తగ్గించదు. కానీ ఇప్పుడు కాకపోతే ఆరు నెలల తర్వాత అయినా ఏదో ఒక దశలో టీమ్ భవిష్యత్తు గురించి ఆలోచించాల్సిందే'

-అజిత్ అగార్కర్, సెలక్షన్ కమిటీ చైర్మన్

ఆంధ్ర క్రికెటర్ నితీశ్ కుమార్ రెడ్డి, కీపర్ ధ్రువ్ జురేల్‌లకు వన్డేల్లో ఇదే తొలి అవకాశం. దుబాయ్ తరహాలో ఎక్కువ మంది స్పిన్నర్లను ఆడించే అవకాశం ఆస్ట్రేలియాలో లేదని...అందుకే జడేజాను పక్కన పెట్టామని అగార్కర్ స్పష్టం చేశాడు. వన్డేల్లో నిలకడగా రాణిస్తున్న శ్రేయస్ అయ్యర్‌ను ఈ సిరీస్ కోసం వైస్ కెప్టెన్‌గా ఎంపిక చేశారు.

సుందర్‌కు చోటు...

టి20 టీమ్‌లో మాత్రం సెలక్టర్లు పెద్దగా మార్పేమీ చేయలేదు. ఆసియా కప్‌లో విజేతగా నిలిచిన జట్టులో ఒక్క హార్దిక్ పాండ్యా మాత్రమే గాయం కారణంగా దూరమయ్యాడు. అతని స్థానంలోనే ఆల్‌రౌండర్‌గా నితీశ్ రెడ్డికి స్థానం లభించింది. ఆ 15 మందితో పాటు ఆస్ట్రేలియా పర్యటన కోసం అదనంగా 16వ ఆటగాడి రూపంలో ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్‌ను ఎంపిక చేశారు. వన్డేలకు దూరంగా ఉండనున్న బుమ్రా టి20లు మాత్రం ఆడతాడు. భారత్, ఆస్ట్రేలియా మధ్య అక్టోబర్ 19, 23, 25 తేదీల్లో వన్డేలు...అక్టోబర్ 29 నుంచి నవంబర్ 8 మధ్య 5 టి20లు జరుగుతాయి.


గాల్లో తేలుతూ చందర్‌పాల్ క్యాచ్‌ను అద్భుతంగా అందుకున్న నితీశ్‌కుమార్ రెడ్డి

భారత్ దెబ్బకు విండీస్ ధాం!

- తొలి టెస్టులో ఇన్నింగ్స్, 140 పరుగుల తేడాతో భారత్ ఘన విజయం
- రెండో ఇన్నింగ్స్‌లో విండీస్ 146 ఆలౌట్
- జడేజాకు 4, సిరాజ్‌కు 3 వికెట్లు



11 టెస్టుల్లో జడేజా 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'ల సంఖ్య. భారత్ తరఫున రాహుల్ ద్రవిడ్ (11) రికార్డును అతను సమం చేయగా... సచిన్ (14) ముందున్నాడు.

అహ్మదాబాద్: భారత్, వెస్టిండీస్ మధ్య జరిగిన తొలి టెస్టులో ఎలాంటి సందేహం లేకుండా ఊహించిన ఫలితమే వచ్చింది. మ్యాచ్ పూర్తిగా మూడు రోజులు కూడా సాగలేదు. శనివారం ముగిసిన మొదటి టెస్టులో భారత్ ఇన్నింగ్స్, 140 పరుగుల తేడాతో వెస్టిండీస్‌పై ఘన విజయం సాధించింది. భారత్ తమ తొలి ఇన్నింగ్స్‌ను ఓవర్ నైట్ స్కోరు 5 వికెట్ల నష్టానికి 448 పరుగుల వద్దే డిక్లేర్ చేసింది. 286 పరుగులు వెనుకబడి రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన విండీస్ ఈ సారి కూడా కనీస పోటీ ఇవ్వలేకపోయింది. 45.1 ఓవర్లలో 146 పరుగులకే విండీస్ ఆలౌటైంది. భారత బౌలర్ల దెబ్బకు శనివారం కనీసం రెండు సెషన్లు కూడా ఆడకుండానే విండీస్ కుప్పకూలింది. తొలి ఇన్నింగ్స్‌తో పోలిస్తే రెండో ఇన్నింగ్స్‌లో సరిగ్గా ఒక్క ఓవర్ మాత్రమే ఆ జట్టు అదనంగా ఆడగలిగింది. అలిక్ అతనజె (74 బంతుల్లో 38; 3 ఫోర్లు) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఒక దశలో జట్టు 46 పరుగులకే సగం వికెట్లు కోల్పోగా...అతనజె, గ్రీవ్స్ (25) ఆరో వికెట్‌కు 46 పరుగులు జోడించి కొద్ది సేపు ప్రతిఘటించారు. భారత బౌలర్లలో జడేజా 4 వికెట్లు పడగొట్టగా, సిరాజ్‌కు 3 వికెట్లు దక్కాయి. బ్యాటింగ్‌లో సెంచరీ కూడా నమోదు చేసిన జడేజాకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. సిరీస్‌లో భారత్ 1-0తో ముందంజ వేయగా... ఈ నెల 10 నుంచి న్యూఢిల్లీలో రెండో టెస్టు జరుగుతుంది.

స్కోరు వివరాలు

వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్ 162; భారత్ తొలి ఇన్నింగ్స్ 448/5 డిక్లేర్డ్; వెస్టిండీస్ రెండో ఇన్నింగ్స్: క్యాంప్‌బెల్ (సి) సుదర్శన్ (బి) జడేజా 14; చందర్‌పాల్ (సి) నితీశ్ (బి) సిరాజ్ 8; అతనజె (సి) అండ్ (బి) సుందర్ 38; కింగ్ (సి) రాహుల్ (బి) జడేజా 5; ఛేజ్ (బి) కుల్దీప్ 1; హోప్ (సి) జైస్వాల్ (బి) జడేజా 1; గ్రీవ్స్ (ఎల్బీ) (బి) సిరాజ్ 25; పైర్ (నాటౌట్) 13; వారికన్ (సి) గిల్ (బి) సిరాజ్ 0; లేన్ (సి) సిరాజ్ (బి) జడేజా 14; సీల్స్ (సి) అండ్ (బి) కుల్దీప్ 22; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (45.1 ఓవర్లలో ఆలౌట్) 146.** **వికెట్ల పతనం:** 1-12, 2-24, 3-34, 4-35, 5-46, 6-92, 7-98, 8-98, 9-122, 10-146. **బౌలింగ్:** బుమ్రా 6-1-16-0, సిరాజ్ 11-2-31-3, జడేజా 13-3-54-4, కుల్దీప్ 8.1-3-23-2, సుందర్ 7-1-18-1.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి సినిమా

డబుల్ సెలబ్రేషన్స్


● చిరంజీవి, వెంకటేశ్

ఇక్కడున్న ఫొటోలో మంచి జోష్‌తో ఫుల్ ఖుషీగా కనిపిస్తున్నారు చిరంజీవి, వెంకటేశ్. ఇంతకీ ఈ జోష్‌కి కారణం ఏంటంటే... స్నేహితులను కలవడానికి వెళ్లారు. ప్రతి ఏడాది 'క్లాస్ ఆఫ్ 80స్' అంటూ 1980స్‌కి చెందిన నటీనటులందరూ కలిసి, సెలబ్రేట్ చేసుకుంటుంటారు. ఒక్కోసారి ఒక్కో థీమ్, ప్లేస్ ఉంటుంది. ఈసారి రీ యూనియన్‌కి చెన్నై వేదికైంది. ఇందు కోసమే చిరంజీవి, వెంకటేశ్ శనివారం హైదరాబాద్ నుంచి చెన్నై ప్రయాణం అయ్యారు. ఇదిలా ఉంటే... చిరంజీవి హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందుతున్న 'మన శంకర వరప్రసాద్‌గారు'లో ఓ కీలక పాత్రలో వెంకటేశ్ నటించనున్న విషయం తెలిసిందే. ఈ సినిమా కొత్త షెడ్యూల్ చిత్రీకరణ వచ్చే వారం ప్రారంభం కానుంది. ఈ షెడ్యూల్‌లో చిరంజీవి, వెంకటేశ్‌లపై కీలక సన్నివేశాలను, ఓ సెలబ్రేషన్ సాంగ్‌ను చిత్రీకరించడానికి ప్లాన్ చేశారట. ''చిరంజీవి, వెంకటేశ్‌గార్లను కలిసి సెట్స్‌లో చూసేందుకు ఆసక్తిగా ఎదురు చూస్తున్నా'' అని 'ఎక్స్'లో పేర్కొన్నారు అనిల్ రావిపూడి. సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్న ఈ సినిమా వచ్చే సంక్రాంతికి విడుదల కానుంది. ఇటు రీ యూనియన్ సెలబ్రేషన్స్ అటు సెట్స్‌లో సెలబ్రేషన్ సాంగ్... ఇలా ఈ నెల చిరంజీవి, వెంకటేశ్‌కు డబుల్ సెలబ్రేషన్స్ అని చెప్పుకోవచ్చు.

నేను నీకు కరెక్టేనా?


● దీక్షిత్, రష్మిక

'విక్రమ్... అందరికీ ఒక టైపు ఉంటుంది కదా... నేను నీ టైపేనా', 'అంటే... ఒకరికొకరు కరెక్టా? అని ఎలా తెలుస్తుంది... అంతకన్నా ఎప్పుడు తెలుస్తుంది', 'కొంపదీసి నేను నీకు కరెక్టేనా అని ఆలోచిస్తున్నావా ఏంటి?', 'నేను నీకు కరెక్టేనా? అని కూడా ఆలోచిస్తున్నా?'... ఈ సంభాషణలు 'ది గార్ల్ ఫ్రెండ్' సినిమా రిలీజ్ డేట్ ప్రోమోలోనివి. రష్మికా మందన్నా, దీక్షిత్ శెట్టి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ది గర్ల్ ఫ్రెండ్'. అల్లు అరవింద్ సమర్పణలో రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి ఈ సినిమాను నిర్మించారు. ఈ చిత్రాన్ని నవంబరు 7న రిలీజ్ చేయనున్నట్లుగా పేర్కొని, రిలీజ్ డేట్ ప్రోమోను విడుదల చేశారు మేకర్స్.

సింగరేణి కార్మికుల జీవితంతో...


● సాగర్

సింగరేణి కార్మికుల జీవితాల ఆధారంగా సాగర్ హీరోగా ఓ చిత్రం రూపొందనుంది. ఈ పాన్ ఇండియా మూవీని 'జార్జి రెడ్డి' మూవీ ఫేమ్ దర్శకుడు జీవన్ రెడ్డి తెరకెక్కించనున్నారు. నవంబరులో షూటింగ్ ప్రారంభించుకోనున్న ఈ చిత్రం కోసం అండర్ గ్రౌండ్ బొగ్గు గని సెట్స్‌ని రూపొందిస్తున్నారు. ఈ చిత్రంలో ఓ కీలక పాత్రకు ప్రముఖ స్టార్ హీరోని తీసుకోనున్నారు. అలాగే తెలుగు, కన్నడ, తమిళ, హిందీ భాషల్లోని ప్రముఖ నటీనటులు నటిస్తారని చిత్రయూనిట్ పేర్కొంది.

గేరే మార్చులే...

''అనుకుందొకటిలే, అయ్యిందొకటిలే..', 'అయిపోలేదులే.. గేరే మార్చులే..', 'భ్రమరం ఫార్ములా.. ఫెయిలే అవదులే' అని 'వెన్నెల' కిశోర్ పాడిన ఈ పాట 'సంతాన ప్రాప్తిరస్తు'లోనిది. విక్రాంత్, చాందినీ చౌదరి, 'వెన్నెల' కిశోర్ ప్రధాన పాత్రల్లో నటించిన సినిమా 'సంతాన ప్రాప్తిరస్తు'. సంజీవ్ రెడ్డి దర్శకత్వంలో 'మధుర' శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రంలో డాక్టర్ భ్రమరం పాత్రలో కనిపిస్తారు 'వెన్నెల' కిశోర్. త్వరలోనే ఈ సినిమా విడుదల కానుంది. ఈ సినిమాలోని 'అనుకుందొకటిలే..' పాట లిరికల్ వీడియోను శనివారం విడుదల చేశారు. చిత్రసంగీత దర్శకుడు సునీల్ కశ్యప్ స్వరపరచిన ఈ పాటకు బాలవర్ధన్ సాహిత్యం అందించారు. తరుణ్ భాస్కర్, అభినవ్ గోమటం, మురళీధర్ గౌడ్ ఈ సినిమాలో కీలక పాత్రల్లో నటించారు.


● అభినవ్, 'వెన్నెల' కిశోర్, విక్రాంత్

థ్రిల్లింగ్ మారియో


● అనిరుధ్, హెబ్బా

అనిరుధ్, హెబ్బా పటేల్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న యాక్షన్ అండ్ థ్రిల్లర్ మూవీ 'మారియో'. 'నాటకం, తీస్ మార్ ఖాన్' చిత్రాల ఫేమ్ కల్యాణ్ జి. గోగణ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. సిల్వర్ స్క్రీన్ ప్రొడక్షన్స్, రిజ్వాన్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థలు నిర్మిస్తున్నాయి. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ జరుగుతోంది. ఈ చిత్రానికి సంబంధించిన కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. రాకేందు మౌళి, మౌర్య సిద్ధవరం, యష్నా ముతులూరి, కల్పిక గణేష్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: సాయి కార్తీక్, రాకేందు మౌళి, కెమెరా: ఎంఎన్ రెడ్డి.

ప్రపంచ శాంతి కోసం కింగ్ బుద్ధ


● 'కింగ్ బుద్ధ' పోస్టర్ లాంచ్ కార్యక్రమంలో సత్యారెడ్డి..

నటుడిగా, దర్శకుడిగా, నిర్మాతగా ప్రత్యేక గుర్తింపు సొంతం చేసుకున్న సత్యారెడ్డి 'కింగ్ బుద్ధ' పేరుతో ఓ హాలీవుడ్ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా పోస్టర్ లాంచ్ ఈవెంట్‌ని అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రంలో నిర్వహించారు. కెడర్ పార్క్ మేయర్‌గా పని చేసిన మ్యాట్ పోవెల్ ముఖ్య అతిథిగా హాజరై, పోస్టర్‌ను లాంచ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ–''గౌతమ బుద్ధుడు ప్రపంచ శాంతి కోసం అమితమైన కృషి చేశారు. నా స్నేహితుడు సత్యారెడ్డి ఈ సినిమాను డైరెక్ట్‌గా హాలీవుడ్‌లో తెరకెక్కిస్తుండటం హ్యాపీగా ఉంది'' అని తెలిపారు. ''ప్రపంచ శాంతి కోసం సత్యారెడ్డి తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని రాజీ పడకుండా నిర్మిస్తాం'' అన్నారు నిర్మాతల్లో ఒకరైన శైలర్. ''కింగ్ బుద్ధ' కాన్సెప్ట్‌ను నిర్మాతలకు చెప్పగానే నిర్మించడానికి అంగీకరించారు'' అని సత్యారెడ్డి తెలిపారు. సోషల్ వర్కర్స్, పారిశ్రామికవేత్తలు పుల్లారెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, రవికుమార్ రెడ్డి, ప్రవర్ధన్, సాయి గణేశ్ రెడ్డి, షైలర్ శివ జోష్నా రెడ్డి పాల్గొన్నారు.

శశివదనే నిరాశపరచదు


● రక్షిత్, కోమలి

''అశ్లీలతకు తావు లేకుండా నిజాయితీగా 'శశివదనే' అనే ఒక మంచి సినిమా చేశాం. ప్రేక్షకులు థియేటర్స్ నుంచి బయటకు వచ్చేటప్పుడు ఆనందంగా వస్తారు. ఈ సినిమా ఏ ఒక్కరినీ నిరాశపరచదు'' అని రక్షిత్ అట్లూరి అన్నారు. - రక్షిత్

రక్షిత్ అట్లూరి, కోమలి ప్రసాద్ జంటగా నటించిన చిత్రం 'శశివదనే'. సాయి మోహన్ ఉబ్బన దర్శకత్వంలో గౌరీ నాయుడు సమర్పణలో అహితేజ బెల్లంకొండ, అభిలాష్ రెడ్డి గోడల నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 10న విడుదల కానుంది. ఈ సందర్భంగా శనివారం యూనిట్ నిర్వహించిన సమావేశంలో రక్షిత్ మాట్లాడుతూ– ''ఈ సినిమా కథ విన్నప్పుడు ఇందులోని సన్నివేశాలు బాగా నచ్చాయి. ఇందులో సాయి రాసుకున్నటువంటి ఫాదర్-సన్ ఎమోషన్స్ అయితే ఇప్పటివరకు తెలుగులో రాలేదు'' అన్నారు. ''నేను ఇండస్ట్రీలోకి రావాలన్నది మా నాన్న కల. నన్ను నమ్మి, అవకాశం కల్పించిన నిర్మాతలు తేజ, గౌరీగార్లకు ధన్యవాదాలు'' అని అన్నారు సాయి మోహన్. ''మా సినిమా పూర్తి కాకముందే అన్ని రైట్స్ అమ్ముడుపోయాయి. 'శశివదనే' సినిమాలోని క్లైమాక్స్ నాకు తెలిసినంత వరకు తెలుగులో ఇప్పటివరకు రాలేదు. ఈ సినిమా షూటింగ్ సమయంలో కొన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నాను. అయినా విజయవంతంగా పూర్తి చేయగలిగాం'' అని తెలిపారు అహితేజ. ''శశివదనే' నాకు ప్రత్యేకమైన సినిమా'' అని పేర్కొన్నారు కోమలి. కెమెరామేన్ సాయికుమార్, నటి అంబిక, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ శ్రీపాల్ తదితరులు మాట్లాడారు.

గ్రామంలో హైలెస్సో..


● సుధీర్

సుధీర్ ఆనంద్ ('సుడిగాలి' సుధీర్) హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'హైలెస్సో'. ఈ చిత్రంలో నటాషా సింగ్, నక్ష శరణ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ సినిమాను ప్రసన్నకుమార్ కోట దర్శకత్వంలో శివ చెర్రి, రవికిరణ్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. శివాజీ, అక్షర గౌడ, మొట్ట రాజేంద్రన్, గెటప్ శ్రీను తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అనుదీప్ దేవ్.

ఓటీటీ ఇది చూడొచ్చు

ఇది అపూర్వం

ఓటీటీలో 'ఇది చూడొచ్చు' అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో మలయాళ చిత్రం 'హృదయపూర్వమ్' ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.

మనిషి జీవించడానికి ఆరోగ్యం అవసరం. మన శరీరంలోని ఏదైనా అవయవం పని చేయకపోతే మనం అనారోగ్యానికి గురైనట్లే. అయితే ఇప్పుడున్న టెక్నాలజీతో ఏదైనా అవయవాన్ని వేరే వాళ్ళ అవయవంతో మార్చుకునే శక్తి వచ్చింది. కానీ వేరే వాళ్ళ అవయవం మార్చుకున్న వ్యక్తికి వారి అనుబంధాలు, ఆప్యాయతలు కూడా వస్తే అనే ఆలోచనతో తీసిన చిత్రమే 'హృదయపూర్వమ్'. ఇది మలయాళ సినిమా అయినా హాట్‌స్టార్ వేదికగా తెలుగులోనూ లభ్యమవుతోంది. మోహన్ లాల్ లీడ్ రోల్‌లో ఈ సినిమాకు సత్యన్ అంతికాడ్ దర్శకత్వం వహించారు. ఈ మధ్య కాలంలో వచ్చిన ఓ నీట్ కామెడీ సినిమా ఇది అని చెప్పొచ్చు. అంతలా ఈ సినిమాలో ఏముందో చెప్పుకుందాం. కొచ్చిలో ఓ క్లౌడ్ కిచెన్ నడుపుతున్న సందీప్ బాలకృష్ణన్‌కి హార్ట్‌లో ఓ సమస్య వచ్చి, హాట్ ట్రాన్స్‌ప్లాంట్ చేయాలని డాక్టర్లు నిర్ణయిస్తారు. పుణేలో అకాల మరణం చెందిన కల్నల్ రవీంద్రనాథ్ గుండెను సందీప్‌కు అమరుస్తారు. ఆపరేషన్ తర్వాత సందీప్‌కు సహాయకుడిగా జెర్రీని నియమిస్తారు. తన తండ్రి గుండెను అమర్చుకున్న సందీప్‌ను కలవడానికి వస్తుంది కల్నల్ కూతురు హరిత. తనకు కొద్ది రోజుల్లో నిశ్చితార్థమని, ఆ వేడుకకు సందీప్ వస్తే తన తండ్రి వచ్చినట్టుగా భావిస్తానని ఆహ్వానిస్తుంది హరిత. ముందు తటపటాయించినా తర్వాత జెర్రీతో పాటు హరిత ఎంగేజ్‌మెంట్‌కు పుణేకి బయలుదేరతాడు సందీప్. అక్కడ కల్నల్ భార్య దేవకి కూడా సందీప్ వచ్చినందుకు సంతోషిస్తుంది. హరిత నిశ్చితార్థంలో జరిగిన ఓ చిన్న ఘటనతో సందీప్ పుణేలో రెండు రోజులు ఉండాల్సింది, రెండు వారాలకు పైగా ఉండాల్సి వస్తుంది. చనిపోయిన కల్నల్ గుండెతో వచ్చిన సందీప్ వీళ్ళిద్దరూ చూపించే ప్రేమతో ఇబ్బందులు పడతాడు. మరి... అతను పుణె నుండి బయటపడ్డాడా? లేదా అన్నది 'హృదయపూర్వమ్'లోనే చూడాలి. ఓ హృదయం అందించిన అద్భుత దృశ్య రూపం ఈ 'హృదయపూర్వమ్'. ఈ వీకెండ్‌కి తప్పక చూడాల్సిన అపూర్వం.



- హరికృష్ణ ఇంటూరు

చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో భారీ వర్షం

పలు ప్రాంతాలకు స్తంభించిన రాకపోకలు

చిత్తూరు రూరల్/తిరుపతి తుడా/చిత్తూరు రూరల్ (కాణిపాకం)/తిరుమల: చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో శుక్రవారం అర్ధరాత్రి వర్షం దంచికొట్టింది. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. శనివారం ఉదయం 8గంటల వరకు వాన పడుతూనే ఉంది. దీంతో పలు చోట్ల వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. చెరువులు నిండిపోయాయి. భారీ వర్షం దెబ్బకు పలు మండలాల్లో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పలు పంటలు సైతం దెబ్బతిన్నాయి.

భారీ వర్షం తిరుపతి నగరాన్ని ముంచెత్తింది. శుక్రవారం అర్ధరాత్రి తర్వాత రెండు గంటల సమయంలో మొదలైన వర్షం ఉదయం 8 గంటల వరకు పడుతూనే ఉంది. కుండపోత కారణంగా కాలువలు పొంగిపొర్లుతున్నాయి. నగరంలోని లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లల్లోకి వర్షపు నీరు పెద్ద ఎత్తున చేరింది. లక్ష్మీపురం కూడలి, ఏఐఆర్ బైపాస్ రోడ్డు, లీలామహల్ కూడలి, కరకంబాడి రోడ్డు, కొర్లగుంట పెద్ద కాలువ ప్రాంతాల్లో వర్షం నీరు ఏరులై పారింది. ఇది ప్రమాదకరస్థాయిలో దాటడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. అలానే రైల్వే అండర్ బ్రిడ్జ్‌ల వద్ద వరద నీరు ప్రమాదకర స్థాయికి చేరింది. తిరుమలలో కూడా శనివారం భారీగా వర్షం కురిసింది.

‘లారీ క్యాబిన్‌లో ఏసీ’ ఎప్పుడు ?

- రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు రాగానే అమలు చేస్తామంటున్న రవాణా శాఖ అధికారులు
- అక్టోబర్ ఒకటి నుంచి తప్పనిసరి అంటూ కేంద్రం నోటిఫికేషన్

సాక్షి, వరంగల్: రోడ్డు ప్రమాదాలను తగ్గించడం.. డ్రైవర్లకు దూర ప్రయాణాల్లో చల్లటి వాతావరణం ఉండి సాఫీగా డ్రైవింగ్ చేసుకునేలా లారీ క్యాబిన్లలో కూడా ఎయిర్ కండిషన్ (ఏసీ) ఉండాలనే నిబంధనను కేంద్రం తీసుకొచ్చిన విషయం తెలిసిందే. అక్టోబర్ ఒకటి నుంచి తప్పనిసరి చేస్తూ కేంద్రం ఇప్పటికే నోటిఫికేషన్ ఇచ్చినా, దీని అమలుపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇంకా స్పష్టమైన ఆదేశాలు జిల్లాలోని రవాణా శాఖ కార్యాలయాలకు వెళ్లలేదు. దీంతో అమలు ఎప్పటి నుంచి అనే దానిపై స్పష్టత లేదు. అయితే రాష్ట్ర ప్రభుత్వం నుంచి ముసాయిదా రాగా, దానిపై అభ్యంతరాలను రాష్ట్ర ప్రభుత్వానికి పంపామని, అక్కడి నుంచి వచ్చే ఆదేశాలకు అనుగుణంగా లారీ క్యాబిన్‌లో ఏసీ నిబంధనపై ముందుకెళతామంటున్నారు. అయితే, ఇప్పటికే టాటా, అశోక్ లేలాండ్, భారత్ బెంజ్, ఇషర్ లాంటి ప్రధాన కంపెనీల ట్రక్కులు ఏసీతోనే వస్తున్నాయి. రాష్ట్రంలో 5.8 లక్షల సరుకు రవాణా వాహనాలుంటే వీటిలో మూడు లక్షలకు పైగా లారీలు ఉన్నాయి. పాత లారీ క్యాబిన్లలోనూ ఏసీ అమర్చాలన్న డిమాండ్లు ఉన్నాయి..

వేసవిలో డ్రైవర్లు దొరకడం గగనమే...



ఉమ్మడి వరంగల్ జిల్లాలో వెయ్యికిపైగా లారీలు ఉన్నాయి. వేసవి సీజన్‌లో లారీ డ్రైవర్లు దొరకడం గగనంగా మారుతోంది. 40 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతోపాటు భారీ లోడ్‌ను మోయాల్సిన ట్రక్కుల ఇంజన్లు విపరీతంగా వేడెక్కి క్యాబిన్‌లోకి చేరుతుండడంతో అనారోగ్య సమస్యలొస్తున్నాయి. ఆలసట, డీహైడ్రేషన్, ఏకాగ్రత తగ్గుతుంది. దీనివల్ల రోడ్డు ప్రమాదాలకు అవకాశం ఏర్పడుతుంది.

– ఫిరోజ్ అలీ, అధ్యక్షుడు, ఓరుగల్లు లారీ ఓనర్స్ అసోసియేషన్

రోడ్డు ప్రమాదాలకు ఆస్కారముండదు



లారీ, ట్రక్కు క్యాబిన్లలో ఏసీలు ఏర్పాటు చేయడం వల్ల సురక్షిత డ్రైవింగ్‌కు ఉపయోగపడుతోంది. వందల కిలోమీటర్లు, రాష్ట్ర సరిహద్దులు దాటుతూ నేషనల్ పర్మిట్లు ఉన్నా లారీల లోడ్‌లతో వెళుతున్న సందర్భాల్లో ఎండ వేడిమితో ఇబ్బందులు ఎదుర్కొన్న సందర్భాలు అనేకం ఉన్నాయి. క్యాబిన్‌లో ఏసీ అమర్చితే వేడి ప్రభావం తగ్గి డ్రైవర్లు తొందరగా అలసిపోరు. డ్రైవింగ్‌పై నియంత్రణ ఉండడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారముండదు.

– వి.భూపాల్, లారీ యజమాని, డ్రైవర్, వరంగల్

హైదరాబాద్‌లో బస్సు చార్జీల పెంపు

▶ మొదటి పేజీ తరువాయి

నుంచి అమల్లోకి రానుంది.

పెంపు ఇలా...

ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఎలక్ట్రిక్ ఆర్డినరీ, ఎలక్ట్రిక్ ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో తొలి మూడు స్టేజీల వరకు ప్రస్తుత టికెట్ ధరపై రూ. 5 పెరగనుంది. ప్రస్తుతం ఆర్డినరీ బస్సుల్లో కనీస చార్జి రూ. 10గా ఉండగా ఇకపై రూ. 15 కానుంది. నాలుగో స్టేజీ నుంచి ప్రస్తుత చార్జీపై రూ. 10 అదనంగా పెరుగుతుంది. ఇక మెట్రో డీలక్స్, ఎలక్ట్రిక్ మెట్రో ఏసీ బస్సుల్లో మొదటి స్టేజీ వరకు రూ. 5, రెండో స్టేజీ నుంచి రూ. 10 చొప్పున పెరుగుతుంది. ఈ పెంపు వల్ల ఆర్టీసీకి నిత్యం రూ. 20 లక్షల వరకు అదనపు ఆదాయం సమకూరే అవకాశం ఉంది.

డీజిల్ బస్సుల స్థానంలో విద్యుత్ బస్సుల కోసం..

హైదరాబాద్‌లో డీజిల్ బస్సుల వల్ల వాతావరణ కాలుష్యం పెరుగుతున్న నేపథ్యంలో విద్యుత్ బస్సులను వాడాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గతంలో నిర్ణయించారు. ప్రస్తుతం తిరుగుతున్న 2,800 డీజిల్ బస్సులను ఔటర్ రింగ్‌రోడ్డు అవతల ఉన్న డిపోలకు తరలించి వాటి స్థానంలో ఎలక్ట్రిక్ బస్సులను తిప్పాలని ఆదేశించారు. ఇందుకోసం ఆర్టీసీ కేంద్ర ప్రభుత్వ పథకం పీఎం ఈ–డ్రైవ్ కింద దరఖాస్తు చేసుకోగా కేంద్రం సానుకూలంగా స్పందించి బస్సులను మంజూరు చేసింది. హైదరాబాద్, బెంగళూరు, ఢిల్లీ సహా మొత్తం 11 నగరాలకు బస్సుల సరఫరాకు టెండర్లు పిలిచింది. ఎంపికైన ప్రైవేటు సంస్థకు కేంద్రం రాయితీ అందిస్తుంది. ఆ సంస్థ బస్సులను సమకూర్చుకొని ఆర్టీసీకి అద్దెకిస్తుంది. ‘ఫేమ్’పథకం కింద గతంలో హైదరాబాద్‌కు 500 ఎలక్ట్రిక్ బస్సులు మంజూరయ్యాయి. వాటిల్లో 225 బస్సులు ఇప్పటికే సమకూరగా మరో రెండు నెలల్లో మిగతావి అందనున్నాయి. పీఎం ఈ–డ్రైవ్ కింద వచ్చే బస్సులతో కలిపి అప్పుడు మొత్తం 3,300 విద్యుత్ బస్సులు నగర రోడ్లపైకి వస్తాయి.

ప్రభుత్వం ఆదుకోకపోవడంతో..

ప్రస్తుతం నగరంలో 25 బస్సు డిపోలున్నాయి. ఎలక్ట్రిక్ బస్సులకు పవర్ చార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేయాల్సి ఉన్నందున అందుకు కొంత స్థలం అవసరమవుతుంది. ప్రస్తుతం డీజిల్ బస్సుల తరహాలో ఒక్కో డిపోలో 100 అంతకుమించి బస్సులకు స్థలం సరిపోదు. 3,300 బస్సులకు సరిపోవాలంటే అదనంగా మరో 10 కొత్త డిపోలను, ఎలక్ట్రిక్ చార్జింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇందుకోసం ఒక్కో డిపోపై రూ. 7–8 కోట్ల భారం పడనుంది. ఇంటర్‌మీడియట్ స్టేషన్ల ఏర్పాటుకు మరో రూ. 6 కోట్లు ఖర్చవుతుంది. ఇప్పటికే కొన్ని డిపోలకు ఏర్పాటు చేయగా, మరో 19 డిపోలకు ఏర్పాటు చేయాల్సి ఉంది. కొత్తగా ప్రతిపాదించిన 10 డిపోలతో కలిపి ఇప్పుడు 29 డిపోలకు ఈ వ్యవస్థ ఏర్పాటు కావాలి. ఇందుకు రూ. 392 కోట్లు అవసరమవుతుందని ఆర్టీసీ అంచనా వేసింది. ఈ మొత్తాన్ని ఇవ్వాల్సిందిగా ప్రభుత్వానికి ప్రతిపాదించగా ప్రభుత్వం చేతులెత్తేసింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో సిటీ బస్సుల ప్రయాణికులపై చార్జీల భారం మోపేందుకు ఆర్టీసీ సిద్ధమైంది. బస్సు చార్జీలను సవరించడం ద్వారా వచ్చే రెండేళ్లలో ఆ మొత్తాన్ని సమకూర్చుకోవాలని నిర్ణయించింది.





డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను శనివారం ప్రజాభవన్ లో మర్యాదపూర్వకంగా కలిసిన డీజీపీ శివధర్ రెడ్డి, అడిషనల్ డీజీ (ఇంటలిజెన్స్) విజయ్ కుమార్

భారతీయ సింధీలది ప్రత్యేక జన్యు నిర్మాణం

- పాక్‌లోని సింధీలతో పోల్చితే భిన్నం
- సీఎస్ఐఆర్, సీసీఎంబీ పరిశోధనలో వెల్లడి



సాక్షి, హైదరాబాద్: భారత్, పాకిస్తాన్ సింధీల జన్యు నిర్మాణాల్లో స్పష్టమైన తేడాలు ఉన్నట్లు సీఎస్ఐఆర్–సీసీఎంబీ (సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ) నిర్వహించిన జన్యు విశ్లేషణలో తేలింది. ఈ పరిశోధనను హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్–సీసీఎంబీకి చెందిన శాస్త్రవేత్తలు డాక్టర్ కుమారస్వామి తంగరాజ్, డాక్టర్ లోమస్ కుమార్ నిర్వహించారు. వీరి పరిశోధన ఫలితాలు హ్యూమన్ జీనోమిక్స్ జర్నల్‌లో ఇటీవల ప్రచురించబడ్డాయి. సుమారు ఆరు లక్షల డీఎన్ఏ మార్కర్ల ఆధారంగా భారతీయ సింధీల జన్యు విశ్లేషణ జరిపారు. పాకిస్తాన్ సింధీలతో పోలిస్తే ప్రత్యేకమైన జన్యు నిర్మాణం భారతీయ సింధీలలో ఉన్నట్లు గుర్తించారు. బురుషో, హజారా వంటి పాకిస్తాన్ వర్గాలతో సన్నిహిత జన్యు సంబంధాలు ఉన్నప్పటికీ, కొంకణీ స్థానికులతో ఇటీవలి కాలంలో మిళితమైనట్లు తేలింది. ప్రత్యేకంగా తూర్పు ఆసియా మూలాలు భారతీయ సింధీల జన్యువుల్లో ఉండటం ఇనుప యుగం లేదా మధ్యయుగం కాలంలో జరిగిన మంగోలుల వలసల ప్రభావం కావచ్చని నిర్ధారించారు. ‘పశ్చిమ తీర సింధీల జన్యు నిర్మాణం పాకిస్తాన్ సింధీలతో పోలిస్తే భిన్నంగా ఉంది. వీరు స్థానిక కొంకణీ ప్రజలతో కలిసిన ఆనవాళ్లు ఉన్నాయి. తూర్పు ఆసియా మూలాలు ఉండటం, పూర్వ వలసల చారిత్రక ప్రభావాన్ని సూచిస్తుంది’అని డాక్టర్ తంగరాజ్ తెలిపారు. ‘ఈ సింధీ వర్గంలో కనిపించిన తూర్పు ఆసియా మూలాలు, ఇనుప యుగం లేదా తరువాత కాలంలో మంగోలుల వలసల కారణంగానో, లేక బురుషో, హజారా వర్గాల ద్వారా మధ్యవర్తిగా చేరినవో కావచ్చు’అని డా.లోమస్ కుమార్ చెప్పారు. ‘ఈ పరిశోధన పశ్చిమ భారతదేశంలో శతాబ్దాలుగా జరిగిన వలసల చరిత్రను శాస్త్రీయంగా నిరూపిస్తోందని, కొన్ని వలసలు మధ్యయుగంలోనూ, కొన్ని స్వాతంత్ర్యం అనంతర విస్తరణల రూపంలోనూ చోటు చేసుకున్నాయి’అని సీఎస్ఐఆర్–సీసీఎంబీ డైరెక్టర్ డాక్టర్ వినయ్ కే. నందికూరి వివరించారు.

రిజర్వేషన్ వ్యతిరేకులకు రాజకీయ సమాధి

జాజుల శ్రీనివాస్‌గౌడ్



నల్లగొండ టౌన్: బీసీ రిజర్వేషన్ వ్యతిరేకులకు రాజకీయ సమాధి తప్పదని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. ఆయన శనివారం నల్లగొండలోని బీసీ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర జనాభాలో 60 శాతానికి పైగా ఉన్న బీసీలకు.. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు రాష్ట్ర ప్రభుత్వం కల్పించగా, రెడ్డి జాగృతికి చెందిన కొంతమంది కోర్టుల ద్వారా అడ్డుకోవాలని చూస్తున్నారన్నారు. ఈ నెల 8న రాష్ట్ర హైకోర్టులో బీసీ రిజర్వేషన్ల కేసు ఉన్నందున స్థానిక సంస్థల ఎన్నికలు జరగవంటూ.. బీసీ రిజర్వేషన్లు అమలు కావంటూ కొంతమంది ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం నల్లగొండ జిల్లా అధ్యక్షుడు చక్రహరి రామరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమం ఇలాగా?

- ఓట్ల చోరీకి వ్యతిరేకంగా సంతకాల సేకరణ రాష్ట్రంలో నత్తనడకన నడుస్తుండటంపై మీనాక్షి నటరాజన్ అసంతృప్తి
- భారీ ఉద్యమం చేపట్టాలనుకున్నా వర్షాలు, ‘స్థానికం’ సందడి వల్ల జాప్యం జరిగిందన్న నేతలు
- ఆ కారణాలను అధిష్టానానికి వివరించలేనన్న మీనాక్షి.. ప్రక్రియను వేగవంతం చేయాలని దిశానిర్దేశం
- మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, డీసీసీ అధ్యక్షులతో ఆన్‌లైన్ ద్వారా భేటీ



సాక్షి, హైదరాబాద్: దేశంలో ఓట్ల చోరీ జరుగుతోందంటూ అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) చేపట్టిన ఉద్యమం తెలంగాణలో నత్తనడకన సాగుతోందన్న అభిప్రాయంతో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్ ఉన్నారనే చర్చ గాంధీ భవన్ వర్గాల్లో జరుగుతోంది. ఇందులో భాగంగా పిలుపునిచ్చిన సంతకాల సేకరణ కార్యక్రమాన్ని టీ కాంగ్రెస్ నేతలు చురుగ్గా ప్రారంభించలేదని ఆమె అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. అందుకు కారణాలు ఏమైనప్పటికీ అధిష్టానానికి వాటిని చెప్పలేమని.. అందువల్ల వెంటనే సంతకాల సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆమె ఆదేశించారు. ఈ మేరకు శనివారం డీసీసీ అధ్యక్షులు, ఆఫీసు బేరర్లు, కార్పొరేషన్ల చైర్మన్లు, అనుబంధ సంఘాల చైర్మన్లు, అధికార ప్రతినిధులు, పార్టీ జిల్లా ఇన్‌చార్జీలతో, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలతో వేర్వేరుగా ఆన్‌లైన్ సమావేశాలు నిర్వహించి దిశానిర్దేశం చేశారు.

క్షేత్రస్థాయిలో మొదలవని సంతకాల సేకరణ

ఓట్ల చోరీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చేపట్టిన నినాదం దేశవ్యాప్తంగా మార్మోగుతున్న వేళ ఈ ఉద్యమాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఏఐసీసీ నిర్ణయించింది. అందులో భాగంగా ఎప్పుడేం చేయాలో వివరిస్తూ పూర్తిస్థాయి కార్యాచరణ ప్రణాళికను రాష్ట్రాలకు పంపింది. ఇందులో భాగంగా గత నెల 15 నుంచి తెలంగాణలో సంతకాల సేకరణ కార్యక్రమం ప్రారంభం కావాల్సి ఉంది. ఇందుకోసం టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ కూడా పార్టీ రాష్ట్ర నేతలకు దిశానిర్దేశం చేశారు. యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమంలో స్వయంగా సంతకం చేస్తానని.. వెంటనే కార్యక్రమం చేపట్టాలనే సంకేతాలను పార్టీ శ్రేణులకు పంపారు. కానీ ఈలోగా భారీ వర్షాలు కురవడం, స్థానిక సంస్థల ఎన్నికల హడావుడి మొదలవడంతో కొంత జాప్యం జరిగింది. జిల్లా కేంద్రాల్లో మినహా క్షేత్రస్థాయిలో సంతకాల సేకరణ ఇంకా ప్రారంభం కాలేదు. ఈ నేపథ్యంలోనే శనివారం రాష్ట్రానికి వచ్చిన మీనాక్షి అన్ని స్థాయిల్లో పార్టీ నేతలకు దిశానిర్దేశం చేసే పనిలో పడ్డారు.

ప్రత్యేక శ్రద్ధ పెట్టండి: మీనాక్షి

పార్టీ నేతలతో శనివారం జరిగిన ఆన్‌లైన్ సమావేశంలో మీనాక్షి మాట్లాడుతూ ఓట్ల చోరీకి వ్యతిరేకంగా చేపడుతున్న ఉద్యమం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ నెల 15 నాటికి సంతకాలు సేకరించి ఏఐసీసీకి పంపాలని.. ప్రతి కాంగ్రెస్ నాయకుడు వారికి ఓటు హక్కు ఉన్న పోలింగ్ బూత్ పరిధిలో సంతకాల సేకరణ చేయాలన్నారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా కొంత జాప్యం జరిగినప్పటికీ ఇకపై వేగం పెంచాలని.. కనీసం ప్రతి గ్రామానికి 100కు తగ్గకుండా సంతకాలు చేయించాలని సూచించారు. టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ బి. మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ భారీ వర్షాల వల్ల సంతకాల సేకరణ ఆలస్యమైన నేపథ్యంలో వీలైనంత త్వరగా కార్యాచరణ రూపొందించి కార్యక్రమాన్ని చేపట్టాలని డీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలకు పిలుపునిచ్చారు.

ప్రతిసారీ కర్ణాటకను అవమానిస్తారా?

ఏపీ మంత్రి లోకేశ్‌పై కర్ణాటక మంత్రి ప్రియాంక్ ఖర్గే ఆగ్రహం

బనశంకరి: పెట్టుబడులు పెట్టడానికి మా రాష్ట్రానికి రండి అంటూ ప్రతిసారి కర్ణాటక, బెంగళూరును అవమానించడం మంచిదికాదని కర్ణాటక ఐటీ శాఖ మంత్రి ప్రియాంక్‌ఖర్గే, ఏపీ ఐటీ శాఖ మంత్రి లోకేశ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. బెంగళూరు పెట్టుబడిదారులను ఆంధ్రప్రదేశ్ మంత్రి లోకేశ్ ఆహ్వానించడంపై స్పందించిన ప్రియాంక్ ఖర్గే శనివారం విలేకరులతో మాట్లాడారు. కర్ణాటక పెట్టుబడిదారులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఏమీ లేదనీ, ప్రధాని మోదీ రూ.10వేల కోట్లకు పైగా నిధులను అమరావతికి ఇచ్చినా, అదీ చాలడం లేదన్నారు. అమరావతి అభివృద్ధి రాత్రికి రాత్రి జరగదని ధ్వజమెత్తారు. లోకేశ్ తమ పెట్టుబడులను కాపాడుకోవాలని సూచించారు.

కోల్డ్రిఫ్ సిరప్ ఉంటే తక్షణం తిరిగివ్వండి

ప్రజలకు డ్రగ్ కంట్రోల్ అధికారుల సూచన

సాక్షి, హైదరాబాద్: దేశ వ్యాప్తంగా ఆందోళన కలిగిస్తున్న కోల్డ్రిఫ్ సిరప్ ఘటనలపై తెలంగాణ డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) అప్రమత్తమైంది. మధ్యప్రదేశ్, రాజస్తాన్ రాష్ట్రాల్లో ఈ సిరప్ వాడకంతో పిల్లలు మృతి చెందిన ఘటనలు సంభవించినట్లు తేలడంతో, ప్రజలు వెంటనే 'కోల్డ్రిఫ్ సిరప్'వాడకాన్ని ఆపాలని అధికారులు సూచించారు. ఈ సిరప్‌లో డైఎతిలీన్ గ్లైకాల్ అనే విషపదార్థం కలిసినట్లు గుర్తించారు. 'ఈ సిరప్ మీ వద్ద ఉంటే పిల్లలకు ఈ దగ్గు మందును వాడకాన్ని తక్షణమే నిలిపివేసి, సమీప డ్రగ్స్ కంట్రోల్ అధికారులకు లేదా ఫార్మసీ ఇన్‌స్పెక్టర్లకు అప్పగించాలి'అని డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ జనరల్ షానవాజ్ ఖాసీం ఒక ప్రకటనలో తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ఎవరి వద్దనైనా ఈ ఔషధం ఉన్నట్లు గుర్తిస్తే టోల్‌ఫ్రీ నంబర్ 1800-599-6969లో సమాచారం ఇవ్వాలని కోరారు. కాగా, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు, అసిస్టెంట్ డైరెక్టర్లు రిటైల్ షాపులు, హోల్‌సేల్ డీలర్లు, ఆసుపత్రులలో ఈ సిరప్ నిల్వలపై తనిఖీలు ప్రారంభించారు.

సంబంధిత సిరప్ వివరాలు...

బ్యాచ్ నంబర్: ఎస్ఆర్-13,
తయారీ తేదీ: మే 2025,
గడువు తేదీ: ఏప్రిల్ 2027,
తయారీదారు: శ్రీసన్ ఫార్మా, సుంగువర్చత్రం, కాంచీపురం జిల్లా (తమిళనాడు)



మనకు నచ్చకపోతే వినేదే లేదు

తెలుసుకుంటే ఏ సమస్య వస్తుందోనన్న భయం
తెలియనిది హాని చేయదని ఎక్కువమంది నమ్మకం
పిల్లలూ, పెద్దల్లో పెరుగుతున్న 'ఆస్ట్రిచ్ ఎఫెక్ట్'

మనకు ఇష్టమైనదే వింటాం. ఏమాత్రం అసౌకర్యంగా అనిపించినా, ప్రతికూలంగా ఉన్నా ఆ సమాచారాన్ని వినడానికి కూడా ఇష్టపడం. కనీసం అటు వైపు కూడా చూడం. తెలియనిది తమకు హాని కలిగించదని చాలామంది అనుకుంటారు. ఇది పెద్దవారిలో ఒక సాధారణ ప్రవర్తన అని మనస్తత్వ శాస్త్రవేత్తలు అంటున్నారు. దీన్ని 'ఆస్ట్రిచ్ ఎఫెక్ట్' అంటారు. షికాగో విశ్వవిద్యాలయం చేపట్టిన కొత్త అధ్యయనం ప్రకారం యుక్త వయసుకు రాకముందే ఈ ధోరణి అభివృద్ధి చెందుతోందట.

- సాక్షి, స్పెషల్ డెస్క్

చాలామందికి ఆసుపత్రికి వెళ్లాలంటే భయం. అక్కడ ఏ టెస్టు చేస్తే ఏ సమస్య బయటపడుతుందో అని లోపల ఒక తెలియని ఆందోళన. అందుకే, 'నువ్వు, ఈ మధ్య టెస్టులు చేయించుకున్నావా' అని ఎవరైనా అడిగితే.. సంభాషణను వేరే విషయాలవైపు మళ్లిస్తుంటారు. కొన్ని కంపెనీలు లేదా సంస్థలు.. ఉచిత వైద్య శిబిరాలు పెట్టినప్పుడు కొందరు కనీసం అటువైపు కూడా చూడంది అందుకే. ఆస్ట్రిచ్ ఎఫెక్ట్‌గా పిలిచే ఈ ధోరణి పెద్దలతో పాటు పిల్లల్లోనూ ఉంటోందట.

చిన్న పిల్లల్లోనూ..

షికాగో విశ్వవిద్యాలయానికి చెందిన రాధిక సంతాన గోపాలన్ నేతృత్వంలోని పరిశోధకుల బృందం.. పిల్లల్లో వయసు పెరిగే కొద్దీ కొత్త సమాచారాన్ని స్వీకరించని మనస్తత్వ ధోరణి పెరుగుతున్నట్టు గుర్తించింది. ముఖ్యంగా ఇది 7-10 ఏళ్ల పిల్లల్లో ఎక్కువగా ఉందట. అసలు చాలామంది.. కొత్త విషయాన్ని లేదా జ్ఞానాన్ని నేర్చుకునే విషయంలో ఎందుకు విముఖత చూపుతారో 5 కారణాలను ఈ బృందం గుర్తించింది.



రాధిక

తప్పించుకునే ధోరణి

ఐదారేళ్ల పిల్లలు మరింత జ్ఞానం సంపాదించాలని ఉత్సాహంగా ఉన్నారు. 7 నుంచి 10 ఏళ్ల చిన్నారుల్లో కొందరు మాత్రం ఇందుకు కాస్త భిన్నంగా ఉన్నారు. వీళ్లు సమాచారం నుంచి తప్పించుకునే ధోరణులను ప్రదర్శించడం ప్రారంభిస్తున్నారు. 'ఉదాహరణకు, ప్రతి ఒక్కరినీ తమకు ఇష్టమైన, తక్కువ ఇష్టమైన క్యాండీ ఏంటో చెప్పండని అడిగాం. ఆ క్యాండీ వారి దంతాలకు ఎందుకు చెడ్డదో వివరించే వీడియో చూడాలని అనుకుంటున్నారా అని అడిగాం. ఆసక్తికరంగా.. వారికి నచ్చే దాని గురించి వారు 'అది ఎందుకు చెడ్డదో' తెలుసుకోడానికి ఇష్టపడలేదు. కానీ తక్కువ ఇష్టమైన క్యాండీ ఎందుకు చెడ్డదో తెలుసుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు' అని వివరించారు రాధిక.

అన్ని వేళలా మంచిది కాదు

'కొన్ని సందర్భాల్లో సమాచారం నుంచి తప్పించుకోవడం మంచిదే. అతి సర్వత్రవర్జయేత్ అన్నారు కదా! అయితే ప్రతిసారీ వద్దనుకునే ధోరణి మంచిది కాదు. అప్పటికి మనకు నచ్చనిది లేదా మనసుకు ఇబ్బందిగా అనిపించేది తరవాత విలువైనదని తేలవచ్చు. మనుషులకు అనిశ్చితిని లేదా ఒక సమస్యను పరిష్కరించుకోవాలనే కోరిక ఉంటుంది. కానీ పరిష్కారం, సమాచారం తమకు ఇబ్బందికరంగా లేదా ముప్పుగా ఉన్నప్పుడు తప్పించుకోవడానికే మొగ్గు చూపుతారు. కాస్త చొరవ, ధైర్యం చూపెడితే చాలు.. దీన్నుంచి సులభంగా బయటపడవచ్చు' అంటారు రాధిక.

ఎందుకు తప్పించుకుంటారు?

- అందోళన లేదా నిరాశ వంటి ప్రతికూల భావోద్వేగాలను నివారించడం
- ఇతరులు మన ఇష్టాయిష్టాలను, సామర్థ్యాలను ఎలా అర్థం చేసుకుంటారో అనే ఆందోళన, భయం
- మన నమ్మకాలను సవాలు చేసే ఆలోచనలు, వాస్తవాల నుంచి తప్పించుకునేందుకు
- మన ప్రాధాన్యతలకు ఇబ్బంది కలగకుండా చూసుకునేందుకు
- స్వార్థం లేదని నిరూపించుకునే క్రమంలో.. వ్యక్తిగత స్వార్థ ప్రయోజనాల కోసం

ఏమిటీ ఆస్ట్రిచ్ ఎఫెక్ట్?

యూనివర్సిటీ ఆఫ్ జెరూసలేంలోని ఇద్దరు ప్రొఫెసర్లు డాన్ గలాయ్, ఓర్లీ సేడ్.. మొట్టమొదట 'ఆస్ట్రిచ్ ఎఫెక్ట్' అనే పద బంధాన్ని ప్రయోగించారు. ఇజ్రాయెల్‌లోని క్యాపిటల్ మార్కెట్లలో పెట్టుబడిదారులు.. ఎప్పటికప్పుడు నష్ట సమాచారాన్ని వెల్లడించే మార్గాల కంటే.. తమకు నష్టం వచ్చినా ఫర్వాలేదని ఆ విషయం బయటకు చెప్పని మార్గాల్లోనే పెట్టుబడులు పెట్టడానికి ఇష్టపడుతున్నట్టు గుర్తించారు. ఈ ధోరణిని ఆస్ట్రిచ్ ఎఫెక్ట్‌గా అభివర్ణించారు. ఆస్ట్రిచ్ పక్షి తనకు ఏదైనా ప్రమాదం వస్తుందనిపిస్తే.. వెంటనే తన తలను ఇసుకలో దాచేస్తుందని దీని అర్థం. నిజానికి ఆస్ట్రిచ్ అలా చేయదు. కానీ, ఇది మాత్రం మానసిక వైద్య శాస్త్రంలో 'ఆస్ట్రిచ్ ఎఫెక్ట్'గా స్థిరపడిపోయింది.

చౌటుప్పల్‌లో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై బారులు తీరిన వాహనాలు



తిరుగు ప్రయాణాల రద్దీ

విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారి కిటకిట

చౌటుప్పల్: విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై శనివారం వాహనాల రద్దీ నెలకొంది. దసరా పండుగ సెలవులు ముగియడంతో సొంతూళ్ల నుంచి ప్రజలు తిరుగు పయనమయ్యారు. ఉదయం నుంచి రద్దీ ప్రారంభమై అర్ధరాత్రి వరకూ కొనసాగింది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో హైవేపై రద్దీతో జనం అవస్థలు పడ్డారు. హైవేపై రద్దీ ఉండడంతో వాహనదారులు సర్వీస్ రోడ్ల మీదుగా వెళ్లారు. దీంతో ఆ రోడ్లు సైతం రద్దీగా మారాయి.

అమెరికాలో దుండగుడి కాల్పులు.. హైదరాబాదీ మృతి

- టెక్సాస్ రాష్ట్రంలోని డాలస్‌లో ఓ పెట్రోల్ బంక్‌లో ఘటన
- ఎంఎస్ చేసేందుకు 2023లో డాలస్ వెళ్లిన పోలే చంద్రశేఖర్
- ఇటీవలే కోర్సు పూర్తి చేసుకొని ఉద్యోగ అన్వేషణలో ఉన్నట్లు సోదరుడి వెల్లడి

ఎల్బీనగర్: అమెరికాలో ఉన్నత చదువులు పూర్తి చేసుకొని ఉద్యోగం కోసం నిరీక్షిస్తున్న పోలే చంద్రశేఖర్(28) అనే హైదరాబాద్ యువకుడు ఓ దుండగుడి కాల్పులకు బలయ్యాడు. టెక్సాస్ రాష్ట్రంలోని డాలస్‌లో ఉన్న ఓ పెట్రోల్ బంక్‌లో పార్ట్‌టైమ్ ఉద్యోగం చేస్తున్న చంద్రశేఖర్‌పై శుక్రవారం రాత్రి (భారత కాలమానం ప్రకారం) ఓ దుండగుడు కాల్పులు జరపడంతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ వార్త తెలియడంతో ఎల్బీనగర్ పరిధిలోని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ టీచర్స్ కాలనీలో నివసిస్తున్న చంద్రశేఖర్ కుటుంబ సభ్యులు కుప్పకూలారు.



చంద్రశేఖర్ తల్లి సునీతను పరామర్శిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

బీడీఎస్ చేసి అమెరికా వెళ్లి..

పోలే జగన్‌మోహన్, తల్లి సునీత దంపతులకు దామోదర్, రాజుకిరణ్, చంద్రశేఖర్ సంతానం. చంద్రశేఖర్ తండ్రి నాలుగేళ్ల క్రితమే మృతి చెందారు. చంద్రశేఖర్ సోదరులు వ్యాపారంలో స్థిరపడగా చంద్రశేఖర్ దిల్‌సుఖ్‌నగర్‌లోని పాణినీయ డెంటల్ కాలేజీలో 2022లో బీడీఎస్ పూర్తి చేసి ఎంఎస్ చదివేందుకు 2023లో అమెరికాలోని డాలస్‌కు వెళ్లాడు. ఆరు నెలల కిందటే కోర్సు పూర్తి చేసుకున్న తన తమ్ముడు ప్రస్తుతం ఉద్యోగం కోసం నిరీక్షిస్తున్నాడని చంద్రశేఖర్ సోదరుడు దామోదర్ విలేకరులకు తెలిపాడు. రోజువారీ ఖర్చుల కోసం అక్కడి ఓ గ్యాస్ ఫిల్లింగ్ స్టేషన్‌లో పార్ట్‌టైమ్ ఉద్యోగం చేస్తున్నాడని చెప్పాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి అతనిపై ఓ దుండగుడు కాల్పులు జరపడంతో కన్నుమూసినట్లు పేర్కొన్నాడు. గ్యాస్ స్టేషన్ నిర్వాహకుడు వెంటనే ఈ విషయాన్ని చంద్రశేఖర్ స్నేహితుడు లోచన్‌సాయికి సమాచారం అందించగా అతను ఈ విషయాన్ని మృతుని తల్లికి ఫోన్లో తెలియజేశాడు. అయితే కాల్పుల ఘటనకు దారితీసిన కారణాలు మాత్రం వెంటనే తెలియరాలేదు.

హరీశ్‌రావు, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పరామర్శ...

చంద్రశేఖర్ బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా దివంగత మాజీ అధ్యక్షుడు గుంటి జంగయ్య మనవడు. దీంతో అతని కుటుంబ సభ్యులను మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సహా స్థానిక నేతలు శనివారం పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. చంద్రశేఖర్ పార్థివదేహాన్ని వీలైనంత త్వరగా హైదరాబాద్ రప్పించేలా రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని హరీశ్‌రావు కోరారు. అమెరికాలో కాల్పులకు ఒక దళిత విద్యార్థి బలికావడం దిగ్భ్రాంతికరమని 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

విద్యార్థి కుటుంబానికి అండగా ఉంటాం: సీఎం రేవంత్, మంత్రి అడ్లూరి

సాక్షి, హైదరాబాద్: అమెరికాలో కాల్పుల ఘటనలో మృతిచెందిన విద్యార్థి పోలే చంద్రశేఖర్ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ మైనారిటీ సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శనివారం వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. చంద్రశేఖర్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. చంద్రశేఖర్ పార్థివదేహాన్ని వీలైనంత త్వరగా స్వస్థలానికి తరలించేందుకు వీలుగా భారత రాయబార కార్యాలయంతో సంప్రదింపులు జరుపుతున్నామన్నారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034. EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

మావోల 'బహిరంగ'ఎత్తుగడ

- కాల్పుల విరమణపై పార్టీలో అయోమయం
- తీవ్ర నిర్బంధంతో తలోదిక్కున కేంద్ర కమిటీ సభ్యులు
- సాయుధ పోరాటంపై చర్చించేందుకు కుదరని వేదిక
- అగ్ర నేతల నుంచి వరుసగా వస్తున్న బహిరంగ లేఖలు
- లేఖల ద్వారానే కేంద్ర కమిటీ సభ్యుల అభిప్రాయాల వెల్లడి



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: సాయుధ పోరాటం కొనసాగించాలా?, విరమించాలా? అన్న అంశంపై మావోయిస్టు పార్టీ ఒక్కతాటిపైకి రావడానికి తర్జనభర్జన పడుతోంది. శాంతి చర్చల ప్రస్తావన తీసుకొచ్చి ఇప్పటికే ఏడు నెలలు గడిచినా.. ఈ అంశంపై పార్టీలో స్పష్టత కరువైంది. దీంతో మావోయిస్టు అగ్రనేతలు వరుసగా లేఖలు విడుదల చేస్తూ సాయుధ పోరాట విరమణ – శాంతి స్థాపన అంశంపై బహిరంగ చర్చకు తెర లేపారనే వాదనలు వినిపిస్తున్నాయి.

ఏడాది కాలంగా..

'ఆయుధాలు దించకుంటే శాంతి చర్చలకు ప్రభుత్వం సిద్ధంగా లేనందున ఇకపై శాంతి చర్చల ప్రస్తావన తేవొద్దు'.. అని 2024 ఆగస్టులో మావోయిస్టు పార్టీ నిర్ణయించినట్టు సమాచారం. కానీ ఇందుకు విరుద్ధంగా ఈ ఏడాది ఏప్రిల్‌లో శాంతి చర్చలకు సిద్ధమంటూ కేంద్ర కమిటీ తరఫున లేఖ విడుదలైంది. దీంతో ఈ అంశంపై మరింత స్పష్టత కోసం.. మరో నేత రూపేశ్ మీడియా ముందుకొచ్చారు. వేర్వేరు ప్రాంతాల్లో ఉన్న తమ అగ్ర నేతలంతా కూర్చుని మాట్లాడుకునేందుకు అవకాశం ఇవ్వాలని, అందుకోసం ఆపరేషన్ కగార్‌ను తాత్కాలికంగా నిలిపివేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

వరుస నష్టాలు..

మావోయిస్టులు శాంతి చర్చల ప్రస్తావన తెచ్చినా, ప్రభుత్వం మరింత కఠినంగా వ్యవహరించింది. ఫలితంగా వరుస ఎన్‌కౌంటర్లలో ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావుతో పాటు సుధాకర్, గణేశ్ వంటి అగ్రనేతలు చనిపోగా, మరో కేంద్ర కమిటీ సభ్యురాలు సుజాత లొంగిపోయారు. దీంతో ఆ పార్టీ మరింత ఇబ్బందుల్లో పడింది. చివరకు సెప్టెంబర్ 16న కేంద్ర కమిటీ తరఫున సోను లేఖ విడుదల చేశారు. ఇందులో స్పష్టంగా సాయుధ పోరాట విరమణ ప్రతిపాదన చేశారు. ఈ అంశంపై వివిధ వర్గాల అభిప్రాయాలు తెలుసుకునేందుకు ఈ మెయిల్ ఐడీలు సైతం ఇచ్చారు.

జగన్ వర్సెస్ అభయ్..

సోను ప్రకటన ఆయన వ్యక్తిగతమైనదిగానే చూడాలని, పార్టీది సాయుధ పోరాట పంథానే.. అని తెలంగాణ, దండకారణ్య, కేంద్ర కమిటీల తరఫున జగన్, అభయ్, వికల్ప్ లేఖలు విడుదల చేశారు. సాయుధ పోరాటానికే కట్టుబడి ఉన్నామని, లొంగిపోవాలనుకుంటే ఆయుధాలు అప్పగించి సోను వెళ్లొచ్చని ఈ మూడు కమిటీలు సూచనలు చేశాయి. దీంతో మావోయిస్టు పార్టీలో వర్గపోరు మొదలైందనే ప్రచారం జోరందుకుంది. రేపోమాపో సోను పోలీసులకు లొంగిపోతాడనే ప్రచారం కూడా జరిగింది. ఈ సమయంలోనే సోనూ మరో లేఖ విడుదల చేశారు. అందులోనూ తన పాత అభిప్రాయాలను పునరుద్ఘాటించడమే కాక.. పార్టీ పొలిట్‌బ్యూరోలో జరిగిన చర్చను సైతం జనం ముందుకు తెచ్చారు. తమ లేఖలపై జరుగుతున్న ప్రచారం గురించి పలుచోట్ల వివరణలు ఇచ్చారు. అయితే పార్టీకి సంబంధించిన రహస్య వివరాలు ఆ లేఖ ద్వారా బయటకు పొక్కకుండా జాగ్రత్త పడ్డారు.

వ్యూహాత్మకంగా బహిరంగ చర్చ..

వేర్వేరు ప్రాంతాల్లో అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు శాంతి చర్చలు – సాయుధ పోరాటంపై చర్చించుకునేందుకు అనువైన పరిస్థితులు లేవు. దీంతో వారు తమ అభిప్రాయాలను తెలిపేందుకు లేఖలను ఉపయోగించుకుంటున్నట్టు తెలుస్తోంది. అయితే ఇప్పటివరకు ఈ శాంతి చర్చల అంశంపై తెలంగాణకు చెందిన నేతలే ఎక్కువగా స్పందిస్తున్నారు. ఛత్తీస్‌గఢ్, ఏపీ, మహారాష్ట్ర, బిహార్, బెంగాల్, జార్ఖండ్, ఒడిశాలకు చెందిన ఇతర నేతలెవరూ స్పందించకపోవడం గమనార్హం.

వారి స్పందన ఏంటో?

మావోయిస్టు పార్టీలో అత్యున్నత నిర్ణయాత్మక విభాగమైన కేంద్ర కమిటీలో ఎనిమిది నుంచి పది మంది వరకు సభ్యులున్నట్టు సమాచారం. ఇందులో సోను సాయుధ పోరాట విరమణ ప్రతిపాదన చేస్తున్నారు. మిగిలిన సభ్యులు రాబోయే రోజుల్లో బహిరంగ లేఖల ద్వారా తమ అభిప్రాయం తెలియజేస్తారా?.. లేక గతంలో అభయ్, వికల్ప్, జగన్ వెల్లడించినట్టుగా సాయుధ పోరాటానికి కట్టుబడుతూ.. సోను, ఆయనను అనుసరించే వారిపై పార్టీ పరమైన క్రమశిక్షణ చర్యలు తీసుకుంటారా? అనేది తేలాల్సి ఉంది.



జిల్లాల వారీగా భూగర్భ జలమట్టాలు

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: గత ఏడాది సెప్టెంబర్‌తో పోలిస్తే ఈ సెప్టెంబర్‌లో భూగర్భ జలమట్టాలు భారీగా పెరిగాయి. జిల్లాల వారీగా సగటు భూగర్భ జలమట్టాల వివరాలు (మీటర్లలో) ఇలా...

జిల్లా	2024లో	2025లో	నీటి మట్టాలు పెరుగుదల(+) తగ్గుదల(-)
ఆదిలాబాద్	3.54	1.63	+ 1.91
భద్రాద్రి	5.16	5.27	- 0.11
భూపాలపల్లి	6.12	7.11	- 0.99
హనుమకొండ	2.02	3.40	- 1.38
హైదరాబాద్	4.34	3.57	+ 0.77
జగిత్యాల	2.29	2.33	- 0.04
జనగాం	5.32	4.79	+ 0.53
జోగుళాంబ గద్వాల	3.33	3.24	+ 0.09
కామారెడ్డి	9.47	5.92	+ 3.55
కరీంనగర్	3.31	3.48	- 0.17
ఖమ్మం	2.49	2.00	+ 0.47
కొమురంభీం	4.77	3.85	+ 0.92
మహబూబాబాద్	1.81	1.78	+ 0.03
మహబూబ్‌నగర్	5.92	5.27	+ 0.65
మంచిర్యాల	3.42	3.13	+ 0.29
మెదక్	10.81	7.86	+ 2.95
మేడ్చల్	7.99	5.35	+ 2.64
ములుగు	3.84	3.64	+ 0.20
నాగర్‌కర్నూల్	4.96	2.85	+ 2.11
నల్లగొండ	7.14	6.41	+ 0.73
నారాయణపేట్	5.11	3.87	+ 1.24
నిర్మల్	3.80	2.45	+ 1.35
నిజామాబాద్	7.20	6.03	+ 1.17
పెద్దపల్లి	3.75	3.52	+ 0.23
రంగారెడ్డి	8.25	6.31	+ 1.94
సంగారెడ్డి	9.37	6.08	+ 3.29
సిద్దిపేట	8.76	6.65	+ 2.11
సిరిసిల్ల	5.76	5.09	+ 0.07
సూర్యాపేట	3.35	3.84	- 0.49
వికారాబాద్	7.02	5.79	+ 1.23
వనపర్తి	3.44	3.41	+ 0.03
వరంగల్	2.49	2.61	- 0.12
యాదాద్రి	8.87	7.15	+ 1.72

అధ్యయనం అటకెక్కింది..

- గల్ఫ్, ఎన్నారై పాలసీ రూపకల్పనకు అడ్డంకులు
- ఎన్నారై అడ్వయిజరీ కమిటీ ఏర్పాటై ఆరు నెలలు..
- అతీగతీ లేని ప్రభుత్వ విధానం– కాగితాలకే పరిమితమైన సలహా కమిటీ

మోర్తాడ్ (బాల్కొండ): ఊరించి ఉసూరుమనిపించినట్లుంది గల్ఫ్ వలస కార్మికుల సంక్షేమంపై రాష్ట్ర ప్రభుత్వ విధానం. వలస కార్మికుల స్థితిగతులపై అధ్యయనం, గల్ఫ్ బోర్డు ఏర్పాటు, ప్రవాసీ విధానం (ఎన్ఆర్ఐ పాలసీ) అమలు చేసే అంశంపై ప్రభుత్వానికి సమగ్ర నివేదికను సమర్పించడానికి ఏర్పాటు చేసిన సలహా కమిటీ ఆరు నెలల నుంచి ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేకపోయింది. గల్ఫ్, ఎన్నారై పాలసీ రూపకల్పనకు తీవ్ర అడ్డంకులను పరోక్షంగా ప్రభుత్వమే సృష్టిస్తుండటంతో వలస కార్మికుల ఆశలు తీరేలా లేవనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. గల్ఫ్ వలస కార్మికుల సంక్షేమం విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పిదాలను తాము చేయబోమని వలస కార్మికు లకు, వారి కుటుంబాలకు అండగా ఉంటామని అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా ప్రకటించారు. ఎన్నారైల అంశం సీఎం పర్యవేక్షణలోనే ఉన్నా అడ్వయిజరీ కమిటీ చేతులు కట్టిపడేయడంతో పాలసీ అతీగతీ లేకుండా పోయిందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. గడచిన ఏప్రిల్ 4న ఎన్నారై సలహా కమిటీని ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. ఆరు నెలలైనా ఇప్పటివరకూ కమిటీ ఒకే ఒక్కసారి సమావేశం నిర్వహించింది. కమిటీ నివేదికను సమర్పించడానికి రెండేళ్ల గడువును ప్రభుత్వం విధించింది. ఇప్పటికే ఆరు నెలల సమయం వృథా కావడంతో మిగిలిన 16 నెలల కాలం మాటేమిటనే సందేహం ఉత్పన్నం అవుతోంది.



ఎన్నారై అడ్వయిజరీ కమిటీ సభ్యులు (ఫైల్)

కమిటీలో అందరూ ఉద్దండులే...

సలహా కమిటీకి చైర్మన్‌గా మాజీ రాయబారి, హైదరాబాద్ రీజినల్ పాస్‌పోర్టు అధికారిగా పనిచేసిన రిటైర్డ్ ఐఎఫ్ఎస్ అధికారి డాక్టర్ వినోద్‌కుమార్ చైర్మన్‌గా, గల్ఫ్ వ్యవహారాలపై విశేష అనుభవం ఉన్న మంద భీంరెడ్డిని వైస్ చైర్మన్‌గా నియమించారు. గౌరవ సభ్యులుగా ఎమ్మెల్యేలు ఆది శ్రీనివాస్, మేడిపల్లి సత్యం, డాక్టర్ భూపతిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్, మాజీ మంత్రి జీవన్‌రెడ్డిలను ఎంపిక చేశారు. గల్ఫ్ వలస కార్మికుల సంఘాలకు ప్రతినిధులుగా ఉన్న సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి, లిజీ జోసెఫ్, చెన్నమనేని శ్రీనివాస్‌రావు, కొట్టాల సత్యం నారాగౌడ్, గుగ్గిల్ల రవీందర్, నంగి దేవేందర్‌రెడ్డి, స్వదేశ్ పరికిపండ్లను సభ్యులుగా ఎన్నుకున్నారు. వీరితో పాటు ప్రభుత్వ పాలన జాయింట్ కార్యదర్శి ప్రొటోకాల్ సభ్యునిగా కొనసాగేలా కమిటీని నియమించారు.

ప్రభుత్వం తీరు ఆక్షేపణీయం...

రేవంత్‌రెడ్డి సర్కార్ గల్ఫ్ వలస కార్మికుల్లో ఆశలు పెంచి చివరకు ఏమీపట్టనట్లు ఉండిపోవడం మంచిది కాదు. ప్రభుత్వ తీరు సమంజసంగా లేదు. ఎన్నారై పాలసీ అమలు కోసం వలస కార్మికులు దశాబ్దాల కాలంగా ఎదురుచూస్తున్నారు. వలస కార్మికుల సంక్షేమం మరిస్తే ప్రభుత్వానికి గుణపాఠం చెబుతాం.

– కృష్ణ దొనికెన, ఎన్నారై పాలసీ సాధన ఉద్యమకారుడు

కార్యాలయం లేదు... నిధులు కరువే...

సలహా కమిటీ తన కార్యాచరణను ముందుకు తీసుకువెళ్లడానికి ఒక కార్యాలయం ఏర్పాటు చేయాల్సి ఉంది. రాష్ట్ర సచివాలయంలో లేదా మరే ఇతర ప్రభుత్వ భవనంలోనైనా కార్యాలయం ఏర్పాటు చేస్తే కమిటీ కార్యక్రమాలు ముందుకుసాగే అవకాశం ఉంది. అలాగే క్షేత్ర స్థాయిలో పర్యటించి అధ్యయనం చేయడానికి నిధులు అవసరం ఉండగా ఇప్పటి వరకూ నయాపైసా కేటాయించలేదు. కమిటీకి ఒక చిరునామా అంటూ ఏది లేకపోవడం గమనార్హం. కమిటీ ఏర్పాటై కాలం గడుస్తున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేకపోవడంతో ఎన్నారై పాలసీ రూపకల్పనపై నీలినీడలు అలుముకున్నాయి. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించి గల్ఫ్ వలస కార్మికుల సంక్షేమంపై ప్రకటనలు చేసినా ఆచరణలో విఫలం కావడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం అవుతోంది.

కృష్ణ.. కృష్ణా!

జింకలకు పోషకాహార నిధుల కొరత

కిన్నెరసాని డీర్ పార్క్ ఏర్పడి 51 ఏళ్లు

నాడు మూడు.. నేడు 139 జింకలు



కిన్నెరసాని డీర్‌పార్కులోని జింకలు

పాల్వంచ రూరల్: డీర్ పార్కులో కృష్ణ జింకల పోషకాహారానికి వైల్డ్‌లైఫ్ శాఖను నిధుల కొరత వేధిస్తోంది. 51 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన పార్కులో మూడు జింకలను ఉంచగా వాటి సంతతి పెరిగి ప్రస్తుతం 139కి చేరాయి. అయితే పార్క్ సామర్థ్యానికి మించి ఉండటంతో కొన్ని జింకలను అడవిలో వదిలివేయాలని వైల్డ్‌లైఫ్ అధికారులు యోచిస్తున్నారు. శరీరంపై తెల్లటి చుక్కలు, కొమ్ములతో అందంగా కనిపించే రాష్ట్ర జంతువైన కృష్ణ జింకలకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కిన్నెరసాని పార్కు నెలవుగా మారింది. వన్యప్రాణుల సంరక్షణ విభాగం (వైల్డ్‌లైఫ్) పర్యవేక్షణలో పర్యాటకులను కనువిందు చేసే అరుదైన చుక్కల దుప్పులు (కృష్ణ జింకలు) నివాసం ఉంటున్న డీర్ పార్కు ఆవిర్భవించి 51 సంవత్సరాలు పూర్తయింది. జింకల సంరక్షణార్థం సింగరేణికి చెందిన 14.50 హెక్టార్ల విస్తీర్ణంలో పార్క్ నిర్మించారు. 2012లో రూ.11 లక్షల వ్యయంతో 720 మీటర్ల విస్తీర్ణంలో ఇనుప కంచె ఏర్పాటు చేశారు. ప్రస్తుతం 139 జింకలు ఉండగా ఆడ జింకలు 54, మగవి 81, నాలుగు పిల్లలు ఉన్నాయి. వీటికి తోడు ఐదు మూషిక జింకలు, కొండగొర్రెలు ఉన్నాయి.

వైల్డ్‌లైఫ్ పర్యవేక్షణలోకి పార్కు...

జింకల సంరక్షణ బాధ్యతను 1998 వరకు సింగరేణి అధికారులు చూసేవారు. ఆ తర్వాత సింగరేణి సంస్థ వైల్డ్‌లైఫ్ శాఖకు అప్పగించింది. జింకలకు పౌష్టికాహారం కోసం ప్రత్యేకంగా రెండు హెక్టార్ల విస్తీర్ణంలో గడ్డి పెంచుతున్నారు. దీనికి తోడు ఉదయం 50 కేజీల, సాయంత్రం 50 కేజీలు గడ్డి, 250 కేజీల చొప్పున ఫీడింగ్ అందిస్తున్నారు. 11 రకాల పోషకాహారాలు కలిగిన ఫీడింగ్‌ను ఛత్తీస్‌గఢ్‌లోని రాయచూర్ నుంచి తెప్పిస్తున్నారు. అయితే ఇది సరిపోక పచ్చిగడ్డి వేసినా వాటి కడుపు నిండని పరిస్థితి నెలకొంది. అదనంగా ఫీడింగ్ పెట్టాలంటే ఖర్చు అధికమవుతోంది. ఇందుకోసం ప్రభుత్వం నిధులు ఇవ్వడం లేదు. జింకలను వీక్షించేందుకు వచ్చే పర్యాటకుల నుంచి టికెట్ల రూపంలో వసూలు చేసినా ఆ అరకొర డబ్బుతోనే ఇటు జింకలకు పోషకాహారంతోపాటు వాటి బాగోగులు చూసే ఏడుగురు వాచర్లకు వేతనాలు, సీసీ కెమెరాల రీచార్జి, శానిటేషన్ తదితర ఖర్చులు ప్రతి నెలా రూ.2 లక్షల మేర అవుతోందని వైల్డ్‌లైఫ్ శాఖ అధికారులు చెబుతున్నారు. ఫీడింగ్ కోసం ప్రభుత్వం నిధులు మంజూరుచేస్తే వైల్డ్‌లైఫ్ శాఖకు ఆర్థిక భారం తగ్గనుంది. కరోనా సమయంలో సందర్శకులు రాక డబ్బులు రాలేదు. దీంతో సంబంధిత అధికారులు ఆ తర్వాత వచ్చిన డబ్బు సుమారు రూ.30 లక్షలు బ్యాంక్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి అత్యవసర సమయంలో వినియోగిస్తున్నారు.

అరకొర నిధులతో ఆకలి గోస..

డీర్ పార్కులోని జింకల ఆహారానికి ప్రభుత్వం నుంచి అరకొరగా నిధులు రావడం, వైల్డ్‌లైఫ్ శాఖనే ఖర్చు భరిస్తుండటంతో సరైన ఆహారం అందక జింకలు బక్కచిక్కుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రోజుకు రెండు పూటలా గడ్డి మేత వేస్తున్నా.. సరిపోకపోవడంతో పర్యాటకులు ఏమైనా ఆహారం అందిస్తారా అని జింకలు ఆశగా ఎదురుచూస్తుంటాయి.

సందర్శకుల ద్వారా వచ్చే ఆదాయంతోనే పోషణ



డీర్ పార్క్ సందర్శనకు వచ్చే పర్యాటకుల ద్వారా లభించే ఆదాయంతోనే జింకలను పోషిస్తున్నాం. ప్రభుత్వం నుంచి ప్రత్యేకంగా నిధులేమీ రావడం లేదు. ఉన్న నిధులతోనే రోజూ ఉదయం, సాయంత్రం పౌష్టికాహారం అందిస్తున్నాం. జింకలకు తాగునీటి కోసం పార్కులో ప్రత్యేకంగా చెక్‌డ్యామ్‌లు నిర్మించాం.

– బి.బాబు, వైల్డ్‌లైఫ్ ఎఫ్‌డీఓ

22 ఏళ్లలో రూ.2.76 కోట్ల ఆదాయం


కిన్నెరసాని డీర్ పార్కులోని జింకలను వీక్షించేందుకు వచ్చిన పర్యాటకుల ద్వారా టికెట్ల రూపంలో వైల్డ్‌లైఫ్ శాఖకు 2003 నుంచి ఇప్పటివరకు రూ.2,76,23,281 ఆదాయం లభించింది.



జింకకు గడ్డి పెడుతున్న సందర్శకురాలు



జింకలకు పచ్చిగడ్డి మేత సిద్ధం చేస్తున్న సిబ్బంది



క్లుప్తంగా...

నేడు బొప్పూడికి హైకోర్టు సీజే

చిలకలూరిపేట: పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం బొప్పూడి గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి, చెన్నకేశవ స్వామి, మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో ఆదివారం నిర్వహించే కార్యక్రమాలకు ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్‌తో పాటు పలువురు హైకోర్టు న్యాయమూర్తులు రానున్నట్టు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఆలయాలకు సంబంధించిన నక్షత్ర వనం, రాశివనం, పంచవటి, నవగ్రహవనంలో మొక్కలు నాటే కార్యక్రమం, ప్రత్యేక పూజలు చేపట్టనున్నారు. కార్యక్రమం ఉదయం 10 గంటలకు జరుగుతుంది. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బి. కృష్ణమోహన్‌తో పాటు జస్టిస్ రవినాథ్ తిహారి, జస్టిస్ నైనాల జయసూర్య, జస్టిస్ వడ్డిబోయిన సుజాత, జస్టిస్ వి. శ్రీనివాస్, జస్టిస్ డాక్టర్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప, జస్టిస్ అవధానం హరిహరనాథ శర్మ, జస్టిస్ డాక్టర్ వై. లక్ష్మణరావు, జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి పాల్గొననున్నారు. స్వామి వార్ల భూమి 1.20 ఎకరాల్లో నక్షత్రాలు, రాశుల వారీగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహిస్తారన్నారు.

తేనెటీగల దాడిలో రెవెన్యూ ఉద్యోగులకు గాయాలు

వజ్రకరూరు: అనంతపురం జిల్లా వజ్రకరూరు మండలం రాగులపాడు సమీపంలోని హంద్రీ–నీవా సుజల స్రవంతి ఎత్తిపోతల పథకం (లిఫ్ట్) వద్ద శనివారం రెవెన్యూ ఉద్యోగులపై తేనెటీగలు దాడి చేశాయి మండలంలోని కొనకొండ్ల గ్రామానికి చెందిన ఎం.రామాంజినేయులు అనే వ్యవసాయ కూలీ 4 రోజుల క్రితం ఛాయాపురం వద్ద ఉన్న హంద్రీ–నీవా ప్రధాన కాలువలో గల్లంతయ్యాడు. ఇప్పటికీ అతని ఆచూకీ లభించలేదు. దీంతో రెవెన్యూ, అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బంది, వజ్రకరూరు పోలీసులు గాలింపు చేపట్టారు. ఇందులో భాగంగా శనివారం సాయంత్రం వజ్రకరూరు తహసీల్దార్ నరేష్‌కుమార్ నేతృత్వంలో ఆర్ఐ సతీష్‌కుమార్, విఆర్వోలు ఛత్రేనాయక్, రంగస్వామి, వీఆర్ఏలు విజయ్, పెన్నయ్య, సుంకన్నతో పాటు మరికొందరు రెవెన్యూ ఉద్యోగులు ఛాయాపురం నుంచి రాగులపాడు లిఫ్ట్ వరకు కాలువ వెంట గాలించారు. రాగులపాడు లిఫ్ట్ వద్ద అకస్మాత్తుగా తేనెటీగలు దాడిచేశాయి. వీఆర్వోలు ఛత్రేనాయక్, రంగస్వామి, వీఆర్ఏలు విజయ్, పెన్నయ్య, సుంకన్న తదితరులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని వజ్రకరూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో శనివారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లోని కంపార్ట్‌మెంట్లు అన్నీ భక్తులతో నిండాయి. క్యూలైన్ గోగర్భం వద్దకు చేరుకుంది. శుక్రవారం అర్ధరాత్రి వరకు 73,581 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 28,976 మంది తలనీలాలు అర్పించుకున్నారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.2.60 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టిక్కెట్లు లేని వారికి 18 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన వారికి 3 గంటల్లో స్వామివారం దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది.

కోనసీమలో వేద సౌరభం



వేదపండితులు, ఘనాపాటీలు, సిద్ధాంతులకు 'ఇరగవరం' ప్రసిద్ధి

- పాలేశ్వరుడు కొలువైన గ్రామం
- దేశవ్యాప్తంగా ఖ్యాతిగాంచిన వారెందరో
- ప్రముఖ ఆలయాల్లోని వేద పండితుల్లో పలువురు ఇరగవరం మూలాలు ఉన్నవారే



వేదపఠనం చేస్తున్న విద్యార్థులు

వేద శివహః శివో వేదహః వేదాధ్యాయి సదా శివహః

సాక్షి, భీమవరం/ ఇరగవరం: వేదమే శివుడు. శివుడే వేదం. ఈశ్వరుని ఉచ్ఛ్వాశ, నిశ్వాసలే వేదాలుగా చెబుతారు. ఆ పరమేశ్వరుడే స్వయంభువుగా వెలసి పాలేశ్వరునిగా పూజలందుకుంటున్న గ్రామం. యజ్ఞయాగాదులు, నిత్య వేదఘోషతో వేద నిలయంగా పేరొందింది పశ్చిమగోదావరి జిల్లా ఇరగవరం. గ్రామం నుంచి వేద పండితులుగా, సిద్ధాంతులుగా, ఘనాపాటీలుగా ఎంతోమంది దేశవ్యాప్తంగా ఖ్యాతి పొందారు. తణుకు నియోజకవర్గంలో మండల కేంద్రంగా ఉన్న ఇరగవరం జనాభా 5585 మంది. కుటుంబాల సంఖ్య 1825. వీరిలో 250 వరకు బ్రాహ్మణ కుటుంబాల వారు ఉన్నారు. చాలా కుటుంబాల్లో వేదం, ఆగమనం, శాస్త్రం, జ్యోతిష్యం, స్మార్తం, మంత్ర శాస్త్రం తదితర కళలను అవపోసన పట్టి వేదపండితులు, ఘనాపాటీలు, సిద్ధాంతులుగా ప్రసిద్ధి చెందినవారు ఉంటారు. తిరుమల తిరుపతి, విజయవాడ ఇంద్రకీలాద్రి, అన్నవరం సత్యనారాయణస్వామి, సింహాచలం అప్పన్న తదితర రాష్ట్రవ్యాప్తంగా పేరొందిన ఎన్నో దేవాలయాలు, వేద పాఠశాలల్లోని ప్రముఖ వేద పండితుల్లో అధికంగా ఇరగవరం మూలాలు ఉన్నవారే ఉంటారని ప్రసిద్ధి. వేదాభివృద్ధికి చేసిన కృషికి సాంగత్రి వేదాచార్య, అహోరాత్రి పారాయణ, వేద తపస్వి, నిత్యాగ్నిహోత్రిలుగా ప్రముఖుల నుంచి సత్కారాలు, పురస్కారాలను, గండభేరుండాలను అందుకున్నవారు ఎంతోమంది ఉన్నారు.

పంచపాల క్షేత్రం

పూర్వం బ్రాహ్మణులు ఇరగవరంలో నిత్యం యజ్ఞయాగాది క్రతువులు చేసేవారు. వేద ప్రియుడైన ఈశ్వరుడు ఈ గ్రామానికి వచ్చి ఆకలితో పిల్లిగా మారి అక్కడి ఉట్టిలోని పాలు, పెరుగు, నెయ్యి ఆరగించేవారని చెబుతారు. పూజకు వినియోగించే ఈ ద్రవ్యాలు రోజూ మాయమైపోతుండటం చూసి గోసంరక్షకుణ్ణి కాపలాగా ఉంచారని, పిల్లి పాలు తాగుతుండటాన్ని గమనించి గొడ్డలితో కొట్టగా తల నాలుగు ముక్కలైందని, పిల్లి శరీరాన్ని విడిచిన ఈశ్వరుడు వేదపండితులు, పెద్దలకు కలలో ప్రత్యక్షమై పిల్లి శరీరం పడిన చోట ఉద్భవించిన శివలింగానికి ఆలయం నిర్మించాలని చెప్పాడని ఇక్కడ బహుళ ప్రాచుర్యంలో ఉంది. పాలగుండం, పాల వృక్షాల వనం, పాలరాతి శివలింగం, పాలబుడ్డి ఆకారంలో గుడి, పాలేశ్వరస్వామి వారి పేర్లతో పంచపాల క్షేత్రంగా ప్రసిద్ధి చెందింది. పాలబుడ్డి ఆకారంలోని శివలింగాన్ని యోగ లింగంగా చెబుతారు.



పంచపాలేశ్వర స్వామివారు

ఎందరో మహానుభావులు...

వేదాధ్యయనం చేసిన బ్రాహ్మణుడు సాక్షాత్తూ పరమేశ్వర స్వరూపంగా భావిస్తారు. రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డును అందుకున్న బ్రహ్మశ్రీ తంగిరాల బాలగంగాధరశాస్త్రి, దేశవ్యాప్తంగా అనేక చోట్ల అహోరాత్ర వేదపారాయణలు చేసిన బ్రహ్మశ్రీ గుళ్లపల్లి ఆంజనేయ ఘనాపాటి, యావత్ జీవితాన్ని వేదానికి అంకితం చేసిన గుళ్లపల్లి సీతారామశాస్త్రి, నిత్యాగ్నిహోత్రకులుగా, పంచాంగకర్తలుగా పేరొందిన సోమయాజి, ప్రేసపాటి పాలశంకర అవధాని, సంస్కృతంలోని ఆరు గ్రంథాలను తెలుగులోకి అనువదించిన గుళ్లపల్లి శ్రీరామశర్మ, ప్రముఖ సిద్ధాంతిగా పేరొందిన ప్రేసపాటి వెంకప్ప సోమయాజి తదితర ఎందరో వేద పండితులు ఈ గ్రామానికి చెందినవారే. తంగిరాల కృష్ణానందతిలక, తంగిరాల రామసోమయాజులు, పేసపాటి సుబ్బరాయశాస్త్రిలు స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని తామ్రపత్రాలు పొందారు. వీరిలోని తంగిరాల రామసోమయాజులు 36 ఏళ్ల ఏకగ్రీవంగా గ్రామ సర్పంచ్‌గా సేవలందించారు. 1962లో అష్టగహ కూటమి వచ్చి అరిష్టాలు సంభవించినప్పుడు ప్రముఖ మంత్రవేత్త తంగిరాల సుబ్రహ్మణ్య సిద్ధాంతి, తంగిరాల బాలగంగాధర శాస్త్రి, పేసపాటి వెంకప్ప సోమయాజి సిద్ధాంతి తదితరులు దేశ క్షేమం కోసం 12 రోజులు స్వామివారికి అతిరుద్ర యాగం నిర్వహించినట్టుగా పెద్దలు చెబుతారు. ప్రస్తుత తరంలోనూ గ్రామానికి చెందిన ఎందరో వేదపండితులు పెద్దలు చూపిన మార్గంలో నడుచుకుంటూ దేశవ్యాప్తంగా జ్యోతిష్య, వాస్తు విషయాలపై ప్రజలకు పరిష్కార మార్గాలను చూపుతూ వేదాభివృద్ధికి కృషి చేస్తున్నారు. సినీ, రాజకీయ ప్రముఖులు ఎందరో ఇక్కడికి వచ్చి పూజలు చేయించుకుంటుంటారు. బ్రహ్మశ్రీ గుళ్లపల్లి సీతారాము కుటుంబ సభ్యులు గ్రామంలో నిర్వహిస్తున్న శ్రీ కామకోటి చంద్రశేఖర వేద పాఠశాల ద్వారా ఎంతోమంది విద్యార్థులు వేద విద్యను అభ్యసిస్తున్నారు.

పాలేశ్వరుని అనుగ్రహంతోనే



పాలేశ్వర స్వామివారు కొలువై ఉన్న ఈ గ్రామంలో జన్మించడం పూర్వజన్మ సుకృతం. స్వామివారి అనుగ్రహంతోనే గ్రామం వేద నిలయంగా పేరొందింది. ఉమ్మడి రాష్ట్రవ్యాప్తంగా సామాన్యుల నుంచి సినీ, రాజకీయ ప్రముఖులు, పారిశ్రామిక, వ్యాపార వేత్తలు ఎంతో మందికి జ్యోతిష్యం, వాస్తు సలహాలు చెప్పడం, ఆలయ నిర్మాణాలకు యజ్ఞయాగాది క్రతువులు నిర్వహించే భాగ్యం కలగడం పరమేశ్వరానుగ్రహంగా భావిస్తాం.

– తంగిరాల ప్రదీప్ సిద్ధాంతి, శ్రీపంచముఖి హనుమద్ పీఠం, ఇరగవరం, పశ్చిమగోదావరి జిల్లా

బాణసంచా తయారీలో అపశృతి

ముగ్గురికి తీవ్రగాయాలు
విశాఖ జిల్లాలో ఘటన

తగరపువలస(విశాఖ): జీవీఎంసీ పరిధి భీమిలి జోన్ రెండో వార్డు వలందపేట రెడ్డివీధిలో అమ్మవారి మండపం వద్ద బాణసంచా తయారీలో భాగంగా శుక్రవారం రాత్రి మంటలు వ్యాపించి అదే గ్రామానికి చెందిన బాకి మహేష్‌రెడ్డి(35), నగిరెడ్ల వాసు(32), చిల్ల కనకరెడ్డి(26) తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దసరా ఉత్సవాల్లో భాగంగా గ్రామంలో మండపం నిర్మించి అమ్మవారి విగ్రహం ఏర్పాటు చేశారు. శనివారం అమ్మవారి నిమజ్జనోత్సవం నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేసుకుంటోంది. అందులో భాగంగా రూ.18 వేల విలువైన బాణసంచా కొనుగోలు చేశారు. ఇంకా బాణసంచా అవసరమని సొంతంగా తయారు చేసుకోవడానికి శుక్రవారం సాయంత్రం ఉపక్రమించారు. ఈ క్రమంలో బాణసంచా తయారీకి అవసరమైన పొటాషియం తదితర ముడిపదార్థాలను బీరు సీసాతో నూరే క్రమంలో పెద్ద ఎత్తున మంటలు వ్యాపించి ఈ ముగ్గురు గాయపడ్డారు. వీరిని తక్షణం సంగివలస అనిల్ నీరుకొండ ఆసుపత్రికి చికిత్స కోసం తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. కనకరెడ్డికి శస్త్రచికిత్స చేయగా మహేష్‌రెడ్డి, వాసులకు సోమవారం శస్త్రచికిత్స చేయనున్నారు. ఈ ముగ్గురు స్థానికంగా ప్లంబింగ్, ఎలక్ట్రీషియన్ పనులు చేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. వీరిలో మహేష్‌రెడ్డి, వాసులకు వివాహాలు కాగా కనకరెడ్డికి ఇంకా వివాహం కాలేదు. ఘటనా స్థలాన్ని భీమిలి సీఐ తిరుపతిరావు, తాళ్లవలస అగ్నిమాపకశాఖాధికారి జి.శ్రీనివాసరాజు సందర్శించారు.

పంట భూములను పాడుచేయొద్దు

ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమ ఏర్పాటుకు వ్యతిరేకంగా గళమెత్తిన ప్రజలు
ప్రజాభిప్రాయ సేకరణలో తీవ్ర వ్యతిరేకత



ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొన్న పలు గ్రామాలకు చెందిన ప్రజలు

చీపురుపల్లిరూరల్(గరివిడి): ఏటా పంటలు పండే భూముల్లో ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమ ఏర్పాటుచేసి ఉపాధిని దూరం చేసి జీవితాలను నాశనం చేయొద్దంటూ విజయనగరం జిల్లా గరివిడి మండలంలోని కుమరాం, కె.పాలవలస, కందిపేట, తాటిగూడ, విజయరాంపురం పరిసర ప్రాంతాల యువత, ప్రజలు గోడు వినిపించారు. పరిశ్రమ ఏర్పాటుకు వ్యతిరేకంగా గళమెత్తారు. గరివిడి మండలం కుమరాం పంచాయతీ పరిధిలో శోభా మెటల్స్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ ఆధ్వర్యంలో సర్వే నంబర్ 136/1, 136/5, 136/5ఎలో ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమ ఏర్పాటుకు సంబంధించి రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రజాభిప్రాయ సేకరణ సదస్సు శనివారం చేపట్టింది. డీఆర్వో శ్రీనివాసమూర్తి, కాలుష్య నియంత్రణ మండలి చీఫ్ ఇంజినీర్ రామారావు నాయుడు, తహసీల్దార్ సీహెచ్ బంగారురాజు హాజరై ప్రజల అభిప్రాయాలు తెలియజేయాలని కోరారు. స్థానిక ప్రజాప్రతినిధులు కొందరు నియమ నిబంధనలు అనుసరించి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుని పరిశ్రమ ఏర్పాటు చేయాలని తెలపగా, మరికొందరు పరిశ్రమ వద్దని స్పష్టం చేశారు. పరిశ్రమకు అవసరమైన నీటికోసం పెద్దఎత్తున బోర్లు తవ్వితే వ్యవసాయ బోర్లు ఎండిపోతాయని, సాగు కష్టాలు తప్పవని పాలవలస సర్పంచ్ మీసాల ప్రసాదరావు అభిప్రాయం తెలిపారు. మూతపడిన గరివిడి ఫేకర్ పరిశ్రమను లీజుకు తీసుకుని కొనసాగిస్తే యువతకు ఉపాధి కలుగుతుందని మరికొందరు పేర్కొన్నారు. పరిశ్రమల పేరుతో పంట భూములను నాశనం చేయొద్దని స్థానికులు గోవింద్, రఘుమండ రవికుమార్, ముల్లు సత్యనారాయణ తెలిపారు. తాటిగూడకు చెందిన పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బూత్‌కమిటీ వింగ్ జాయింట్ సెక్రటరీ ఎడ్ల అప్పారావు మాట్లాడుతూ నీటిని కలుషితం చేసే పరిశ్రమ మాకొద్దని తెగేసి చెప్పారు.

మా ఆటో ముందు.. పసుపు జెండాలతో ఫొటోలొద్దు



కోనసీమ జిల్లా పిగన్నవరం మండలం పోతవరంలో టీడీపీ, జనసేన కార్యకర్తల మధ్య వాగ్వాదం

- ఉచిత బస్సుతో కొడుపు కొట్టి.. 'ఆటోడ్రైవర్ సేవలో' టీడీపీ
- మొక్కుబడిగా పాల్గొన్న ఆటో డ్రైవర్లు
- పసుపు జెండాలతో ఫొటోలకు అంగీకరించని వైనం
- కంగుతిన్న అమలాపురం ఎమ్మెల్యే ఆనందరావు, టీడీపీ నేతలు
- పి.గన్నవరంలో జనసేన, టీడీపీ బాహాబాహీ

సాక్షి, అమలాపురం: ఓవైపు ఉచిత బస్సు పేరుతో తమ పొట్ట కొట్టారనే ఆగ్రహం.. దీనికి తోడు ఇస్తానన్న రూ.15 వేల సాయానికి నిబంధనల కొర్రీలు.. ఇలా గిల్లి జోల పాడినట్లుగా వ్యవహరిస్తున్న కూటమి సర్కారు తీరుపై ఆటో డ్రైవర్లు మండిపడ్డారు. దీంతో, టీడీపీ శనివారం నిర్వహించిన 'ఆటో డ్రైవర్ల సేవలో..' కార్యక్రమం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో రసాభాసగా సాగింది. 'గోరంత సాయానికి.. కొండంత హడావుడి' అనే తీరులో ప్రచారార్భాటం చేయాలనుకున్న నేతల వ్యూహం ఎదురు తన్నింది. పలుచోట్ల ఆటో డ్రైవర్లు ఎదురు తిరిగారు. కూటమి సర్కారు తీరుపై అసంతృప్తితో ఈ కార్యక్రమానికి దూరంగా ఉన్నారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురంలో ఆ పార్టీకి చెందిన స్థానిక ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు సమక్షంలో టీడీపీ నేతలకు చేదు అనుభవం ఎదురైంది. ఆటో డ్రైర్ల సేవలో ర్యాలీకి 100 ఆటోలు కూడా రాలేదు. వచ్చినా చాలా మంది ఈ కార్యక్రమంలో పాల్గొనకుండానే వెళ్లిపోయారు. ఎమ్మెల్యే ఆనందరావు, ఇతర టీడీపీ నేతలు వచ్చిన సమయంలో టీడీపీకి చెందిన కొంతమంది చోటామోటా నాయకులు ఆటోల ముందు టీడీపీ జెండాలతో ఫొటోలు దిగేందుకు సిద్ధమయ్యారు. దీనికి ఆటో డ్రైవర్లు అభ్యంతరం చెప్పడంతో తమ్ముళ్లు కంగు తిన్నారు.

టీడీపీ, జనసేన బాహాబాహీ

నియోజకవర్గ కేంద్రమైన పి.గన్నవరంలో టీడీపీ, జనసేన నేతలు బాహాబాహీకి దిగారు. ఒకరినొకరు నెట్టుకోవడంతో పాటు పరుష పదజాలంతో తిట్ల దండకం అందుకున్నారు. ఇక్కడ నిర్వహించిన ఆటో డ్రైవర్ సేవలో కార్యక్రమం కోసం రవాణా శాఖ తయారు చేసిన ఫ్లెక్సీ మీద, ఆటో డ్రైవర్లకు పంపిణీ చేసే నమూనా చెక్ మీద ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఫొటో లేకపోవడం చూసి జనసేన నేతలు విరుచుకుపడ్డారు. జనసేనకు చెందిన పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ సమక్షంలోనే అధికారులపై మండిపడ్డారు. పవన్ వల్లే టీడీపీ అధికారంలోకి వచ్చిందని గుర్తు చేశారు. తాము నిర్వహించే కార్యక్రమాల్లో చంద్రబాబు ఫొటో వేస్తున్నామని, టీడీపీ కార్యక్రమాల్లో మాత్రం పవన్ కల్యాణ్ ఫొటో వేయడం లేదని ప్రశ్నించారు. అధికారులు సర్ది చెబుతున్న సమయంలో టీడీపీకి చెందిన మద్దాల సుబ్రహ్మణేశ్వరరావు వివాదాస్పద వ్యాఖ్యలు చేయడంతో జనసేన నేతలు మండిపడ్డారు. సుబ్రహ్మణ్యేశ్వరరావుతో పాటు మాజీ జెడ్పీ చైర్మన్ నామన రాంబాబు, ఇతర టీడీపీ నాయకుల మీదికి దూసుకుపోయారు. దీంతో, అక్కడ ఘర్షణ వాతావరణం నెలకొంది. పోలీసులు కలుగజేసుకుని ఇరు పార్టీల నాయకులకు సర్ది చెప్పారు.

చిన్నారి పెళ్లి కూతుళ్లు

- దగ్గరి బంధువులకు ఇచ్చుకోవడం, పేదరికం, నిరక్షరాస్యత కారణం
- బాల్యవివాహాలతో అనారోగ్యం
- చిన్నతనంలో గర్భం దాలిస్తే తల్లీబిడ్డకు ప్రమాదం

అధికమవుతున్న టీనేజీ వివాహాలు



కర్నూలు(హాస్పిటల్): పేదరికం, నిరక్షరాస్యత, బాలికల ఎదుగుదలపై ఆందోళన, అభద్రతా భావం వంటి కారణాలతో బాల్యవివాహాలు అధికమవుతున్నాయి. ఇందులో అధికారులు కొన్ని మాత్రమే అడ్డుకుంటుండగా అధిక శాతం గుట్టుచప్పుడు కాకుండా, ఆధార్‌కార్డులో వయస్సు మార్చి వివాహ తంతు జరిపించేస్తున్నారు. వీటిలో అధికశాతం గ్రామ పెద్దల సహకారంతోనే జరుగుతున్నా అడిగే నాథుడు కరువయ్యారు. బిడ్డకు మూడుముళ్లు పడితే భారం తగ్గిపోతుందన్న భావనతో గ్రామాల్లో కూతురు పుష్పవతి అయితే చాలు ఏ అయ్యకు కట్టబెడదామా అని తల్లిదండ్రులు ఆలోచిస్తున్నారు. ఈ కారణంగా బాలికల చదువు మధ్యలోనే ఆగిపోతూ వారి భవిష్యత్ నాశనమవుతోంది. మరోవైపు చిన్నవయస్సులో గర్భవతి కావడంతో ఆమె ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది.

నిరక్షరాస్యులే అధికం

టీనేజీలో గర్భం దాల్చే వారిలో నిరక్షరాస్యులైన అమ్మాయిలే అధికంగా ఉన్నట్లు రికార్డులు చెబుతున్నాయి. పేదరికం, వర్షపాతం తక్కువగా ఉండటం, ఫలితంగా పంటలు సరిగ్గా పండకపోవడం, ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లడం, అమ్మాయిల భద్రత గురించి ఆందోళన, సామాజికపరమైన అంశాలు వంటి కారణాలతో బాల్యవివాహాలు అధికంగా జరుగుతున్నాయి. పుష్పవతి అయిన బాలికలను ఒకరికిచ్చి పెళ్లి జరిపిస్తే తమ బాధ్యత తీరిపోతుందని నమ్మే వారు అధికంగా ఉన్నారు. చెడు వ్యసనాల కారణంగా భార్య లేదా భర్త మరణించడంతో ఒంటరివారైన పిల్లల వివాహాలు కూడా త్వరగా జరిపించేస్తున్నారు. ఇందులో అమ్మాయిల అవ్వాతాతలు ముఖ్యపాత్ర పోషిస్తున్నారు.

పట్టని డిస్ట్రిక్ట్, డివిజన్ లెవెల్ కమిటీలు

బాల్యవివాహాలు, టీనేజి ప్రెగ్నెన్సీని అరికట్టేందుకు జిల్లా స్థాయి, డివిజన్ స్థాయిలో కమిటీలు ఉన్నాయి. జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్ చైర్మన్/చైర్‌పర్సన్ కాగా, కన్వీనర్‌గా జిల్లా ఎస్పీ, డీఎంహెచ్ఓ, సభ్యులుగా గైనకాలజి హెచ్ఓడీ, ఐసీడీఎస్ అధికారి, డీఈఓ, ఆర్ఐఓ, డివిజన్ స్థాయిలో చైర్మన్/చైర్‌పర్సన్‌గా ఆర్‌డీఓ, కన్వీనర్‌గా డిప్యూటీ డీఎంహెచ్ఓ, సభ్యులుగా స్థానిక డీఎస్పీ ఉంటారు. ఈ కమిటీలు బాల్యవివాహాలు, టీనేజి ప్రెగ్నెన్సీలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. పాఠశాలలకు కౌమారదశ బాలికలకు పునరుత్పత్తి ఆరోగ్యం, న్యాయపరమైన హక్కులు, లైఫ్ స్కిల్స్ గురించి వివరించారు. బాల్యవివాహాలు అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలి. కౌమార దశ బాలికలకు వచ్చే సమస్యలపై ఆరోగ్యశిబిరాలు నిర్వహించాలి. కానీ అధికారులు మొక్కుబడిగా కార్యక్రమాలు నిర్వహించి మమ అనిపిస్తున్నారు. ఇప్పటికీ యదేచ్ఛగా గ్రామాల్లో బాల్యవివాహాలు జరుగుతున్నా టీనేజిలోనే గర్భం దాలుస్తున్నా చర్యలు కరువయ్యాయి. కొందరు అధికారులకు ఇలాంటి కమిటి ఒకటి ఉందనే విషయం కూడా తెలియదు.

శిశువులకు అనారోగ్య సమస్యలు



బాల్యవివాహాల వల్ల చాలా మంది కౌమార దశ పూర్తి గాకుండానే గర్భం దాలుస్తున్నారు. ఈ కారణంగా వారికి నెలలు నిండకుండా శిశువు జన్మించడం, సరైన సమయంలో జన్మించినా బరువు తక్కువగా ఉండటం జరుగుతుంది. ఇలాంటి పిల్లలకు బుద్ధిమాంద్యం, చురుకుగా లేకపోవడం, గుండె, ఊపిరితిత్తుల సమస్యలు వస్తాయి. తల్లులకు ప్రసవం తర్వాత తల్లిపాలు సరిగ్గా పడవు. దీంతో శిశువులు పలుమార్లు ఇన్‌ఫెక్షన్లకు గురై అనారోగ్యం బారిన పడే అవకాశం ఉంది.

– డాక్టర్ అమరనాథరెడ్డి, చిన్నపిల్లల వైద్యులు, కర్నూలు

టీనేజి ప్రెగ్నెన్సీపై అవగాహన కార్యక్రమాలు



జిల్లాలో బాల్య వివాహాలు జరగకుండా ఐసీడీఎస్ శాఖతో కలిసి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాము. ఒకవేళ ఎక్కడైనా బాల్యవివాహాలు జరుగుతున్నాయని తెలిస్తే స్థానిక పోలీసులు, ఐసీడీఎస్ సిబ్బందితో కలిసి వెళ్లి పెళ్లి జరగకుండా చూస్తున్నాము. అప్పటికే వివాహం జరిగి ఉంటే ఆమె టీనేజిలో గర్భం దాల్చకుండా ఆరోగ్య సిబ్బందిచే అవగాహన కల్పిస్తున్నాము. టీనేజిలో గర్భం దాల్చడం వల్ల వచ్చే దుష్పరిణాల గురించి బాలికలకు, వారి తల్లిదండ్రులకు వివరిస్తున్నాము.


– డాక్టర్ ఎల్.భాస్కర్, ఇన్‌చార్జ్ డీఎంహెచ్ఓ, కర్నూలు

అక్టోబర్‌లో అదరహో

● దజను సినిమాలతో థియేటర్లు కళకళ

చిత్ర పరిశ్రమలో సినిమాల విడుదలకు సంక్రాంతి సరైన పండగ అని ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. పందెం కోళ్లులాగా సంక్రాంతి బరిలో నిలిచేందుకు హీరోలు, దర్శక-నిర్మాతలు తెగ ఆసక్తి చూపుతుంటారు. ఈ కారణంగానే సంక్రాంతికి భారీ పోటీ ఉంటుంది. సంక్రాంతి తర్వాత దసరా, దీపావళి పండగలు తమ సినిమాల విడుదలకు మంచి సమయం అని మేకర్స్ ఆలోచన. ఈ ఏడాది దసరా, దీపావళి పండగలు అక్టోబరులోనే రావడం విశేషం. సో.. సినిమా ప్రేమికులకు ఈ నెల సినిమాల పండగే అని చెప్పొచ్చు. ఈ నెల ఆరంభంలో 'ఇడ్లీ కొట్టు, కాంతారా: చాప్టర్ 1' వంటి డబ్బింగ్ సినిమాలు విడుదలయ్యాయి. ఇక ఈ నెలలోనే రవితేజ 'మాస్ జాతర', సిద్ధు జొన్నలగడ్డ 'తెలుసు కదా', ప్రియదర్శి 'మిత్ర మండలి', ప్రదీప్ రంగనాథన్ 'డ్యూడ్', కిరణ్ అబ్బవరం 'కె.ర్యాంప్', సాయికుమార్, అనసూయ 'అరి', రక్షిత్ అట్లూరి 'శశివదనే' వంటి పలు తెలుగు సినిమాలు ప్రేక్షకుల ముందుకు రానున్నాయి. అదే విధంగా ప్రభాస్ 'బాహుబలి' రెండు భాగాలు కలిపి. 'బాహుబలి: ది ఎపిక్'గా ఆడియన్స్ ముందుకు రానుంది. ఇవి మాత్రమే కాదు... ఇంకా పలు చిత్రాలు విడుదల కానున్నాయి. ఆ వివరాల్లోకి వెళదాం.


● రవితేజ, శ్రీలీల



● 'బాహుబలి ది ఎపిక్' పోస్టర్

బాహుబలి: ది ఎపిక్

తెలుగు సినిమా ఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా చాటి చెప్పిన చిత్రం 'బాహుబలి'. ప్రభాస్ హీరోగా, అనుష్క, తమన్నా హీరోయిన్లుగా, రానా, రమ్యకృష్ణ, సత్యరాజ్, నాజర్ ముఖ్య తారలుగా నటించారు. ఎస్ఎస్ రాజమౌళి దర్శకత్వం వహించారు. శోభు యార్లగడ్డ, ప్రసాద్ దేవినేని నిర్మించిన 'బాహుబలి: ది బిగినింగ్' 2015 జూలై 15న, 'బాహుబలి 2: ది కన్‌క్లూజన్' 2017 ఏప్రిల్ 28న రెండు భాగాలుగా విడుదలై, బ్లాక్‌బస్టర్‌గా నిలవడంతో పాటు పలు రికార్డులు, రివార్డులు సాధించింది. 'బాహుబలి: ది బిగినింగ్' విడుదలై పదేళ్లయిన సందర్భంగా ఈ చిత్రాన్ని మరోసారి ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు మేకర్స్. తొలి, ద్వితీయ భాగాలను కలిపి 'బాహుబలి: ది ఎపిక్' పేరుతో ఈ నెల 31న రిలీజ్ చేస్తున్నారు. ఇండియాలోనే కాదు... ఇంటర్‌నేషనల్ వైడ్‌గా ఈ చిత్రాన్ని రీ-రిలీజ్ చేస్తున్నారు. ఈ సినిమా టీజర్‌ని ఇప్పటికే విడుదల చేయగా అద్భుతమైన స్పందన వచ్చింది. ఇక సినిమా ఎన్ని గంటలు ఉంటుంది? ఎలాంటి రికార్డులు సొంతం చేసుకుంటుంది? అనే వివరాలు తెలియాలంటే విడుదల వరకూ వేచి చూడాలి.

థియేటర్లలో జాతర

రవితేజ హీరోగా నటించిన చిత్రం 'మాస్ జాతర'. భాను భోగవరపు దర్శకత్వం వహించారు. రవితేజ నటించిన 75వ చిత్రం కావడంతో ఈ సినిమాపై ఇటు ఇండస్ట్రీ వర్గాల్లో, అటు ప్రేక్షకుల్లో క్రేజ్ నెలకొంది. పైగా 'ధమాకా' (2022) వంటి బ్లాక్ బస్టర్ మూవీ తర్వాత హీరో రవితేజ, హీరోయిన్ శ్రీలీల 'మాస్ జాతర'లో రెండోసారి జోడీగా నటించారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్‌పై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. పలుమార్లు విడుదల వాయిదా పడుతూ వచ్చిన ఈ సినిమా ఫైనల్‌గా ఈ నెల 31 ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ''రవితేజ నుంచి అభిమానులు, ప్రేక్షకులు కోరుకునే విందు భోజనంలాంటి మాస్ ఎంటర్‌టైనర్‌గా 'మాస్ జాతర' రూపొందింది. అన్ని వర్గాల ప్రేక్షకులు మెచ్చేలా ఈ చిత్రాన్ని మలిచారు భాను భోగవరపు. 'ధమాకా' చిత్రానికి అద్భుతమైన మ్యూజిక్ అందించిన భీమ్స్ సిసిరోలియో మరోసారి రవితేజ ఎనర్జీకి ఏమాత్రం తగ్గకుండా 'మాస్ జాతర' కోసం సూపర్ మ్యూజిక్ అందించారు. మా సినిమా థియేటర్లలో అసలు సిసలైన మాస్ పండగను తీసుకురాబోతోంది'' అని చిత్రబృందం పేర్కొంది.

మనసు హత్తుకునే తెలుసు కదా!

'డీజే టిల్లు, టిల్లు స్క్వేర్' చిత్రాల ఫేమ్ సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటించిన తాజా చిత్రం 'తెలుసు కదా'.ఈ సినిమాలో రాశీ ఖన్నా, శ్రీనిధీ శెట్టి హీరోయిన్లుగా నటించగా, వైవా హర్ష కీలక పాత్ర పోషించారు. స్టైలిస్ట్ నీరజ కోన ఈ చిత్రం ద్వారా దర్శకురాలిగా పరిచయవుతున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వప్రసాద్, టీజీ కృతీ ప్రసాద్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 17న విడుదల కానుంది. ''మోస్ట్ ఎవైటెడ్ మ్యూజికల్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ 'తెలుసు కదా'. మనసుని హత్తుకునే కథ, స్వచ్ఛమైన ప్రేమ, అనుబంధాల నేపథ్యంలో ఈ చిత్రకథ సాగుతుంది. అద్భుతమైన భావోద్వేగాలు, వినోదాలు ప్రేక్షకులని అలరిస్తాయి. నీరజ కోన యునిక్ కాన్సెప్ట్‌తో తెరకెక్కించారు. సినిమా చాలా అద్భుతంగా వచ్చింది. ఇటీవల విడుదల చేసిన మా మూవీ టీజర్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. తమన్ మ్యూజిక్ మా సినిమాకి అదనపు ఆకర్షణగా నిలుస్తుంది'' అని మేకర్స్ తెలిపారు.


● శ్రీనిధి శెట్టి, సిద్ధు జొన్నలగడ్డ, రాశీ ఖన్నా

ప్రేమ, వినోదాల ర్యాంప్

'ఎస్ఆర్ కళ్యాణ మండపం, వినరో భాగ్యము విష్ణుకథ, క' చిత్రాల ఫేమ్ కిరణ్ అబ్బవరం హీరోగా నటించిన తాజా చిత్రం 'కె ర్యాంప్'. జైన్స్ నాని రచన, దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో యుక్తి తరేజా హీరోయిన్‌గా నటించారు. హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్ బ్యానర్లపై రాజేశ్ దండ, శివ బొమ్మకు నిర్మించిన ఈ సినిమా ఈ నెల 18న విడుదల కానుంది. ''లవ్, రొమాన్స్, యాక్షన్, ఫన్‌తో కంప్లీట్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం 'కె-ర్యాంప్'. కిరణ్ అబ్బవరం కెరీర్‌లో ఈ చిత్రం మరో ఫ్రెష్ అటెంప్ట్ అవుతుంది. అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే వాణిజ్య అంశాలు మా సినిమాలో ఉన్నాయి. ఇప్పటికే విడుదలైన మా టీజర్ సినిమా మీద మరిన్ని అంచనాలు పెంచింది.. ఆ అంచనాలకు ఏ మాత్రం తగ్గకుండా మా చిత్రం ఉంటుంది. చేతన్ భరద్వాజ్ సంగీతం మా మూవీకి ప్లస్ అవుతుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.


● కిరణ్ అబ్బవరం, యుక్తి తరేజా

దీపావళికి డ్యూడ్

'ప్రేమలు' వంటి అద్భుతమైన విజయం తర్వాత ప్రదీప్ రంగనాథన్, మమిత బైజు జంటగా నటించిన చిత్రం 'డ్యూడ్'. ఈ సినిమాలో శరత్ కుమార్ కీలక పాత్ర పోషించారు. ఈ మూవీ ద్వారా కీర్తీశ్వరన్ డైరెక్టర్‌గా పరిచయం అవుతున్నారు. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 17న తెలుగు, తమిళ, హిందీ, మలయాళ, కన్నడ భాషల్లో విడుదలవుతోంది. ''రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం 'డ్యూడ్'. న్యూ ఏజ్ కథాంశంతో పూర్తి స్థాయి వినోదాత్మకంగా తెరకెక్కిన ఈ మూవీ యువతరంతో పాటు అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తుంది. సాయి అభ్యంకర్ అందించిన అద్భుతమైన మ్యూజిక్ ఆడియన్స్‌ని అలరిస్తుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది.


● 'మిత్ర మండలి' పోస్టర్

సమాజానికి సందేశం

సాయి కుమార్, అనసూయ భరద్వాజ్, వినోద్ వర్మ, శ్రీకాంత్ అయ్యంగార్ ముఖ్య తారలుగా నటించిన చిత్రం 'అరి'. 'మై నేమ్ ఈజ్ నో బడీ' అనేది ఉపశీర్షిక. 'పేపర్ బాయ్' మూవీ ఫేమ్ జయశంకర్ దర్శకత్వం వహించారు. ఆర్వీ సినిమాస్ పతాకంపై రామిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి (ఆర్వీ రెడ్డి) సమర్పణలో శ్రీనివాస్ రామిరెడ్డి, డి. శేషురెడ్డి మారంరెడ్డి, నాయుడు నిర్మించిన ఈ సినిమా ఈ నెల 10న విడుదల కానుంది. ఈ చిత్రాన్ని ఏషియన్ సురేష్ డిస్ట్రిబ్యూషన్ సంస్థ రిలీజ్ చేస్తోంది. ''మా సినిమా ద్వారా సమాజానికి ఒక మంచి సందేశం ఇవ్వనున్నాం. అన్ని వర్గాల ప్రేక్షకుల్ని మెప్పించే వాణిజ్య అంశాలున్న మా చిత్రం విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది'' అని చిత్రబృందం తెలిపింది.


● 'అరి' పోస్టర్

నవ్వులు పంచే మిత్ర మండలి

'బలగం, కోర్ట్' చిత్రాల ఫేమ్ ప్రియదర్శి హీరోగా నటించిన తాజా చిత్రం 'మిత్ర మండలి'. నూతన దర్శకుడు విజయేందర్ ఎస్. దర్శకత్వం వహించారు. సోషల్ మీడియాలో ట్రెండింగ్‌గా మారిన నిహారిక ఎన్ఎం ఈ చిత్రం ద్వారా హీరోయిన్‌గా పరిచయమవుతున్నారు. బ్రహ్మానందం, రాగ్ మయూర్, ప్రసాద్ బెహ్రా ప్రధాన పాత్రలు పోషించారు. బీవీ వర్క్స్(బన్నీ వాసు) సమర్పణలో సప్త అశ్వ మీడియా వర్క్స్, వైరా ఎంటర్‌టైన్మెంట్స్‌పై కల్యాణ్ మంతిన, భాను ప్రతాప, డా. విజయేందర్ రెడ్డి తీగల నిర్మించిన ఈ సినిమా ఈ నెల 16న విడుదల కానుంది. ''స్నేహం ప్రధానంగా నడిచే కథతో రూపొందిన చిత్రం 'మిత్ర మండలి'. ప్రేక్షకులు మనస్ఫూర్తిగా నవ్వుకునేలా ఈ సినిమా ఉంటుంది. ఏ ఒక్కర్ని కూడా మా చిత్రం నిరుత్సాహపరచదు. ఆర్ఆర్ ధ్రువన్ సంగీతం అందించిన ఈ సినిమా నుంచి ఇప్పటికే విడుదల చేసిన పాటలకు మంచి స్పందన వచ్చింది'' అంటూ పేర్కొన్నారు మేకర్స్.

తండ్రీ కొడుకుల అనుబంధం

'పలాస 1978, నరకాసుర, ఆపరేషన్ రావణ్' వంటి చిత్రాలతో ప్రేక్షకుల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సొంతం చేసుకున్నారు రక్షిత్ అట్లూరి. ఆయన హీరోగా నటించిన తాజా చిత్రం 'శశివదనే'. సాయి మోహన్ ఉబ్బన దర్శకత్వం వహించిన ఈ సినిమాలో కోమలి ప్రసాద్ హీరోయిన్. తమిళ నటుడు శ్రీమాన్ కీలక పాత్ర పోషించారు. గౌరీ నాయుడు సమర్పణలో ఏజీ ఫిల్మ్స్ కంపెనీ, ఎస్.వి.ఎస్ స్టూడియోస్‌పై అహితేజ బెల్లంకొండ, అభిలాష్ రెడ్డి గోడల నిర్మించారు. ఈ సినిమా ఈ నెల 10న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ''తండ్రీ కొడుకుల అనుబంధం, భావోద్వేగాల నేపథ్యంలో రూపొందిన చిత్రం 'శశివదనే'. ఇలాంటి కథా నేపథ్యం ఉన్న చిత్రం ఇదివరకు రాలేదు. కుటుంబ సమేతంగా చూడదగ్గ సినిమా ఇది. ప్రేక్షకులను నిరాశపరచదు. ఓ మంచి సినిమా చూశామనే అనుభూతితో ప్రేక్షకులు థియేటర్ నుంచి బయటకు వస్తారు'' అని చిత్రయూనిట్ పేర్కొంది.


● రక్షిత్ అట్లూరి, కోమలి


● మమిత, ప్రదీప్


● వరుణ్ సందేశ్

పోలీస్ కానిస్టేబుల్


'కొత్త బంగారు లోకం' మూవీ ఫేమ్ వరుణ్ సందేశ్ హీరోగా నటించిన తాజా చిత్రం 'కానిస్టేబుల్'. ఆర్యన్ సుభాన్ ఎస్.కె. దర్శకత్వం వహించారు. ఈ సినిమా ద్వారా మధులిక వారణాసి హీరోయిన్‌గా పరిచయమవుతున్నారు. జాగృతి మూవీ మేకర్స్ పై బలగం జగదీష్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 10న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ చిత్రంలో వరుణ్ సందేశ్ పోలీస్ కానిస్టేబుల్ పాత్ర పోషించారు. సుభాష్ ఆనంద్ సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి 'కానిస్టేబుల్..' అంటూ సాగే టైటిల్ సాంగ్‌ని హైదరాబాద్ మాజీ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ చేతుల మీదుగా విడుదల చేసిన సంగతి తెలిసిందే.

పైన పేర్కొన్న సినిమాలే కాదు.. మరికొన్ని చిత్రాలు కూడా ఈ నెలలో విడుదలకు ముస్తాబవుతున్నాయి.

- డేరంగుల జగన్ మోహన్

కేవలం తెలుగు సినిమాలే కాదు.. మోహన్‌లాల్ నటించిన మలయాళ చిత్రం 'వృషభ', విష్ణు విశాల్ నటించిన తమిళ చిత్రం 'ఆర్యన్', ధృవ్ విక్రమ్ నటించిన 'బైసన్' చిత్రాలు కూడా అక్టోబరులోనే తెలుగులోనూ విడుదలకానున్నాయి.

● మోహన్ లాల్ లీడ్ రోల్‌లో నటించిన తాజా పాన్ ఇండియన్ చిత్రం 'వృషభ'. రాగిణి ద్వివేది, సమర్జిత్ లంకేష్ ముఖ్య పాత్రలు పోషించారు. నంద కిశోర్ దర్శకత్వం వహించిన ఈ సినిమాని కనెక్ట్ మీడియా, బాలాజీ టెలిఫిల్మ్స్, అభిషేక్ ఎస్ వ్యాస్ స్టూడియోస్ బ్యానర్లపై శోభా కపూర్, ఏక్తా ఆర్ కపూర్, సి.కె. పద్మకుమార్, వరుణ్ మాథుర్, సౌరభ్ మిశ్రా, అభిషేక్ ఎస్ వ్యాస్, ప్రవీర్ సింగ్, విశాల్ గుర్నాని, జూహి పరేఖ్ మెహతా నిర్మించారు. మలయాళ, తెలుగు భాషల్లో ఏక కాలంలో చిత్రీకరించిన ఈ చిత్రం దీపావళి సందర్భంగా ఈ నెల 16న ప్రేక్షకుల ముందుకు వస్తోంది.


● మోహన్ లాల్

● విష్ణు విశాల్ హీరోగా నటించి, నిర్మించిన చిత్రం 'ఆర్యన్'. సెల్వ రాఘవన్, శ్రద్ధా శ్రీనాథ్, మానస చౌదరి కీలక పాత్రలు పోషించారు. ప్రవీణ్ .కె దర్శకత్వం వహించారు. విష్ణు విశాల్ స్టూడియోస్‌పై శుభ్ర, ఆర్యన్ రమేశ్, విష్ణు విశాల్ నిర్మించిన ఈ మూవీ తమిళ, తెలుగు భాషల్లో ఈ నెల 31న రిలీజ్ కానుంది. ఇన్వెస్టిగేటివ్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ చిత్రాన్ని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో శ్రేష్ట మూవీస్ బ్యానర్‌పై సుధాకర్ రెడ్డి విడుదల చేస్తున్నారు.

● హీరో విక్రమ్ తనయుడు ధృవ్ హీరోగా, అనుపమా పరమేశ్వరన్ హీరోయిన్‌గా నటించిన చిత్రం 'బైసన్'. ఏఆర్ జీవా దర్శకత్వంలో లైకా ప్రొడక్షన్స్ నిర్మించిన ఈ మూవీ ఈ నెల 17న రిలీజ్ కానుంది. స్పోర్ట్స్ బయోపిక్‌గా రూపొందిన ఈ చిత్రంపై మంచి అంచనాలున్నాయి.


● ధృవ్, అనుపమ


● విష్ణు విశాల్

భర్త మహాశయులకు విజ్ఞప్తి!

'భర్త మహాశయులకు విజ్ఞప్తి' అని అంటున్నారట హీరో రవితేజ. ఈ విజ్ఞప్తి వివరాల కోసం ప్రేక్షకులను వచ్చే సంక్రాంతికి థియేటర్స్‌కి రమ్మంటున్నారు. రవితేజ హీరోగా కిశోర్ తిరుమల దర్శకత్వంలో ఓ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి తొలుత 'అనార్కలి' అనే టైటిల్‌ను


● రవితేజ

అనుకున్నారు. కానీ తాజాగా 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నారని, త్వరలోనే ఈ సినిమా టైటిల్ గురించిన అధికారిక ప్రకటన రానుందని సమాచారం. ప్రస్తుతం ఈ మూవీ చిత్రీకరణ కోసమే రవితేజ స్పెయిన్ వెళ్లారు. కొంత టాకీ పార్టు, రెండు పాటల చిత్రీకరణ స్పెయిన్ లొకేషన్స్‌లో జరుగుతుంది. ఈ షెడ్యూల్‌తో ఈ సినిమా చిత్రీకరణ దాదాపు పూర్తవుతుంది. ఇక ఈ చిత్రాన్ని సంక్రాంతి సందర్భంగా రిలీజ్ చేయనున్నట్లుగా మేకర్స్ ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే.

అవి నా చేతుల్లో ఉండవు

● హృతిక్ రోషన్



''హీరో.. డైరెక్టర్.. నిర్మాత.. ఇలా ఓ సినిమాకి పనిచేసే నటీనటులు, సాంకేతిక నిపుణులు తమ సినిమా విజయం సాధించాలనే కోరుకుంటారు. అయితే అన్ని సినిమాలూ విజయం సాధిస్తాయని చెప్పలేం. వంద శాతం ఎఫర్ట్ పెట్టి పనిచేయడమే నా చేతుల్లో ఉంటుంది. హిట్లు, ఫ్లాపులు అనేవి నా చేతుల్లో ఉండవు.. వాటిని నిర్ణయించేది ప్రేక్షకులే. ఓ సినిమా ఫలితం ఎలా ఉన్నా పాజిటివ్‌గానే తీసుకోవాలి'' అని హీరో హృతిక్ రోషన్ తెలిపారు. ఎన్టీఆర్, హృతిక్ రోషన్, కియారా అద్వానీ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'వార్ 2'. అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో యశ్ రాజ్ ఫిల్మ్స్‌పై ఆదిత్యా చోప్రా నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 14న విడుదల అయింది. భారీ అంచనాల నడుమ రిలీజైన ఈ చిత్రం ప్రేక్షకుల అంచనాలను అందుకోలేకపోయింది. ఈ విషయంపై హృతిక్ రోషన్ తాజాగా స్పందించారు. ''వార్ 2' కోసం అయాన్ ముఖర్జీ చాలా కష్టపడ్డారు. తన ఎనర్జీ చూసి నాకు కూడా ఎంతో ఉత్సాహంగా పని చేయాలనిపించేది. ఈ ప్రాజెక్ట్ గురించి నాకు పూర్తిగా తెలుసు కాబట్టి కబీర్ పాత్రను చాలా సరదాగా పూర్తి చేశాను. ఒక నటుడిగా మన బాధ్యతను 100 శాతం పూర్తి చేయాలి. ఫలితం ఎలా ఉన్నా ప్రతి దాన్ని సీరియస్‌గా కాకుండా ఈజీగానే తీసుకోవాలి. అన్ని సినిమాలూ హిట్ అవుతాయనే నమ్మకంతోనే చేస్తాం. కానీ, ఫలితం మాత్రం ప్రేక్షకులే ఇస్తారు. వీటన్నిటినీ మనం పాజిటివ్‌గానే తీసుకోవాలి'' అంటూ హృతిక్ రోషన్ పోస్ట్ చేశారు.

బిజినెస్ రీల్

జొమాటో డెలివరీ సిబ్బందికి ఎన్‌పీఎస్ సదుపాయం



న్యూఢిల్లీ: జొమాటో, హెచ్‌డీఎఫ్‌సీ పెన్షన్ మధ్య భాగస్వామ్యం కుదిరింది. జొమాటో డెలివరీ భాగస్వాములకు 'ఎన్‌పీఎస్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ మోడల్'ను హెచ్‌డీఎఫ్‌సీ పెన్షన్ ఆఫర్ చేయనుంది. పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (పీఎఫ్ఆర్‌డీఏ) ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దీన్ని కేంద్ర ఆర్థిక మంత్రి సీతారామన్ ప్రారంభించారు. ''ప్లాట్‌ఫామ్ ప్రారంభించిన 72 గంటల్లోనే 30,000 మందికి పైగా డెలివరీ భాగస్వాములు శాశ్వత రిటైర్మెంట్ ఖాతా నంబర్లను (ప్రాన్) తీసుకున్నారు. లక్ష మందికి పైగా డెలివరీ భాగస్వాములకు ఎన్‌పీఎస్ సేవలు అందించేందుకు కట్టుబడి ఉన్నాం''అని జొమాటో ప్రకటించింది.

హైదరాబాద్‌లో హార్ట్‌ఫోర్డ్ టెక్నాలజీ సెంటర్



హైదరాబాద్: అమెరికాకు చెందిన బీమా సేవల సంస్థ ది హార్ట్‌ఫోర్డ్ తాజాగా హైదరాబాద్‌లో తమ ఇండియా టెక్నాలజీ సెంటర్‌ను ప్రారంభించింది. కొత్త ఆవిష్కరణలకు ఊతమిచ్చేలా అధునాతన వర్క్‌స్టేషన్లు, శిక్షణా సదుపాయాలు మొదలైన ప్రత్యేకతలతో దీన్ని రూపొందించినట్లు సంస్థ తెలిపింది. డిజిటల్, కృత్రిమ మేధ సామర్థ్యాలను పటిష్టం చేసుకునేందుకు ఇది తోడ్పడుతుందని చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ శేఖర్ పన్నాల తెలిపారు. సుశిక్షితులైన టెక్నాలజీ నిపుణుల లభ్యత, గ్లోబల్ ఇన్నోవేషన్ కేంద్రంగా హైదరాబాద్ పేరొందిన నేపథ్యంలో నగరాన్ని ఎంచుకున్నట్లు చీఫ్ డేటా, ఏఐ, ఆపరేషన్స్ ఆఫీసర్ జెఫ్ హాకిన్స్ తెలిపారు. దాదాపు 200 ఏళ్ల పైగా చరిత్ర గల ది హార్ట్‌ఫోర్డ్‌కి ప్రపంచవ్యాప్తంగా 19 వేల మంది ఉద్యోగులు ఉన్నారు. అమెరికాలోని హార్ట్‌ఫోర్డ్, షికాగో తదితర ప్రాంతాల్లో టెక్నాలజీ కేంద్రాలు ఉన్నాయి.

రూ. 355 కోట్ల సమీకరణలో సాంప్రే న్యూట్రిషన్స్

న్యూఢిల్లీ: కన్ఫెక్షనరీ ఉత్పత్తుల తయారీ సంస్థ సాంప్రే న్యూట్రిషన్స్ కొత్తగా రూ.355 కోట్లు సమీకరించనున్నట్లు వెల్లడించింది. ఫారిన్ కరెన్సీ కన్వర్టబుల్ బాండ్ల (ఎఫ్‌సీసీబీ) ద్వారా నిధుల సమీకరణకు బోర్డు ఆమోదముద్ర వేసినట్లు వివరించింది. దీని ప్రకారం ఒక్కొక్కటి 1,00,000 డాలర్లు విలువ చేసే 400 ఎఫ్‌సీసీబీలను జారీ చేయనున్నట్లు సంస్థ తెలిపింది. అంతర్జాతీయంగా కార్యకలాపాలను విస్తరించేందుకు ఈ నిధులను ఉపయోగించుకోనున్నట్లు వివరించింది. కొత్తగా ఈజిప్ట్, లైబీరియా మార్కెట్లను కూడా గుర్తించినట్లు కంపెనీ పేర్కొంది. అధిక వృద్ధికి ఆస్కారం ఉన్న ప్రాంతాల్లో విస్తరణ, ఆదాయ మార్గాలను పెంచుకోవడం, అంతర్జాతీయంగా ఎఫ్ఎంసీజీ రంగంలో కొత్త అవకాశాలను అందిపుచ్చుకోవడంపై మరింతగా దృష్టి పెడుతున్నట్లు తెలిపింది. సాంప్రే ఇటీవలే న్యూట్రాస్యూటికల్స్, ఆహార ఉత్పత్తుల తయారీ, సరఫరా కోసం సుమారు రూ. 45 కోట్ల విలువ చేసే అవగాహన ఒప్పందాలను (ఎంవోయూ) కుదుర్చుకుంది.

డీమార్ట్ ఆదాయం 15 శాతం అప్

క్యూ2లో రూ. 16,219 కోట్లు

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో డీమార్ట్ మాతృ సంస్థ అవెన్యూ సూపర్‌మార్ట్స్ ఆదాయం రూ. 16,219 కోట్లుగా (స్టాండెలోన్) నమోదైంది. గత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో నమోదైన రూ. 14,050 కోట్లతో పోలిస్తే 15 శాతం పెరిగింది. త్రైమాసికాలవారీగా క్యూ1లో నమోదైన రూ. 15,932 కోట్లతో పోలిస్తే 1.8 శాతం వృద్ధి చెందినట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలకు ఇచ్చిన సమాచారంలో కంపెనీ పేర్కొంది. 2025 సెప్టెంబర్ ఖరు నాటికి మొత్తం స్టోర్స్ సంఖ్య 432గా ఉంది. స్టాండెలోన్, కన్సాలిడేటెడ్ ఫలితాలను ఆమోదించేందుకు అక్టోబర్ 11న కంపెనీ బోర్డు మసావేశం కానుంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు మహారాష్ట్ర, గుజరాత్, తమిళనాడు తదితర రాష్ట్రాల్లో డీమార్ట్‌కి కార్యకలాపాలు ఉన్నాయి.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

5-10-2025

విశాఖ	510-00
చిత్తూరు	528-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	520-00
విజయవాడ	520-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	500-00
వరంగల్	502-00
రిటైల్ ధర	5.60

ఐపీవో స్ట్రీట్

లిస్టింగ్ బాటలో మరిన్ని కంపెనీలు



ఈ ఏడాది ఓవైపు సెకండరీ మార్కెట్లు ఆటుపోట్లను చవిచూస్తున్నప్పటికీ మరోవైపు ప్రైమరీ మార్కెట్లు మాత్రం చెలరేగిపోతున్నాయి. ఈ నెలలోనూ (అక్టోబర్) సెకండరీ మార్కెట్లను ఓవర్‌టేక్ చేయనున్నాయి. మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి హైదరాబాద్ కంపెనీలు విరూపాక్ష ఆర్గానిక్స్, ఆర్‌వీ ఇంజినీరింగ్ ఇటీవలే ప్రాస్పెక్టస్‌లు దాఖలు చేయగా.. అదే బాటలో మరో 5 కంపెనీలు నిధుల వేటలో పడ్డాయి. ఈ జాబితాలో రన్వాల్ డెవలపర్స్, లాల్‌బాబా ఇంజినీరింగ్, స్టెరిలైట్ ఎలక్ట్రిక్, సీజే దార్సిల్ లాజిస్టిక్స్, జెరాయ్ ఫిట్‌నెస్ చేరాయి. 2025లో ఇప్పటి వరకూ మెయిన్‌బోర్డులో 77 కంపెనీలు లిస్ట్‌కాగా.. ఈ నెలలో టాటా ఇన్వెస్ట్‌మెంట్, ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ తదితర దిగ్గజాల ఐపీవోలకు తెరలేవనుంది.

సెబీకి ప్రాస్పెక్టస్ దాఖలు చేసిన ఇంకో అయిదు సంస్థలు

లిస్టులో రన్వాల్ డెవలపర్స్, స్టెరిలైట్ ఎలక్ట్రిక్ మొదలైనవి

రూ. 2,000 కోట్లపై కన్ను

రియల్టీ రంగ కంపెనీ రన్వాల్ డెవలపర్స్ ఐపీవో ద్వారా రూ. 2,000 కోట్లు సమీకరించాలని భావిస్తోంది. ఇందుకు అనుగుణంగా ఈ ముంబై కంపెనీ రూ. 1,700 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. అంతేకాకుండా ప్రమోటర్ సందీప్ సుభాష్ రన్వాల్ మరో రూ. 300 కోట్ల విలువైన షేర్లను ఆఫర్ చేయనున్నారు. ఈక్విటీ జారీ నిధులను కంపెనీ సహా అనుబంధ సంస్థల రుణ చెల్లింపులతోపాటు.. సాధారణ కార్పొరేట్ అవసరాలకు వెచ్చించనుంది. 1988లో ఏర్పాటైన కంపెనీ ముంబై మెట్రోపాలిటన్ రీజియన్, పుణె నగరాల్లో రిటైల్, వాణిజ్య ప్రాపర్టీలను నిర్వహిస్తోంది.

1,500 కోట్ల సమీకరణ ..

రూ.1,500 కోట్ల నిధుల సమీకరణ లక్ష్యంతో సెబీకి స్టెరిలైట్ ఎలక్ట్రిక్ ఐపీవో పత్రాలను దాఖలు చేసింది. కార్యకలాపాల విస్తరణ, రుణ భారం తగ్గింపు లక్ష్యాలతో కంపెనీ పబ్లిక్ ఇష్యూకి వస్తోంది. ఇందులో భాగంగా 77.9 లక్షల షేర్లను తాజాగా జారీ చేయనుంది. ఇంతే పరిమాణంలో షేర్లను ఆఫర్ ఫర్ సేల్ రూపంలో ప్రమోటర్లు ట్విన్ స్టార్ ఓవర్సీస్‌తో పాటు కైలాష్ చంద్ర మహేశ్వరి, జాకబ్ జాన్, రామ్‌గురు రాధాకృష్ణన్ షేర్లను విక్రయించనున్నారు. సెప్టెంబర్ 20 నాటికి కంపెనీకి రూ.600 కోట్ల రుణ భారం ఉంది. ఐపీవోలో సమీకరించే నిధుల్లో రుణ చెల్లింపులకు రూ.350 కోట్లు వినియోగించాలన్న ప్రణాళికతో ఉంది. మిగిలిన నిధులను విస్తరణ కార్యకలాపాలకు వెచ్చించనుంది.

లాల్‌బాబా ఇంజనీరింగ్

ఇంజనీరింగ్ సొల్యూషన్స్ కార్యకలాపాలు నిర్వహించే లాల్‌బాబా ఇంజనీరింగ్ ఐపీవోలో భాగంగా తాజా షేర్ల జారీ రూపంలో రూ.630 కోట్ల నిధులను, ప్రమోటర్ల వాటాల విక్రయ రూపంలో మరో రూ.370 కోట్లను సమీకరించనుంది. తాజా షేర్ల జారీ రూపంలో సమకూరే నిధుల నుంచి రూ.271 కోట్లను మూలధన వ్యయాల కోసం వెచ్చించనుంది. హల్దియా ప్లాంట్ విస్తరణకు కేటాయించనుంది. రూ.209 కోట్లను రుణ చెల్లింపులకు ఉపయోగించుకోనుంది. లాల్‌బాబా ఇంజనీరింగ్ సంస్థ సీమ్‌లెస్ ట్యూబులు, ప్రెసిషన్ ఫోర్జింగ్స్, ఇంటెగ్రేటెడ్ రైల్ సిస్టమ్స్ తయారీ కార్యకలాపాలు నిర్వహిస్తోంది.

సీజే డార్సిల్స్ లాజిస్టిక్స్

సమగ్ర లాజిస్టిక్స్ సర్వీసుల సంస్థ సీజే డార్సిల్ లాజిస్టిక్స్ భారత్‌తో పాటు అంతర్జాతీయంగా ఎంటర్‌ప్రైజ్ కస్టమర్లకు సరుకు రవాణా, వేర్‌హౌసింగ్ తదితర సేవలను అందిస్తోంది. సెబీకి సమర్పించిన ముసాయిదా ప్రాస్పెక్టస్ ప్రకారం కంపెనీ 2.64 కోట్ల వరకు షేర్లను తాజాగా జారీ చేయనుంది. ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) కింద ప్రమోటర్లు 99.05 లక్షల షేర్లను విక్రయించనున్నారు. తాజా షేర్ల జారీ ద్వారా సమీకరించిన నిధులను కొత్త యంత్రపరికరాల కొనుగోలు, రుణాల చెల్లింపునకు కంపెనీ వినియోగించుకోనుంది.

జెరాయ్ ఫిట్‌నెస్

జిమ్ ఎక్విప్‌మెంట్ సరఫరా చేసే జెరాయ్ ఫిట్‌నెస్ ప్రమోటర్లు 43.92 లక్షల షేర్లను ఓఎఫ్ఎస్ విధానంలో విక్రయించనున్నారు. ఇష్యూ పూర్తిగా ఓఎఫ్ఎస్ రూపంలో ఉంటుంది కాబట్టి కంపెనీకి ఐపీవో ద్వారా నిధులేమీ లభించవు. దేశ, విదేశాల్లో కమర్షియల్ జిమ్‌లు, హోటళ్లు, కార్పొరేషన్లు, రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులకు జెరాయ్ ఎక్విప్‌మెంట్‌ను అందిస్తోంది. జపాన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఆస్ట్రేలియా, సెర్బియా, స్వీడన్ తదితర దేశాలకు కూడా ఎగుమతులు చేస్తోంది. దేశవ్యాప్తంగా 14 ఎక్స్‌క్లూజివ్ షోరూమ్‌లు ఉన్నాయి.

6జీపై ఇండియా మొబైల్ కాంగ్రెస్ ఫోకస్..

న్యూఢిల్లీ: ఈ నెల 8 నుంచి 11 వరకు న్యూఢిల్లీలో నిర్వహించే ఇండియా మొబైల్ కాంగ్రెస్ (ఐఎంసీ) 2025 సదస్సులో ప్రధానంగా 6జీ వ్యవస్థను అభివృద్ధి చేయడం, భాగస్వామ్యాలను ఏర్పాటు చేసుకోవడంపై దృష్టి పెట్టనున్నారు. విశ్వసనీయ భాగస్వామిగా అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన భారత్, 6జీ వ్యవస్థను అభివృద్ధి చేయడంలో కీలక పాత్ర పోషించగలదని డిజిటల్ టెక్నాలజీ ప్లాట్‌ఫాం ఐఎంసీ సీఈవో పి. రామకృష్ణ తెలిపారు. '6జీ వ్యవస్థకు ప్రధానమైన అంశాలను అనుసంధానం చేయగలిగే కీలక ప్లాట్‌ఫాంగా ఇండియా మొబైల్ కాంగ్రెస్ ఎదుగుతోంది. ఇందులో భారత్‌తో పాటు యూరప్, బ్రిటన్, అమెరికా, జపాన్, దక్షిణ కొరియా తదితర దేశాల నుంచి పరిశ్రమకు చెందిన సీనియర్ నేతలు, నిపుణులు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారు' అని ఆయన పేర్కొన్నారు. 6జీ సిపోజియంలో టెక్నాలజీ దిగ్గజాలతో పాటు ఐఐటీ, అంతర్జాతీయ యూనివర్సిటీల్లాంటి ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థల నుంచి విద్యావేత్తలు పాల్గొనున్నారు. 6జీకి సంబంధించిన టెక్నాలజీలు, కృత్రిమ మేధ నెట్‌వర్క్‌లు, స్పెక్ట్రం క్రమబద్ధీకరణ తదితర అంశాలపై అత్యున్నత స్థాయిలో చర్చలు జరపనున్నట్లు రామకృష్ణ చెప్పారు. 7,000 మంది పైగా గ్లోబల్ ప్రతినిధులు, 800 మంది వక్తలు, 150 దేశాల నుంచి 400 మంది ఎగ్జిబిటర్లు ఇందులో పాల్గొంటారని అంచనా. 6జీ గ్లోబల్ రేసుకు భారత్ సారథ్యం వహించనుందని సెల్యులార్ ఆపరేటర్స్ సమాఖ్య సీవోఏఐ డైరెక్టర్ జనరల్ ఎస్‌పీ కొచ్చర్ తెలిపారు. ఏఐ, జెన్ఏఐ టెక్నాలజీల్లో భారతీయ డిజిటల్ ఆవిష్కరణలు, దేశీయంగా టెలికం రంగాన్ని సరికొత్తగా తీర్చిదిద్దేందుకు ఉపయోగపడుతున్నాయని ఆయన పేర్కొన్నారు. 5జీ విస్తరణ, 6జీ సన్నద్ధతకు 6 గిగాహెర్ట్జ్ బ్యాండ్‌ను సమర్థవంతంగా కేటాయించడం కీలకంగా ఉంటుందని వివరించారు.

సిట్రోయెన్ నుంచి సరికొత్త ఎయిర్‌క్రాస్ ఎక్స్

ధర రూ. 8.29 లక్షల నుంచి ప్రారంభం



చెన్నై: వాహనాల తయారీ సంస్థ సిట్రోయెన్ ఇండియా తమ ఎక్స్-సిరీస్ ఎస్‌యూవీ పోర్ట్‌ఫోలియోను మరింతగా విస్తరించింది. సరికొత్త ఎయిర్‌క్రాస్ ఎక్స్‌ను ఆవిష్కరించింది. ఇటీవల ప్రవేశపెట్టిన న్యూ బసాల్ట్ ఎక్స్, సీ3ఎక్స్‌కి ఇది కొనసాగింపుగా ఉంటుందని సంస్థ తెలిపింది. ఎయిర్‌క్రాస్ ఎక్స్ శ్రేణి ప్రారంభ ధర రూ. 8.29 లక్షలుగా ఉంటుందని వివరించింది. ప్రీమియం క్యాబిన్ అనుభూతి కలిగిస్తూ, పుష్ స్టార్ట్, క్రూయిజ్ కంట్రోల్, స్పీడ్ లిమిటర్, కాలిటైట్ వ్యూతో హేలో360 డిగ్రీస్ కెమెరా, 52 భాషలు మాట్లాడగలిగే అసిస్టెంట్ 'కారా', ఎల్ఈడీ ప్రొజెక్టర్ హెడ్‌ల్యాంప్స్, ఆరు యిర్‌బ్యాగ్స్ మొదలైన ఫీచర్లు ఇందులో ఉన్నట్లు కంపెనీ వివరించింది.

బ్యూటీ బ్రాండ్స్‌లోకి పెట్టుబడుల జోరు..

టాప్ డీ2సీ సంస్థల నిధుల సమీకరణ 7 శాతం అప్

2020తో పోలిస్తే 3 రెట్లు అధికం • 24 బిలియన్ డాలర్లుగా దేశీ బ్యూటీ ఉత్పత్తుల మార్కెట్



న్యూఢిల్లీ: గ్లోబల్ బ్రాండ్స్ భారత మార్కెట్లోకి విస్తరిస్తున్నప్పటికీ, దేశీ ఆన్‌లైన్ డైరెక్ట్-టు-కన్జూమర్ (డీ2సీ) సౌందర్య, వ్యక్తిగత సంరక్షణ బ్రాండ్స్‌లోకి కూడా భారీగా పెట్టుబడులు వెల్లువెత్తున్నాయి. 20 అగ్రగామి డీ2సీ బ్రాండ్స్‌లోకి గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది (జనవరి-సెప్టెంబర్ మధ్య కాలంలో) ఇన్వెస్ట్‌మెంట్స్ 7 శాతం పెరిగాయి. సుమారు 63.1 మిలియన్ డాలర్లకు (దాదాపు రూ. 560 కోట్లు) పైగా వచ్చినట్లు బిజినెస్ ఇంటెలిజెన్స్ సంస్థ ట్రాక్షన్ డేటాలో వెల్లడైంది. 2020లో నమోదైన 21.6 మిలియన్ డాలర్లతో పోలిస్తే పెట్టుబడులు సుమారు మూడు రెట్లు ఎగియడం గమనార్హం. ఫండింగ్ సమకూర్చుకున్న సంస్థల్లో షుగర్ కాస్మెటిక్స్, ఇన్నోవిస్ట్, ఫే బ్యూటీ, రెనీ కాస్మెటిక్స్‌లాంటివి ఉన్నాయి. బ్యూటీ కేటగిరీలో పెట్టే పెట్టుబడులపై సగటున 10 నుంచి 25 రెట్లు రాబడులు వస్తున్నట్లు పరిశ్రమ వర్గాలు తెలిపాయి. ఈ విభాగంలో మార్జిన్లు అధికంగా ఉండటం, మూలధనాన్ని సమర్థంగా వినియోగించుకునేందుకు అవకాశం ఉండటమే ఇందుకు కారణమని పేర్కొన్నాయి. ప్రీమియం ఉత్పత్తులకి, వినియోగానికి గణనీయంగా డిమాండ్ నెలకొనడం ఈ కేటగిరీకి సానుకూలాంశమని, ఇతరత్రా మిగతా ఏ కేటగిరీల్లోనూ ఇలాంటి పరిస్థితి లేదని వివరించాయి.

ఫాక్స్‌టేల్‌కి 30 మిలియన్ డాలర్లు..

ఆర్ఏఎస్ లగ్జరీ స్కిన్‌కేర్ సంస్థ ఈ ఏడాది యూనిలీవర్ వెంచర్స్ నుంచి 5 మిలియన్ డాలర్లు, ఆయుర్వేదిక్ బ్యూటీ బ్రాండ్ ఇండి వైల్డ్ కూడా దాదాపు అంతే మొత్తాన్ని సమకూర్చుకున్నాయి. ఇందులోనూ యూనిలీవర్ వెంచర్స్ సారథ్యంలోని ఇన్వెస్టర్లు పెట్టుబడులు పెట్టారు. అమెరికాలో కార్యకలాపాల విస్తరణ కోసం కంపెనీ ఈ నిధులను సమకూర్చుకుంది. ఇక ఆగస్టులో రెనీ కాస్మెటిక్స్ సంస్థ సిరీస్ సీ విడత కింద ప్లేబుక్, మిడాస్ పార్ట్‌నర్స్, ఇతర ఇన్వెస్టర్ల నుంచి 5.8 మిలియన్ డాలర్లు సేకరించింది. ఇక ఫాక్స్‌టేల్ సైతం సిరీస్ సీ విడత కింద పాంథెరా, కోసీ కార్పొరేషన్ తదితర సంస్థల నుంచి ఏకంగా 30 మిలియన్ డాలర్లు దక్కించుకుంది. అటు బేర్ అనాటమీ, కెమిస్ట్ ఎట్ ప్లే, సన్‌స్కూప్‌లాంటి బ్రాండ్స్ మాతృ సంస్థ ఇన్నోవిస్ట్ సైతం ఐసీఐసీఐ వెంచర్, మిరాబిలిస్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ నుంచి 16 మిలియన్ డాలర్లు సమకూర్చుకుంది.

45 బిలియన్ డాలర్లకు చేరనున్న పరిశ్రమ ..

2025 ఆర్థిక సంవత్సరంలో భారతీయ బ్యూటీ, పర్సనల్ కేర్ ఉత్పత్తుల మార్కెట్ పరిమాణం సుమారు 24 బిలియన్ డాలర్లుగా ఉందని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. 2030 నాటికి ఇది 40–45 బిలియన్ డాలర్లకు చేరే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నాయి. ఈ మార్కెట్లో ఆన్‌లైన్ కేటగిరీ వాటా 2023లో 13 శాతంగా ఉండగా 2024లో దాదాపు 17 శాతానికి పెరిగినట్లు వివరించాయి. ద్వితీయ, తృతీయ శ్రేణి మార్కెట్లలో ఈ-కామర్స్ బూమ్ నెలకొనడంతో కొత్త కస్టమర్లకు చేరువయ్యేందుకు అవకాశాలు లభిస్తున్నాయని తెలిపాయి. దీంతో వేగంగా వృద్ధి సాధించేందుకు, విస్తృత శ్రేణిలో ఉత్పత్తులను అందించేందుకు, మార్కెట్లో మరింత విస్తరించేందుకు దేశీ బ్యూటీ బ్రాండ్స్ నిధులను సమకూర్చుకుంటున్నట్లు ట్రాక్షన్ వర్గాలు తెలిపాయి. ఇదే సమయంలో బడా కంపెనీలు, ఇలాంటి బ్యూటీ బ్రాండ్స్‌ను కొనుగోలు చేయడంపై ఆసక్తిగా ఉంటున్నాయి. దేశీ స్కిన్ కేర్ బ్రాండ్ మినిమలిస్ట్‌లో హిందుస్తాన్ యూనిలీవర్ (హెచ్‌యూఎల్) 90.5 శాతం వాటాలు కొనుగోలు చేసింది. ఇందుకోసం రూ. 2,706 కోట్లు వెచ్చించింది. అటు మారికో సంస్థ దాదాపు రూ. 400 కోట్లతో బియర్డోను కొనుగోలు చేసింది. ది మ్యాన్ కంపెనీని ఇమామీ దక్కించుకుంది.

గ్లోబల్ బ్రాండ్స్ వెల్లువ..

దేశీయంగా వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో భారత మార్కెట్లోకి పలు అంతర్జాతీయ బ్రాండ్స్ కూడా పెద్ద ఎత్తున ఎంట్రీ ఇస్తున్నాయి. స్వీడిష్ బ్రాండ్ హెచ్అండ్ఎం ఇటీవలే భారత్‌లో బ్యూటీ సెగ్మెంట్లోకి ప్రవేశించగా, రిలయన్స్‌కి చెందిన టీరాతో కలిసి పాప్ ఐకాన్ రిహానా తన ఫెంటీ బ్రాండ్‌ను ప్రవేశపెట్టింది. అటు ఎంఏసీ, హుడా, అనస్టాషియా బెవర్లీ హిల్స్, స్మాష్‌బాక్స్, చార్లొట్ టిల్‌బరీ కూడా రంగంలోకి దిగాయి. ఇక ఓటీటీ ప్లాట్‌ఫాంలలో కొరియన్ కంటెంట్‌కి ఆదరణ పెరుగుతుండటంతో, ప్రీమియం ఉత్పత్తులతో ఇన్నిస్‌ఫ్రీ, కాస్ఆర్‌ఎక్స్, బ్యూటీ ఆఫ్ జోసియోన్‌లాంటి కొరియన్ బ్రాండ్లు కూడా భారత వినియోగదారులకు గాలమేస్తున్నాయి.

బ్యాంకులకు డిపాజిట్ సవాళ్లు

తగ్గుతున్న కాసా నిష్పత్తి, ఎఫ్‌డీలు

- భవిష్యత్తులో మరింత క్షీణించొచ్చు
- రేటింగ్ ఏజెన్సీ క్రిసిల్ నివేదిక



ముంబై: ఫిక్స్‌డ్ డిపాజిట్లలో క్షీణత, కరెంట్-సేవింగ్స్ ఖాతా డిపాజిట్లు (కాసా) తగ్గుదలతో బ్యాంకులు మధ్య కాలం నుంచి దీర్ఘకాలానికి సవాళ్లను ఎదుర్కోనున్నట్లు రేటింగ్ ఏజెన్సీ క్రిసిల్ తెలిపింది. గృహ పొదుపులు అధిక రాబడులను ఆకాంక్షిస్తూ క్యాపిటల్ మార్కెట్లకు మళ్లుతుండడంతో బ్యాంకుల్లో డిపాజిట్లు తగ్గిపోతున్నాయంటూ కొంత కాలంగా ఆందోళనలు నెలకొనడం తెలిసిందే. వ్యవస్థ పరిణతిలో భాగంగా ఇలాంటి పరిణామం చూస్తున్నట్టు నిపుణుల అభిప్రాయంగా ఉంది. ''టర్మ్ డిపాజిట్లు, కాసా నిష్పత్తిలో గృహాల వాటా తగ్గుతోంది. డిపాజిట్ కూర్పులో నిర్మాణాత్మక మార్పును ఇది సూచిస్తోంది. డిపాజిట్ స్థిరత్వానికి ఇది సవాలుగా మారొచ్చు. మధ్య కాలం నుంచి దీర్ఘకాలంలో బ్యాంకుల నిధుల వ్యయాలపైనా ప్రభావం చూపిస్తుంది. 2025 మార్చి నాటికి బ్యాంకుల డిపాజిట్లలో గృహాల వాటా 60 శాతానికి తగ్గింది. 2020 మార్చి నాటికి ఇది 64 శాతంగా ఉంది'' అని క్రిసిల్ నివేదిక వివరించింది. డిపాజిట్లలో వృద్ధి బ్యాంకులకు ఎంతో కీలకమని, స్థిరత్వం, వ్యయాలను ఇది ప్రభావితం చేయగలదని పేర్కొంది. రానున్న కాలంలో బ్యాంక్ డిపాజిట్లలో గృహాల వాటా మరింత తగ్గుతుందని అంచనా వేసింది.

పెరుగుతున్న ఆర్థికేతర సంస్థల వాటా

ఆర్థికేతర సంస్థలు తమ వాటా పెంచుకుంటున్నట్టు క్రిసిల్ డైరెక్టర్ శుభ శ్రీనారాయణన్ ఎత్తిచూపుతూ.. కార్పొరేట్ డిపాజిటర్లు రేటుకు సున్నితంగా ఉంటారని, వారు స్వల్పకాలానికి ప్రాధాన్యమిస్తున్నట్టు చెప్పారు. ''నగదు లభ్యత పరిస్థితులు (లిక్విడిటీ) కఠినంగా ఉన్నప్పుడు ఈ తరహా పరిస్థితుల్లో మరిన్ని డిపాజిట్లు బయటకు వెళ్లిపోతాయి. దీంతో బ్యాంకులకు నిధుల వ్యయాలు పెరుగుతాయి. భవిష్యత్తులో ప్రత్యామ్నాయ పెట్టుబడి సాధనాలు మరింత ఆదరణకు నోచుకుంటాయి. దీంతో బ్యాంకు డిపాజిట్లలో గృహాల వాటా మరింత తగ్గుతుంది''అని నారాయణన్ వివరించారు. బ్యాంకులకు సేవింగ్స్, కరెంటు ఖాతాల్లోని డిపాజిట్లపై వ్యయాలు చాలా తక్కువగా ఉంటాయన్న విషయం తెలిసిందే. సేవింగ్స్ ఖాతాల్లోని డిపాజిట్లపై 3 శాతం వరకు బ్యాంకులు వడ్డీ కింద చెల్లిస్తుంటాయి. ఇక కరెంటు ఖాతా డిపాజిట్లపై ఎలాంటి వడ్డీని ఇవ్వవు. దీంతో వాటికి తక్కువ వ్యయాలకు పెద్ద మొత్తంలో నిధులు సమకూరుతుంటాయి. అందుకే బ్యాంకుల వృద్ధికి కాసా డిపాజిట్లను కీలకంగా పరిగణిస్తుంటారు. 2025 జూన్ చివరికి బ్యాంకుల కాసా డిపాజిట్ల నిషపత్తి 36 శాతానికి తగ్గిపోయినట్టు క్రిసిల్ నివేదిక తెలిపింది. 2022 మార్చిలో నమోదైన 42 శాతం చారిత్రక గరిష్ఠ స్థాయి నుంచి తగ్గుముఖం పట్టడాన్ని ప్రస్తావించింది. ముఖ్యంగా సేవింగ్స్ డిపాజిట్లు తగ్గుముఖం పడుతున్నట్టు పేర్కొంది. ఇటీవలి కాలంలో బ్యాంకులు సేవింగ్స్ డిపాజిట్లపై రేట్లను తగ్గించడం దీన్ని మరింత వేగవంతం చేస్తుందని అంచనా వేసింది. సేవింగ్స్ డిపాజిట్లపై వడ్డీని ఎస్‌బీఐ సహా పలు ప్రముఖ బ్యాంకులు ఇటీవల 2.5 శాతానికి తగ్గించడం గమనార్హం. లిక్విడిటీ పెంపు దిశగా ఆర్‌బీఐ పలు చర్యలు తీసుకున్నందున సమీప కాలానికి ఈ డిపాజిట్లు స్థిరంగా వృద్ధి చెందాల్సి ఉందని క్రిసిల్ నివేదిక పేర్కొంది.

రుణాల జోరు..



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో బ్యాంకుల రుణ వితరణ గణనీయంగా పెరిగింది. రెండో త్రైమాసికంలో ప్రైవేట్ రంగ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు రుణాలు 9 శాతం పెరిగి రూ. 27.9 లక్షల కోట్లకు చేరాయి. గత ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు క్రెడిట్ బుక్ రూ. 25.6 లక్షల కోట్లుగా నమోదైంది. మరోవైపు, కోటక్ మహీంద్రా బ్యాంక్‌లో రుణ వృద్ధి 15.8 శాతంగా నమోదైంది. రుణాల పరిమాణం రూ. 3.99 లక్షల నుంచి రూ. 4.62 లక్షల కోట్లకు ఎగిసింది. ఇక ఐడీబీఐ బ్యాంకు రుణాలు 15 శాతం పెరిగి రూ. 2 లక్షల కోట్ల నుంచి రూ. 2.3 లక్షల కోట్లకు చేరాయి. మొత్తం వ్యాపారం 12 శాతం పెరిగింది. రూ. 4.78 లక్షల కోట్ల నుంచి రూ. 5.33 లక్షల కోట్లకు ఎగిసింది. అటు క్యూ2లో యూకో బ్యాంక్ మొత్తం వ్యాపారం 13 శాతం పెరిగి రూ. 5.37 లక్షల కోట్లకు చేరింది. మొత్తం రుణాలు 16.67 శాతం వృద్ధి చెంది రూ. 1.98 లక్షల కోట్ల నుంచి రూ.2.31 లక్షల కోట్లకు చేరాయి.

నేషనల్ చాంప్స్ మనీశ్, వైష్ణవి


మనీశ్ వైష్ణవి

న్యూఢిల్లీ: ఫెనెస్టా ఓపెన్ జాతీయ టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో మనీశ్ సురేశ్ కుమార్, వైష్ణవి అడ్కర్ చాంపియన్‌లుగా నిలిచారు. తమిళనాడుకు చెందిన మనీశ్ పురుషుల విభాగంలో విజేతగా నిలవగా... మహారాష్ట్రకు చెందిన వైష్ణవి మహిళల ట్రోఫీ హస్తగతం చేసుకుంది. శనివారం పురుషుల సింగిల్స్ తుదిపోరులో మనీశ్ 6-4, 6-2తో సురేశ్‌పై విజయం సాధించాడు. రెండు గంటల పాటు సాగిన పోరులో మనీశ్ సంపూర్ణ ఆధిపత్యం కనబర్చాడు. సుదీర్ఘ ర్యాలీలు ఆడుతూ... చక్కటి రిటర్న్‌లతో ప్రత్యర్థిని ఉక్కిరి బిక్కిరి చేస్తూ వరుస సెట్లలో విజయం సాధించాడు. మహిళల సింగిల్స్ ఫైనల్లో వైష్ణవి 6-1, 6-2తో ఆక్షాంక్షపై విజయం సాధించింది. అండర్-18 విభాగంలో హర్షిణి 6-1, 2-6, 6-4తో స్నిగ్ధపై గెలిచి ట్రోఫీ చేజిక్కించుకుంది. మూడు గంటలకు పైగా సాగిన ఈ పోరులో ఇరువురు ప్లేయర్లు హోరాహోరీగా పోరాడారు. బాలుర ఫైనల్ మధ్యలో హృతిక్ గాయం కారణంగా తప్పుకోవడంతో తవీశ్‌కు టైటిల్ దక్కింది. పురుషుల డబుల్స్ ఫైనల్లో నితిన్ కుమార్ సిన్హా-మాన్ కేశర్వాని జంట విజేతగా నిలవగా... మహిళల డబుల్స్ తుదిపోరులో ఆకాంక్ష-సోహా సాధిఖ్ జోడీ 6-2, 6-2తో పూజ-యువరాణి ద్వయంపై గెలిచి ట్రోఫీ కైవసం చేసుకుంది. అండర్-18 బాలుర విభాగంలో విరాజ్-ప్రకాశ్, బాలిక విభాగంలో సవిత-అహాన్ విజేతలుగా నిలిచారు.

వర్షార్పణం



కొలంబో: అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) మహిళల వన్డే ప్రపంచకప్‌ను వరుణుడు వీడటం లేదు. ఇప్పటికే పలు మ్యాచ్‌లకు స్వల్పంగా ఆటంకం కలిగించిన వర్షం... శనివారం పూర్తి మ్యాచ్‌ను తుడిచిపెట్టేసింది. డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియా, శ్రీలంక మధ్య జరగాల్సిన మ్యాచ్ భారీ వర్షం కారణంగా రద్దు అయింది. మ్యాచ్ సమయం కంటే ముందు నుంచే భారీ వర్షం ముంచెత్తడంతో... కనీసం టాస్ కూడా వేసే అవకాశం దక్కలేదు. దీంతో ఇరు జట్లకు చెరో పాయింట్ కేటాయించారు. వరల్డ్‌కప్‌లో భాగంగా నేడు దాయాది పాకిస్తాన్‌తో భారత మహిళల జట్టు తలపడనుంది.

రసెల్‌కు పోల్ పొజిషన్


రసెల్

సింగపూర్: మెర్సిడెస్ డ్రైవర్ జార్జ్ రసెల్ ఫార్ములావన్ తాజా సీజన్‌లో రెండో సారి పోల్ పొజిషన్ సాధించాడు. శనివారం జరిగిన సింగపూర్ గ్రాండ్‌ప్రి క్వాలిఫయింగ్ రేసులో రసెల్ అందరికంటే ముందు నిలిచాడు. శుక్రవారం ప్రాక్టీస్ సందర్భంగా రసెల్ కారు ప్రమాదానికి గురవగా... దాని నుంచి వెంటనే తేరుకున్న మెర్సిడెస్ డ్రైవర్ క్వాలిఫయింగ్ రేసులో వాయువేగంతో దూసుకెళ్లాడు. రసెల్ 1 నిమిషం 29.158 సెకన్లలో ల్యాప్‌ను పూర్తి చేసి అగ్ర స్థానం దక్కించుకున్నాడు. డిఫెండింగ్ చాంపియన్, రెడ్ బుల్ డ్రైవర్ మ్యాక్స్ వెర్‌స్టాపెన్ 1 నిమిషం 29.340 సెకన్లతో రెండో స్థానంలో నిలిచాడు. ఈ ఏడాది జోరు కొనసాగిస్తున్న మెక్‌లారెన్ డ్రైవర్లు ఆస్కార్ పియాస్ట్రి, లాండో నోరిస్ ఈ క్వాలిఫయింగ్ రేసులో వెనుకబడిపోయారు. పియాస్ట్రి (1 నిమిషం 29.524 సెకన్లు) మూడో స్థానం దక్కించుకోగా... అంటొనెల్లి (1 నిమిషం 29.537 సెకన్లు; మెర్సిడెస్) నాలుగో స్థానంలో నిలిచాడు. నోరిస్ (1 నిమిషం 29.586 సెకన్లు) ఐదో 'ప్లేస్' దక్కించుకున్నాడు. ఏడుసార్లు ప్రపంచ చాంపియన్, ఫెరారీ డ్రైవర్ లూయిస్ హామిల్టన్ 1 నిమిషం 29.688 సెకన్లతో ఆరో స్థానానికి పరిమితమయ్యాడు. ఆదివారం జరగనున్న ప్రధాన రేసును రసెల్ పోల్ పొజిషన్ నుంచి ప్రారంభించనున్నాడు.


ప్రవీణ్ కుమార్

ఏక్తా, సోమన్ వెండి వెలుగులు

ప్రవీణ్ కుమార్‌కు కాంస్య పతకం ● ప్రపంచ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్


సోమన్

న్యూఢిల్లీ: ప్రపంచ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భారత అథ్లెట్ల జోరు సాగుతోంది. సొంతగడ్డపై జరుగుతున్న ఈ మెగాటోర్నీ ఎనిమిదో రోజు మనవాళ్లు మరో మూడు పతకాలు సాధించారు. శనివారం పోటీల్లో ఏక్తా భ్యాన్, సోమన్ రాణా రజత పతకాలు సాధించగా... ప్రవీణ్ కుమార్ కాంస్యం గెలుచుకున్నాడు. దీంతో ఓవరాల్‌గా ఈ చాంపియన్‌షిప్‌లో భారత పతకాల సంఖ్య 18 (6 స్వర్ణాలు, 7 రజతాలు, 5 కాంస్యాలు)కి చేరింది. బ్రెజిల్ 37 పతకాల (12 స్వర్ణాలు, 18 రజతాలు, 7 కాంస్యాలు)తో పట్టిక అగ్ర స్థానంలో కొనసాగుతోంది. ఆదివారం పోటీల చివరి రోజు కాగా... భారత్ ఖాతాలో మరిన్ని పతకాలు చేరే అవకాశం ఉంది. ప్రపంచ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ చరిత్రలో భారత్ ఇప్పటి వరకు 2024లో (జపాన్) అత్యుత్తమంగా 17 పతకాలు సాధించగా... తాజా టోర్నీలో ఆ సంఖ్యను దాటింది.

- పారిస్ పారాలింపిక్స్‌లో పసిడి నెగ్గిన ప్రవీణ్ కుమార్... గాయంతో ఇబ్బంది పడుతూ కూడా కాంస్యం తన ఖాతాలో వేసుకున్నాడు. పురుషుల హైజంప్ టి64 విభాగంలో ప్రవీణ్ కుమార్ 2.00 మీటర్ల ఎత్తు దూకి మూడో స్థానంలో నిలిచాడు. టిమూర్‌బెక్ గియాజొవ్ (2.03 మీటర్లు; ఉజ్బెకిస్తాన్) స్వర్ణం నెగ్గాడు. జొనాథ్రామ్ ఎడ్వర్డ్స్ (2.00 మీటర్లు; బ్రిటన్) రజతం గెలుచుకున్నాడు. ఎడ్వర్డ్స్, ప్రవీణ్ సమానమైన ఎత్తే దూకినప్పటికీ... బ్రిటన్ అథ్లెట్ తొలి ప్రయత్నంలోనే దాన్ని పూర్తి చేయడంతో అతడికి రజతం దక్కింది.
- మహిళల క్లబ్ త్రో ఎఫ్51 ఈవెంట్‌లో ఏక్తా భ్యాన్ క్లబ్‌ను 19.80 మీటర్ల దూరం విసిరి రజత పతకం సాధించింది. 2024లో జరిగిన ప్రపంచ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం గెలిచిన 40 ఏళ్ల ఏక్తా... ఈ సారి వెండి పతకంతో సరిపెట్టుకుంది. జోయా (24.03 మీటర్లు), ఎకతెరీనా పాటపోవా (18.60 మీటర్లు) వరుసగా స్వర్ణ, కాంస్యాలు దక్కించుకున్నారు.
- పురుషుల షాట్‌పుట్ ఎఫ్57 విభాగంలో సోమన్ రాణా రజతం గెలుచుకున్నాడు. శనివారం పోటీల్లో సోమన్ ఇనుప గుండును 14.69 మీటర్ల దూరం విసిరి రెండో స్థానంలో నిలిచాడు. 42 ఏళ్ల రాణాకు ఈ సీజన్‌లో ఇదే అత్యుత్తమ ప్రదర్శన. 2006లో మందుపాతర పేలి కుడికాలు కోల్పోయిన ఈ మాజీ సైనికుడికి అంతర్జాతీయ స్థాయిలో ఇదే అత్యుత్తమ ప్రదర్శన.



ఏక్తా



హైదరాబాద్ పరాజయం

సాక్షి, హైదరాబాద్: ప్రైమ్ వాలీబాల్ లీగ్ (పీవీఎల్) నాలుగో సీజన్‌లో హైదరాబాద్ బ్లాక్‌హాక్స్ జట్టుకు తొలి పరాజయం ఎదురైంది. సొంతగడ్డపై జరుగుతున్న లీగ్‌లో శనివారం హైదరాబాద్ బ్లాక్‌హాక్స్ 0-3 (9-15, 13-15, 7-15)తో ముంబై మెటియోర్స్ చేతిలో ఓడింది. సీజన్ ఆరంభ పోరులో కాలికట్ హీరోస్‌పై ఏకపక్ష విజయం సాధించిన హైదరాబాద్... ముంబై మెటియోర్స్‌తో పోరులో అదే జోరు కనబర్చలేకపోయింది. ముంబై విజయంలో కీలక పాత్ర పోషించిన శుభమ్ చౌదరికి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలోనే జరిగిన మరో మ్యాచ్‌లో అహ్మదాబాద్ డిఫెండర్స్ 3-2 (13-15, 13-15, 15-13, 15-8, 18-16)తో ఢిల్లీ తుఫాన్స్‌పై విజయం సాధించింది. లీగ్‌లో భాగంగా నేడు జరగనున్న మ్యాచ్‌ల్లో కోల్‌కతా థండర్‌బోల్ట్స్‌తో బెంగళూరు టార్పడోస్, కొచ్చి బ్లూ స్పైకర్స్‌తో గోవా గార్డియన్స్ తలపడనున్నాయి.

పుణేరి పల్టన్ హ్యాట్రిక్

చెన్నై: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) 12వ సీజన్‌లో పుణేరి పల్టన్ వరుసగా మూడో విజయం ఖాతాలో వేసుకుంది. శనివారం జరిగిన పోరులో పుణేరి పల్టన్ 41-36 పాయింట్ల తేడాతో జైపూర్ పింక్ పాంథర్స్‌పై విజయం సాధించింది. పల్టన్ తరఫున ఆదిత్య షిండే 13 పాయింట్లు సాధించగా... కెప్టెన్ పంకజ్ మోహితె 8 పాయింట్లు సాధించాడు. జైపూర్ తరఫున అలీ సమది 22 పాయింట్లతో విజృంభించాడు. మరో మ్యాచ్‌లో గుజరాత్ జెయింట్స్ 47-40 పాయింట్ల తేడాతో బెంగాల్ వారియర్స్‌పై గెలుపొందింది. ఆదివారం యూపీ యోధాస్‌తో తెలుగు టైటాన్స్, బెంగళూరు బుల్స్‌తో తమిళ్ తలైవాస్ తలపడతాయి.

రెస్టాఫ్ ఇండియా లక్ష్యం 361



నాగ్‌పూర్: రంజీ ట్రోఫీ విజేత విదర్భ, రెస్టాఫ్ ఇండియా మధ్య జరుగుతున్న ఇరానీ కప్ రసవత్తరంగా సాగుతోంది. 361 పరుగుల విజయ లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన రెస్టాఫ్ ఇండియా... శనివారం ఆట ముగిసే సమయానికి 12 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 30 పరుగులు చేసింది. అభిమన్యు ఈశ్వరన్ (17), ఆర్యాన్ జుయల్ (6) అవుట్ కాగా... ఇషాన్ కిషన్ (18 బంతుల్లో 5 బ్యాటింగ్), కెప్టెన్ రజత్ పాటీదార్ (22 బంతుల్లో 2 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. చేతిలో 8 వికెట్లు ఉన్న రెస్టాఫ్ ఇండియా... విజయానికి ఇంకా 331 పరుగులు చేయాల్సి ఉంది. తొలి ఇన్నింగ్స్‌లో భారీ స్కోరు చేయలేకపోయిన రెస్టాఫ్ ఇండియా బ్యాటర్లు... మరి చివరి రోజు ఎలాంటి ప్రదర్శన కనబరుస్తారో చూడాలి. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్, యశ్ ధుల్, మానవ్ సుతార్ ఇంకా బ్యాటింగ్‌కు రావాల్సి ఉంది. విదర్భ బౌలర్లలో హర్ష్ దూబే, ఆదిత్య ఠాకరే చెరో వికెట్ పడగొట్టారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 96/2తో శనివారం నాలుగో రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన విదర్భ జట్టు... చివరకు 94.1 ఓవర్లలో 232 పరుగులకు ఆలౌటైంది. దీంతో తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం 128 పరుగులతో కలుపుకొని ప్రత్యర్థి ముందు 361 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించినట్లు అయింది. అమన్ (37), కెప్టెన్ అక్షయ్ వాడ్కర్ (125 బంతుల్లో 36; 4 ఫోర్లు), దర్శన్ నల్కండే (92 బంతుల్లో 35; 2 ఫోర్లు, 1 సిక్స్) తలా కొన్ని పరుగులు చేశారు. తొలి ఇన్నింగ్స్‌లో మంచి పోరాటం కనబర్చిన విదర్భ ఆటగాళ్లు... రెండో ఇన్నింగ్స్‌లో అదే జోరు కొనసాగించలేకపోయారు. మెరుగైన ఆరంభాలను భారీ స్కోర్లుగా మలచలేకపోవడంతో విదర్భ ఓ మాదిరి స్కోరుకే పరిమితమైంది. హర్ష్ దూబే (43 బంతుల్లో 29; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) క్రీజులో ఉన్నంతసేపు ధాటిగా ఆడేందుకు ప్రయత్నించాడు. రెస్టాఫ్ ఇండియా బౌలర్లలో అన్షుల్ కంబోజ్ 4 వికెట్లు పడగొట్టాడు.నేడు ఆటకు చివరి రోజు.

స్కోరు వివరాలు

విదర్భ తొలి ఇన్నింగ్స్: 342; **రెస్టాఫ్ ఇండియా తొలి ఇన్నింగ్స్:** 214; **విదర్భ రెండో ఇన్నింగ్స్:** అథర్వ తైడె (సి) ఆకాశ్‌దీప్ (బి) మానవ్ సుతార్ 15; అమన్ మోఖడే (సి) ఇషాన్ కిషన్ (బి) గుర్‌నూర్ బ్రార్ 37; ధ్రువ్ షొరే (ఎల్బీ) (బి) అన్షుల్ కంబోజ్ 27; దానిశ్ మాలేవార్ (సి) రుతురాజ్ (బి)అన్షుల్ కంబోజ్ 16; యశ్ రాథోడ్ (సి) ఇషాన్ కిషన్ (బి) అన్షుల్ కంబోజ్ 5; అక్షయ్ వాడ్కర్ (సి) ఇషాన్ కిషన్ (బి) అన్షుల్ కంబోజ్ 36; హర్ష్ దూబే (సి) సారాంశ్ (బి) గుర్‌నూర్ బ్రార్ 29; పార్థ్ రేఖడే (సి) రజత్ పాటీదార్ (బి) సారాంశ్ 2; యశ్ ఠాకూర్ (సి) ఆర్యాన్ జుయల్ (బి) మానవ్ సుతార్ 13; ఆదిత్య ఠాకరే (నాటౌట్) 3; ఎక్స్‌ట్రాలు: 14; **మొత్తం (94.1 ఓవర్లలో ఆలౌట్) 232. వికెట్ల పతనం:** 1-42, 2-64, 3-97, 4-104, 5-105, 6-144, 7-155, 8-190, 9-207, 10-232. **బౌలింగ్:** సారాంశ్ జైన్ 21.1-0-52-2; ఆకాశ్‌దీప్ 10-4-13-0; మానవ్ సుతార్ 33-9-82-2; అన్షుల్ కంబోజ్ 12-1-34-4; గుర్‌నూర్ బ్రార్ 18-5-41-2.

రెస్టాఫ్ ఇండియా రెండో ఇన్నింగ్స్: అభిమన్యు ఈశ్వరన్ (ఎల్బీ) (బి) హర్ష్ దూబే 17; ఆర్యాన్ జుయల్ (బి) ఆదిత్య 6; ఇషాన్ కిషన్ (బ్యాటింగ్) 5; రజత్ పాటీదార్ (బ్యాటింగ్) 2; ఎక్స్‌ట్రాలు 0; **మొత్తం (12 ఓవర్లలో 2 వికెట్లకు) 30. వికెట్ల పతనం:** 1-16, 2-24; బౌలింగ్: హర్ష్ దూబే 6-2-20-1; ఆదిత్య ఠాకరే 5-1-8-1; పార్థ్ రేఖడే 1-0-2-0.

మార్ష్ మెరుపు శతకం


● 52 బంతుల్లో 8 ఫోర్లు, 7 సిక్స్‌లతో 103 నాటౌట్
● న్యూజిలాండ్‌తో మూడో టి20లో ఆస్ట్రేలియా విజయం


మార్ష్

మౌంట్ మాంగనీ: మిచెల్ మార్ష్ (52 బంతుల్లో 103 నాటౌట్; 8 ఫోర్లు, 7 సిక్స్‌లు) అజేయ శతకంతో చెలరేగడంతో న్యూజిలాండ్‌పై మూడో టి20లో ఆస్ట్రేలియా ఘనవిజయం సాధించింది. మూడు మ్యాచ్‌ల 'చాపెల్-హ్యాడ్లీ' సిరీస్‌లో భాగంగా శనివారం జరిగిన ఆఖరి టి20లో ఆస్ట్రేలియా 3 వికెట్ల తేడాతో ఆతిథ్య న్యూజిలాండ్‌ను చిత్తుచేసింది. తద్వారా 2-0తో సిరీస్ కైవసం చేసుకుంది. తొలి మ్యాచ్‌లో మార్ష్ మెరుపులతో ఆసీస్ అలవోకగా గెలవగా... రెండో మ్యాచ్ వర్షం కారణంగా రద్దు అయింది. అంతర్జాతీయ టి20ల్లో మార్ష్‌కు ఇదే తొలి సెంచరీ కావడం విశేషం. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 156 పరుగులు చేసింది. వికెట్ కీపర్ టిమ్ సైఫెర్ట్ (35 బంతుల్లో 48; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) టాప్ స్కోరర్ కాగా... కెప్టెన్ మిచెల్ బ్రేస్‌వెల్ (22 బంతుల్లో 26; 2 ఫోర్లు, 1 సిక్స్), నీషమ్ (18 బంతుల్లో 25; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఫర్వాలేదనిపించారు. గత మ్యాచ్ సెంచరీ హీరో టిమ్ రాబిన్సన్ (13) ఈ సారి విఫలం కాగా... డెవాన్ కాన్వే (0), మార్క్ చాప్‌మన్ (4), డారిల్ మిచెల్ (9) ప్రభావం చూపలేకపోయారు. ఆస్ట్రేలియా బౌలర్లలో సీన్ అబాట్ 3 వికెట్లు పడగొట్టగా... జోష్ హాజిల్‌వుడ్, జేవియర్ చెరో రెండు వికెట్లు ఖాతాలో వేసుకున్నారు. అనంతరం లక్ష్యఛేదనలో మార్ష్ మెరుపులు మెరిపించడంతో ఆస్ట్రేలియా 18 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 160 పరుగులు చేసింది. మిగిలిన వాళ్లు పెద్దగా ఆకట్టుకోలేకపోగా, మార్ష్ ఒంటి చేత్తో జట్టును విజయపథాన నడిపాడు. ట్రావిస్ హెడ్ (8), మాథ్యూ షార్ట్ (7), టిమ్ డేవిడ్ (3), అలెక్స్ కారీ (1)మార్కస్ స్టొయినిస్ (2) పేలవ ప్రదర్శన కనబర్చారు. మరో ఎండ్‌లో వరుసగా వికెట్లు పడుతున్నా... మార్ష్ ఏమాత్రం వెరవకుండా భారీ షాట్‌లతో విరుచుకుపడ్డాడు. ఈ క్రమంలో అతడు 50 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. టి20ల్లో 73 ఇన్నింగ్స్‌లు ఆడిన మార్ష్‌కు ఇదే తొలి మూడంకెల స్కోరు. న్యూజిలాండ్ బౌలర్లలో నీషమ్ 4 వికెట్లు పడగొట్టాడు. మార్ష్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్', 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్' అవార్డులు దక్కాయి.

ఫైనల్లో తస్నీమ్, శ్రియాన్షి

అల్ అయిన్ (యూఏఈ): భారత స్టార్ షట్లర్ కిడాంబి శ్రీకాంత్... అల్ అయిన్ మాస్టర్స్ సూపర్-100 బ్యాడ్మింటన్ టోర్నమెంట్ సెమీఫైనల్లో పరాజయం పాలవగా... మహిళల విభాగంలో తస్నీమ్ మీర్, శ్రియాన్షి వలిశెట్టి ఫైనల్‌కు దూసుకెళ్లారు. శనివారం జరిగిన పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో మూడో సీడ్ శ్రీకాంత్ 4-21, 21-11, 19-21తో రెండో సీడ్ ఆదిల్ షోలెహ్ (మలేసియా) చేతిలో పోరాడి ఓడాడు. ఇక మహిళల సింగిల్స్‌లో బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ జూనియర్ నంబర్‌వన్, 20 ఏళ్ల తస్నీమ్ మీర్ సత్తాచాటింది. సెమీస్‌లో ఆరో సీడ్ తస్నీమ్ 9-21, 21-17, 21-10తో ఐదో సీడ్ నెస్లిహన్ అరిన్ (తుర్కియే)పై విజయం సాధించింది. మరో సెమీస్‌లో ఏడో సీడ్ శ్రియాన్షి 21-11, 21-12తో చియారా మార్వెల్లా హండోయో (ఇండోనేసియా)పై గెలిచి తుదిపోరుకు అర్హత సాధించింది. ఆదివారం జరగనున్న మహిళల సింగిల్స్ ఫైనల్లో తస్నీమ్, శ్రియాన్షి టైటిల్ కోసం పోటీపడనున్నారు. ఈ ఇద్దరికీ ఇదే తొలి బీడబ్ల్యూఎఫ్ సూపర్-100 ఫైనల్.





20 ఏళ్ల తర్వాత సందర్శకుల కోసం

లక్సార్: ఈజిప్టులోని లక్సార్ నగరంలో ఫారో చక్రవర్తి సమాధిని రెండు దశాబ్దాల అనంతరం సందర్శకుల కోసం శనివారం తిరిగి తెరిచారు. ఈజిప్టును క్రీస్తు పూర్వం 1390–1350 మధ్యన పాలించిన అమెన్‌హోటెప్-3 సమాధి 'ప్రఖ్యాత వాలీ ఆఫ్ కింగ్స్'లో పశ్చిమ దిక్కున ఉంది. దీనిని 1799లో గుర్తించారు. ఇందులోని ప్రధానమైన సార్కోఫాగస్(మమ్మీ) సహా ముఖ్యమైన వస్తువులు లూటీకి గురయ్యాయని ఈజిప్షియన్ యాంటిక్విటీస్ అథారిటీ తెలిపింది. జపాన్ ఆర్థిక, సాంకేతిక సాయంతో రెండు దశాబ్దాలపాటు మూడు దఫాలుగా ఈ సమాధి పునరుద్ధరణ పనులు సాగాయి. ఫారో, ఆయన భార్య సమాధి గోడలపై ఉన్న చిత్రాలకు రంగులు అద్దడం కూడా ఇందులో ఉన్నాయి. సార్కోఫాగస్‌ను ఉంచిన భారీ పెట్టె ఫ్రేమ్ కూడా ఇందులో ఉంది. వ్యాలీ ఆఫ్ కింగ్స్ ప్రాంతంలో 36 మీటర్ల పొడవు, 14 మీటర్ల లోతున మెట్ల దారి సమాధికి దారి తీస్తుంది. ఇందులో చక్రవర్తిని ఉంచిన ప్రధాన సమాధి ఛాంబర్‌తో పాటు ఆయన ఇద్దరు భార్యలకు రెండు ఛాంబర్లున్నాయి. వ్యాలీ ఆఫ్ కింగ్స్‌లో ప్రాచీన ఈజిప్టును క్రీస్తుపూర్వం 1550–1292 సంవత్సరాల మధ్య పాలించిన 17 మంది రాజులు, రాణుల మమ్మీలతోపాటు మరో 16 ఇతరుల మమ్మీలున్నాయి.

చిన్నారుల ఆధార్ అప్‌డేట్స్‌పై ఫీజు లేదు

న్యూఢిల్లీ: చిన్నారుల ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేట్స్‌కు ఎలాంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ(యూఐడీఏఐ) శనివారం తెలిపింది. ఫీజు మాఫీ ఇప్పటికే ఈనెల ఒకటో తేదీ నుంచే అమల్లోకి వచ్చిందని, ఏడాది పాటు ఇది కొనసాగుతుందని వివరించింది. తప్పనిసరిగా చేయించాల్సిన బయోమెట్రిక్ అప్‌డేట్స్‌కు ఇది వర్తిస్తుందని పేర్కొంది. ఐదేళ్లలోపు చిన్నారులకు ఆధార్ తీసుకుంటే వేలిముద్రలు, ఐరిస్ బయో మెట్రిక్ నమోదు కావు. ఐదేళ్లు నిండాక 5–7 ఏళ్ల మధ్య చేపట్టే ఆధార్ అప్‌డేట్స్‌లో వేలిముద్రలు, ఐరిస్ నమోదు తప్పనిసరి తెలిపింది. రెండో సారి అప్‌డేట్‌ను 15–17 ఏళ్ల మధ్య నమోదు చేయించాలని తల్లిదండ్రులకు సూచించింది. తాజా నిర్ణయంతో 5–17 ఏళ్ల మధ్య ఆధార్ అప్‌డేట్స్ చేయించుకునే బాలలు ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపింది. ఆ తర్వాత ప్రతి తప్పనిసరి బయోమెట్రిక్ అప్‌డేట్‌కు రూ.125 ఫీజు ఉంటుందని పేర్కొంది.

సన్ రైజ్ సెక్టార్‌గా మత్స్య రంగం

దేశవ్యాప్తంగా 3 కోట్ల మందికి జీవనోపాధి

- ఏటా రూ.60 వేల కోట్ల ఎగుమతులు..
- ప్రపంచంలో రెండో అతిపెద్ద ఉత్పత్తిదారుగా భారత్..

సాక్షి, న్యూఢిల్లీ: దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తూ, 'సన్‌రైజ్ సెక్టార్'గా మత్స్య రంగం శరవేగంగా అభివృద్ధి చెందుతోందని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. దాదాపు 3 కోట్ల మందికి జీవనోపాధి కల్పిస్తూ, ప్రపంచ చేపల ఉత్పత్తిలో 8% వాటాతో భారత్ రెండో అతిపెద్ద దేశంగా నిలిచింది. 2015 నుంచి కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ప్రత్యేక చర్యల ఫలితంగా ఈ రంగంలోకి రూ. 38,572 కోట్ల పెట్టుబడులు రాగా, 2023–24లో మత్స్య ఉత్పత్తుల ఎగుమతులు రికార్డు స్థాయిలో రూ.60,524 కోట్లకు చేరాయి. ఏటా 8.74% వృద్ధి రేటుతో దూసుకెళ్తున్న ఈ రంగంలో సుస్థిర అభివృద్ధిని సాధించేందుకు కేంద్రం నడుం బిగించింది. ఈ వృద్ధిని మరింత వేగవంతం చేసి, క్షేత్రస్థాయిలో మత్స్యకారులు, రైతులను భాగస్వాములను చేసేందుకు కేంద్ర మత్స్యశాఖ ఒక బహత్తర కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసింది. కేంద్ర మత్స్యశాఖ కార్యదర్శి డాక్టర్ అభిలక్ష్ లిఖి నేతృత్వంలో 2025 ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు ఆరు నెలల పాటు దేశవ్యాప్తంగా వర్చువల్ సమావేశాలు నిర్వహించారు. 34 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి 15,000 మందికి పైగా మత్స్యకారులు, ఆక్వా రైతులు, పరిశ్రమల ప్రతినిధులు ఇందులో పాల్గొని తమ అభిప్రాయాలను, సవాళ్లను నేరుగా ప్రభుత్వానికి నివేదించారు.

రైతు కేంద్రంగానే మా విధానాలు: డాక్టర్ అభిలక్ష్‌లిఖి

ఈ సందర్భంగా డాక్టర్ అభిలక్ష్ లిఖి మాట్లాడుతూ, 'మత్స్యకారులు, విధాన రూపకర్తల మధ్య ఈ సమావేశాలు బలమైన వారధిని నిర్మించాయి. క్షేత్రస్థాయి నుంచి అందిన ఈ సూచనలు 'వికసిత భారత్ 2047'లక్ష్యానికి అనుగుణంగా మా భవిష్యత్ ప్రణాళికలకు దిక్సూచిగా నిలుస్తాయి. ఈ రంగంలో వృద్ధి సమ్మిళితంగా, రైతు కేంద్రంగా ఉండేలా చూస్తాం'అని తెలిపారు. మొత్తంగా, భారీ పెట్టుబడులతో పాటు క్షేత్రస్థాయి భాగస్వామ్యంతో మత్స్య రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సంపూర్ణ ప్రణాళికతో ముందుకు సాగుతోంది.

క్షేత్రస్థాయిలో అందిన కీలక సూచనలు

సమావేశాల్లో మత్స్యకారులు తమకు అవసరమైన మద్దతుపై స్పష్టమైన సూచనలు చేశారు. నాణ్యమైన చేప పిల్లలు, తక్కువ ధరకే మేత, కోల్డ్ స్టోరేజీలు, రవాణా సౌకర్యాలు మెరుగుపరచాలని కోరారు. డ్రోన్లు, శాటిలైట్ టెక్నాలజీ వంటి ఆధునిక సాంకేతికతను అందుబాటులోకి తేవాలని, ప్రభుత్వం ఉచితంగా అందించిన ట్రాన్స్‌పాండర్లు తమ భద్రతకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని హర్షం వ్యక్తం చేశారు. ప్రత్యేక మార్కెట్లు, ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసి గిట్టుబాటు ధర కల్పించాలని, సముద్రపు నాచు, అలంకార చేపల పెంపకం వంటి ప్రత్యామ్నాయ జీవనోపాధి మార్గాలను ప్రోత్సహించాలని కోరారు.

ఉక్రెయిన్ రైళ్లపై రష్యా డ్రోన్ దాడి

ఒకరు మృతి, పదుల సంఖ్యలో క్షతగాత్రులు


దాడిలో ధ్వంసమైన రైలు బోగీ

కీవ్: ఉక్రెయిన్‌లోని సుమీ ప్రాంతంలోని రైళ్లపై శనివారం రష్యా జరిపిన డ్రోన్ల దాడిలో ఒకరు చనిపోగా డజన్ల కొద్దీ జనం గాయాలపాలయ్యారు. బాధితుల్లో రైల్వే సిబ్బందితోపాటు ప్రయాణికులు కూడా ఉన్నారని అధ్యక్షుడు జెలెన్‌స్కీ పేర్కొన్నారు. రష్యా దాడిని ఆయన ఆటవిక చర్యగా అభివర్ణించారు. దాడి తీవ్రతకు ధ్వంసమైన రైలు బోగీలు మంటల్లో చిక్కుకున్న దృశ్యాలను ఆయన ఎక్స్‌లో షేర్ చేశారు. ఇందులో సుమీలోని షోస్ట్కా నుంచి కీవ్ వైపునకు బయలుదేరుతున్న రైలు ఒకటి కాగా, అందులోని బాధితుల్ని, సహాయ సిబ్బంది వెళ్లే లోకల్ రైలు. ఈ ఘటనను ఉగ్రదాడిగా పరిగణించాలని ప్రపంచ దేశాలను ఆయన కోరారు. కేవలం మాటలకే పరిమితం కాకుండా, రష్యాపై చర్యలకు దిగాలన్నారు. గత రెండు నెలలుగా ఉక్రెయిన్ రైల్వే మౌలిక వనరులే లక్ష్యంగా రష్యా నిత్యం గగనతల దాడులకు పాల్పడుతోంది. ఇలాఉండగా, ఉక్రెయిన్‌లోని ఖర్కివ్, పోల్టావా ప్రాంతాల్లోని ప్రభుత్వ రంగ నఫ్తోగాజ్ గ్యాస్, ఆయిల్ కంపెనీ వనరులపై శుక్రవారం రష్యా 35 క్షిపణులను, 381 డ్రోన్లను ప్రయోగించింది. మూడేళ్ల క్రితం రష్యా దురాక్రమణ మొదలయ్యాక గ్యాస్ వనరులపై జరిగిన భారీ దాడిగా దీనిని అధికారులు పేర్కొన్నారు. ఈ దాడులతో తీవ్ర నష్టం వాటిల్లిందని, పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని పేర్కొన్నారు. శీతాకాలం సమీపిస్తున్న వేళ ఉక్రెయిన్ పౌరుల్లో ప్రభుత్వంపై అసంతృప్తిని రగిల్చేందుకే రష్యా ఇలాంటి దాడులకు తెరతీసిందని ఆరోపించారు. ఇలా ఉండగా, రష్యాలోని అతిపెద్ద రిఫైనరీల్లో ఒకటైన సెయింట్ పీటర్స్ బర్గ్ సమీపంలోని కిరిషి చమురుశుద్ధి కేంద్రంపై డ్రోన్లతో దాడి చేసినట్లు ఉక్రెయిన్ శనివారం ప్రకటించింది. దీంతో భీకర పేలుళ్లు సంభవించాయంది. ఇక్కడ నిత్యం 3.55 లక్షల బ్యారెళ్ల చమురు శుద్ధి అవుతుంది. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద చమురు ఎగుమతి దారుగా ఉన్న రష్యా..ఇటీవల చమురు వనరులపై ఉక్రెయిన్ దాడుల నేపథ్యంలో ఎగుమతులను నిలిపివేసింది.

రూ.145 కోట్లతో అత్యాధునిక కారాగారం

చక్రం ఆకారంలో హై సెక్యూరిటీ జైలు

- 10వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో నిర్మాణం
- నరేలాలో 21 నెలల్లో సిద్ధం
- తిహార్, మండోలి జైళ్లపై తగ్గనున్న భారం

సాక్షి, న్యూఢిల్లీ: దేశరాజధాని ఢిల్లీలోని జైళ్లు ఖైదీలతో కిక్కిరిసిపోతున్నాయి. ఈ భారాన్ని తగ్గించేందుకు అత్యాధునిక హంగులతో సరికొత్త జైలు అందుబాటులోకి రానుంది. ఈ హైసెక్యూరిటీ జైలును రూ.145.52కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్నారు. ఇప్పటికే సామర్థ్యానికి మించి ఖైదీలతో నిండిపోయిన తిహార్, మండోలి, రోహిణి జైళ్లలో ఖైదీల భారం తగ్గనుంది. 10వేలకు పైగా చదరపు మీటర్ల విస్తీర్ణంలో రెండు అంతస్తుల్లో మొత్తం 256 సెల్‌లతో ఈ జైలు నిర్మించనున్నారు. నరేలాలో 21 నెలల్లో ఈ కారాగారం నిర్మాణాన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మొత్తం ఎనిమిది బ్లాకులుగా జైలును నిర్మిస్తారు. ఇందులో గ్రౌండ్ ఫ్లోర్‌లో 128 సెల్‌లు, మొదటి అంతస్తులో 128 సెల్‌లు ఉంటాయి, మొత్తం 256 మంది ఖైదీల సామర్థ్యం. గ్రౌండ్, మొదటి అంతస్తులలోని జైలు బ్లాక్‌లు ఒక్కొక్కటి 5126.44 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉంటాయి. ప్రధాన అంతస్తు 345 చదరపు మీటర్లు ఉంటుంది. ఖైదీల సెల్ లతోపాటు.. జైలు సిబ్బంది గృహాలు, శిక్షణా కేంద్రం ఉంటాయి. అన్నీ సెంట్రల్ వాచ్‌టవర్‌కు అనుసంధానమై ఉంటాయి. భద్రతలను దృష్టిలోపెట్టుకుని ఈ జైలును చక్రం ఆకారంలో నిర్మించనున్నారు. ఆటోమేటిక్ లాకింగ్, స్కానర్లు, బాడీ స్కానర్లు, బాడీ వార్న్ కెమెరాలతో సహా ఆధునిక భద్రతా పరికాలు ఇక్కడ అమర్చుతున్నారు. సెంట్రల్ వాచ్‌టవర్ నుంచి మొత్తం ఖైదీలందరినీ పర్యవేక్షించేలా జైలును డిజైన్ చేశారు.

కొత్త జైలుతో తగ్గనున్న భారం

ఢిల్లీలోని జైళ్లు దేశంలోనే అత్యంత రద్దీగా ఉన్నాయని 'ఇండియా జస్టిస్ రిపోర్ట్ 2025'నివేదికలో వెల్లడించింది. మొత్తం ఖైదీల జనాభాలో విచారణలో ఉన్న ఖైదీలే 91 శాతం. దేశంలోనే ప్రఖ్యాత తిహార్ జైలు సామర్థ్యం సుమారు 5,200 మంది. కానీ.. ఇక్కడ సుమారు 13వేల మంది ఖైదీలు ఉన్నారు. నరేలాలో నిర్మించనున్న ఈ అత్యాధునిక కొత్త జైలుతో తీహార్‌తోపాటు.. మండోలి, రోహిణి జైళ్లపై ఒత్తిడి తగ్గుతుందని అధికార వర్గాలు చెబుతున్నాయి.

భారత్‌లో ఉద్యోగాల జోరు

ఆరేళ్లలో 17 కోట్ల కొత్త కొలువులు..

- 3.2 శాతానికి తగ్గిన నిరుద్యోగిత
- పెరిగిన మహిళల భాగస్వామ్యం
- కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరిగాయని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. గడిచిన ఆరేళ్లలో ఏకంగా 16.83 కోట్ల కొత్త ఉద్యోగాలు సృష్టించినట్లు కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ వెల్లడించింది. ప్రభుత్వ యువజన-కేంద్రీకృత విధానాలు, 'వికసిత భారత్'దార్శనికత ఫలితంగా దేశ శ్రామిక శక్తి స్వరూపంలో సానుకూల మార్పులు చోటుచేసుకున్నాయని వెల్లడించింది. 2017-18లో 47.5 కోట్లుగా ఉన్న మొత్తం ఉపాధి పొందిన వారి సంఖ్య, 2023-24 నాటికి 64.33 కోట్లకు చేరింది. ఇదే సమయంలో దేశంలో నిరుద్యోగిత రేటు 6.0% నుంచి 3.2%కి పడిపోయింది. దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్టంగా ఉందనడానికి, ఉద్యోగ కల్పన సరైన మార్గంలో పయనిస్తోందనడానికి నిదర్శనంగా నిపుణులు భావిస్తున్నారు.

సంఘటిత రంగంలోకి 1.56 కోట్ల మహిళలు

గత ఏడేళ్లలో సంఘటిత రంగంలోకి 1.56 కోట్ల మంది మహిళలు అడుగుపెట్టారు. ఇది మహిళా సాధికారతకు, శ్రామిక శక్తిలో వారి పెరుగుతున్న పాత్రకు అద్దం పడుతోంది. పట్టణ ప్రాంతాల్లో పురుషుల నిరుద్యోగం జూలైలో 6.6% ఉండగా, ఆగస్టు నాటికి 5.9%కి తగ్గింది. గ్రామీణ ప్రాంతాల్లో ఇది 4.5%గా నమోదైంది, ఇది గత నాలుగు నెలల్లో అత్యంత తక్కువ. ఈ కాలంలో కార్మికుల వేతనాలు కూడా గణనీయంగా పెరిగాయి. సాధారణ కార్మికుల రోజువారీ వేతనం 2017లో రూ.294 ఉండగా, 2024 నాటికి రూ.433కి పెరిగింది. అదేవిధంగా, నెలవారీ జీతం తీసుకునే ఉద్యోగుల సగటు ఆదాయం రూ. 16,538 నుంచి రూ.21,103కి పెరిగింది.ఉద్యోగ కల్పన ను మరింత ప్రోత్సహించేందుకు ప్రభుత్వం 2025 ఆగస్టు లో 'ప్రధాన మంత్రి వికసిత భారత్ రోజ్‌గార్ యోజన'ను ప్రారంభించింది. 2025 నుంచి 2027 వరకు అమల్లో ఉండే ఈ పథకం కోసం రూ.99,446 కోట్లు కేటాయించింది. యజమానులకు, ఉద్యోగులకు ప్రోత్సాహకాలు అందించడం ద్వారా కొత్త ఉద్యోగాల కల్పనకు ఈ పథకం ఊతమిస్తోంది. ప్రభుత్వ సమర్థవంతమైన విధానాల ఫలితంగా దేశంలో ఉపాధి అవకాశాలు మరింత మెరుగుపడతాయని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు.


అమెరికాలోని న్యూయార్క్ రాష్ట్రం వాపింగర్స్ ఫాల్స్‌లో టోని స్కాట్ అనే ఈ రైతు తన పెరటిలో పండించిన భారీ గుమ్మడి కాయ ఇది. బరువు 876 కిలోలు.

బరేలీలో ఫంక్షన్ హాల్, 15 దుకాణాలు కూల్చివేత

సమాజ్‌వాదీ పార్టీ నేతల హౌస్ అరెస్ట్

లక్నో: ఇటీవల హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్న యూపీలోని బరేలీలో శనివారం అధికారులు మరోసారి బుల్డోజర్లను ఉపయోగించారు. సెప్టెంబర్ 26వ తేదీన బరేలీలో 'ఐ లవ్ మహ్మద్' ర్యాలీ నిర్వహణకు అధికారులు అనుమతివ్వకపోవడంతో ఉద్రిక్తతలు చెలరేగాయి. నిరసనకారుల పోలీసులతో తలపడ్డారు. ఈ సందర్భంగా పలువురిని అరెస్ట్ చేయడం తెల్సిందే. వీరిలో మతపెద్ద తౌకీర్ రజా ఖాన్, ఆయన అనుచరులు, బంధువులు ఉన్నారు. నిబంధనలను ఉల్లంఘించారని పేర్కొంటూ రజా ఖాన్ సంబంధీకులకు చెందిన రజా ప్యాలెస్ కట్టడంలోని కొంతభాగాన్ని మున్సిపల్ అధికారులు బుల్డోజర్లతో కూల్చివేసి, ఆ ప్రాంతానికి సీల్ వేశారు. అదేవిధంగా, ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా నిర్మించారని ఆరోపిస్తూ మరో 15 దుకాణాలను అధికారులు నేలమట్టం చేశారు. ఈ సందర్భంగా నగరంలో భారీగా పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. ముందుగా ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. మరో పరిణామం.. బరేలీని సందర్శించాల్సిన ప్రతిపక్ష సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) ప్రజాప్రతినిధుల బృందాన్ని యూపీ యంత్రాంగం శనివారం అడ్డుకుంది. ఎస్పీ బృందంలోని 14 మంది ఎంపీలు, ఎమ్మెల్యేలను వారి ఇళ్ల వద్దే పోలీసులు బయటకు వెళ్లనివ్వలేదని అసెంబ్లీలో ప్రతిపక్ష నేత మాతా ప్రసాద్ పాండే తెలిపారు. వీరి సందర్శనతో శాంతికి భగ్నం కలుగుతుందనే వెళ్లనీయడం లేదని ప్రభుత్వం పేర్కొంది. పోలీసులు, అమాయకులను చంపేందుకు ప్రయత్నించిన వారివద్ద మొసలి కన్నీరు కార్చేందుకే వీరు వెళ్తున్నారని మండిపడింది.

పీవోకేతో పాక్ సర్కారు ఒప్పందం

ఇస్లామాబాద్: గత వారం రోజులుగా పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో చెలరేగుతున్న నిరసనోద్యమాన్ని చల్లార్చేందుకు పాకిస్తాన్ ప్రభుత్వం ఎట్టకేలకు దిగివచ్చింది. మొదటి మిలిటరీని పంపి ఉద్యమాన్ని అణచివేయాలని ప్రయత్నించి విఫలమైన షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వం.. చివరకు ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న జమ్మూకశ్మీర్ జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ (జేకేజేఏఏసీ)తో ఒప్పందం చేసుకుంది. 25 అంశాలతో కూడిన ఒప్పందం ప్రతిని పాక్ పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి తారిఖ్ ఫజల్ చౌదరి శనివారం సోషల్ మీడియాలో షేర్ చేశారు. గత నెల 29 నుంచి జరుగుతున్న హింసాత్మక ఘర్షణల్లో పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో 10 మంది మరణించారు. అనేకమంది గాయపడ్డారు. దీంతో పరిస్థితిని చక్కదిద్దేందుకు ముజఫరాబాద్‌కు షహబాజ్ షరీఫ్ గత బుధవారం ఉన్నత స్థాయి ప్రతినిధి బృందాన్ని పంపారు. వారు జేకేజేఏఏసీ నేతలతో రెండురోజులపాటు చర్చలు జరిపి ఒక ఒప్పందానికి వచ్చారు. దీని ప్రకారం పాక్ ప్రభుత్వం పీవోకేలోని ముజఫరాబాద్, పూంచ్‌లలో అదనంగా ఇంటర్మీడియట్, సెకండరీ ఎడ్యుకేషన్ బోర్డులను ఏర్పాటుచేస్తుంది.

టీఆర్ఎఫ్ కమాండర్ ఆస్తులు అటాచ్

శ్రీనగర్: ఉగ్రవాద సంస్థ ది రెసిస్టెన్స్ ఫ్రంట్(టీఆర్ఎఫ్)కమాండర్, పహల్గాం ఉగ్రదాడికి కుట్రధారిగా భావిస్తున్న సజాద్ అహ్మద్ షేక్ ఆస్తులను పోలీసులు శనివారం అటాచ్ చేశారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (ఉపా)లోని 13,38, 20 సెక్షన్ల కింది ఇతడిపై పరింపొర పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసు మేరకు ఈ చర్య తీసుకున్నామన్నారు. నిషేధిత లష్కరే తోయిబా ఏర్పాటు చేసుకున్న ముసుగు సంస్థే టీఆర్ఎఫ్. సజాద్ అహ్మద్ షేక్ అలియాస్ సజాద్ గుల్‌ను కేంద్రం 2022 ఏప్రిల్‌లో ఉగ్రవాదిగా ప్రకటించింది. ఇతడి తలపై రూ.10 లక్షల రివార్డు సైతం ఉంది. 'ఉగ్రవాదుల నెట్‌వర్క్‌ను వాటికి మద్దతిచ్చే వ్యవస్థలను నిర్వీర్యం చేసే దిశగా శ్రీనగర్ పోలీసులు ముఖ్యమైన అడుగు వేశారు. నగరంలోని హెచ్ఎంటీ ప్రాంతం రోజ్ అవెన్యూలో రూ.2 కోట్ల విలువ చేసే 3,750 చదరపు అడుగుల స్థలంలో నిర్మించిన మూడంతస్తుల నివాస గృహాన్ని స్వాధీనం చేసుకున్నారు'అని పోలీసు ప్రతినిధి తెలిపారు. ఈ ఆస్తి తండ్రి పేరుతో ఉన్నా, సజాద్ అహ్మద్ ప్రధాన భాగస్వామి అని గుర్తించామని వివరించారు. సజాద్ అహ్మద్ ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పిస్తూ, వివిధ సామాజిక మాధ్యమాల ద్వారా ప్రభుత్వానికి వ్యతిరేకంగా దేశ విద్రోహ కార్యకలాపాలకు పాల్పడుతున్నాడని తెలిపారు.

శబరిమల 'బంగారం'పై హైకోర్టుకెళ్తాం

ట్రావన్‌కోర్ దేవస్థానం బోర్డు ప్రకటన

తిరువనంతపురం: ప్రముఖ పుణ్యక్షేత్రం శబరిమలలో బంగారం దుర్వినియోగంపై కేరళలోని ప్రతిపక్ష పార్టీల నుంచి తీవ్ర విమర్శలు వస్తుండటంతో ఈ అంశంపై సంపూర్ణ దర్యాప్తునకు ఆదేశించాలని హైకోర్టుకు వెళ్లనున్నట్లు ట్రావన్‌కోర్ దేవస్థానం బోర్డు (టీడీబీ) అధ్యక్షుడు పీఎస్ ప్రశాంత్ శనివారం ప్రకటించారు. శబరిమల ఆలయానికి బంగారు తాపడం ప్రాజెక్టులో అక్రమాలు జరిగాయని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. దీనిపై ప్రశాంత్ స్పందిస్తూ.. బోర్డును రాజకీయాల్లోకి లాగటానికి ప్రతిపక్షాలు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. 1998లో ఆలయానికి బంగారు తాపడం ప్రాజెక్టుకు ప్రముఖ వ్యాపారవేత్త విజయ్ మాల్యా స్పాన్సరర్‌గా వ్యవహరించారని, అప్పటి నుంచి ఈ ప్రాజెక్టులో ఏం జరిగిందో పూర్తిగా దర్యాప్తు జరిపించాలని కోర్టును కోరనున్నట్లు వెల్లడించారు. ఆలయ ద్వారపాలక విగ్రహాలకు బంగారు తాపడం పలకలను మార్చేందుకు చెన్నైకి పంపటంలో ఎలాంటి పొరపాట్లు జరగలేదని స్పష్టంచేశారు.

ఇరాన్‌లో మరో ఆరుగురికి ఉరి

టెహ్రాన్: ఇరాన్‌లో ఉరిశిక్షల పరంపర కొనసాగుతోంది. శనివారం మరో ఆరుగురిని ఆ దేశ ప్రభుత్వం ఉరితీసింది. ఇటీవల ఇజ్రాయెల్‌తో జరిగిన సైనిక ఘర్షణల సమయంలో వారు ఇజ్రాయెల్‌కు సహకరించారని ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. వీరు ఖుజెస్తాన్ ప్రావిన్స్‌లో పోలీసు అధికారులను చంపారని, బాంబుదాడులకు పాల్పడ్డారని ప్రభుత్వం ఆరోపించింది. వీరు దేశ శత్రువులతో బాంబు దాడుల గురించి మాట్లాడుతున్న ఆడియోలను కూడా ఆ దేశ అధికార వార్తా సంస్థ విడుదల చేసింది. అరబ్ జనాభా అధికంగా ఉండే ఖుజెస్తాన్‌పై ఇరాన్ ప్రభుత్వం వివక్ష చూపుతోందని, అణచివేతకు పాల్పడుతోందని ఎంతోకాలంగా ఆ ప్రాంత వాసులు నిరసన తెలుపుతున్నారు. ఇజ్రాయెల్‌తో యుద్ధం తర్వాత ఇరాన్ ప్రభుత్వం దేశద్రోహులుగా పేర్కొంటూ పదుల సంఖ్యలో ఉరిశిక్షలు అమలు చేసింది. ఈ సంవత్సరంలోనే ఇరాన్ ప్రభుత్వం దాదాపు వెయ్యి మందిని ఉరితీసినట్లు వాషింగ్టన్ కేంద్రంగా పనిచేసే మానవహక్కుల సంస్థ అబ్దోరమన్ బోరోమండ్ సెంటర్ ఫర్ హ్యూమన్ రైట్స్ ఆరోపించింది.

ఫరూక్ అబ్దుల్లాకు అస్వస్థత

శ్రీనగర్: కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు, ఫరూక్ అబ్దుల్లా (87)ను ఆసుపత్రిలో చేర్చినట్లు పార్టీ నాయకులు శనివారం తెలిపారు. ఫరూక్ అబ్దుల్లాకు మంగళవారం పొత్తికడుపులో ఇన్ఫెక్షన్ రావడంతో.. చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. 'కొద్ది రోజులుగా అబ్దుల్లా ఆరోగ్యం బాగా లేదని, ఇప్పుడు ఆయన పరిస్థితి మెరుగుపడుతోందని వారు పేర్కొన్నారు. శనివారం సాయంత్రం లేదా ఆదివారం ఆయన డిశ్చార్జ్ అయ్యే అవకాశం ఉందని ఒక పార్టీ నేత చెప్పారు. ఫరూక్ అబ్దుల్లాకు డిసెంబర్ 2014లో కిడ్నీ మార్పిడి జరిగింది.

'జన్మతః పౌరసత్వం' రద్దుపై ట్రంప్ ఉత్తర్వును తప్పుపట్టిన మరో కోర్టు

బోస్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు వరుసగా ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ఆయన నిర్ణయాలను న్యాయస్థానాలు తప్పుపడుతున్నాయి. అమెరికా గడ్డపై పుట్టిన శిశువులకు జన్మతః పౌరసత్వం కల్పించడాన్ని రద్దు చేస్తూ కార్యనిర్వాహక ఉత్తర్వుపై ట్రంప్ సంతకం చేసిన సంగతి తెలిసిందే. అమెరికాకు చట్టవిరుద్ధంగా లేదా తాత్కాలిక నివాసం కోసం వచ్చిన దంపతులకు శిశువులు జన్మిస్తే వారికి సహజంగానే అమెరికా పౌరసత్వం లభించే విధానం అమల్లో ఉండేది. ట్రంప్ రెండోసారి అధ్యక్షుడైన కొన్నిరోజులకే ఈ విధానాన్ని రద్దుచేశారు. ట్రంప్ ఉత్తర్వును అమెరికాలో ఇప్పటికే నాలుగు వేర్వేరు ఫెడరల్ కోర్టులు తిరస్కరించాయి. శుక్రవారం మరో కోర్టు సైతం తిరస్కరించింది. బోస్టన్‌లోని 'మొదటి యూఎస్ సర్క్యూట్ కోర్టు ఆఫ్ అప్పీల్స్' ట్రంప్ నిర్ణయాన్ని ఆక్షేపించింది. అధ్యక్షుడు సంతకం చేసిన ఆ ఉత్తర్వును అమలు చేయడం సాధ్యం కాదని తేల్చిచెప్పారు. ఇదిలా ఉండగా, కింది కోర్టుల తీర్పుపై సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని ట్రంప్ ప్రభుత్వం తేల్చిచెప్పింది. జన్మతః పౌరసత్వం కల్పించడాన్ని రద్దు చేసే అధికారం చట్టప్రకారం అధ్యక్షుడిగా ఉందని పేర్కొంది. ట్రంప్ నిర్ణయాన్ని సుప్రీంకోర్టు సమర్థిస్తుందని ఆశాభావం వ్యక్తం చేసింది.

గెలుపోటములను తేల్చిన ఓట్ల కంటే తొలగించినవే ఎక్కువ

బిహార్‌లో ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్ ధ్వజం

న్యూఢిల్లీ: బిహార్‌లో ఇటీవల విడుదల చేసిన తుది ఓటరు జాబితాలోనూ పలు అవకతవకలను గుర్తించామని కాంగ్రెస్ పార్టీ పేర్కొంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కొన్ని నియోజకవర్గాల్లో గెలుపోటములను ప్రభావితం చేసిన ఓట్ల కంటే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్)తో తొలగించినవే ఎక్కువగా ఉన్నాయని వ్యాఖ్యానించింది. ఎన్నికల కమిషన్(ఈసీ)అధికార బీజేపీ చేతిలో కీలుబొమ్మగా మారిపోయిందని పేర్కొంది. బీజేపీ, ఆ పార్టీ మిత్రులకు లాభం కలిగించేందుకే ఎస్ఐఆర్‌ను చేపట్టిందని ఆరోపించారు. ఈ మేరకు శనివారం కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఎక్స్‌లో పలు పోస్టులు చేశారు. బిహార్‌లోని జముయిలో ఒకే ఇంటి నంబర్‌లో 247 మంది ఓటర్లున్నట్లు తెలిపే కథనాన్ని ఆయన షేర్ చేశారు. ఒక బూత్‌లో ఒకే ఓటరు మూడేసి సార్లు ప్రచురితమైందన్నారు. వీటన్నిటిపై ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ స్పందించాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాలను కూడా ఈసీ పట్టించుకోలేదని దీన్ని బట్టి అర్థమవుతోందన్నారు. ఈసీ బీజేపీకి బీ-టీమ్‌గా మారకూడదని, దేశ ప్రజలందరి తరఫున నిష్పాక్షికంగా వ్యవహరించాలన్నారు. ఈసీ వైఖరి దేశ ప్రజాస్వామ్య కీర్తిని చాటేలా, ప్రపంచ దేశాల్లో గౌరవం పెంచేలా ఉండాలని హితవు పలికారు.

ఏకకేంద్ర, సమాఖ్య ప్రభుత్వం

భారత సమాఖ్యకు ప్రాతిపదిక ఏది?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ పాలిటీ

భారతదేశ పరిపాలనా సౌలభ్యాన్ని దృష్టిలో పెట్టుకొని మన రాజ్యాంగ నిర్మాతలు రాజకీయ వ్యవస్థ నిర్మాణాన్ని నిర్ణయించారు. దేశ భిన్నత్వం, విభిన్న వర్గాల ప్రజల ఆలోచనలు, ప్రయోజనాలు, భౌగోళిక వైవిధ్యాలు, ఆచార, సాంప్రదాయాలు, సంస్కృతులు మొదలైన వాటిని పరిగణనలోకి తీసుకొని భారత పరిపాలనా విధానానికి రూపకల్పన చేశారు. పార్లమెంటరీ అధ్యక్ష తరహా ప్రభుత్వాల ఎంపిక విషయంలో జరిగిన చర్చల అనంతరం పార్లమెంటరీ ప్రభుత్వ విధానం వైపు మొగ్గు చూపారు. ఏక కేంద్ర, సమాఖ్య ప్రభుత్వాల విషయంలో మాత్రం మన రాజ్యాంగ నిర్మాతలు విజ్ఞతను ప్రదర్శించారు. ఎంతో దూరదృష్టితో మనదేశ పరిస్థితులకు అనుగుణంగా ఏక కేంద్ర,సమాఖ్య లక్షణాల కలయికగా పరిపాలనా వ్యవస్థను రూపొందించారు. ప్రాంతీయమైన పరిపాలనా అవసరాలు, భిన్నత్వం, పరిపాలనా సౌలభ్యం మొదలైన అంశాలను ప్రాతిపదికగా చేసుకొని సమాఖ్య లక్షణాలను పొందుపరిచారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య అధికారాలను పంపిణీ చేశారు. మన సమాఖ్యను నిర్మించేటప్పుడు అమెరికాకు బదులుగా కెనడా విధానాన్ని అనుసరించారు. దేశ విభజన కాలం నాటి స్థితిగతులు,స్వదేశీ సంస్థానాల విలీనం, భిన్నత్వంలో ఏకత్వాన్ని సాధించడం, ప్రణాళికా బద్ధమైన ఆర్థిక వ్యవస్థను అమలు చేయడం వంటి పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని కేంద్రీకృత వ్యవస్థ ఏర్పాటుకు కృషి చేశారు. మన దేశం బలమైన ఏకకేంద్ర లక్షణాలు గల బలహీనమైన సమాఖ్య ప్రభుత్వమే గాని బలమైన సమాఖ్య లక్షణాలున్న బలహీనమైన ఏక కేంద్రం కాదని కె.సి.వేర్ పేర్కొనడం గమనార్హం.

మూడు జాబితాలు

భారత రాజ్యాంగంలోని 7వ షెడ్యూల్ ప్రకారం.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య అధికారాల విభజన చేస్తూ మూడు జాబితాలను పొందుపరిచారు. కేంద్ర జాబితాలో జాతీయ, అంతర్జాతీయ ప్రాముఖ్యమున్న అంశాలను పొందుపర్చగా, ప్రాంతీయ ప్రాముఖ్యమున్న 66 అంశాలను రాష్ట్ర జాబితాలో చేర్చారు. ప్రాంతీయ ప్రాముఖ్యం ఉన్నప్పటికీ జాతీయ దృక్పథం అవసరమైన అంశాలను ఉమ్మడి జాబితాగా పేర్కొంటూ 47 అంశాలను పొందుపర్చారు. కాలక్రమంలో వచ్చిన అనేక మార్పుల దృష్ట్యా ప్రస్తుతం కేంద్ర జాబితాలో 100 అంశాలు, రాష్ట్ర జాబితాలో 61 అంశాలు, ఉమ్మడి జాబితాలో 52 అంశాలు ఉన్నాయి. 1976లో ఇందిరాగాంధీ ప్రభుత్వం 42వ రాజ్యాంగ సవరణ ద్వారా విద్య, అడవులు, తూనికలు, కొలతలు వంటి అంశాలను రాష్ట్రజాబితా నుంచి తొలగించి ఉమ్మడి జాబితాలో చేర్చడం వల్ల పైన పేర్కొన్న మార్పులు సంభవించాయి. మూడు జాబితాల్లో పేర్కొనని అంశాలను, నూతనంగా వచ్చే అంశాలను అవశిష్ట అధికారాలుగా పేర్కొంటూ వాటిపై శాసనాలను చేసే అధికారాన్ని కేంద్ర ప్రభుత్వానికి కల్పించారు. ఏదైనా ఒక అంశం అవశిష్ట అంశం అవుతుందో, కాదో నిర్ణయించే అధికారం సుప్రీంకోర్టుకు మాత్రమే ఉంటుంది.



ప్రపంచంలో సమాఖ్య విధానాన్ని అనుసరించే అన్ని దేశాల రాజ్యాంగాల్లోని సమాఖ్య లక్షణాలను మనదేశం కూడా కలిగి ఉంది. లిఖిత రాజ్యాంగాన్ని కలిగిన మనదేశంలో కేంద్ర, రాష్ట్రాల మధ్య అధికారాలను పంపిణీ చేయడం, అదేవిధంగా కేంద్ర, రాష్ట్రాల మధ్య వివాదాలు తలెత్తినప్పుడు పరిష్కరించడం కోసం స్వతంత్ర ప్రతిపత్తిగల న్యాయస్థానమైన సుప్రీంకోర్టును ఏర్పాటు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, సుప్రీంకోర్టు రాజ్యాంగ పరిధికి లోబడి వ్యవహరించాల్సి ఉంటుంది. కాబట్టి మన దేశంలో రాజ్యాంగం ఆధిక్యతను కలిగి ఉంటుందని చెప్పొచ్చు. మారుతున్న ఆర్థిక, సామాజిక, రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా రాజ్యాంగాన్ని సవరిస్తున్నారు. మన రాజ్యాంగంలోని సమాఖ్య లక్షణాలను.. అనగా 7వ షెడ్యూల్‌ను, 11వ భాగాన్ని, సుప్రీంకోర్టు అధికారాలను సవరించాలంటే భారత పార్లమెంట్ 2/3వ వంతు మెజార్టీతో పాటు దేశంలోని 1/2 వంతుకు తగ్గకుండా రాష్ట్రాలు కూడా తమ ఆమోదాన్ని తెలపాల్సి ఉంటుంది. దేశ పరిపాలనకు అవసరమైన శాసనాలను రూపొందించే పార్లమెంట్‌లోని ఎగువసభ రాజ్యసభ రాష్ట్రాలకు ప్రాతినిధ్యం వహిస్తుంది. పార్లమెంట్‌లోని ఎగువ సభ రాష్ట్రాలకు ప్రాతినిధ్యం వహించడం వల్ల కేంద్రం చేసే చట్టాలు రాష్ట్రాల ప్రయోజనాలకు భిన్నంగా ఉంటే రాజ్యసభ దాన్ని నిరోధిస్తుంది. గతంలో బీహార్‌లోని రాష్ట్రీయ జనతాదళ్(ఆర్‌జేడీ)కు చెందిన రబ్రీదేవి ప్రభుత్వాన్ని రద్దుచేసి రాష్ట్రపతి పరిపాలన విధిస్తూ రాష్ట్రపతి చేసిన ప్రకటనను పార్లమెంట్‌లోని లోక్‌సభ ఆమోదించినప్పటికీ రాజ్యసభ తిరస్కరించింది. ఈ కారణంగా బీహార్‌లో రాష్ట్రపతి పాలనను ఎత్తివేయాల్సి వచ్చింది.

అవశిష్ట అధికారాలు కేంద్రానికే

భారతదేశంలోని ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా కేంద్రంలో బలమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో ఏక కేంద్ర లక్షణాలను రాజ్యాంగంలో ప్రబలంగా పొందుపర్చడం విశేషం. కేంద్ర, రాష్ట్రాల మధ్య అధికారాల పంపిణీ జరిగినప్పటికీ, కేంద్ర జాబితాలో 97, రాష్ట్ర జాబితాలో 66, ఉమ్మడి జాబితాలో 47 అంశాలను పొందుపర్చినప్పటికీ ఉమ్మడి జాబితాలోని అంశాలపై పరోక్షంగా కేంద్రానికి ఆధిపత్యం ఉంటుంది. అవశిష్ట అధికారాలను కూడా కేంద్రానికి కేటాయించడంతోపాటు 249, 250, 356, 252 వంటి అధికరణలు రాష్ట్ర జాబితాలోని అంశాలపై కూడా కేంద్రం శాసనాలు చేయడానికి అవకాశం కల్పిస్తున్నాయి. దీనిద్వారా మన దేశంలో బలమైన కేంద్రం ఉందని పేర్కొనవచ్చు. మన దేశంలోని రాష్ట్రాల్లో అధిపతులుగా వ్యవహరించే గవర్నర్ రాష్ట్రాల పరిపాలనలో కీలకమైన పాత్రను పోషిస్తారు. అయితే గవర్నర్ల నియామకంలో, వారిని బదిలీ చేసే సందర్భంలో, వారి పదవీకాలాన్ని పొడగించడంలో, పదవి నుంచి తొలగించడంలో కేంద్ర ప్రభుత్వమే పూర్తి అధికారాలను కలిగి ఉంటుంది. గవర్నర్ల నియామకంలో, తొలగింపు విషయంలో రాష్ట్రాలకు ఎలాంటి అధికారలుండవు. రాజ్యాంగంలోని 18వ భాగంలో పొందుపర్చిన అత్యవసర పరిస్థితులు, ఆ సందర్భంలో కేంద్ర ప్రభుత్వానికి సంక్రమించే తిరుగులేని అధికారాలు మనదేశ ఏక కేంద్ర లక్షణాన్ని తెలియజేస్తున్నాయి. జాతీయ అత్యవసర పరిస్థితిని విధించిన కాలంలో కేంద్రం రాష్ట్ర జాబితాలో పేర్కొన్న అంశాలపై కూడా శాసనాలను చేయవచ్చు. 356 అధికరణను అనుసరించి రాష్ట్రాల్లో రాష్ట్రపతి పాలన విధించినప్పు డు రాష్ట్ర పరిపాలనకు సంబంధించిన అంశాలన్నింటిపై కేంద్రమే శాసనాలు చేస్తుంది. ఆర్థిక అత్యవసర పరిస్థితి విధించిన కాలంలో కేంద్రం జారీచేసే ఆర్థికపరమైన ఆదేశాలను రాష్ట్రాలు తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది. అందువల్లే భారతదేశం సాధారణ పరిస్థితుల్లో సమాఖ్యగా, అత్యవసర పరిస్థితుల్లో ఏక కేంద్రంగా పనిచేస్తుందని బి.ఆర్.అంబేద్కర్ పేర్కొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వాల బర్తరఫ్

భారత రాజ్యాంగంలోని కొన్ని అంశాలు కేంద్రం ఆధిపత్యాన్ని చాటుకోవడానికి, కేంద్రం రాష్ట్రాల వ్యవహారాల్లో జోక్యం కలుగజేసుకోవడానికి అవకాశం కల్పిస్తున్నాయి. 365 అధికరణ ప్రకారం కేంద్రం.. రాష్ట్రాలకు పరిపాలనాపరమైన ఆదేశాలను జారీ చేసినప్పుడు ఒకవేళ రాష్ట్రాలు పాటించని సందర్భంలో కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాలను బర్తరఫ్ చేయడమే కాకుండా ప్రత్యక్షంగా జోక్యం చేసుకోవచ్చు. రాష్ట్ర శాసనసభలు రూపొందించి, ఆమోదించిన బిల్లులపై గవర్నర్ తన ఆమోద ముద్ర వేయకుండా రాష్ట్రపతి పరిశీలన కోసం కేంద్రానికి పంపించవచ్చు. ఒకవేళ రాష్ట్రపతి సదరు బిల్లును తిరస్కరిస్తే దానిపై రాష్ట్రాలకు ఎలాంటి అధికారం ఉండదు.రాష్ట్రాల్లో శాంతిభద్రతలు క్షీణించినప్పుడు రాష్ట్రాలు కోరితే కేంద్రం తన సాయుధ బలగాలను పంపాల్సి ఉంటుంది. కానీ రాష్ట్రాల అభిప్రాయంతో నిమిత్తం లేకుండానే తన బలగాలను మోహరింపజేసే అధికారం కూడా కేంద్రానికి ఉంది.

పార్లమెంట్‌కు విశేష అధికారాలు

భారతదేశ పరిపాలనలో అత్యంత కీలకపాత్రను పోషించే రాజ్యాంగ, రాజ్యాంగేతర సంస్థలు కూడా బలమైన కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు తోడ్పడ్డాయని పేర్కొనవచ్చు. కేంద్ర, రాష్ట్రాల మధ్య ఆదాయ వనరులను పంపిణీ చేసేందుకు కేంద్ర ఆర్థిక సంఘాన్ని రాష్ట్రపతి ఏర్పాటు చేస్తారు. ఈ ఆర్థిక సంఘాన్ని మనదేశ ఆర్థిక సమాఖ్యను సమన్వయపరిచే చక్రంగా పేర్కొంటారు. ఫైనాన్స్ కమిషన్‌ను కేంద్రమే నియమిస్తుంది. దానిలో రాష్ట్రాలకు ఎలాంటి ప్రాతినిధ్యం ఉండదు. కేంద్ర ప్రభుత్వ ఖర్చులను, ఖాతాలను తనిఖీ చేసే కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్) రాష్ట్ర ప్రభుత్వాల ఖర్చులను, ఖాతాలను కూడా తనిఖీ చేయవచ్చు. అయితే ఈ విషయంలో కాగ్ విధులను, బాధ్యతలను నిర్ణయించే అధికారం పార్లమెంట్‌కు మాత్రమే ఉంటుంది. మనదేశ పరిపాలనలో అత్యంత కీలక పాత్రను పోషించే అఖిల భారత సర్వీసుల ఉద్యోగుల ఎంపిక విషయంలో కేంద్రంలో ఉండే యూపీఎస్సీ కీలకపాత్రను పోషిస్తోంది. భారతదేశంలో రాజ్యాంగబద్ధమైన ఎన్నికలను నిర్వహించే కేంద్ర ఎన్నికల కమిషన్ విధివిధానాలను నిర్ణయించడంలో, ప్రజాప్రాతినిధ్య చట్టాలను రూపకల్పన చేయడంలోనూ పార్లమెంట్ మాత్రమే అధికారాన్ని కలిగి ఉంటుంది.

కేంద్ర ప్రణాళికా సంఘం

భారతదేశం ప్రణాళికాబద్ధమైన ఆర్థిక వ్యవస్థను అనుసరిస్తోంది. మనదేశ సామాజిక, ఆర్థికాభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు అనే అంశం ఉమ్మడి జాబితాలో ఉంది. 1950లో కేంద్ర కేబినెట్ తీర్మానాన్ని అనుసరించి ఏర్పాటు చేసిన కేంద్ర ప్రణాళికా సంఘం భారత ప్రధానమంత్రి నేతృత్వంలో పనిచేస్తోంది. అంటే.. జాతీయ ప్రణాళికలతోపాటు రాష్ట్రాల ప్రణాళికలను నిర్మించడంలో, నియంత్రించడంలో కేంద్రమే ముఖ్యపాత్రను పోషిస్తోంది. ప్రణాళికా సంఘంలో రాష్ట్రాలకు ఎలాంటి ప్రాధాన్యత ఇవ్వలేదు. కేంద్రీకృతమైన ప్రణాళిక వ్యవస్థను అనుసరించడం వల్ల రాష్ట్రాల్లో ప్రణాళికా సంఘాలకు ఎలాంటి ప్రాధాన్యం లేదు. ప్రణాళికా సంఘం రూపొందించిన ప్రణాళికా ముసాయిదాను ఆమోదించే జాతీయాభివృద్ధి మండలికి కూడా ప్రధానమంత్రి నేతృత్వం వహిస్తారు. జాతీయాభివృద్ధి మండలిలో రాష్ట్రాలకు ప్రాతినిధ్యం కల్పించినప్పటికీ ఇది కేవలం ప్రణాళికా సంఘానికి సలహా మండలిగా మాత్రమే పనిచేస్తుంది. అంతర్రాష్ట్ర కౌన్సిల్‌కు ప్రధానమంత్రి నేతృత్వం వహిస్తారు. ఈ కౌన్సిల్ కేంద్రానికి, రాష్ట్రాలకు మధ్య అదేవిధంగా రాష్ట్రాలకు, రాష్ట్రాలకు మధ్య తలెత్తే వివాదాలను పరిష్కరించే సంస్థగా పని చేస్తోంది.

భారత్‌లో బలమైన కేంద్రం

భారతదేశం సాధారణ సమాఖ్య లక్షణాలను కలిగి ఉన్నప్పటికీ ప్రపంచంలో వాస్తవిక సమాఖ్య ప్రభుత్వానికి ఆదర్శంగా పేర్కొనే అమెరికా సమాఖ్యతో అనేక అంశాల్లో విభేదిస్తోందని పేర్కొనవచ్చు. అమెరికన్ సమాఖ్య ప్రకారం రాష్ట్రాలకు ఎక్కువ అధికారాలను కల్పించి కేంద్ర ప్రభుత్వానికి జాతీయ ప్రాముఖ్యమున్న కొన్ని అంశాలపై అధికారాలను కల్పించారు. అంటే బలమైన రాష్ట్రాలను ఏర్పాటు చేశారు.

భారతదేశంలో కేంద్రానికి ఎక్కువ అధికారాలను కల్పించడం ద్వారా బలమైన కేంద్రాన్ని ఏర్పాటు చేయడం గమనార్హం. అమెరికాలో మిగులు(అవశిష్ట) అధికారాలను రాష్ట్రాలకు కేటాయించగా భారతదేశంలో మాత్రం దానికి భిన్నంగా కేంద్రానికి కేటాయించారు. అమెరికాలో దేశం మొత్తానికి వర్తించే ఫెడరల్ రాజ్యాంగంతో పాటు ప్రతి రాష్ట్రానికి సొంత రాజ్యాంగాలను ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పించారు. దీని ద్వారా అక్కడ రెండు రాజ్యాంగాలున్నాయి. భారతదేశంలో ఒకే రాజ్యాంగం అమల్లో ఉంది. అదేవిధంగా అమెరికాలో జాతీయ పౌరత్వం, రాష్ట్ర పౌరత్వం అని రెండు పౌరత్వాలు ఉండగా మనదేశంలో ఒకే పౌరత్వం అమల్లో ఉంది. ఆ ఒక్క పౌరత్వం కూడా కేంద్ర జాబితాలో ఉండటం వల్ల పౌరత్వాలపై చట్టాలను చేసే అధికారాన్ని పార్లమెంట్ కలిగి ఉంటుంది.

అమెరికన్ శాసన శాఖయైన కాంగ్రెస్‌లోని ఎగువసభ సెనేట్ రాష్ట్రాలకు ప్రాతినిధ్యం వహిస్తుంది. అయితే సెనేట్‌లోని మొత్తం వంద మంది సభ్యులు ఆ దేశంలోని 50 రాష్ట్రాల నుంచి.. అంటే ఒక్కో రాష్ట్రం నుంచి ఇద్దరు సభ్యులు చొప్పున ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అక్కడ పెద్ద రాష్ట్రానికి, చిన్న రాష్ట్రానికి ఒకే రకమైన ప్రాతినిధ్యం కల్పించారు. కానీ భారతదేశంలో రాష్ట్రాల జనాభాను బట్టి రాజ్యసభలో సభ్యుల ప్రాతినిధ్యం వేర్వేరుగా ఉంది. అమెరికాలో వికేంద్రీకృతమైన న్యాయవ్యవస్థ ఉండగా మనదేశంలో కేంద్రీకృతమైన న్యాయ వ్యవస్థ అమల్లో ఉంది. రాష్ట్రాల రాజ్యాంగాధిపతులైన గవర్నర్లను అమెరికాలోని రాష్ట్రాల్లో ప్రజలు ప్రత్యక్షంగా ఎన్నుకుంటారు. మనం కెనడా పద్ధతిని అనుసరిస్తుండడం వల్ల మన దేశంలోని రాష్ట్రాల అధిపతులైన గవర్నర్లను రాష్ట్రపతి అనగా కేంద్రం నియమిస్తుంది. అమెరికా రాజ్యాంగం వాస్తవికమైన దృఢ రాజ్యాంగంగా వ్యవహరిస్తోంది. కానీ, మనదేశంలో రాజ్యాంగం ప్రధానంగా అదృఢమైనది. భారతదేశంలో రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ విషయంలో కేంద్ర ప్రభుత్వం తిరుగులేని అధికారాన్ని కలిగి ఉంది. అంటే ఈ విషయంలో రాష్ట్రాల ఆమోదం తప్పనిసరి కాదు.

మూర్తము నుంచి అమూర్తానికి అనేది..



సంఘీకృత ఉద్గార పద్ధతి/ సామాజిక కృత కథనా పద్ధతి-సామాజిక వాచిక పద్ధతి/ చర్చా పద్ధతి

1. బౌద్ధుల కాలంలో చర్చాపద్ధతి ఆవిర్భవించింది.
2. సంఘీకృత ఉద్గార పద్ధతిని సాంఘీ కీకృతం చేసిన చర్చ అనడం ఉత్తమం.
3. సంఘీకృత ఉద్గార పద్ధతిలో విద్యార్థులు చొరవ తీసుకొని చర్చలు, గోష్ఠులు నిర్వహించుకుంటారు.
4. యాకబ్, సింప్సన్ ప్రకారం సామాజికీకృత కథనంలో విద్యార్థులు సహజ వాతావరణంలో చర్చలు జరుపుతారు. ప్రశ్నలు వేస్తారు. పథక రచన చేస్తారు, నివేదిస్తారు. ప్రకటనలు చేస్తారు. పనిచేస్తూ ఉంటారు.
5. ఉపాధ్యాయుడు మార్గదర్శకునిలా, సహాయకునిలా, నిర్దేశకునిలా వ్యవహరిస్తాడు.

చర్చ రూపాలు

1. **సెమినార్ (సెమినార్ గోష్ఠి పథకం)**
   సెమినార్‌లో విద్యార్థులు వ్యక్తిగతం లేదా సామూహికంగా సమస్యను దర్యాప్తు చేసి నివేదిక సమర్పిస్తారు. ఆ నివేదికపై సమావేశంలో చర్చిస్తారు.
   ఉదా: 'రోడ్డు భద్రత విద్య' అనే పాఠ్యాంశంపై సెమినార్.
2. **వాగ్వాదం (Debate):** ఒక ప్రత్యేకమైన సమస్యపై పరస్పర విరుద్ధమైన అభి ప్రాయాలున్న ఇద్దరు విద్యార్థులు పాల్గొంటారు. వివాదాంశంపై అనుకూలంగా లేదా ప్రతికూలంగా అభిప్రాయాలు వ్యక్తం చేస్తారు. వాగ్వాదం జరిగేటప్పుడు సమన్వయకర్త ఉంటాడు.
   ఉదా: మతం, మానవాళి మనుగడకు అవసరమా? కాదా?
   1. భారత రాజ్యాంగం దృఢమైందా? అదృఢమైందా?
   2. జాతీయ సమైక్యతకు కులం అవరోధమా? కాదా?
   3. రాజ్యాంగం ఏకకేంద్ర లక్షణాలు కలదా? సమైఖ్య లక్షణాలు కలదా?
3. **సింపోజియం:** ఎంపిక చేసిన విషయంలోని వివిధ అంశాలపై సభ్యులు అభి ప్రాయాలు వ్యక్తం చేస్తారు. స్ట్రక్ ప్రకారం సింపోజియం వ్యాఖ్యానాల సముదా యం. ఇది మౌఖికంగా గానీ, లిఖితంగా గానీ ఉండవచ్చు. సింపోజియంలో చర్చా కార్యక్రమాన్ని తరగతి ఎదుట నిర్వహి స్తారు. సింపోజియంలో నలుగురు లేదా ఐదు మంది ఉంటే మంచిది.
   ఉదా: జాతీయ సమైక్యతకు అవరోధాలు.
4. **జట్టు చర్చ (Panel Discussion)**
   4 నుంచి 8 మంది విద్యార్థులున్న గ్రూపు ను ప్యానల్ అంటారు. దీనికి ఒక అధ్యక్షుడు ఉంటాడు. సభ్యులు ఇతని ఆధ్వర్యంలో చర్చిస్తారు.
   ★ సభ్యులు అర్ధచంద్రకారంలో ప్లాట్‌ఫాం పై కూర్చుంటారు.
   ★ అధ్యక్షుడు అడిగే ప్రశ్నలకు సభ్యులు జవాబులిస్తారు.
5. **రౌండ్ టేబుల్ సమావేశం:**
   1. ఇది తరగతిలో విద్యార్థులు నిర్వహించే బహిరంగ చర్చ. విద్యార్థులను నాలుగు లేదా ఐదు వర్గాలుగా విభజిస్తారు.
   2. వీరు ఒక అంశాన్ని చర్చిస్తారు.
   3. చిన్న సమూహంలో చర్చ ప్రభావ వంతమైన ఫలితాన్ని ఇస్తుంది.
   4. విద్యార్థులందరూ చర్చలో పాల్గొంటారు. కాబట్టి మంచి ఫలితాలు పొందవచ్చు.
   5. చర్చలు పూర్తయిన తర్వాత ప్రతి గ్రూపు తరగతిలో సారాంశాన్ని నివేదించాలి.
   6. రౌండ్ టేబుల్ సమావేశాన్ని గ్రూపు చర్చ అని కూడా అంటారు.

   ఉదా: ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం అమలు.
6. **కార్య శిబిరం (Workshops)**
   కార్యశిబిరంలో పాల్గొనే వ్యక్తులు పత్రాలను పాటించడం, చర్చలను నిర్వర్తిం చడం వంటి కార్యకలాపాలను ఆచరణ రూపంలో చేస్తారు.
   ఉదా: విద్యార్థుల్లో పటాలు గీసే నైపుణ్యాలు పెంపొందించే వర్క్‌షాప్.
7. **బ్రెయిన్ స్టోర్మింగ్ :**
   - ఆలెక్స్ అస్‌బర్న్ రూపొందించారు.
   - మెదడులో ఆలోచనలు రేకెత్తించడం దీని ముఖ్య ఉద్దేశం.
   - ఉపాధ్యాయుడు ఒక సమస్యను విద్యా ర్థులకు ఇచ్చి వారి నుంచి సమాధానా లు కోరతాడు. ఆ సమాధానాలు సరైనవా కావా? అనేవి ముఖ్యం కాదు. విద్యార్థుల్లో విభిన్న ఆలోచనలు రేకెత్తించి సృజనాత్మకత పెంపొందించడం బ్రెయిన్ స్టోర్మింగ్ ముఖ్య ఉద్దేశం.

ప్రయోజనాలు:

1. విద్యార్థి సాంఘీకీకరణానికి వీలు కలుగుతుంది.
2. నాయకత్వ లక్షణాలు పెంపొందిం చవచ్చు.
3. వాక్‌పటిమను అభివృద్ధి చేయవచ్చు.
4. ఇతరుల అభిప్రాయాలను గౌరవించడం నేర్చవచ్చు.
5. ప్రజాస్వామ్య విలువలు పెంచవచ్చు.
6. ఉపాధ్యాయుడికి, విద్యార్థులకు మధ్య సత్సంబంధాలు నెలకొల్పవచ్చు.

పరిమితులు:

1. నిరర్థకమైన చర్చగా పరిణమించవచ్చు.
2. కాలయాపనతో కూడుకున్నది
3. ధైర్యం, చొరవ ఉన్న కొద్ది మంది విద్యార్థులు మిగతావారిపై ఆధిపత్యం చూపవచ్చు.
4. విద్యార్థులు వాదన పటిమ కోసం, ప్రజ్ఞను చూపించడం కోసం వాదించవచ్చు.

మాదిరి ప్రశ్నలు

1. విద్యార్థులు తోటివారి అభిప్రాయాలను గౌరవించడం ఏ పద్ధతిలో నేర్చు కుంటారు?
   1) ప్రశ్నోత్తర 2) ప్రకల్పన
   3) ఉపన్యాస 4) చర్చా
2. సాంఘిక శాస్త్రానికి ఒక చక్కని విద్యా ప్రణాళికా ప్రయోగశాల?
   1) పాఠశాల ప్రయోగశాల
   2) సాంఘికశాస్త్ర మ్యూజియం
   3) సాంఘికశాస్త్ర తరగతి గది
   4) చుట్టూ ఉండే సమాజం
3. సింపోజియంలో ఎంతమంది విద్యార్థులు పాల్గొంటే బాగుంటుంది?
   1) 10-15 2) 20-30
   3) 15-18 4) 4-5
4. విద్యార్థుల్లో స్వీయ అభిప్రాయాల వ్యక్తీకరణకు అవకాశం కల్పించే పద్ధతి?
   1) పర్యవేక్షితాధ్యయనం
   2) సామాజీకీకృత కథనం
   3) మూలాధార పద్ధతి
   4) ఉపన్యాస ప్రదర్శన పద్ధతి
5. జిల్లా ఉపవిద్యాధికారి జనవరిలో పూర్తి చేయాల్సిన సిలబస్ డిసెంబర్‌లోనే పూర్తి చేయాలని ఆదేశించాడు. అప్పుడు హై స్కూల్ ఉపాధ్యాయుడిగా మీరు?
   1) ముఖ్యమైన అంశాలు బోధిస్తారు
   2) ఉపన్యాస పద్ధతిలో బోధిస్తారు
   3) చర్చా పద్ధతిలో కష్టమైన పాఠాలు బోధిస్తారు
   4) సమస్యాపరిష్కార పద్ధతి అవలంబిస్తారు
6. పర్యవేక్షితాధ్యయనంలో మోటిల్ ఇ. సింప్సన్ ఒక పాఠానికి 90 నిమిషాల కాలవ్యవధిని కేటాయించి దాన్ని కింది ఏ కార్యకలాపాలుగా వర్గీకరించారు?
   1) సమీక్ష-25ని., నియోజన 25ని.,అభ్యాసాలు 15ని., నియోజిత అధ్యయనం 20 ని.
   2) సమీక్ష-25 ని., నియోజన-25 ని.,అభ్యాసాలు 5ని.,నియోజితాధ్య యనం-35 ని.
   3) సమీక్ష-30ని., నియోజన 20ని.,అభ్యాసాలు,10ని., నియోజితాధ్య యనం-20 ని.
   4) సమీక్ష-25ని.,నియోజన-35ని.,అభ్యాసాలు-15ని.,నియోజితాధ్య యనం-20 ని
7. ఏ బోధనా పద్ధతిలో మోదరేట్ ఆవశ్యకత ఉంటుంది?
   1) సమస్యాపద్ధతి 2) మూలాధార పద్ధతి
   3) సామాజీకీకృత కథనం
   4) సమస్యా పద్ధతి
8. 9వ తరగతిలోని భూపట చలనాలు అనే అంశం బోధించడానికి అనువైన పద్ధతి?
   1) మూలాధార పద్ధతి
   2) ఉపన్యాస ప్రదర్శనా పద్ధతి
   3) సామాజీకీకృత కథనం
   4) సమస్యాపద్ధతి
9. సింపోజియం గోష్ఠిలో?
   1) అనేకమంది విద్యార్థులు ఒక సమస్య గురించి నివేదిస్తారు
   2) ఎంపికచేసిన విషయంలో వివిధ అంశాలపై పాల్గొనే సభ్యులు అభిప్రా యాలు వ్యక్తం చేస్తారు
   3) తరగతిని 4 లేదా 5 చర్చా వర్గాల కింద విభజిస్తారు
   4) చైర్మన్ ప్రశ్నలకు 4 నుంచి 8 మంది అభిప్రాయాలు వ్యక్తం చేస్తారు
10. జట్టు బోధనలో రెండు అంతకంటే ఎక్కువ విషయాలు ఒకే వర్గంలోని విద్యార్థులకు సంయుక్తంగా చేపట్టడం?
    1) సంచయన క్రమానుగతం
    2) సమవర్తిత విషయాలు
    3) ఏక కేంద్ర నమూనా
    4) విషయ స్వభావంపై ఆధారపడిన ఉపగమం
11. కంప్యూటర్ యుగంలో సాంఘికశాస్త్ర అధ్యయనాలు అవసరమా? కాదా? అనే అంశాన్ని చేపట్టడానికి సామాజీకీకృత కథనంలోని ఏ రూపం అనువైంది?
    1) సెమినార్ గోష్ఠి పథకం
    2) వాగ్వాదం 3) సింపోజియం
    4) కార్యశిబిరం
12. 'జలియన్‌వాలాబాగ్ దురంతం'అనే అం శాన్ని బోధించడానికి అత్యుత్తమ మూలాధారం?
    1) ఆనాటి వార్తాపత్రికలు
    2) చిరస్మారకాలు
    3) ఉద్యమ నాయకుల రచనలు
    4) జలియన్ వాలాబాగ్‌కు సంబంధించిన నమూనా
13. ఆదాయం, వ్యయాన్ని సూచించే 'సంతులిత బడ్జెట్' అనే అంశాన్ని బోధించడానికి అనువైన బోధనోపకరణం?
    1) కమ్మీగ్రాఫ్ 2) టేబుల్ చార్ట్
    3) ఫ్లోచార్ట్ 4) లైన్ గ్రాఫ్
14. బోధనలో క్రమమైన, తార్కికమైన, ఫలప్రదమైన ఏర్పాటును సూచించేది?
    1) ఉపగమం 2) నైపుణ్యం
    3) వ్యూహం 4) బోధనాంశం

సమాధానాలు

1) 4	2) 4	3) 4	4) 2	5) 2
6) 2	7) 3	8) 2	9) 2	10) 2
11) 2	12) 2	13) 2	14) 3	

గతంలో అడిగిన ప్రశ్నలు

1. విద్యార్థి వాస్తవ జీవిత సమస్యలను ఎదుర్కోవడానికి తగిన సామర్థ్యాన్ని పెంపొందించే జీవితాన్ని సరిదిద్దుకోగల జ్ఞానాన్ని ఇవ్వడం ఏ యూనిట్ ముఖ్యోద్దేశం?
   1) వనరుల యూనిట్
   2) బోధనా యూనిట్
   3) అనుభవ ప్రాముఖ్య యూనిట్
   4) నిర్మాణాత్మక యూనిట్
2. 'సింపోజియం వ్యాఖ్యానాల సముదాయంగా ఉంటుంది. ఇది మౌఖికంగా గానీ, లిఖితంగా గానీ ఉండవచ్చు. విభిన్న భావాలను, దృక్పథాలను అందిస్తుంది' అని పేర్కొన్నవారు?
   1) రెమాంట్ 2) వెస్లీ
   3) స్ట్రక్ 4) రాన్‌స్కీ
3. జట్టు బోధన భావన ఏ దేశంలో ఆవిర్భ వించింది?
   1) రష్యా 2) అమెరికా
   3) ఇంగ్లండ్ 4) ఇండియా
4. మూర్తము నుంచి అమూర్తానికి అనేది ఒక?
   1) బోధనా క్షేత్రం 2) బోధనా ప్రవర్తన
   3) బోధనోపకరణం 4) బోధనా సూత్రం
5. కిందివాటిలో సామాజిక సర్వేకు సరిపోయే అంశం?
   1) గ్రామస్థుల్లోని మూఢనమ్మకాలను తెలుసుకోవడం
   2) పాఠశాల స్థితిగతులను తెలుసుకోవడం
   3) బహుళార్థ సాధక ప్రాజెక్టుల ప్రయోజనాలను తెలుసుకోవడం
   4) విద్యార్థులు సాధించిన ప్రగతిని తెలుసుకోవడం
6. 9వ తరగతి విద్యార్థులకు కుటుంబ బడ్జెట్ అనే పాఠాన్ని అవగాహన చేయించడానికి అనువైన పద్ధతి?
   1) ప్రాజెక్టు 2) ఉపన్యాస
   3) ప్రదర్శన 4) బృంద

సమాధానాలు

1) 4; 2) 3; 3) 2; 4) 4; 5) 1; 6) 1.

నేత్రానుగుణ్యత అంటే ఏమిటి?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఫిజిక్స్

కాంతి

పుటాకార దర్పణం

పుటాకార దర్పణానికి ఎదురుగా ఒక చిన్న వస్తువును ఉంచినప్పుడు దాని ప్రతిబింబం పెద్దగా ఆవర్తనం చెంది తలకిందులుగా ఏర్పడుతుంది.

1. చెవి, ముక్కు, గొంతు పరిశీలించడానికి వైద్యులు ఈ దర్పణాన్ని ఉపయోగిస్తారు. కాబట్టి దీన్ని డాక్టర్స్ మిర్రర్ అని కూడా అంటారు.
2. సౌరశక్తిని ఒక బిందువు వద్ద కేంద్రీకరించే సోలార్ కనెక్టర్లలో ఈ దర్పణాన్ని ఉపయోగిస్తారు. అందువల్ల దీన్ని బర్నింగ్ మిర్రర్ అంటారు. సోలార్ కనెక్టర్లలో పుటాకార దర్పణాలు, కుంభాకార దర్పణాలను ఉపయోగించవచ్చు.
3. దీన్ని సేవింగ్ మిర్రర్‌గా ఉపయోగిస్తారు.
4. టార్చ్‌లైట్, వాహనాల హెడ్‌లైట్‌లలో ఈ దర్పణాన్ని ఉపయోగిస్తారు. ఈ దర్పణాల ప్రధాన నాభి వద్ద విద్యుత్ బల్బును అమర్చుతారు.

కుంభాకార దర్పణం

కుంభాకార దర్పణంలో పెద్ద వస్తువు ప్రతిబింబం చిన్నగా, నిటారుగా ఏర్పడుతుంది.

1. కుంభాకార దర్పణాన్ని వాహనాల్లో డ్రైవర్ పక్కన అద్దాలుగా ఉపయోగిస్తారు.
2. ఆగ్రాకోట వద్ద ఏర్పాటు చేసిన కుంభాకార దర్పణంలో తాజ్‌మహల్ పూర్తి ప్రతిబింబం కనిపిస్తుంది.

➤ **దూరదర్శిని:** కంటి నుంచి దూరంగా ఉన్న వస్తువులను దగ్గరగా స్పష్టంగా చూడటానికి దూరదర్శినులను ఉపయోగిస్తారు.

➤ దూరదర్శినిని 1608 జనవరి 10న గెలీలియో అనే శాస్త్రవేత్త కనుగొన్నాడు.

➤ **దూరదర్శిని రకాలు:** ఉపయోగించే విధానాన్ని బట్టి దూరదర్శినిని రెండు రకాలుగా వర్గీకరించవచ్చు.

1. **ఖగోళ దూరదర్శిని:** భూమికి ఆవల ఉన్న ఖగోళ వస్తువులను అంటే సూర్యుడు, నక్షత్రాలు, గ్రహాలు మొదలైన వాటిని పరిశీలించడానికి ఈ దూరదర్శినిని ఉపయోగిస్తారు. దీనిలో తుది ప్రతిబింబం తలకిందులుగా ఏర్పడుతుంది. అయితే ఖగోళ వస్తువులన్నీ గోళాకారంలో ఉండటం వల్ల ఖగోళ వస్తువులను ఈ దూరదర్శిని ద్వారా పరిశీలించడంలో ఎలాంటి సమస్య ఉండదు.

➤ **భూ ఖగోళ దూరదర్శిని:** భూమి, సముద్రాల పై దూరంగా ఉన్న వస్తువులను దగ్గరగా, స్పష్టంగా చూడటానికి ఖగోళ దూరదర్శిని ని ఉపయోగిస్తారు. దీనిలో తుది ప్రతిబింబం నిటారుగా ఏర్పడుతుంది.

నిర్మాణం దృష్ట్యా దూరదర్శినులను తిరిగి రెండు రకాలుగా వర్గీకరించవచ్చు.

1. **వక్రీభవన దూరదర్శిని:** ఇలాంటి దూరదర్శినిని కటకాలను ఉపయోగించి నిర్మిస్తారు. ఈ రకానికి చెందిన దూరదర్శినిని గెలీలియో కనుగొన్నాడు.
2. **పరావర్తన దూరదర్శిని:** వీటిని దర్పణాలను ఉపయోగించి నిర్మిస్తారు. ఈ రకానికి చెందిన దూరదర్శినిని జేమ్స్ గ్రెగొరి అనే శాస్త్రవేత్త కనుగొన్నాడు.

1. హబుల్ స్పేస్ టెలిస్కోప్‌ను 1990 ఏప్రిల్ లో నాసా శాస్త్రవేత్తలు అంతరిక్షంలోకి ప్రవేశపెట్టారు. దీని ద్వారా విశ్వ రహస్యాలను అధ్యయనం చేస్తున్నారు.
2. X-కిరణాలతో పనిచేసే మొదటి టెలిస్కోప్ (చంద్ర X-Ray)ను నాసా శాస్త్రవేత్తలు రూపొందించారు. దీన్ని 1999లో అంతరిక్షంలోకి ప్రయోగించారు.
3. రేడియో తరంగాలను ఉపయోగించి పనిచేసే ప్రపంచంలో అతిపెద్దదైన రేడియో టెలిస్కోప్‌ను మహారాష్ట్రలోని పుణే సమీపంలో ఏర్పాటు చేశారు. దీని పేరు India Giant రేడియో ఆస్ట్రోనామికల్ టెలిస్కోప్.
4. 2009 మార్చి 6న కెప్లర్ టెలిస్కోప్‌ను నాసా శాస్త్రవేత్తలు అంతరిక్షంలోకి ప్రయోగించారు. ఈ టెలిస్కోప్‌ను ఉపయోగించి జీవరాశిని కలిగి ఉన్న గ్రహాల ఉనికిని తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.
5. ప్రపంచంలో అతిపెద్దదైన సోలార్ టెలిస్కోప్‌ను భారతదేశం రూపొందిస్తోంది. దీన్ని జమ్మూకాశ్మీర్‌లోని లఢక్ ప్రాంతం లో ఏర్పాటు చేస్తున్నారు.

మైక్రోస్కోప్‌లు

➤ **సూక్ష్మదర్శినులు:** కంటికి దగ్గరగా ఉన్న చిన్న వస్తువులను పెద్దగా, స్పష్టంగా చూడ డానికి సూక్ష్మదర్శినులను ఉపయోగిస్తారు. వీటిని రెండు రకాలుగా వర్గీకరించవచ్చు.

➤ **సరళ సూక్ష్మదర్శిని:** దీన్ని తక్కువ నాభ్యాంతరం ఉన్న ఒకే ఒక కుంభాకార కటకాలను ఉపయోగించి నిర్మిస్తారు. ఈ కటకాలకు ఒకవైపున చిన్న వస్తువును ఉంచి రెండో వైపు నుంచి చూస్తే దాని ప్రతిబింబం ఆవర్తనం చెంది నిటారుగా కనిపిస్తుంది. కాబట్టి సరళ సూక్ష్మదర్శినిలో చిన్న వస్తువు ప్రతిబింబం చాలా పెద్దదిగా కనిపిస్తుంది.

ఉపయోగాలు

1. చిన్న అక్షరాలను స్పష్టంగా చదవడానికి
2. వేలిముద్రలను, హస్తరేఖలను పరిశీ లించడానికి
3. గడియారంలోని చిన్న భాగాలను స్పష్టంగా చూడటానికి
4. వాచ్ మెకానిక్‌లు ఈ సరళ సూక్ష్మదర్శినిని ఉపయోగిస్తారు.

➤ **సంయుక్త సూక్ష్మదర్శిని:** దీనిలో రెండు కుంభాకార కటకాలు ఉంటాయి. ఇందులో వస్తువుకు దగ్గరగా ఉన్న కటకాలను వస్తు కటకం, కంటికి దగ్గరగా ఉన్న కటకాన్ని అక్షి కటకం అంటారు. ఈ రెండు కటకాల మధ్య దూరాన్ని సంయుక్త సూక్ష్మదర్శిని పొడవు అని అంటారు. ఈ సూక్ష్మదర్శినిలో చిన్న వస్తువు ప్రతిబింబం మొదట వస్తు కటకం వల్ల, ఆ తర్వాత అక్షి కటకం వల్ల రెండుసార్లు ఆవర్తనం చెంది తుది ప్రతిబింబం



తలకిందులుగా ఏర్పడుతుంది. సంయుక్త సూక్ష్మదర్శిని ఆవర్తన సామర్థ్యం సరళ సూక్ష్మదర్శినితో పోల్చినప్పుడు 1000 నుంచి 2000 రెట్లు ఎక్కువగా ఉంటుంది. బ్యాక్టీరియా, ఫంగస్, వృక్ష కణాలు, జంతు కణాలు, జీవ కణాలు, రక్త కణాలు, పుప్పొడి రేణువులు మొదలైన వాటిని పరిశీలించడానికి దీన్ని ఉపయోగిస్తారు.

1. ఎలక్ట్రానిక్స్ సూత్రం ఆధారంగా పనిచేసే ఎలక్ట్రానిక్స్ మైక్రోస్కోప్ ఆవర్తన సామ ర్థ్యం సంయుక్త సూక్ష్మదర్శిని కంటే 265 రెట్లు ఎక్కువగా ఉంటుంది. కాబట్టి వైరస్‌ను పరిశీలించడానికి దీన్ని ఉపయోగిస్తారు.
2. 2011 సెప్టెంబరులో బ్రిటన్ శాస్త్రవేత్తలు ఆప్టికల్ మైక్రోస్కోప్‌ను కనుగొన్నారు. దీని ఆవర్తన సామర్థ్యం ఎలక్ట్రానిక్ మైక్రోస్కోప్‌తో పోల్చినప్పుడు 250 రెట్లు ఎక్కువగా ఉంటుంది. కాబట్టి ప్రాథమిక కణాల గురించి అధ్యయనం చేయడానికి దీన్ని ఉపయోగిస్తున్నారు.

➤ **స్టీరియోస్కోప్:** హోలోగ్రఫీ విధానంలో చిత్రీకరించిన త్రిడైమెన్షనల్ ఫొటోలను చూడటానికి ఈ సాధనాన్ని ఉపయోగిస్తారు.

➤ **స్ట్రోబ్‌స్కోప్:** గమనంలో ఉన్న వస్తువు, తన చుట్టూ తాను తిరుగుతున్న వస్తువును నిశ్చల స్థితిలో ఉన్నట్లుగా చూడటానికి ఈ సాధనాన్ని ఉపయోగిస్తారు.

➤ **పెరిస్కోప్:** Z ఆకారం ఉన్న ఒక గొట్టం రెండు మూలల వద్ద M_1, M_2 అనే రెండు సమతల దర్పణాలను ఒక్కొక్క దాన్ని 45° కోణంతో అమర్చుతారు. యుద్ధం జరిగే సమయంలో బంకరు (గొయ్యి)లో ఉన్న సైనికులు, జలాంతర్గామిలో ఉన్న నావికులు, శత్రువుల కదలికలను పరిశీ లించడానికి దీన్ని ఉపయోగిస్తారు.

➤ **కెలిడియోస్కోప్:** దీన్ని మూడు సమతల దర్పణాలను ఉపయోగించి నిర్మిస్తారు. ఈ దర్పణాలను సమబాహు త్రిభుజం ఆసన్న భుజాల్లా అమర్చి నిర్మిస్తారు. ఈ దర్పణాల మధ్య ఒక వస్తువును ఉంచినప్పుడు అనేక ప్రతిబింబాలు కనిపిస్తాయి.

➤ **Sextant:** త్రికోణమితిలోని Secθ సూత్రం ఆధారంగా ఈ సాధనం పనిచేస్తుంది. దీన్ని ఉపయోగించి పర్వతాలు, భవనాలు, కట్టడాల ఎత్తును తెలుసుకోవచ్చు.

➤ **అల్టీమీటర్:** ఈ సాధనాన్ని గగనతలంలో ఎగురుతున్న విమానాలు, రాకెట్‌లు, క్షిపణులు మొదలైన వాటిలో అమర్చి భూఉపరితలం నుంచి ఆ వస్తువుల ఎత్తును కొలవవచ్చు.

➤ **సినిమా ప్రొజెక్టర్:** దీన్ని థామస్ అల్వా ఎడిసన్ కనుగొన్నాడు. సినిమా ప్రొజెక్టర్‌కు ముందు భాగంలో కుంభాకార కటకాలను అమర్చుతారు. ఈ ప్రొజెక్టర్ ద్వారా ఒక సెకన్ కాలంలో 16 ఫిల్మ్‌లు కదలి వెళ్లినట్లయితే తెరపైన ఏర్పడిన బొమ్మ సజీవ చిత్రంలా కనిపిస్తుంది.

➤ టెలివిజన్‌ను జె.ఎల్. బయర్డ్ అనే శాస్త్రవేత్త కనుగొన్నాడు. టెలివిజన్‌లో కెనియోస్కోప్ అనే పరికరం విద్యుదయస్కాంత తరంగాలను $\frac{1}{25}$ వ సెకను కాలంలో పిక్చర్‌గా మార్చుతుంది.

➤ ఆధునిక కాలంలో ఉపయోగిస్తున్న ఎల్‌సీడీ, ఎల్ఈడీలను క్యాలెండర్ టెలివిజన్‌లు అని పిలుస్తారు. వీటిలో పిక్చర్ స్పష్టత ఎక్కువగా ఉంటుంది.

➤ **కెమెరా:** కెమెరాను జోసెఫ్ నయోఫ్సీనైస్ అనే శాస్త్రవేత్త కనుగొన్నాడు. మానవుని కంటి భాగాలను ఆధారంగా చేసుకొని కెమెరాను ఆవిష్కరించారు. కెమెరా వివిధ భాగాలతో కంటిలోని భాగాలను పోల్చవచ్చు.

1. మానవ కనుగుడ్డు కెమెరాలోని కుంభాకార కటకంలా పనిచేస్తుంది. ఈ కనుగుడ్డు ఉబ్బెత్తుగా ఉండి కుంభాకార కటకంలా పనిచేస్తుంది. కాబట్టి కనుగుడ్డు వస్తువు దూరాన్ని ఆధారంగా చేసుకొని తనంతట తానుగా తన నాభ్యాంతరాన్ని మార్చుకుంటూ ఆ వస్తువును స్పష్టంగా చూడగలుగుతుంది. ఈ ధర్మాన్ని నేత్రానుగుణ్యత అంటారు.
2. కనురెప్ప కెమెరాలోని మూతలా పనిచేసి, కనుగుడ్డుకు రక్షణ కల్పిస్తుంది.
3. రెటీనా కెమెరాలోని ఫిల్మ్‌లా పనిచేస్తుంది. కాబట్టి వస్తువు ప్రతిబింబం దీనిపైన ఏర్పడుతుంది.

నిశ్చల స్థితిలో ఉన్న ఒక వస్తువును ఫొటో తీయడాన్ని స్టిల్ ఫొటోగ్రఫీ అంటారు. కదులుతున్న వస్తువును ఫొటో తీయడాన్ని Kinetography అంటారు.

దృష్టి రకాలు

1. **మోనాక్యులర్ దృష్టి:** ఒకే కన్నుతో వస్తువులను చూడగలగడాన్ని మోనాక్యులర్ దృష్టి అంటారు.
   ఉదా: కాకి దృష్టి
2. **బైనాక్యులర్ దృష్టి:** రెండు కళ్లతో వస్తువులను చూడగలిగే దృష్టి జ్ఞానాన్ని బైనాక్యులర్ దృష్టి అంటారు.
   ఉదా: మానవుడి దృష్టి
3. **నిషాచర దృష్టి:** రాత్రి సమయంలో లేదా చీకటిలో వస్తువులను చూడగలిగే దృష్టి జ్ఞానాన్ని నిషాచర దృష్టి అంటారు.
   ఉదా: పిల్లిదృష్టి

దృష్టిలోపాలు

1. **హ్రస్వదృష్టి (దగ్గర దృష్టి):** కంటికి దగ్గరగా ఉన్న వస్తువును మాత్రమే చూడగలిగి దూరంగా ఉన్న వస్తువును చూడలేని దృష్టిలోపాన్ని హ్రస్వ దృష్టి అంటారు. ఈ దృష్టి లోపాన్ని నివారించడానికి తగిన నాభ్యాంతరం ఉన్న వికేంద్రీకరణ కటకాన్ని ఉపయోగించాలి.
2. **దూరదృష్టి (దీర్ఘ దృష్టి):** కంటి నుంచి దూరంగా ఉన్న వస్తువును మాత్రమే చూడగలిగి దగ్గరగా ఉన్న వస్తువును చూడలేని దృష్టిలోపాన్ని దూరదృష్టి లేదా దీర్ఘ దృష్టి అంటారు. ఈ దృష్టి లోపాన్ని తగిన నాభ్యాంతరం ఉన్న కేంద్రీకరణ కటకాన్ని ఉపయోగించి నివారించవచ్చు.

➤ **అసమదృష్టి:** కంటిలోని కార్నియా అనే భాగం దెబ్బతినడం వల్ల ఈ దృష్టి లోపం ఏర్పడుతుంది. ఈ లోపం ఉన్న వ్యక్తులు ఏ వస్తువును పరిశీలించినా అడ్డు, నిలువు రేఖలుగా కనిపిస్తుంది. ఈ లోపాన్ని సవరించడానికి తగిన నాభ్యాంతరం ఉన్న స్థూపాకార కటకాన్ని ఉపయోగించాలి.

➤ **చత్వారం:** కొంత మందిలో వయసు పెరిగిన కొద్దీ కళ్లు నేత్రానుగుణ్యతను కోల్పోతాయి. అంటే తమంతట తాము తమ నాభ్యాంతరాన్ని మార్చుకోలేక దగ్గరగా, దూరంగా ఉన్న వస్తువులను చూడటం వీలుకాదు. ఇలాంటి దృష్టి లోపాన్ని చత్వారం అంటారు. ఈ లోపాన్ని సవరించడానికి ద్వినాభికటకాన్ని ఉపయోగించాలి.

➤ **రేచీకటి:** విటమిన్-ఎ లోపం వల్ల ఈ దృష్టి లోపం ఏర్పడుతుంది. ఈ లోపం ఉన్న వ్యక్తులకు పగటి సమయంలో అంటే సూర్య కిరణాల సమక్షంలో మాత్రమే దృష్టి జ్ఞానం ఉంటుంది. కానీ రాత్రి సమయంలో లేదా చీకటిలో కృత్రిమ కాంతి జనకాల వల్ల వచ్చే కాంతి తీవ్రత వల్ల దృష్టి జ్ఞానం కలుగదు. ఇలాంటి దృష్టి లోపాన్ని రేచీకటి అంటారు. ఈ లోపాన్ని సవరించుకోవడానికి విటమిన్-ఎ ఎక్కువగా ఉన్న ఆహార పదార్థాలను తీసు కోవాలి.

➤ **వర్ణాంధత్వం:** కంటిలో కోన్స్ లోపం వల్ల ఈ దృష్టి లోపం ఏర్పడుతుంది. ఈ లోపం ఉన్న వ్యక్తులు అన్ని రంగులను గుర్తిం చలేరు. కాబట్టి ఈ దృష్టి లోపాన్ని వర్ణాంధత్వం అంటారు. ఇది జన్యువుల ద్వారా తల్లిదండ్రుల నుంచి సంతానానికి సంక్రమిస్తుంది. అందువల్ల దీనికి చికిత్సా విధానం అందుబాటులో లేదు.

అదృశ్య వికిరణాలు

పరారుణ కిరణాలు: పరారుణ కిరణాలను హెర్షెల్ అనే శాస్త్రవేత్త కనుగొన్నాడు. ఈ కిరణాల తరంగదైర్ఘ్య అవధి 7500 A° నుంచి సుమారు 4 మిలియన్‌ల A° వరకు ఉంటుంది. ఈ కిరణాలను అన్ని రకాలైన గాజు పదార్థాలు శోషించుకుంటాయి. కాబట్టి గాజుతో నిర్మించిన సాధనాలను ఉపయోగించి పరారుణ కిరణాల ఉనికిని గుర్తించేందుకు వీలుకాదు.

రాతి ఉప్పు/ సైంధవ లవణం: రాతి ఉప్పు తో చేసిన పట్టకం, కటకాల ద్వారా ఈ తరంగాలు చొచ్చుకువెళతాయి. ఇలాంటి పట్టకం, కటకాలను ఉపయోగించి పరారుణ కిరణాల ఉనికిని తెలుసుకోవచ్చు.

➤ పరారుణ కిరణాలు వాటి వెంట ఉష్ణాన్ని మొసుకొనిపోతాయి. ఈ కిరణాలు ఏవైనా వస్తువులను తాకినప్పుడు ఆ వస్తువుల ఉష్ణోగ్రత పెరుగుతుంది. కాబట్టి పరారుణ కిరణాలను ఉష్ణ వికిరణాలు అని కూడా అంటారు. ఈ సూత్రం ఆధారంగా పనిచేసే థర్మోపైల్, బోలోమీటర్ అనే సాధనాలను ఉపయోగించి పరారుణ కిరణాల ఉనికిని తెలుసుకోవచ్చు.


ఉపయోగాలు

1. టీవీ, రేడియో కార్యక్రమాల ప్రసారానికి
2. టీవీ రిమోట్ కార్డ్‌లో
3. రహస్య సంకేతాలను ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి ప్రసారం చేసేందుకు
4. పొగమంచు, దుమ్ము, ధూళి కణాల ద్వారా కొంతదూరంలో ఉన్న వస్తువులను చూసేందుకు, స్పష్టంగా ఫొటో తీసేందుకు
5. గోడలపై ఉన్న పాత చిత్రలేఖనాలను తొలగించేందుకు
6. కండరాల నొప్పిని, బెణుకుల నొప్పిని తగ్గించేందుకు
7. పక్షవాతాన్ని నయం చేసేందుకు
8. భూమి చుట్టూ పరిభ్రమిస్తున్న కృత్రిమ ఉపగ్రహాలను నియంత్రించేందుకు
9. తక్కువ దూరం ప్రయాణించేందుకు, రాకెట్లు, క్షిపణుల కోసం ఈ కిరణాలను మార్గనిర్దేశిక కిరణాలుగా ఉపయోగిస్తారు.

How far is the starting point..

DIRECTIONS

Main Directions:
East
West
North
South



Sub-Directions (or) Cardinal Directions:
North-East
South-East
South-West
North-West

From the above diagram, we can also observe that:


a) Angle between North and East is 90°
b) Angle between North-East and East is 45°
c) Angle between North and South-East is 135°

Rotation of Angles: To solve angle movement questions, it is necessary to know about the rotations of angles.

CW (Clock Wise)


ACW (Anti Clock Wise)

Left-Right Conditions:



Pythagoras Rule:

$a^2 + b^2 = c^2$



Some standard values:
If a = 3; b = 4, then c = 5 i.e., $3^2 + 4^2 = 5^2$
$a^2 + b^2 = c^2$
3, 4, 5 ® $3^2 + 4^2 = 5^2$
5, 12, 13 ® $5^2 + 12^2 = 13^2$
7, 24, 25 ® $7^2 + 24^2 = 25^2$
8, 15, 17 ® $8^2 + 15^2 = 17^2$

Shadow Cases:

Morning

Direction	*Shadow falls*
East	Front side
West	Back side
North	Left side
South	Right side

Evening


Direction	*Shadow falls*
East	Back side
West	Front side
North	Right side
South	Left side

- At 12 Noon there is no shadow because the rays of the sun are vertically downward.

Exercise

1. **Satyam starts walking towards East and after walking 20 m, turn Southwards and walks 10 m and then he turns to his right and walks 30 m. In which direction is he now with respect to the starting point?**
   1) South 2) West
   3) South-East 4) South-West
   5) None of these

Sol:



So, Satyam is in the south-west direction with respect to starting point.

BANK EXAMS
REASONING

This type of question, can solve in distance method:

1. **Same Directions (Addition)**
   $E_3 + E_4 = E_7$
   $S_2 + S_3 = S_5$
2. **Opposite Directions (Subtraction)**
   $N_3 - S_8 = S_5$
   $E_8 - W_3 = E_5$
3. ^ (Pythagoras) Directions ($a^2 + b^2 = c^2$)
   $E_5N_{12} = NE_{13}$
   E_3S_4 Þ SE_5
   Above,
   question we can write
   $E_{20}\,S_{10}\,W_{30}$ Þ $W_{10}\,S_{10}$ Þ SW
   Ans: 4

2. **Anirudh walked 35 meters towards South. Then he turned to his left and walked 40 meters. He then turned towards his left and walked 15 meters. He again turned to his right and walked 25 meters. At what approximate distance is he from the starting point and in which direction?**
   1) 60m NE 2) 35m SE
   3) 67m East 4) 67m SE
   5) None of these

Sol: $S_{35}\,E_{40}\,N_{15}\,E_{25}$
$S_{35}\,N_{15}\,E_{40}\,E_{25}$
$S_{20}E_{65}$ ® $20^2 + 65^2 = 4625$
approx. 67m.
SE_{67}
Ans: 4

3. **Arun travels 10 miles towards West, then travels 20 miles South, then travels 6 miles East, then travels 20 miles North and then finally goes 10 miles West. How far is he from the starting place?**
   1) 10 2) 14 3) 20 4) 6




   5) None of these

Sol: $W_{10}\,S_{20}\,E_6\,N_{20}\,W_{10}$
W_{14}
Ans: 2

4. **A is East to B and West of C, H is South-West of C and B is South-East of X, who is the farthest West?**
   1) C 2) A 3) X 4) B
   5) None of these

Sol:



B is the farthest west
Ans: 4

5. **Gopal moves towards South-East a distance of 7m, then he moves towards west and travels a distance of 14m. From here, he moves towards North-West a distance of 7m and finally he moves a distance of 4m towards East and stood at that point. How far is the starting point from where he stood?**
   1) 3m 2) 4m
   3) 10m 4) 11m
   5) None of these


Sol: $SE_7\,W_{14}\,NW_7\,E_4 = W_{10}$
Ans: 3

Directions (Q. No. 6 and 7) Study the following information care- fully and answer the questions given below.

Point P is 9m towards the East of point Q. Point R is 5m towards the South of point P. Point S is 3m towards the West of point R. Point T is 5m towards the North of point S. Point V is 7m towards the South of point S.

6. **If a person walks in a straight line for 8m towards West from point R, which of the following points would he cross the first?**
   1) V 2) Q 3) T 4) S
   5) None of these
   Ans: 4
7. **Which of the following points are in a straight line?**
   1) P, R, V 2) S, T, Q
   3) P, T, V 4) V, T, R
   5) None of these


Sol:



Ans: 5

8. **If North is called as East, West is called as North and so on.. then South East is called as?**
   1) South-West 2) South
   3) North East 4) North
   5) None of these

Sol:




Ans: 1

9. **One early morning, after the sunrise a man was standing facing a pole. The shadow of the pole fell exactly to his right. In which direction person facing finally?**
   1) North 2) East
   3) West 4) South
   5) None of these
   Ans: 4
10. **A man travels 4 km due North, the travels 6 km due East and further travels 4 km due North. How far and in which direction is he from the starting point?**
    1) 14 km North East
    2) 10 km North East
    3) 3 km South East
    4) 14 km North West
    5) None of these

Sol: $N_4\,E_6\,N_4$
$N_8\,E_6$ (^)
NE_{10}
Ans: 2

11. **Seven villages A, B, C, D, E, F and G are situated as follow.**
    E is 2 km to the West of B
    F is 2 km to the North of A
    C is 1 km to the West of A
    D is 2 km to the South of G
    G is 2 km to the East of C
    1) E and G 2) E and C
    3) G and C 4) F and G
    5) None of these

Sol:



Ans:3

12. **A walked 40 m towards West, took a left turn and walked 30m. He, then took a right turn and walked 20m. He again took a right turn and walked 30m. How far was he from the starting point?**
    1) 50 m 2) 60 m
    3) 55 m 4) 70 m
    5) 45 m

Sol: $W_{40}\,S_{30}\,W_{20}\,N_{30}$
$= W_{60m}$
Ans: 2